# చే గువేరా

## మోటార్ సైకిల్ డైరీ



ప్రజాశక్తి బుక్‌హౌస్

చేగువేరా

# మోటార్ సైకిల్ డైరీ

చేగువేరా

# మోటార్ సైకిల్ డైరీ

చేగువేరా

తెలుగు

కె. వీరయ్య

ప్రజాశక్తి బుక్‌హౌస్

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*

*హైదరాబాద్-20. ఫోన్ : 040 - 27660013*

ప్రచురణ సంఖ్య : 1015

ప్రథమ ముద్రణ : జనవరి, 2008
ద్వితీయ ముద్రణ : జూన్, 2008
తృతీయ ముద్రణ : ఆగస్ట్, 2010
నాల్గవ ముద్రణ : డిసెంబర్, 2013

వెల : ₹ 00/-

ప్రతులకు
**ప్రజాశక్తి బుక్‌హౌస్**
**1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27608107**

బ్రాంచీలు
**హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,**
**హన్మకొండ, నల్గొండ, గుంటూరు, ఒంగోలు**

ముద్రణ
**ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్**

website : www.psbh.in

# విషయసూచిక

ముందుమాట .................... 7
మొదటి సంపుటికి ముందుమాట .................... 10
ఎర్నెస్టో చె గువెరా .................... 11
చే జీవన గమనం .................... 13
మ్యాప్ .................... 17
చే మోటార్ సైకిల్ యాత్రలో మజిలీలు .................... 18
పరిచయం .................... 21

**మోటార్ సైకిల్ డైరీ**
**లాటిన్ అమెరికా .................... 37**

ఒకరినొకరం అర్థం చేసుకున్నాము .................... 38
ముందస్తు హెచ్చరికలు .................... 40
సాగరమథనం .................... 41
ముగిసిన నిరీక్షణ .................... 43
ఆఖరి బంధం తెగతెంపులు .................... 46
ఫ్లూ జ్వరంతో మంచమెక్కడం .................... 48
ఆండెస్ పర్వత సానువుల్లో... .................... 52
వృత్తాకార భ్రమణం .................... 56
ప్రియమైన మామకు .................... 59
ఏడు సరస్సుల రోడ్డు .................... 60
ఇప్పుడు నా మూలాలు స్పష్టంగా తెలిశాయి...స్వేచ్ఛగా.... .................... 63
ఆసక్తికరమైన అంశాలు .................... 65
నిపుణులు .................... 67
పెరిగిన కష్టాలు .................... 70
లా పొడెరోసాకు చివరి ప్రయాణం .................... 72

పోరాడే వీరులు, కార్మికులు, ఇతర విషయాలు ..... 74
గియొకొండా నవ్వు ..... 78
స్టోఅవేస్ ..... 85
ఈసారి... ఘోరం ..... 88
చుకికమాటా ..... 91
మైళ్ల తరబడి బంజరు ..... 94
చిలీ అంచుల్లో... ..... 97
దూరంగా చూసినప్పుడు చిలీ పట్ల అభిప్రాయం ..... 99
తరాతా : ఒక నూతన ప్రపంచం ..... 102
పచమామా నివసించిన ప్రదేశంలో ..... 107
సూర్య సరస్సు ..... 112
వినూత్న ప్రపంచం దిశగా ..... 114
నవల ..... 117
ఇన్‌కాల జన్మస్థలం ..... 119
భూకంపాల దేవుడు ..... 126
విజేతల జన్మస్థలం ..... 128
కజ్కో కొండలు ..... 130
హువాంబో ..... 133
మరింత ఉత్తరం దిక్కుగా ..... 139
పెరు మధ్యలో గుండా... ..... 141
చెదిరిన ఆశలు ..... 145
వైస్రాయిల నగరం ..... 149
ఉకలియా దిగువన ..... 157
ప్రియమైన పాపికి ..... 162
శాన్ పాబ్లో కుష్టురోగుల కాలనీ ..... 163
సెయింట్ గువెరో వర్ధంతి ..... 165
లిటిల్ కొంటికిలో ప్రవేశం ..... 170
ప్రియమైన మామాకు ..... 171
కారకాస్ దారిలో ..... 176
కొత్తగా ఉన్న 20వ శతాబ్దం ..... 179
చివరి మాటలు ..... 182

ఫొటోలు ..... 185

## అలెదా గువెరా

# ముందుమాట

**మొ**దటిసారి నేను ఈ నోట్స్ చదివినప్పుడు అవి పుస్తకం రూపంలో కూడా లేవు. ఎవరు రాశారో కూడా తెలియదు. అప్పుడు నేను చాలా చిన్నదాన్ని. అప్పుడే తన సాహసాలను అప్పటికప్పుడే ఈ విధంగా వర్ణించిన వారెవరో తెలుసుకోగలిగాను. ఈ నోట్స్ చదువుతూ పోయిన కొద్దీ రాసిన వ్యక్తిని మరింత బాగా తెలుసుకోగలిగాను. నేను ఆయన కూతురిని అయినందుకు చాలా సంతోషించాను.

ఈ నోట్స్‌లో మీరు తెలుసుకోబోయే విషయాలు ఇప్పుడే ప్రస్తావించటం నా ఉద్దేశ్యం కాదు. కానీ మీరు ఒకసారి పుస్తకం చదవటం పూర్తి చేసిన తర్వాత అవి రాసిన తీరు గురించి గానీ, అందులో వ్యక్తం చేసిన లోతైన భావాల కారణంగా గానీ, కొన్ని భాగాలు మీకు మళ్ళీ మళ్ళీ చదవాలనిపిస్తుందన్న విశ్వాసం నాకుంది.

కొన్ని సందర్భాల్లో నేను గ్రానడోగా మారి నాన్నకు అతుక్కుపోయి ఆయన వెనక కూర్చున్నాననిపిస్తోంది. ఆ విధంగా నేను కూడా ఆ కొండలు, లోయలు, సరస్సులు తిరిగిన అనుభూతి కలుగుతుంది. ఆయన మానాన ఆయన్ను వదిలేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. కాదనను. ప్రత్యేకించి ఆయన తాను చేసిన పనుల గురించి వర్ణిస్తున్నప్పుడు నన్ను నేను మర్చిపోయాను. ఆ విధంగా చేస్తున్నపుడు ఆయన యధాతథంగా విషయాలు చెప్పేటప్పుడు ఎంత నిజాయితీగా సాంప్రదాయేతర ధోరణిలో వ్యవహరించగలరో తెలుస్తుంది.

నిజం చెప్పాలంటే ఎంత ఎక్కువగా చదివానో అంత ఎక్కువగా యువకుడిగా ఉన్న మా నాన్న పట్ల అంతగా ప్రేమ పెరుగుతోంది. నా ఈ అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారో లేదో తెలియదు కానీ, ఈ పుస్తం చదువుతున్నంతసేపు యువ ఎర్నెస్టో గురించి మరింత స్పష్టంగా తెలుసుకునే అవకాశం కలిగింది. సాహసాలపై మక్కువతో

అర్జెంటీనా వదిలి వెళ్లిన ఎర్నెస్టో, ఏవో ఉత్కృష్ట విషయాలు సాధించాలన్న తపనతో వెళ్లిన ఎర్నెస్టో, ఆయనే తన మాటల్లో ఈ ఖండపు వాస్తవికత గురించి చెప్పినట్లుగా, ఒక యువకుడు మనిషిగా మారి, సామాజిక వ్యక్తిగా పరిణామం చెందిన తీరును తెలుసుకోగలిగాను.

క్రమక్రమంగా ఈ కలలు, కోరికలు ఏ విధంగా మార్పు చెందాయో మనం చూస్తాము. తన తోటి మనుషుల బాధలు స్వయంగా చూశాడు. ఆ బాధలన్నింటినీ తన బాధలుగా మార్చుకున్నాడు.

తన సాహసాలతో, విడ్డూరపు పోకడలతో మొదట్లో నవ్వు తెప్పించిన వ్యక్తే క్రమంగా సున్నితమైపోతాడు. లాటిన్ అమెరికా ఖండంలో స్థానికులైన ప్రజల గురించి ఆయన వివరించిన విషయాలు, పేదరికం, దోపిడీ మన మనసులను తాకే విధంగా ఆయన వర్ణిస్తారు. ఈ వర్ణన కూడా ఎంతో సున్నితంగాను, సూటిగాను ఉంటుంది.

నా తండ్రి (ఈ వ్యక్తి, ఎవరైతే... వారు) మనలో చాలామందికి తెలియని లాటిన్ అమెరికా గురించి మనకు తెలియచేస్తారు. ఆ భూభాగంలో ప్రతి విషయం, వస్తువు, ప్రకృతిలో ప్రతి భాగం మన మనస్సులకు తాకే విధంగా వర్ణిస్తారు. ఈ పుస్తకం చదువుతుంటే ఇవన్నీ ఆయన కళ్లతో మనం చూసినట్లుగానే ఉంటుంది.

ఆయన ఎప్పుడూ తాజాగానే కనిపించేవారు. ఆయన ఉపయోగించిన పదాలు – మనం ఎన్నడూ వినని శబ్దాలు మనకు వినిపించేవి. సౌందర్యంతో నిండిన పరిసరాలను మన కళ్ల ముందుకు తెచ్చేవి. ఉన్నది ఉన్నట్లుగా ఎటువంటి సౌందర్య లేపనం అంటించకుండా మనముందుంచారు. తన విప్లవాత్మక ఆలోచనలు మరింత పటిష్టంగా మారుతున్నా ఆయనలో లేతదనం మాత్రం పోలేదు. తన వ్యక్తిగత చైతన్యంలో ఆయనకు కలిగిన అవగాహన ఏమిటంటే ఈ పేద ప్రజలకు ఒక వైద్యునిగా తన సేవల అవసరం కంటే వారు సామాజిక గుర్తింపు, గౌరవంతో జీవించటానికి అవసరమైన మార్పు తెచ్చే క్రమంలో తన శక్తి సామర్థ్యాలు, నిరంతర కృషి అవసరం అన్న స్పృహ పెరుగుతూ వస్తోంది. ఆ గుర్తింపు, గౌరవంతోనే వీరు మిగిలిన దేశాలను జయించేందుకు కృషి చేస్తారని ఆయన భావించాడు.

ఈ యువ సాహసి విషయ పరిజ్ఞానం సముపార్జించటంలో తనకున్న పిపాస, ప్రేమించగల అమితమైన శక్తితో వాస్తవాన్ని సక్రమంగా వ్యాఖ్యానిస్తే ఒక మనిషి ఆలోచనా విధానాన్ని ఏ విధంగా మార్చవచ్చో చూపిస్తారు.

ఎంతో ప్రేమతో, స్పష్టతతో, నిబద్ధతతో రాసిన ఈ లేఖలు చదవండి. ఏ ఇతర విషయం కంటే ఈ నోట్సే నన్ను మరింతగా మా నాన్న దగ్గరకు చేరుస్తోంది. ఈ నోట్స్ చదివి మీరు కూడా ఆనందిస్తారని, ఆయన సాగించిన ప్రయాణంలో జోడు కలుస్తారని ఆశిస్తున్నాను.

నిజంగా ఆయన అడుగుజాడల్లో నడవాలని మీరు ఎప్పుడైనా నిర్ణయించుకుంటే అనేక విషయాలు (ఆయన ఆశించిన విధంగా) మారకపోగా మరింతగా దిగజారిన విషయాన్ని గుర్తిస్తారు. ఇదే మన అందరికీ సవాలు. అనేక సంవత్సరాల తర్వాత చె గా చరిత్రకెక్కిన ఈ యువకుడిలాగానే, వాస్తవాలకు స్పందించే శక్తి గల వారు, ఇప్పుడు వున్న దానికన్నా మరింత న్యాయమైన ప్రపంచాన్ని సాధించాలి, సృష్టించాలని భావించే వారందరికీ ఇది ఒక సవాలు.

ఇప్పుడు మిమ్ములను నాకు తెలిసిన మనిషితో వదిలిపెడుతున్నాను. నేను శక్తి సంపాదించుకోవటం కోసం ఎంతగానో ప్రేమించే వ్యక్తితో వదిలిపెడుతున్నాను.

చదువుతూ ఆస్వాదించండి. ముందుకెళ్లండి.

***అలెదా గువెరా మార్చ్***

***జూలై, 2003***

# మొదటి సంపుటికి ముందుమాట

**హ**వానా కేంద్రంగా పని చేస్తున్న చే వ్యక్తిగత భాండారం ఎర్నెస్టో గువేరా సంచార డైరీకి పుస్తక రూపమిచ్చింది. ఇందులో ఒక యువకుడు లాటిన్ అమెరికాను కనుగొనే ప్రయత్నంలో ఎదుర్కొన్న పరీక్షలు, సంక్లిష్ట పరిస్థితులు, అద్భుత సాహసాలు దర్శనమిస్తాయి. 1951 డిశంబరులో తన సహచరుడు అల్బెర్టో గ్రెనడాతో పాటు ఆయన అర్జెంటీనా రాజధాని బ్యూనస్ఎయిర్స్‌లో తన సుదీర్ఘ ప్రయాణానికి శ్రీకారం చుట్టిన నాడే ఈ డైరీ మొదలుపెట్టారు. అర్జెంటీనాలోని అట్లాంటిక్ తీరం, పంపా మైదానాలు, ఆండిస్ పర్వతాల గుండా చిలి, అటు తర్వాత ఉత్తరాన ఉన్న పెరూ, కొలంబియాల మీదుగా చివరికి కారకాస్ వరకూ ఈ డైరీ సాగుతుంది.

ఈ అనుభవాలను తర్వాత కాలంలో స్వయంగా చె కథనం రూపంలో తిరిగి రాశారు. ఇందులో చె వ్యక్తిగత జీవనం గురించి ప్రత్యేకంగా ప్రపంచం దృష్టికి రాని ఆయన తొలిరోజుల గురించిన లోతైన సమాచారంతో పాటు ఆయన వ్యక్తిత్వం, సాంస్కృతిక నేపథ్యం వంటి అనేక విషయాలు తెలుస్తాయి. అంతేకాదు. ఆయన రచనా సామర్థ్యాన్ని కూడా ఈ డైరీ విదితం చేస్తుంది. ఆ తర్వాత సాగించిన అనేక రచనల్లో ఆయన సృష్టించుకున్న తనదైన శైలికి ఓం ప్రథం ఈ డైరీలే. లాటిన్ అమెరికా గురించి తెలుసుకునే కొద్దీ ఒక వ్యక్తిగా చే లో చోటు చేసుకున్న మార్పులను కూడా పాఠకులు గుర్తించవచ్చు. ఈ ప్రయాణంలో ఆయన దృష్టికి వచ్చిన అనేక విషయాలు హృదయానికి తాకేవి మాత్రమే కాదు. క్రమంగా లాటిన్ అమెరికాకు ఒక గుర్తింపు తెచ్చిపెట్టేవిగా, నూతన అమెరికా చరిత్ర రచనలో ఆయన్ను మొదటి వ్యక్తిగా మార్చేవిగా ఉన్న విషయాలను ఈ డైరీల ద్వారా తెలుసుకోవచ్చు.

**అలెడా మార్చ్, 1993,**

**చె వ్యక్తిగత భాండారం,**

**హవానా, క్యూబా**

# ఎర్నెస్టో చే గువేరా

**టై**మ్ మాగజైన్ చేత ఈ శతాబ్ది పురుషుడుగా గుర్తింపు పొందిన ఎర్నెస్టో గువెరా డి లా సెర్నా 1928 జూన్ 14న అర్జెంటీనాలోని రోసారియోలో జన్మించాడు. బ్యూనస్ ఎయిర్స్‌లో ఆయన వైద్య విద్యార్థిగా ఉన్నప్పుడు, అంతకు ముందు కూడా ఆయన లాటిన్ అమెరికా దేశాల్లో విస్తృతంగా పర్యటించాడు. అందులో 1952లో ఆయన ఒక అస్తవ్యస్తపు  నోర్టన్ మోటార్‌సైకిల్‌పై సాగించిన యాత్ర కూడా అందులో భాగమే. 1952లో సాగించిన యాత్రే ప్రస్తుత డైరీకి కథా వస్తువు.

1954లో అప్పటి గౌటిమాలాలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని సిఐఎ సైనిక తిరుగుబాటుతో కూల్చివేసే సమయానికి చే ఆ దేశంలో రాజకీయ కార్యక్రమాలు సాగిస్తున్నారు. ఈ తిరుగుబాటు అనంతరం ఆయన తప్పించుకుని మెక్సికో పారిపోయారు. అక్కడే తీవ్రవాద రాజకీయ భావాలు సంతరించుకున్నారు.

గౌటిమాలాలో ఏర్పడిన సంబంధాల ఆధారంగా అప్పటికే మెక్సికోలో అజ్ఞాతవాసం గడుపుతున్న క్యూబా తిరుగుబాటుదారులతో నూతన సంబంధాలు ఏర్పర్చుకున్నారు. 1955లో తొలిసారి ఫైడెల్ కాస్ట్రోను కలుసుకున్నారు. వెంటనే క్యూబా నియంత ఫుల్‌గెన్సియో బాటిస్టాను కూలదోయటానికి పయనమైన గెరిల్లా దళంలో తన పేరు కూడా నమోదు చేసుకున్నారు. క్యూబా వాసులు ఆయన్ను చే అని పిలవటం ప్రారంభించారు. అర్జెంటీనాలో ఎర్నెస్టోను అప్యాయంగా పిల్చుకునే పేరు ఇది.

క్యూబాలో సియర్రా కొండల్లో విప్లవ పోరాటం ప్రారంభించిన గెరిల్లాలకు వైద్య సహాయం అందించేందుకు గాను గువెరా 1956 నవంబరు 25న గ్రాన్మా పడవలో ప్రయాణం ప్రారంభించారు. కొద్దినెల్లలోనే విప్లవ సైన్యపు మొదటి కమాండర్‌గా ఆయన బాధ్యతల్లోకి ఎదిగారు. అయినా పోరాటంలో గాయపడిన యోధులకు వైద్య సపర్యలు మాత్రం మానలేదు. బాటిస్టా సైన్యం నుండి పట్టుబడ్డ వారికి కూడా ఆయన వైద్య సేవలందించారు.

1958 సెప్టెంబరులో సియర్రా మెస్ట్రో పర్వతాల నుండి ఒక వైపు నుంచి కామిలో సిన్‌ఫ్యెగోస్, మరోవైపు నుంచి గువేరాల నాయకత్వంలో  గెరిల్లా దళాలు

బాటిస్టా దళాలపై దాడులు చేశాయి. బాటిస్టా సేనలను ఓడించటంలో గువేరా నాయకత్వం లోని దళం కీలకపాత్ర పోషించింది.

1959 జనవరి 1న బాటిస్టా క్యూబా నుండి పారిపోయిన తర్వాత చే విప్లవ ప్రభుత్వంలో ముఖ్యమైన నేతగా మారారు. మొదట్లో జాతీయ వ్యవసాయక సంస్కరణల సంస్థకు చెందిన పారిశ్రామిక విభాగానికి జాతీయ అధ్యక్షునిగాను తర్వాత జాతీయ బ్యాంకుకు అధ్యక్షునిగాను బాధ్యతలు నిర్వహించారు. 1961లో పారిశ్రామిక మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1965లో క్యూబా కమ్యూనిస్టు పార్టీగా మారినప్పుడు ఆయన కేంద్ర స్థాయి నాయకునిగా ఉన్నారు.

ఈ బాధ్యతలతో పాటుగా గువేరా ప్రపంచ వ్యాప్తంగా వివిధ వేదికలపై క్యూబా విప్లవ ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. ఐక్యరాజ్యసమితి సమావేశాలకు వివిధ బృందాలను తీసుకెళ్లటంలోను, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో జరిగిన వివిధ సమావేశాల్లో కీలక వక్తగాను, వర్ధమాన దేశాల ప్రజల ప్రయోజనాలను ప్రతిబింబించే వ్యక్తిగాను ప్రాతినిధ్యం వహించారు. అన్నింటికంటే మించి ఉరుగ్వేలోని పుంటా డెల్ ఎస్టేట్‌లో జరిగిన అంతర్జాతీయ సమావేశంలో అప్పటి అమెరికా అధ్యక్షులు కెన్నడీ ప్రతిపాదించిన ప్రజాస్వామిక కూటమిని ఖండితంగా వ్యతిరేకించారు.

క్యూబా విప్లవోద్యమంలో చేరినప్పటినుండీ ఆయన నిర్ణయించుకున్నట్లుగానే 1965 ఏప్రిల్‌లో గువెరా క్యూబా వదిలి వెళ్లారు. అనంతరం మొదట్లో కాంగోలో జరుగుతున్న విప్లవ పోరాటానికి మద్దతుగా ఒక గెరిల్లా దళానికి నాయకత్వం వహించారు. బొలీవియాలో జరుగుతున్న విముక్తి పోరాటానికి సహకరించేందుకు అవసరమైన మరో గెరిల్లా దళాన్ని సిద్ధం చేసుకునేందుకు గాను అదే సంవత్సరం డిశంబరులో ఆయన తిరిగి రహస్యంగా క్యూబా చేరుకున్నారు. 1966 నవంబరులో బొలీవియాలో సైనిక నియంత పాలనకు సవాలు విసరాలన్న ఉద్దేశ్యంతో ఆ దేశంలో అడుగుపెట్టారు. ఆ దేశ ప్రజల్లో తిరుగుబాటును ప్రోత్సహించటం ఆయన ఉద్దేశ్యం. ఈ విధమైన తిరుగుబాటు లాటిన్ అమెరికా అంతటా రాజుకుంటుందని ఆయన ఆశించారు. 1967 అక్టోబరు ఎనిమిదో తేదీన అమెరికా శిక్షణ పొందిన విప్లవ ప్రతీఘాత దళంతో జరిగిన పోరాటంలో ఆయన గాయపడి పట్టుబడ్డారు. సైనిక నియంతకు అండగా ఉన్న విప్లవ ప్రతీఘాత దళం ఆ మరునాడే ఆయన్ను హత్యచేసి శవాన్ని భూస్థాపితం చేసింది.

అంతిమంగా గువేరా అస్థికలను 1997లో గుర్తించి వెలికితీసి తిరిగి క్యూబాకు పంపారు. విప్లవ పోరాటంలో గువేరా కీలక విజయం సాధించిన సెంట్రల్ క్యూబాలోని శాంతా క్లారాలో గువేరా స్మారక చిహ్నాన్ని నిర్మించారు.

# చే జీవిత గమనం

| | | |
|---|---|---|
| జూన్ 14, 1928 | : | అర్జెంటీనాలోని రొసారియోలో ఎర్నెస్టో గువేరా లించ్, సెలియా డి లా సెర్న దంపతులకు ఎర్నెస్టో చేగువేరా జన్మించారు. ఐదుగురు సంతానంలో ఆయనే మొదటి వాడు. |
| 1947 | : | గువేరా కుటుంబం బ్యూనస్ ఎయిర్స్‌కు మకాం మార్చింది. |
| 1947-53 | : | బ్యూనస్ ఎయిర్స్ వైద్య కళాశాలలో చే విద్యాభ్యాసం. |
| డిసెంబరు 1951- జులై 1952 | : | చిలీ, పెరు, కొలంబియా, వెనిజులాలో చే పర్యటన. |
| మార్చి 10 1952 | : | క్యూబాలో బాటిస్టా తిరుగుబాటు చే పర్యటన. |
| మార్చి 10, 1953 | : | చే వైద్య శాస్త్ర పట్టభద్రుడయ్యారు. |
| జులై 6, 1953 | : | వైద్యునిగా లాటిన్ అమెరికాలో పర్యటన. 1952 విప్లవ ప్రభావాన్ని పరిశీలించేందుకు బొలీవియా పర్యటన. |
| జూలై 26, 1953 | : | మోంకాడా సైనిక శిబిరంపై ఫైడేల్ కాస్ట్రో నేతృత్యంలో దాడి |
| డిసెంబరు 1953 | : | మోంకాడా దాడిలో ప్రాణాలు దక్కించుకున్న విప్లవకారులతో సాన్ జోస్ (కోస్టారికా) లో పరిచయం. |
| జనవరి- జూన్ 1954 | : | మార్క్సిజం అధ్యయనం, రాజకీయ కార్యకలాపాలు |
| జూన్ 17, 1954 | : | సిఐఎ ప్రోద్భలంతో తిరుగుబాటుదారులు గ్వాటిమాలా ఆక్రమణ, వారికి వ్యతిరేకంగా పోరాడడానికి గువేరా సంసిద్ధత |
| ఆగష్టు 1954 | : | తిరుగుబాటుదారుల మారణహోమం |
| సెప్టెంబరు 21, 1954 | : | గ్వాటిమాలా వీడి మెక్సికో నగరానికి చేరిక. కేంద్ర వైద్యశాలలో ఉద్యోగం. |

| | | |
|---|---|---|
| మే 15, 1955 | : | జైలు నుండి కాస్ట్రో విడుదల |
| జులై 7, 1955 | : | కాస్ట్రో మెక్సికో చేరిక, క్యూబా సాయుధ యాత్రకు వ్యూహరచన |
| జులై 1955 | : | కాస్ట్రోను కలుసుకున్న గువేరా. సాయుధ యాత్రలో మూడవ సభ్యునిగా చేరిక |
| జూన్ 24, 1956 | : | కాస్ట్రో, గువేరాలను అదుపులోకి తీసుకున్న మెక్సికో పోలీసులు. 57 రోజులపాటు గువేరా నిర్భంధం. |
| నవంబరు 25, 1956 | : | టుక్స్పాన్ (మెక్సికో) నుండి గ్రాన్మా పయనం |
| నవంబరు 30, 1956 | : | సాంటియాగో డి క్యూబాలో ఉద్యమం |
| డిసెంబరు 2,1956 | : | లాస్ కొలొరాడస్ ( క్యూబా)కు గ్రాన్మా చేరిక |
| డిసెంబరు 5, 1956 | : | బాటిస్టా సైన్యంతో పోరాటం, గువేరాకు గాయాలు |
| జనవరి 17, 1957 | : | లాప్లాటో సంఘర్షణలో సైన్యశిబిరాన్ని ఆక్రమించుకున్న విప్లవ సైన్యం. |
| మార్చి 13, 1957 | : | హవానా ఆధ్యక్ష భవనంపై దాడి విఫలం. |
| మే 27-28, 1957 | : | ఎల్ ఉవేరో యుద్ధం,విప్లవ సైన్యం జయకేతనం |
| జులై 1957 | : | విప్లవ సైన్యం ద్వితీయ విభాగం ఆవిర్భావం, గువేరా సారథ్యం. |
| ఏప్రిల్ 9, 1958 | : | సార్వత్రిక సమ్మె విఫలం |
| వే 1958 | : | బాటిస్టా సైన్యంతో సియర్రా మాయోస్ట్రాలో భీకరపోరు. అణచివేత విఫలం |
| జులై 1958 | : | ఎల్ జిగ్యూ యుద్ధంలో విజయం |
| అగష్టు 31, 1958 | : | గువేరా నాయకత్వంలో లాస్ విల్లాస్‌కు దండయాత్ర |
| అక్టోబరు 16, 1958 | : | గువేరా సైన్యం ఎస్కాంబ్రే పర్వతాలకు చేరిక |
| డిసెంబరు 1958 | : | లాస్ విల్లీస్ రాజధాని శాంటా క్లారా ఆక్రమణ |
| జనవరి 1, 1959 | : | క్యుబా నుండి పారిపోయిన బాటిస్తా, సైనిక పాలన సాయుధ పోరాటం కొనసాగుతుందని కాస్ట్రో ప్రకటన |
| జనవరి 2, 1959 | : | సార్వత్రిక సమ్మె: గువేరా, సియన్ ఫ్యూగస్ ఆధ్యర్యంలోని విప్లవ సైన్యాలు హవానా చేరిక, లా కబానా కోట స్వాధీనం |

| | | |
|---|---|---|
| జనవరి 8, 1959 | : | హవానా చేరుకున్న కాస్ట్రోకు ఘన స్వాగతం |
| ఫిబ్రవరి 9, 1959 | : | క్యూబా పౌరునిగా గువేరాకు గుర్తింపు |
| ఫిబ్రవరి16,1959 | : | ప్రధానమంత్రిగా కాస్ట్రో |
| మే 17,1959 | : | భూ సంస్కరణల అమలు |
| జూన్ 12 - సెప్టెంబరు 8, 1959 | : | ఐరోపా, ఆఫ్రికా, ఆసియాలలో గువేరా పర్యటన |
| అక్టోబరు 7, 1959 | : | వ్యవసాయ సంస్కరణలు, పరిశ్రమల శాఖ అధిపతిగా గువేరా నియామకం |
| నవంబరు 26, 1959 | : | క్యూబా జాతీయ బ్యాంకు అధ్యక్షునిగా గువేరా నియామకం |
| మార్చి 19, 1960 | : | క్యూబా శరణార్థుల సైన్యంతో క్యుబా ఆక్రమణకు అమెరికా అధ్యక్షడు ఐసెన్ హవర్ ఆదేశం |
| అక్టోబర్ 21,1960 | : | సోవియట్ యూనియన్, తూర్పు జర్మనీ చెకెస్లోవేకియా, చైనా, ఉత్తర కొరియాలలో గువేరా పర్యటన |
| జనవరి 3, 1961 | : | క్యూబాతో దౌత్య సంబంధాలు తెంచుకున్న అమెరికా |
| జనవరి 6, 1961 | : | సోవియట్ యూనియన్‌తో కుదుర్చుకున్న ఆర్థిక ఒప్పందాల గురించి ప్రజలకు గువేరా వివరణ |
| ఫబ్రవరి 23, 1961 | : | పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గువేరా |
| ఏప్రిల్ 15,1961 | : | శాంటియాగో డి క్యూబా, హవానాపై అమెరికా ప్రోద్భలంతో వైమానిక దాడులు. |
| ఏప్రిల్ 17-19, 1961 | : | బే ఆఫ్ పిగ్స్ వద్ద తిరుగుబాటు అణచివేత |
| ఆగష్టు 8, 1961 | : | ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్ సమావేశంలో క్యూబా ప్రతినిధిగా గువేరా ప్రసంగం |
| ఆగస్టు 27 - సెప్టెంబరు 7, 1962 | : | రెండవ సారి రష్యాలో పర్యటించిన గువేరా |
| అక్టోబరు 22,1962 | : | క్యూబా క్షిపణి సంక్షోభం |
| జులై 3-17, 1963 | : | గువేరా అల్జీరియా పర్యటన |
| మార్చి 25, 1964 | : | ఐక్యరాజ్య సమితి వాణిజ్య, అభివృద్ధి మండలి సమావేశంలో గువేరా ప్రసంగం |

| | | |
|---|---|---|
| డిసెంబరు 11, 1964 | : | ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో గువేరా ప్రసంగం |
| మార్చి 14, 1965 | : | మూడు నెలల విదేశీ పర్యటన ముగించుకొని క్యూబా చేరుకున్న గువేరా , రాజకీయ కార్యకలాపాల విరమణ |
| ఏప్రిల్1, 1965 | : | ఫైడెల్ కాస్ట్రోకు వీడ్కోలు లేఖ సమర్పించిన గువేరా కాంగోలో టాతు పేరుతో కార్యకలాపాలు |
| డిసెంబరు 1965 | : | క్యూబాలో రహస్య పర్యటన , బొలీవియాకు పయనం |
| మార్చి 23, 1967 | : | బొలీవియాలో విప్లవ యుద్ధం ప్రారంభం |
| జులై 31 - ఆగస్టు 10, 1967 | : | లాటిన్ అమెరికా సంఘీభావ సంస్థ గౌరవ అధ్యక్షునిగా గువేరా ఎన్నిక. |
| అక్టోబరు 8, 1967 | : | బొలీవియా సైనికులతో పోరాటం, గువేరాకు గాయాలు |
| అక్టోబరు 9, 1967 | : | గువేరాతో సహా ఇద్దరు నిర్బంధ గెరిల్లాల హత్య |
| అక్టోబరు 15, 1967 | : | గువేరా మరణవార్తను అధికారికంగా ప్రకటించిన కాస్ట్రో, మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా సంతాపం. |
| అక్టోబరు 18, 1967 | : | పది లక్షల మందితో హవానాలో గువేరా స్మారక సభ, కాస్ట్రో ప్రసంగం |
| మార్చి 1968 | : | గువేరా బొలీవియా డైరీ, ప్రచురణ, ప్రజలకు ఉచితంగా పంపిణీ. |
| జూన్ 28,1997 | : | మూడు దశబ్దాల తర్వాత గువేరా భౌతిక అవశేషాలను వెలికితీసిన బొలీవియా అధికారులు |
| అక్టోబరు 1997 | : | గువేరా అవశేషాలను సాంటాక్లారా (క్యూబా)లో ఖననం చేసిన క్యూబా అధికారులు |

# map of the motorcycle diaries




Map not to scale.

# చే మోటార్ సైకిల్ యాత్రలో మజిలీలు

**అర్జెంటినా**

| | |
|---|---|
| **1951** | |
| డిసెంబరు | కోర్డాబా నుండి బ్యూనస్ ఎయిర్స్‌కు |
| **1952** | |
| జనవరి 4 | బ్యూనస్ ఎయిర్స్ నుండి పయనం |
| జనవరి 6 | విల్లా గెసెల్ |
| జనవరి 13 | మిరామర్ |
| జనవరి 14 | నెకోచియా |
| జనవరి 16- 21 | బాహియా బ్లాంకా |
| జనవరి 22 | చోయలి చోయల్ మార్గంలో |
| జనవరి 25 | చోయలి చోయల్ |
| జనవరి 29 | పియడ్రా డెల్ ఆండీస్ |
| జనవరి 31 | శాన్‌మార్టిన్ డి లాస్ ఆండీస్ |
| ఫిబ్రవరి 8 | నాహుయెల్ హువాపి |
| ఫిబ్రవరి 11 | శాన్ కార్లస్ డి బారిల్‌కోచ్ |

**చిలి**

| | |
|---|---|
| ఫిబ్రవరి 14 | మోడెస్టా విక్టోరియా నుండి ప్యుల్లా |
| ఫిబ్రవరి 18 | టెముకొ |
| ఫిబ్రవరి 21 | లావుటరో |

| | |
|---|---|
| ఫిబ్రవరి 27 | లాస్ ఏంజలెస్ |
| మార్చి 1 | శాంటియోగో డి చిలి |
| మార్చి 7 | వాల్పరాయిజొ |
| మార్చి 8-10 | శాన్ ఆంటోనియో మీద |
| మార్చి 11 | ఆంటోఫగస్టా |
| మార్చి 12 | బాస్క్వెడానో |
| మార్చి 13-15 | ఇకికే |
| మార్చి 22 | అరికా |

**పెరు**

| | |
|---|---|
| మార్చి 24 | టాస్నా |
| మార్చి 25 | టరటా |
| మార్చి 26 | పునో |
| మార్చి 27 | టిటికా సరస్సుపై పయనం |
| మార్చి 28 | జులియాకా |
| మార్చి 30 | సికుయాని |
| మార్చి 31- ఏప్రిల్ 3 | కుజ్కో |
| ఏప్రిల్ 4-5 | మచు పిచు |
| ఏప్రిల్ 6-7 | కుజ్కో |
| ఏప్రిల్ 11 | అబాంకే |
| ఏప్రిల్ 13 | హువాంకరమా |
| ఏప్రిల్ 14 | హువాంబో |
| ఏప్రిల్ 15 | హువాంకరమా |
| ఏప్రిల్ 16-19 | అండాహుయాలస్ |
| ఏప్రిల్ 22-24 | అయాకుచో నుండి హువాంకులో వరకు |
| ఏప్రిల్ 25- 26 | లా మెర్సిడ్ |
| ఏప్రిల్ 27 | ఓగ్జాపంపా, శాన్ రామన్ మధ్య |
| ఏప్రిల్ 28 | శాన్ రామన్ |
| ఏప్రిల్ 30 | టర్మా |
| మే1 - 17 | లిమా |

| | |
|---|---|
| మే 19 | సెర్రో డి పాస్కో |
| మే 24 | పుకల్పా |
| మే 25- 31 | అమెజాన్ ఉపనది రియో ఉకాయలీపై లా కాన్సెపాపై పయనం |
| జూన్ 1-5 | ఇకిటాస్ |
| జూన్ 6-7 | కుష్టువ్యాధిగ్రస్తుల కాలనీ శాన్ పాబ్లోకు ఎల్ సిస్నెపై పయనం |
| జూన్ 8-20 | శాన్ పాబ్లో |
| జూన్ 21 | అమెజాన్ నదిలో మాంబో టాంగోపై |

పయనం

**కొలంబియా**

| | |
|---|---|
| జూన్ 23-జులై 1 | లెటిసియా |
| జులై 2 | లెటిసియా నుండి విమాన ప్రయాణం |
| జులై 2-10 | బొగోటా |
| జులై 12-13 | కుకుటా |

**వెనిజులా**

| | |
|---|---|
| జులై 14 | శ్రాన్ క్రిస్టోబాల్ |
| జులై 16 | బార్కిసిమెటో నుండి కరోనా |
| జులై 17-26 | కారకాస్- ఇక్కడ చే, ఆల్బెర్టోలు విడిపోతారు |

**అమెరికా**

| | |
|---|---|
| జులై చివర | మియామి |

**అర్జెంటినా**

| | |
|---|---|
| అగస్టు | కోర్డోబాలోని కుటుంబ సభ్యులను చేరుకున్న చే |

# పరిచయం

**బొ**లీవర్ మొదలు నేటి వరకు లాటిన్ అమెరికా విముక్తి ఉద్యమంలో ఎవరైనా ఒక ధీరుడు ఉన్నాడంటే, లాటిన్ అమెరికా నుండి మాత్రమే కాక మొత్తం ప్రపంచం నుండి యువతను ఆకర్షిస్తున్న వ్యక్తి ఎవరైనా ఉన్నాడంటే అతను ఎర్నెస్టో చే గువేరా. ఆయన మరణానంతరం చే ఆధునిక కల్పనగా మారినప్పటికీ ఆయన తన యవ్వనోత్తేజాన్ని మాత్రం ఇంకా కోల్పోలేదు. పైగా ఆయనకున్న కాల్పనిక హోదా చే యవ్వనాన్ని మరింత పెంచేందుకే తోడ్పడింది. దాంతో పాటు ఆయన ధీరోదాత్తత, స్వచ్ఛతలు ఆయన ఆకర్షణ శక్తిని పెంచే రహస్యంగా మిగిలిపోయింది.

ఒక కల్పనగా, చెల్లాచెదురైన ఆశలకు ప్రతిబింబంగా మారటానికి సదరు వ్యక్తిలో లోతైన కోణాలు, ఏకాత్మకత ఉండాలి. ఈయన విషయంలో కూడా అదేవిధంగా జరిగింది. ఏదో ఒక ముఖంతో చారిత్రక ఊహలు ఆకృతి దాలుస్తాయి. (చారిత్రక ఊహలకు గుర్తింపు తెచ్చేందుకు ఒక ముఖం కావాలి). అదే సమయంలో ఆ వ్యక్తుల దైనందిన జీవితాన్ని గురించి, వారి బాల్యం గురించి, యవ్వనం గురించి, మనకు మార్గదర్శకంగా మారిన లక్షణాలు పుణికిపుచ్చుకోవటానికి ముందు యువకులుగా వారు జీవితం గురించిన వాస్తవం పట్ల మనం సంకుచిత దృష్టిని ప్రదర్శించకూడదు. ఈ విషయం చెప్తున్నంత మాత్రాన వారి అసమాన గుణాల గురించిన ప్రత్యేకతలను కప్పి వుంచాలన్న ఉద్దేశ్యం నాకు లేదు. వారి జీవితాల్లో సాధించిన చెప్పుకోదగ్గ అంశాలను తోసిపుచ్చాలని నేను ప్రయత్నించటం లేదు. వారి జీవితంలో మిగిలిన కాలం ఏ దిశలో సాగిందనేది తెలుసుకోవటానికి వారి ప్రారంభ దినాలకు సంబంధించిన సమాచారం ఉపయోగపడుతుందన్నదే నా ఉద్దేశ్యం.

చే విషయంలో ఇది మరింత వాస్తవం. తన యవ్వనంలో మిత్రుడు అల్బెర్టో గ్రనడోతో కలసి సాగించిన సాహసోపేత యాత్రల గురించిన సమాచారం, యువకుడిగా

ఆయనలో ఉన్న వేగాన్ని, ఉత్సాహాన్ని అదే సమయంలో విలక్షణమైన ఒక యువకుడి గురించి తెలియచేస్తోంది. ఇందులో ఆయన నవ్వును, ఆయన స్వరాన్ని కూడా గుర్తించవచ్చు. మిగిలిన వారిలాగానే ఆయన కూడా యువకుడు. తన జీవితాన్ని యవ్వనంతోనే నింపాడు. యవ్వనాన్ని కోల్పోకుండా, నీరుగార్చకుండా పరిపక్వత సాధించాడు.

ఈ మోటార్ సైకిల్ డైరీ ప్రతి ఎటువంటి ముందువెనకలు చూసుకోకుండా దగడగ మంటూ శబ్దం చేసే మోటార్‌సైకిల్ లా పొడెరోసా 2పై సాగించిన ప్రయాణానికి సంబంధించిన వివరాలతో నిండి ఉంది. ఈ యాత్ర గాలి లాగా స్వేచ్ఛతో నిండింది. కేవలం ప్రపంచాన్ని తెలుసుకుందామన్న ఉద్దేశ్యంతో సాగించిన యాత్ర ఇది. ఈ యాత్ర కేవలం వయస్సు రీత్యా యవ్వనంలోకి ప్రవేశించేవారికి కాక హృదయపూర్వకంగా భావుకులైన యువతకు అంకితమైనది.

ఈ డైరీ మొదటి పేజీల్లో 20వ శతాబ్దంలో ఒక ఉదాత్త ధీరునిగా చరిత్రకెక్కనున్న ఈయన "ఇదేదో అదుపులేని ధీరోధాత్తత గురించిన కథ కాదు" అని హెచ్చరిస్తారు. ధీరోదాత్తత అన్న పదం మిగిలిన పదాలను మించి వినిపిస్తోంది. ఎందుకంటే చే భవిష్యత్తు గురించి ఊహించకుండా మనం ఈ పేజీలు తిప్పలేము. సియర్రా మేస్ట్రో పర్వతాల్లోను, ఆ తర్వాత బొలీవియాలోని క్వెబ్రాడా డెల్ యురోలో పరిపక్వత సాధించిన చిత్రం గురించి ఊహించకుండా ఉండలేము.

ఈ యువకుని సాహసయాత్ర ఒక విప్లవకారుడిని తయారు చేసి ఉండక పోయినట్లయితే ఈ పేజీలు మరో విధంగా ఉండేవి. వాటిని (తర్వాతి తరాలు) మరో తరహాలో చదువుకునేవి. అయితే ఈ మరో తరహా ఎలా ఉంటుందనేది ఇప్పుడు ఊహించటం కష్టం. చే రాతలు – గువెరా చెగా మారకముందే రాసినవి అయినప్పటికీ తన రచనలను భావితరాలు ఎలా చదువుకోవాలన్న అంశానికి సంబంధించి ఆయనకు కొన్ని స్పష్టమైన అభిప్రాయాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు :

> ఇది రాసిన వ్యక్తి తొలుత అర్జెంటీనాలో కాలుపెట్టింది మొదలు అంతర్ధానమయ్యాడు. ఈ భావాలను గుర్తించి వాటిని నగిషీలు దిద్దే వ్యక్తి అంటే నేను, ఇక ఎంతమాత్రమూ ఒకప్పటి మనిషిని కాదు. అర్జెంటీనా రాజధానిగా మన లాటిన్ అమెరికా అన్న నా ఆలోచనలు, భావాలు ఈ పర్యటనతో మారిపోయాయి.

అని ఒక చోట రాస్తారు. ఇవి ఒకరకమైన సాక్ష్యాలు. ఆయన మాటల్లో చెప్పాలంటే ఒక మారిన మనిషికి సంబంధించిన ఫోటో నెగటివ్‌లు. భావాత్మక ప్రపంచంలోకి పయనమై వెళ్లిన వ్యక్తి అనుభవాలు. ఇవి ఒక వ్యక్తి సంపూర్ణ చైతన్యంతో ఉన్నప్పటి సంగతులు. గిజోట్ పేర్కొన్నట్లుగా ఆ వ్యక్తి అనుభవాలపై అదే విధమైన ప్రభావం చూపిన సంగతులు. మేలుకొలుపును అనుభవిస్తున్న ఒక వ్యక్తికి చెందిన కలల స్ఫూర్తి ఇది.

ఒక సూత్రంగా నిర్ధారించుకోవాలంటే ఈ యాత్ర మొదట ఉత్తర అమెరికా వైపు సాగే లక్ష్యంతో ప్రారంభమైంది. కానీ నిజానికి, ఉత్తర అమెరికాకు ఫోటో నెగటివ్ వంటి దక్షిణ అమెరికా వైపుకు పయనం మొదలైంది. అంటే ఆ సమయానికి దక్షిణ అమెరికాలో ఉన్న పేదరికం, నిస్సహాయతలు ఉత్తర అమెరికాలోనూ సర్వసాధారణంగా ఉన్నాయి. ఈ ప్రయాణంలో వెల్లడించిన అనేక సంగతులు ఉత్తర అమెరికాకు చెందిన వాస్తవిక సమాచారాన్ని అందుబాటులోకి తెస్తాయి.

“మా ప్రయత్నం యొక్క తీవ్రత మా బైకు ముందున్న దుమ్ము ధూళితో నిండిన రోడ్లు, ఉత్తరాది దిశగా కిలోమీటర్లు లెక్కించుకుంటూ వెళ్లిన విమానాల వివరాల మధ్య దారితప్పింది.” జోస్ మార్టి కూడా లా గారియా నుండి కారకాస్ మీదుగా ఒక చిన్న వాహనంలో ప్రయాణించినప్పుడు దాటుకుంటూ వచ్చిన దుమ్ము ధూళే కదా ఇది. ఈ విషయాన్ని చే గుర్తించి ఉండకపోవచ్చు. గిజోట్‌కు అమెరికాను అంటిపెట్టుకుని ఉన్న భూతాలు కనిపించిన నేల కాదా? “మనలను బంధించి ఉన్న ఈ సంకెళ్లు తెగి నేలను తాకే సమయంలో ధూళి మేఘాలు కమ్ముకుంటాయి.” మార్టి, చే ప్రయాణాల మధ్య ఉన్న వ్యత్యాసం ఏమిటంటే మార్టి ఉత్తర అమెరికా నుండి ప్రయాణం ప్రారంభించాడు. చే ఆయన అడుగుజాడల్లో పయనించినా తనను తాను తెలుసుకునేందుకే ప్రయాణించాడు. కొద్ది సేపట్లో ఈ పేజీల్లో మనం చూడనున్న విధంగా ఆయన తన భవిష్యత్తును తెలుసుకునేందుకే చే ప్రయాణం సాగింది.

వెనక్కు తిరిగి చూస్తే ప్రయాణీకులు శకునంగా భావించే ఒక కుక్కను మనకు హాస్యరసస్ఫోరకంగా పరిచయం చేస్తాడు చే. ఈ కుక్క పిల్ల విల్లా గెసెల్ నుండి మిరామర్ వరకు మోటార్‌సైకిలును అంటిపెట్టుకుని తిరుగుతుంది. చాలాకాలం తర్వాత సియర్రా మేస్ట్రా పర్వతాల్లో తిరిగి దర్శనం ఇస్తుంది. అప్పట్లో నియంత బాటిస్టా సైన్యానికి చెందిన కీలకమైన అధికారి కల్నల్ శాంచెజ్ మస్క్వేరాను బంధించే ఉద్దేశ్యంతో చే నాయకత్వంలోని గెరిల్లాల దళం సియర్రా మెస్ట్రా పర్వతాల్లో కాపుకాస్తుంది. “నరాలు

తెగే ఉత్కంఠలో ఉన్నప్పుడు ఒక్కసారిగా ఆ కుక్క మూలగటం మానేసింది. అక్కడే నిలుచుని నేలమీద పొర్లనారంభించింది. తలను రెండు కాళ్ల మధ్య పెట్టి గంతులు వేసింది." చివరికి విప్లవ యుద్ధంలో అంకాలు అన్న పుస్తకంలో వర్ణించినట్లుగా మార్ వెర్డె గ్రామంలో మరో కుక్క కనిపిస్తుంది :

> ఫెలిక్స్ దాని తల నిమిరాడు. కుక్క అతనివంక చూసింది. ఫెలిక్స్ తిరిగి దానివంక చూశాడు. ఆ తర్వాత అతను, నేను తప్పు చేశామా అన్న భావనతో ఒకరినొకరం చూసుకున్నాము. హటాత్తుగా అందరూ మౌనం వహించారు. ఈ కుక్క ముందుకు వెళ్లటాన్ని అడ్డుకోవటానికా అన్నట్లుగా ఒక మూలుగు మా చెవులకు చేరింది. మా కళ్ల ముందున్న కుక్క రూపంలో చనిపోయిన పప్పీ కనిపిస్తోంది.

పేరుకు తగ్గట్లుగానే కుక్క కంబాక్ వెనక్కు వచ్చింది. అర్జెంటీనాకు చెందిన మరో మహోన్నత వ్యక్తి జోస్ మార్టి గురించి తన క్యాంపెయిన్ డైరీలో రాసుకున్న విషయాన్ని మనకు ఈ విధంగా తెలియచేస్తున్నారు.

> "ఈ భావం, ఉద్వేగం, కేవలం కవులు, చిత్రకారులు, గాయకుల భాషల్లో వర్ణించటానికి వీలు లేనివి. అవి మరోమాట లేకుండా ఆకళింపు చేసుకోగలిగినవి. పశుపక్ష్యాదులు ఏ విధంగా తమ కళ్లతో ప్రకృతిని చూస్తాయో ఆ విధంగానే చూపులతోనే అర్థం చేసుకోగలిగినవి ఆ భావాలు."

మోటార్ సైకిల్ డైరీని విప్లవ యుద్ధపు ఘట్టాలతో పోల్చటం ద్వారా, పదేళ్లు దాటిపోయినప్పటికీ మొదటిది రెండోదానికి సాహిత్యపరంగా మార్గదర్శిగా ఉంది. ఈ రచనల్లో ఒకే రకమైన సాధారణత్వం, స్పష్టత, స్వచ్ఛత. ఒక్కో అధ్యాయాన్ని తదుపరి అధ్యాయంతో అనుసంధానం చేయటానికి ఒకే రకమైన దృక్పథాన్ని అనుసరించటం, ఎటువంటి తొట్రుపాటు, ఉపమానాలు లేకుండా విజయాలు, పరాజయాలు, సానుకూల అంశాలు, ప్రతికూల అంశాలను ఒకే తీవ్రతతో ప్రస్తావించటం ఈ రెండు గ్రంథాలకు ఉన్న ఉమ్మడి లక్షణాలని చెప్పవచ్చు.

ఈ రచనకు స్పష్టత తెచ్చింది సాహిత్యరూపం అనేకంటే చెప్పదల్చుకున్న అంశానికి సంబంధించి మనకున్న అంకిత భావం అని చెప్పవచ్చు. చెప్పదల్చుకున్న

అంశంపై స్పష్టత, దానిపట్ల అంకిత భావం ఈ రెండూ ఉన్నప్పుడు రూపంలో స్పష్టత, నిపుణత దానంతట అదే వస్తోంది. ఎటువంటి వక్రీకరణలకు, గుడ్డి అనుసరణకు తావివ్వకుండా (సాహిత్యానికి) తన వంతు సహకారం అందిస్తుంది. ఇక్కడ కొంత అస్పష్టతతోనైనా రచనకు సంబంధించి చే ఒక శైలిని ఏర్పాటుచేసుకున్నాడు. రానున్న కాలం ఈ శైలిని మరింత పదునెక్కిస్తుంది. మెరుగులు దిద్దుతుంది. ఒక సాంస్కృతికవేత్తకు ఉండే సంతోషంతో ఆయన తన ఇష్టాయిష్టాలను కూడా అదేవిధంగా మెరుగులు దిద్దుకున్నాడు. ఇక్కడ సాంస్కృతికవేత్త అని ప్రస్తావించినంత మాత్రాన రచయిత అనే అనుకోవాల్సిన అవసరం లేదు. చే ఉన్నది ఉన్నట్లు ప్రస్తావించేందుకు, కవితాత్మక ధోరణి అనుసరించేందుకు కొంత సిగ్గుపడితే పడి ఉండవచ్చు. ఈ వాస్తవికతలను ఆయన నామమాత్రపు స్పర్శతో నిజంగా మారింది. ఈ రచనలో చేకు సంబంధించిన "నేను, అది, నాలో అది" అన్న వలయం నిరంతరం తెరుచుకుంటుంది, మూసుకుంటుంది. కానీ ఎక్కడా మసకబారదు. పలచబడదు. నిద్రాణంగా దాగి ఉన్న ఒక శైలికి ఈ ధోరణి అవకాశమిచ్చింది. ఈ పేజీల్లో ఉన్న వర్ణన, ఆ వర్ణన క్రమంలో ఉన్న తేలికపాటితనంతో నిలిచిపోకుండా వెలుగులు జిమ్ముతోంది. ఈ రచన ఒక వ్యక్తికి కలిగే భావాలకు, (యుద్ధ అంకాల్లో ప్రస్తావించినట్లు నిర్ణయించుకున్న హంతకుడు తనవెనక కాలిపోయిన గుడిశెలు, వాటి మధ్య నిర్వేదాన్ని మిగిల్చినట్లు...) తనను తాను వెతుక్కునే భావాలకు మధ్య ముందుకు సాగుతుంది. (దీనికి సంబంధించి డైరీలో పేర్కొన్నట్లు " అన్నింటికీ కొలమానంగా ఉన్న ఒక మనిషి, ఇక్కడ నా గొంతుతో మాట్లాడతాడు, నా భాషలో మాట్లాడతాడు. నేను చూసిన విషయాల గురించి మాట్లాడతాడు" అన్న వాక్యాలకు ప్రస్తావించవచ్చు. ఇంకా చెప్పాలంటే కొన్నిసార్లు మనలను చూస్తూ ఉంటాడు.

కళ్లు చూసిన విధంగా, అంటూ చే ఉపయోగించిన రంగుల వర్ణన ఆయన చూసిన అన్ని విషయాలకు రంగులద్దుతుంది. ప్రకృతిని అనుమతించినంత వరకు అత్యంత సన్నిహితంగా వర్ణిస్తుంది.

> "ఆండిస్ పర్వతాల్లో నివసించే కొర్డిల్లెరా లాగా శబ్దం చేస్తున్న రహదారి కొండల నడుమ నడుస్తున్న పాములాగా ఉంది. చివరికి ఈ దారి అంతగా ఆకర్షణీయంగా లేని ప్రాంతాలకు, కష్టాలతో కాలం వెళ్లదీస్తున్న పట్టణాలకు చేరుతుంది. వీటిచుట్టూ దట్టమైన అడవులతో నిండిన పర్వతాలుంటాయి."

వైన్ దొంగిలించే ప్రయత్నానికి సంబంధించిన సంఘటనను వర్ణించేటప్పుడు, ఇతర ఆసక్తికరమైన సంఘటనలు వర్ణించేటప్పుడు కూడా ఆయన రచనలో అద్భుతమైన వ్యక్తీకరణ కనిపిస్తుంది.

> "నిజానికి, మేము ఎన్నడూ లేనంతగా దివాళా తీశాము. జేబులో చిల్లిగవ్వ లేదు. మా మదిలో ఒకప్పుడు వైన్ తాగిన మైకపు తాలూకు జ్ఞాపకాలు మెదులుతున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే దొంగను పట్టుకునేటప్పుడు ఉండే మానసిక స్థితిలో మేము ఉన్నాము."

కొత్తదనం అన్న భావన తిరిగి దర్శనం ఇస్తుంది. వృత్తాకారంగా బయటికి తీయటం అన్న వ్యాసంలో "చీకటిపడటంతో వేలాది కొత్త గొంతుకలు మా చెవులకు చేరుతున్నాయి. మేము ఆ చీకట్లో వేసే ప్రతి అడుగూ శూన్యంలోకి వేస్తున్నట్లుగా ఉంది" అంటాడు చే. విప్లవ యుద్ధంలో అంకాలు అన్న పుస్తకంలో "దాడి మధ్యలో ఒక్కసారిగా నిశ్శబ్దం అలముకుంది. మొదటి దఫా కాల్పుల తర్వాత మృతదేహాలు స్వాధీనం చేసుకోవటానికి వెళ్లినప్పుడు రహదారిపై ఒక్కరు కూడా లేరు...." ఈ విధంగా సాగుతుంది. వాస్తవిక ప్రపంచంలో ఉన్న నిశ్శబ్దాన్ని, అపరిమితిని ఈ వ్యక్తీకరణ ప్రస్ఫుటం చేస్తుంది : "అతని ఒంటికి ఒక్కపెట్టున వేడి ఊపిరి తగిలినట్లు అయ్యింది. అప్పుడప్పుడే పొద్దెక్కుతున్న చందమామ విరజిమ్మే వెండికాంతుల్లో ఒక ఆకారం అమాంతంగా మీదకు వచ్చినట్లనిపించింది. అంతేవేగంగా ఆ ఆకారం పొదలమాటున మాయమయ్యింది. ప్రకృతిలో ఇటువంటి ఉత్పాతాలు మా హృదయాన్ని తాకాయి" (మోటార్‌సైకిల్ డైరీ నుండి)."

> "ఆ పొదల మాటున ఉన్న (ఫైడెల్) గొంతు, టార్చిలైట్ల కాంతిలో ముందుకు సాగుతూ ఉంది. ఆ విధంగా మా నాయకుడు ఎంతో మంది ఆలోచనలను ప్రభావితం చేస్తున్న తీరును మనం తెలుసుకోవచ్చు" (అంకాల నుండి).
>
> ఇక్కడ ఫైడెల్ గొంతు, మాటలను ప్రస్తావించినప్పటికీ అక్కడ చిత్రం ఈ విషయానికి సంబంధించి నిశ్శబ్దమే పాటిస్తున్నట్లు మనకు కనిపిస్తోంది. అది ఎంతో దూరంగా చూసినప్పుడు కనిపించిన విధంగా కనిపిస్తోంది.

ఇదే విధంగా ఈ డైరీలో అనేక సందర్భాల్లో కాల్పనిక వ్యక్తీకరణలు, చాప్లిన్ తరహా వ్యక్తీకరణలు పదే పదే కనిపిస్తాయి. ఇంతకు ముందే పేర్కొన్న వైన్ దొంగిలించే

సంఘటనతో పాటు, ఇద్దరు యువకుల రాత్రి ప్రయాణం, నృత్యపు బృందాలతో కలవటం, చిలీ గెరిల్లా దళాల్లో నమోదు చేసుకోవటం, ఆకర్షణీయంగా తప్పించుకోవటాలు, గాలుల్లో తేలియాడటాలు, కారకాస్ సమీపంలోని పర్వతాల్లో కష్టాలమధ్య ఉన్న గుడిశెవాసుల మధ్య ఫోటోలు తీసుకోవటం కూడా ఇటువంటి నిశ్శబ్దాన్నే చిత్రీకరిస్తాయి.

లా పొడెరోసా చివరి గమ్య స్థానానికి చేరుకున్న తీరును సినిమాటోగ్రాఫిక్ తరహాలో వర్ణిస్తారు. నిశ్శబ్దంగా సినిమా చూస్తున్నట్లు ఆ తీరును మనం కూడా అంతే నిశ్శబ్దంతో గమనిస్తూ ఉంటాము:

> "నేను చేతి బ్రేకు ఉపయోగించాను. కానీ అప్పటికే నిర్వీర్యం అయిన సైనికుడిలాగా ఉండి, విరిగిపోయి ఉన్న బ్రేకు పని చేయలేదు. కొన్ని క్షణాల్లో నా కళ్లకు పశువుల కాళ్ల వెంట లేస్తున్న దుమ్ము మేఘాలు తప్ప మరేమీ కనపడలేదు. ఈ ధూళి మేఘాలను దాటుకుంటూ పొడెరోసా పల్లపు ప్రాంతంలోకి వెళ్లాక కొంత వేగం పుంజుకుంది. అదృష్టవశాత్తూ ఈ గుంపులో నడుస్తున్న చివరి పశువు గిట్టల దెబ్బను మాత్రమే మేము తప్పించుకోగలిగాము. అంతలోనే కీచుగొంతుతో అరుస్తున్నట్లు శబ్దం చేస్తూ ఒక నీటిప్రవాహం మా కళ్ల ముందు కనిపించింది. దాని ప్రవాహ వేగం అతి తీవ్రంగా ఉంది. దాన్నుండి తప్పుకునేందుకు బండిని పక్కగాడిలోకి మళ్లించాను. కళ్లు మూసి తెరిచేంతలో బండి రెండు మీటర్ల నిడివిన ఉన్న కట్టమీదకు చేరి రెండు రాళ్ల మధ్య ఇరుక్కుపోయింది. ఈ ప్రయత్నంలో మేము గాయపడకుండా మిగిలాము."

ఈ యువతరం సాహసాలు – ఆనందం, హాస్యం, అప్పుడప్పుడూ స్వయంగా సృష్టించుకున్న ఇక్కట్లు ప్రకృతిలో కేవలం సౌందర్యాన్ని మాత్రమే కాక అందులో ఇమిడి ఉన్న స్ఫూర్తిని కూడా అనుభవిస్తున్నాయి. అకస్మాత్తుగా కళ్ల ముందు కనిపిస్తున్న జింకలో చే బృందం ఇటువంటి స్ఫూర్తిని చూస్తోంది. "ప్రకృతి నిర్మలత్వాన్ని చెదరకుండా ఉంచేందుకు గాను మేము నిదానంగా ప్రయాణం సాగించాము. ప్రస్తుతం ఈ పశుపక్ష్యాదుల నివాసంతోనే మేము ఇప్పుడు సహచర్యం చేస్తున్నాము." మతానికి సంబంధించి తన అభిప్రాయాలు చెప్పేటప్పుడు కూడా ఇదే తరహా వర్ణనతో మన ముందుకు వస్తాడు చే. "మేము ఇరువురమూ ఒకరకమైన భక్తిప్రపత్తతతో ఆదివారం కోసం ఎదురుచూస్తూ ఉన్నాము" అంటాడు మరో సందర్భంలో. నాస్తికులై ఉండి కూడా వాళ్లు ప్రకృతిలో అటువంటి నివాసాన్ని వారు చూడగలిగారు. అటువంటి ప్రాకృతిక నివాసంతోనే

వారు సహచర్యం సాగించారు. ఈ క్రమంలో వీరు మనకు స్వేచ్ఛగా ఆలోచించే మార్గాన్ని ఈ క్రింది పదాల్లో గుర్తుకు తెస్తున్నారు. "స్పెయిన్ బిషప్ పర్వత ప్రాంతాల్లో ఉన్న తన ప్రార్థనా స్థలానికి మద్దతు ఇస్తాడు. మైదానమంతా మనదే."

1952 మార్చి 7న వల్పారాసియోలో నేరుగా అన్యాయాన్ని ఎదుర్కోవాల్సి వచ్చినప్పుడు వారు వ్యక్తీకరించిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి. లా గియొకొండాలో ఒక చిన్న దుకాణంలో కొనుగోలుదారు ఆ మహిళ. ఆమెకు ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధికూడా ఉంది.

> "ఈ బీదరాలు దారుణమైన స్థితిలో ఉంది. అక్కడ పోగుపడి ఉన్న మిఠాయిల వాసన చూస్తోంది. ఆమె గది నిండా దుమ్ముకొట్టుకున్న కాళ్లు చెల్లాచెదురుగా తిరిగినట్లు కనిపిస్తోంది. రెండు గోడకుర్చీలు దుమ్ములోనే కూర్చున్నాయి. ఈ కుర్చీలే ఆమె ఇంట్లో ఉన్న విలావస్తువులు. ఆస్తమాకు తోడు ఆమె గుండెకు సంబంధించిన సమస్యలు కూడా ఉన్నాయి."

దాదాపుగా నాశనం అయిందన్న అర్థం ఇచ్చేట్లు వర్ణన పూర్తి చేసిన తర్వాత కూడా ఆ రోగిష్టి అయిన మహిళ పట్ల శతృత్వం చూపుతున్న తీరును గమనిస్తూ చే – తాను కూడా స్వయంగా వైద్యుడే అయినా ఆమె విషయంలో తానుకూడా నిస్సహాయుడైపోయాడు. ఈ వైఫల్యం ఆయనలో చైతన్యాన్ని మరింతగా ప్రేరేపించినప్పుడు ఈ కింద ప్రస్తావించిన మాటల్లో తన అనుభవాన్ని గ్రంథస్తం చేస్తాడు చే.

> "ఆమె తన తుది క్షణాల్లో ఉంది. సూదూర తీరం రేపే అవుతున్న ప్రజల కోవకు చెందినది ఆవిడ. ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గ జీవితాలను పెనవేసుకుపోతున్న శక్తివంతమైన విషాదం కళ్లముందు దర్శనం ఇస్తుంది. తుది శ్వాస విడుస్తున్న ఆమె కళ్లు క్షమాపణ కోరుతున్నాయి. చివరాఖరి అవకాశంగా ఉన్న కన్సొలేషన్‌ను కోరుకొంటున్నాయి. మరికొద్ది క్షణాల్లో మనచుట్టూ ఉన్న కష్టాలకడలిలో ఆ శరీరం కలిసిపోతోంది."

మరే దిశలోను ప్రయాణాన్ని కొనసాగించలేకపోతున్న వీరిరువురూ చిలీలోని ఆంటోఫాగస్టాకు తమను చేరవేయించుకునే నిమిత్తం ఒక పడవ ఎక్కారు. ఆ సమయంలో వారిద్దరూ, లేదా చే మాత్రం విషయాలు స్పష్టంగా చూసే స్థితిలో లేదు.

“(శాన్ ఆంటోనియో పడవ రెయిలింగ్స్‌కు ఆనుకుని కూర్చున్న చే సముద్రాన్ని చూస్తూ) అక్కడ మా నిజమైన వృత్తి ఏమిటో తెలుసుకున్నాము. మొత్తం ప్రపంచంలో రహదారులు, సముద్రాలతో సహా శాశ్వతత్వాన్ని సాధించటమే మా వృత్తి అని తెలిసింది. నిరంతరం ఆసక్తికరంగా ఉంటూ, మా కళ్ల ముందుకు వచ్చిన ప్రతి అంశాన్ని గమనిస్తూ, ప్రతి మూలనూ సోదా చేస్తూ, ఎక్కడా నిలకడగా లేకుండా, జరుగుతున్న విషయాలు, వస్తువుల వాస్తవిక పరిణామాలను పరిశీలిస్తూ, బాహ్యాపరిధులను అందుకొంటూ ఉండటమే మా అసలైన వృత్తి అని తెలిసింది  ఈ ప్రయాణంలోనే.”

ఈ ప్రయాణీకులకు రహదారి కంటే సముద్రమే మరింత ఆసక్తికరంగా కనిపించింది. ఎందుకంటే తమ దారిన తాముగా సాగిపోయే వారిని సైతం నేలతల్లి ఆపి పలకరించి అక్కడే నివాసం ఏర్పరచుకొమ్మని ఆహ్వానిస్తుంటే సముద్రం మాత్రం అన్ని రకాల సంబంధాల నుండి స్వాతంత్ర్యం సంపాదించుకొన్న ధోరణిని కనబరుస్తోంది. “ఇక ఇప్పుడు, నా పునాదులు వెలికి వచ్చాయి, స్వేచ్ఛగా మారాయి ఇంకా” అంటూ ఈ ధోరణిలో రాసిన పదాలు చిచినా విముక్తి సందర్భంగా రాసిన సంపుటంలో మరింత స్పష్టమైన ఆకృతి తీసుకుంటాయి. ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న ముదుసలి చిలీ పౌరురాలి సమక్షంలో తన మరో వేరును తెంచేసుకున్నాడు చే. అదేసమయంలో తన మిత్రబృందంలో చిలీ దంపతులను చూసినప్పుడు మాత్రం చే హృదయం ఉప్పొంగేది. అదే సమయంలో బాక్విడానో చేతుల్లో వేధింపులకు గురైన కమ్యూనిస్టులను చూసినప్పుడు కూడా ఆయన హృదయం ఆక్రోశించేది.

“ఎడారి రాత్రిలో చలికి ముద్దై ఒకరినొకరు కావలించుకున్న ఆ జంట ప్రపంచంలోని ఏ మూలన ఉన్న కార్మికవర్గాన్నైనా ప్రతిబింబిస్తోంది.”

శాన్ మార్టి సంతానంలాగా ఒకటే దుప్పటిని వారు పంచుకుంటున్నారు.

“అది నా జీవితంలో అత్యంత చల్లని సమయం. అదే సమయంలో ఈ కొత్తదనం పట్ల కొంత నాకు, నాతోటి మానవాళికి సహోదరత్వం కూడా కలిగిన సమయం అది.”

ఆయన స్వంతం చేసుకున్న ఈ సాహసోపేతమైన, లోతైన ఒంటరితనం కొత్తది. ఆసక్తికరమైనది కూడా. సాహసాన్ని మించిన తెంపరితనం ఏముంటుంది! ఉరికంబాలనెక్కిన బానిసలు, బాధితులైన బాలల పట్ల సానుభూతితో నిండే వరకు డాన్

గిజోట్ కూడా ఒంటరితనం, కొత్తదనం మధ్యనే ఉన్నాడు. ఆయన చుట్టూ ఉన్న ప్రపంచం పట్ల అమితాసక్తి కనబరుస్తూనే ఉన్నాడు. మెడిటేషన్ ఆన్ గిజోట్ అన్న గ్రంథంలో జోస్ ఒర్టెగా వై గాస్సెట్ ఆయన అభిప్రాయాలను క్రోడీకరిస్తూ "నేను, నా, నా చుట్టూ ఉన్న పరిసరాలు" అన్న వ్యక్తీకరణ సాధారణంగా రెండు అంశాల మిశ్రమం అని అభిప్రాయపడ్డారు. ఇందులో నేను, నేనే అన్న భావాల మధ్య జరుగుతున్న ఘర్షణ, తేల్చుకోలేని తనం అని కూడా చెప్పవచ్చు. ఈ రెండు వ్యక్తీకరణలు వేరుపడటం, దూరం కావటం జరిగినా అంతర్గతంగా అనుసంధానించబడి ఉండటం అన్న అర్థాన్ని ఇస్తాయని జోస్ ఒర్టెగా వ్యాఖ్యానం. ఇదే సందిగ్ధత చే జ్ఞాపకాల్లో కూడా కనిపిస్తోంది.

> ఆయన మొదటిసారిగా ప్రయాణం కట్టినప్పుడు "మమ్ములను వేరు చేస్తున్న దూరంలో ఆ జంట రూపం క్రమంగా అంతరించిపోతున్నప్పటికీ, మేము ఆ వ్యక్తి ముఖంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న నిర్ణయాత్మకతను గుర్తుంచుకుంటూనే ఉన్నాము. " రండి సోదరులారా, కలిసి ప్రయాణిద్దాం, నేనూ బాటసారినే " అతను వెనకాముందూ చూసుకోకుండా మాకు ఆహ్వానం పలుకుతున్న తీరును కూడా మాకళ్ల ముందు మెదులుతూనే ఉంది. ఈ ఆహ్వానంలో గమ్యం లేని మా ప్రయాణం పట్ల ఆయన వ్యక్తం చేసిన అయిష్టత, తృష్ణీకారం కూడా మా కళ్లముందు మెదులుతున్నాయి" అని రాస్తాడు చే.

ఈ అయిష్టత, తృష్ణీకారం ఎవరిది స్వయంగా గువేరా దేనా లేక తోటి కార్మికులదా? బహుశా వీరిరువురిదీ కాకపోవచ్చు కూడా. కానీ ఎడారి రాత్రి తోడుతో బ్రెడ్, వెన్న, దుప్పట్లు పంచుకోవటం బాధాకరమైన ఎడబాటుకు దారితీశాయి.

ఏ పరిస్థితుల్లో మనం దక్షిణాదికి చెందిన గనులు, గని కార్మికులతో కలిసి చెక్వికామాటాలో ఉన్నాము.

> "ఈ పెద్ద గనిలో చల్లదనం సామర్థ్యం, అసమర్థపు అసంతృప్తి ఒకదానితో ఒకటి కలిసి పోతున్నాయి. రెండూ కలసి జీవించాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఆ రెండింటి మధ్య ఉన్న వైషమ్యం ఒకవైపున, మరోవైపున ఊహాగానం కనిపిస్తూనే ఉన్నాయి..."

ఇక్కడే మనకు స్పష్టమైన సూచన కనిపిస్తోంది. ఈ సూచన ఏ సందర్భంలో ముందుకు వచ్చిందో ఆ సందర్భానికి సంబంధించిన ఆలోచనను కూడా మనకు కలిగిస్తుంది. కొద్ది సంవత్సరాల తర్వాత క్యూబా :

"... ఏదో ఒక రోజున క్యూబాలో గని కార్మికులు ఆనందోత్సాహాల మధ్య ఉన్న చిత్రాన్ని మనం చూస్తాము. సంతోషం అనే విషయం వారి ఊపిరితిత్తుల్లోకి ప్రవహిస్తుండగా వారు ఒకప్పుడు అక్కడ పరిస్థితి ఎలా ఉండేదో జ్ఞాపకాలు చెప్పుకుంటుంటారు. మరోవైపున ప్రపంచంలో ఏ మూలనుండో ఎర్రని కాంతులు ప్రసరిస్తుంటాయి."

నిజానికి 1964లో ఈ భావాలకు కవి లియోన్ ఫెలిప్పె పదకల్పన చేశారు. (చే ఈ పదాలు రాసేనాటికి ఫెలిప్పె గురించి ఆయనకు తెలుసో లేదో నాకు తెలియదు) ఫెలిప్పె మాటల్లో "సూర్య కాంతి లోతును ఇంతవరకు ఎవ్వరూ కొలవలేకపోయారు...ఎవ్వరూ చెవిపోగును ప్రేమతో కోయలేరు"

"ఈ విషయాలు ఇప్పుడు మీ దృష్టికి తేవచ్చు. ఎందుకంటే ఒక పేరు గాంచిన కవి ఒకరు ఇప్పుడు క్యూబా రానున్నారు. పెట్టుబడిదారీ విధానం ప్రజలను ఎన్ని విధాలుగా వేరు చేస్తుందో ప్రత్యక్షంగా చూసిన తర్వాత క్యూబా అడుగుపెట్టనున్నాడు. తమ దౌర్భాగ్యమైన కష్టాలను దోపిడీదారుడు ఎలా ఉపయోగించుకుంటాడో చూసిన తర్వాత ఇక్కడకు వస్తున్నాడు. ఈ విషయాలు తెలుసుకునే క్రమంలోనే తమ మార్గాన్ని తెలుసుకున్నారు. తమ పాత్ర ఏమిటో అవలోకనం చేసుకున్నారు. ఇక్కడ మన క్యూబాలో పని అంటే నూతన అర్థం కనిపిస్తోంది. అందరూ సంతోషంగా పని చేస్తున్నారు."

అయినప్పటికీ మార్చి 1952లో చే "చకుక్వికమాటా" గని కార్మికులు దోపిడీకి గురవుతున్న తీరును వర్ణిస్తూ రాసిన అధ్యాయంలో రాసిన అంశాలు ఆధునిక నాటకంలోనివిగా కనిపిస్తాయి. ఈ వర్ణనలో ఆయన సమతూకం పాటించాడు. సమాచారం కూడా సరిగానే అందించాడు. అక్కడ నేర్చుకున్న గుణపాఠం "చిన్న చిన్న గోతుల్లో పెద్ద సంఖ్యలో గని కార్మికుల శవాలు కుప్పలు పడి ఉండటం" చూడటం ద్వారా నేర్చుకున్నారు. 1952 మార్చి 22న రాసుకున్న నోట్స్‌లోను, ఆ తర్వాత తిరగరాసిన నోట్స్‌లోను ఆయన "చిలీ ప్రజలు చేయాల్సిన ప్రధాన కర్తవ్యం ఏమిటంటే తన వీపు మీద కూర్చున్న యాంకీ మిత్రుడిని కదిలించి వేయాలి. ఇప్పటికిప్పుడు ఈ లక్ష్యం భారీగానే కనిపిస్తోంది" అని రాసుకున్నారు. ఈ విషయాన్ని చదివిన తర్వాత సాల్వెడార్ అలెండీ మనలను ఆకర్షిస్తాడు.

మోటారుసైకిలుపైనా, ట్రక్కుల్లోను, వాన్లలోను, పడవ మీద లేదా చిన్న ఫోర్డ్ కారు మీద ప్రయాణించటం, పోలీసు స్టేషన్లలోను, వెన్నెల వెలుగుల్లో, నక్షత్రాల నీడన, సముద్రపు అంచున నిద్రిస్తూ చే ఆస్తమా వ్యాధితో నిరంతరం పోరాడుతూనే ఉన్నాడు. అస్తమాతోనే ఇద్దరు మిత్రులు అర్జెంటీనాను దాటిపోయారు. కాలినడకన ప్రయాణిస్తూ పెరులో ప్రవేశించారు. మార్టిపై మెక్సికో వాసులు ప్రభావం చూపినట్లుగా వారిపై పెరుఇండియన్‌లు పెద్దఎత్తున ప్రభావం చూపించారు.

> "మమ్ములను గమనిస్తూ నగర వీధుల్లో మాయమవుతున్న ప్రజలు ఓడించబడిన జాతికి చెందిన వారు. వారి మనసుల్లో భయం గూడుకట్టుకుని ఉంది. బయట ప్రపంచంతో పోలిస్తే పూర్తిగా భిన్నంగా ఉంటుంది. వారు జీవించే అలవాటును మార్చుకోలేరు కాబట్టి జీవిస్తున్నారని వీరి గురించి ఎవరో ఒక రచయిత అన్నాడు."

ఓడిపోయిన పంచమామ రాజ్యానికి వచ్చారు. భూమాతను చూశారు. రాళ్లకు బదులు కోకా ఆకులు నమిలారు. వాటితో పాటే వెంటవచ్చే సమస్యలను కూడా అనుభవించారు. (ఈ ప్రయాణంలో) కేంద్రం, ప్రపంచంలో వినూత్నత్వంతో మునిగి ఉంటుంది. అక్కడ మామా ఒక్లో తన బంగారు ఆభరణం భూమి మీద వదిలేస్తుంది. భూకంపాల దేవుడి ప్రదర్శన మధ్యలో వారు నిరంతరం ఉత్తరాదికి వెళ్లాల్సిన విషయాన్ని మాత్రం పదే పదే గుర్తుపెట్టుకున్నారు. అది దక్షిణ అమెరికా నుండి మాత్రమే చూడగలము.

> "చిన్న చిన్న దృశ్యాల్లో అక్కడ నిల్చున్న ఇండియన్‌లు ప్రదర్శన చూస్తున్నారు. మధ్య మధ్యలో బట్టతలతో ఉన్న ఉత్తర అమెరికా వాసి కనిపిస్తున్నాడు. కెమెరా పట్టుకుని, క్రీడాకారులు వేసే తరహాలో దుస్తులు వేసుకుని మరో ప్రపంచం నుండి వచ్చిన విలేకరిలాగా ఉన్నారు."

కజ్కో కేథెడ్రల్ చేలో ఉన్న కళాకారుడిని బయటకు తెచ్చింది. ఆయన కేథెడ్రల్ గురించి నమోదు చేసిన వర్ణన గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. "వెండికున్నంత హుందాతనం బంగారానికి ఉండదు. బంగారం వయసు పెరిగే కొద్దీ మెరుస్తుంది. అదేవిధంగా కేథెడ్రల్ కూడా ముసలావిడకి ఎక్కువ మేకప్ వేసినట్లుంది" అని వ్యాఖ్యానిస్తాడు. ఆయన సందర్శించిన అనేక చర్చిల్లో బేలెన్ చర్చి బెల్ స్థంభాల దయనీయత

అతన్ని ఆకట్టుకుంది. భూకంపం తాకిడికి కింద పడిన ఈ గండ కొండల్లో పడిపోయిన మృత జంతువు శరీరంలాగా కనిపించింది. పెరు వలసవాద సంస్కృతి గురించి ఆయన చేసిన శక్తివంతమైన వ్యాఖ్య లిమా చర్చిని వర్ణిస్తూ రాసిన దిగువ మాటల్లో కనిపిస్తుంది.

> "లిమాలో కళలు నిర్దిష్ట శైలిని సంతరించుకున్నాయి. ఆకట్టుకునే స్థాయికి చేరాయి. కేథెడ్రల్ స్థంభాలు ఆకాశంలోకి దూసుకుపోతున్నాయి. స్పెయిన్ వలసల్లో ఇది సాధారణమేనేమో. కజ్కోలో కనిపించిన చెక్కపనితనం ఎంతో విలాస జీవితాలను ప్రతిబింబిస్తోంది. దాన్ని అక్కడే వదిలిపెట్టి ఇక్కడ (అదే ఆకృతిని) బంగారంతో నిర్మిస్తున్నారు. ఇన్కా నగరంలో ఉన్న నిర్మాణాలు దట్టమైన రంగులతో ఉంటే ఇక్కడ నిర్మాణాలు తేలికపాటి రంగులతో ఉన్నాయి. చిత్రకళ కూడా అద్భుతంగా ఉంది. ఆనందోత్సాహాలను ప్రతిబింబిస్తోంది. హెర్మిటిక్ మెస్టిజోస్‌లతో పోల్చినప్పుడు చిత్రకళ చాలా ఆధునికమైనదని చెప్పాలి. మెస్టిజోస్ చిత్రకళ ప్రధానంగా దట్టమైన రంగులతో ఉంటుంది."

ఏప్రిల్ ఐదో తేదీన వారు మచుపిచ్చు ప్రాంతాన్ని సందర్శించినప్పుడు చేకు కలిగిన భావాలే తర్వాత 1953 డిశంబరు రెండో తేదీన పనామా నుండి వెలువడే ఒక పత్రికలో చే రాసిన వ్యాసానికి ప్రేరణ. ఇందులో చారిత్రక సన్నివేశాలకు సంబంధించి, ఇతర అనేక కోణాల్లో సేకరించిన విలువైన సమాచారం పొందుపర్చి ఉంచాడు. ఈ సమాచారం ఆయన నోట్సులో కనిపించదు.

మహానదుల ఒడ్డున అన్న వ్యాసంలో కూడా ఇదే ధోరణి కనిపిస్తోంది. ఈ వ్యాసం పనామాలో 1953 నవంబరు 22న ప్రచురితమైంది. ఇందులో ప్రధానంగా అమెజాన్ దిగువ ప్రాంతాల్లో ఆయన సంచారాన్ని వివరిస్తాడు. హాస్యరసస్ఫోరకంగా వివరించిన మాంబో, టాంటో కథనం నిజానికి చే, ఆల్బెర్టోలు సాగించిన సాహసోపేత ప్రయాణంలో అమెజాన్ ప్రాంతంలో నివసించే ఇండియన్‌ల గురించి అనేక విషయాలు తెలుసుకున్నారు.

అమెజాన్ ప్రాంతంలో కనిపించిన అద్భుతమైన కట్టడాల నుండి నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాల వరకు వీరిద్దరు విస్తృతంగా పర్యటించారు. ఒకరకంగా ఇది అమెరికా ప్రజల పరిణామాన్ని విస్తరించిన మార్గంలో ప్రయాణించటం వంటిదే. శాన్ పాబ్లోలోని కుష్టువ్యాధిగ్రస్తుల కాలనీలో తన 24 జన్మదినం జరుపుకుంటూ చే బొలివర్, మార్టి

శైలిలో మాట్లాడాడు. "మనమంతా ఒకే మెస్టిజో జాతికి చెందిన వాళ్లము. మెక్సికో మొదలు మగెల్లాన్ పర్వతాల వరకు ఉన్న ప్రజల్లో ఈ లక్ష్యాల్లో ఎంతో సామ్యం ఉంది. అందువల్ల నాలోని పరిమితమైన ప్రాంతీయాభిమానాన్ని వదిలించుకోవటానికి ప్రయత్నిస్తున్నాను. ఈ దిశగా ఉమ్మడి లాటిన్ అమెరికా సాధన కోసం పెరు ప్రజలతో విందు పంచుకుంటున్నాను" అన్నాడు.

ఈ పదాల్లో పవిత్రతకు సంబంధించిన సూచనలులేవు. అంతమాత్రాన ఆయన మాటలు కేవలం గారడీ అని చెప్పటానికి లేదు. అన్ని రకాల సాంప్రదాయాల పరిధికి అతీతమైన విశ్వాసం ఆయన మాటల్లో కనిపిస్తోంది. "అక్కడ హాజరైనవాళ్లు నా ఉపన్యాసానికి పెద్దఎత్తున స్పందించారు" అని ఆ తర్వాత తన డైరీలో రాసుకుంటాడు. 1952 జూలై 6న బగోటా నుండి తన తల్లికి రాసిన లేఖలో కూడా ఆయన అదే చెప్తాడు. "నేను ఉమ్మడి లాటిన్ అమెరికా గురించి ఇచ్చిన ఉపన్యాసం అక్కడున్న పెద్దలందరి మన్ననలకు నోచుకొంది" అని ఆ లేఖలో రాస్తాడు. గ్రానడో కృతజ్ఞతా పూర్వకంగా చెప్పిన మాటలపై చే వ్యాఖ్యానం చేసినప్పుడు అన్న మాటలు ఇలా ఉన్నాయి. "అల్బెర్టో పెరోన్‌కు నిజమైన వారసుడిగా కనిపిస్తున్నాడు. అల్బెర్టో ఎంతో అద్భుత ఉపన్యాసం ఇచ్చాడు. ఇది ఎంత అద్భుతంగా ఉందంటే మన సానుభూతిపరులంతా పగలబడి నవ్వారు." కానీ ఆయన పూర్తి భిన్నంగా కుష్టువ్యాధిగ్రస్తుల గురించి, వారి జీవితాల గురించి మాట్లాడాడు. ఈ ఉపన్యాసం ఇస్తున్నంత సేపు తన బాధలు గురించి మర్చిపోయేందుకు విఫల ప్రయత్నం చేశాడు. శాన్ పాబ్లో కుష్టువ్యాధిగ్రస్తుల కాలనీ నుండి వీడ్కోలు తీసుకున్న సందర్భం గురించి రాస్తూ చే,

> "ఆ రోజు రాత్రి ఆ కాలనీలో నివసిస్తున్న కుష్టురోగులు మాకు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఆ సందర్భంగా ఒక అంధుడు స్థానికభాషలో ఎన్నో పాటలు పాడాడు. ఫ్లూటు, గిటారు, బందనో వాయిద్యకారులతో ఆర్కెస్ట్రా గ్రూపు తయారైంది. అందరూ ప్రధానంగా వాయిద్యాలకు వేళ్లనే ఉపయోగించారు. ఆ తర్వాత ఉపన్యాసాలు. అందులో నలుగురు రోగులు బాగా మాట్లాడారు. అందులో కొద్దిపాటి అసంబద్ధత ఉంది కూడా. అందులో ఒకరు బిగదీసుకుపోయారు. మాటలు పెగల్లేదు. ఉద్రేకంతో చివరికి "ఈ వైద్యులకు భారీ అభినందనలు'' అని అరిచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత వారి ప్రేమాభిమానాలకు అల్బెర్టో పదే పదే కృతజ్ఞతలు చెప్పాడు.."

చే తన తల్లికి  రాసిన లేఖలో ఈ సంఘటన గురించి ఎంతో విపులంగా వర్ణించాడు. (ఎకోర్డియన్ వాయిద్యకారుడు వాయించటానికి చేతివేళ్లు లేకపోవటంతో మణికట్టుకు పుల్లలు కట్టుకుని వాటినే వేళ్లుగా ఉపయోగించాడు. దాదాపు అందరూ ఏదో ఒక అవయవాన్ని పోగొట్టుకున్నవారే. ఈ వ్యాధి కారణంగా) ఆమె మరింత నీరుగారకుండా ఉండేందుకా అన్నట్లు ఈ చిత్రణ అంతా హర్రర్ సినిమాల్లో ఉండే విధంగా ఉందని సమాధానపర్చే ప్రయత్నం చేశాడు. అయితే ఈ వీడ్కోలులో కనిపించే ఆర్ద్రతను మాత్రం దాచలేకపోయాడు.

> "రోగులు వరుసగా వీడ్కోలు చెప్తూ వివిధ జానపద గొంతుకలు వినసొంపుగా వినిపిస్తుండగా మా వాహనం తీరం దాటి ముందుకు పోసాగింది. వారి నివాసాల్లో ఉన్న లాంతర్ల నీడలో వీరి శరీరాలు దూరం నుండి చూసే వారికి దెయ్యాల్లాగా కనిపిస్తున్నాయి."

ఈ నోట్సులో కుష్టురోగుల గురించి వారు వెల్లడించిన అనుభవాలు, అభిప్రాయాలు వారిపట్ల కుష్టురోగులు ఎంత అభిమానం, ఆప్యాయత ప్రదర్శించారో తెలుస్తోంది. అక్కడ వారితో పాటు నివసిస్తూ వారికి వైద్య సేవలందించటం, వారితో ఫుట్‌బాల్ ఆడటం, ఎంతో సోదరభావంతో వ్యవహరించటం, మానవతను ప్రదర్శించటం ద్వారా అల్బెర్టో, చేలు కుష్టురోగులకు ఎంతగానో దగ్గరయ్యారు. ఈ అన్ని చర్యల్లోను చే లో అంకురం దాల్చుతున్న విప్లవకారుడిని మనం చూడవచ్చు. ఈ కింది మాటలు నేను వక్కాణిస్తున్నాను."అక్కడ మమ్మలను మేము కుష్టువ్యాధి నివారణకు తీవ్రంగా అంకితం చేసేలా ప్రేరేపించేది ఏమైనా ఉంటే అది మా ప్రయాణంలో మేము కలిసిన ఈ కుష్టురోగులు మా పట్ల ప్రదర్శించిన ఆదరాభిమానాలు. ఆప్యాయతలే" అని చే రాసుకున్నాడు. ఈ అభిమానం, నిబద్ధత భవిష్యత్తులో ఎంత లోతుగా మారనుందో ఆయన ఊహించి ఉండరేమో. కుష్టును అర్థం చేసుకున్నట్లే ఆయన మానవసమాజం అనుభవిస్తున్న బాధలను కూడా అర్థం చేసుకున్నాడు.

జీవితం లాగానే అనేక బోధనలు, వైరుధ్యాలతో నిండిన ఈ నోట్సు చదివిన తర్వాత ఇంత విస్తృతంగా వ్యాఖ్యానించిన తర్వాత ఇక చెప్పటానికి పెద్దగా ఏమీ ఉండదు. ఒక చిన్న సూచనతో ఈ పరిచయాన్ని ముగిస్తాను. చే కారకాస్‌లో ప్రవేశించే అద్భుత దృశ్యాన్ని వర్ణిస్తూ "ప్రయాణంలో ఉపయోగించిన దుప్పటి కప్పుకుని వచ్చిన చే ట్రక్కు నుండే అన్ని రకాల భాషల్లో అరుస్తూ తన ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాడు."

ఇక నా వ్యాఖ్యానాన్ని ముగించదల్చుకున్నాను. ఎందుకంటే ఇందులో చివరి అధ్యాయం, మార్జిన్ నోట్సు అన్న అంశం తప్ప ఇంత అద్భుత వర్ణనకు ఇక ఏ మాత్రం పరిచయం అవసరం లేదు. నిజానికి ఈ అద్భుతమైన నూతన అంశాలను డైరీకి చివర్లో పొందుపర్చాలా లేక దీనితోనే డైరీ ప్రారంభించాలా అన్న సందేహం నాకుంది. ఈ నూతన అంశం రాత్రి ఆకాశంలో అచ్చయినట్లు చే రాసుకున్నాడు. ఇందులో చే భవిష్యత్తు ఇమిడి ఉంది. రెండు భిన్న ధృవాలను వేరు చేసే ఈ గొప్ప స్ఫూర్తి, మార్టి మన అమెరికా గురించి ఊహించినట్లుగా "నూతన తరహా అమెరికా గురించిన విత్తనాలు అందమైన ఈ దేశాలు, వాటిని చుట్టుముట్టిన సముద్రం గుండా వేసుకుంటూ" పోతుంది. ఇది ఎంతో ముఖ్యమైన ముగింపు లేని అధ్యాయం. మెరుపులా ఇది మన భూమి గొప్పతనంపై వెలుగులు ప్రసరిస్తోంది. 20వ శతాబ్దిలో సాధారణ సైనికుడినని చెప్పుకునే వ్యక్తి హృదయంలో ముద్రితమైంది. ఈ ఒక్కడే మన ఆశల్లో నిరంతరం రహదారిపైకి వస్తూనే ఉంటాడు. తన కాళ్ల కింద రొకినాన్‌టేతో చేసిన చెప్పులు వేసుకుని చేతులపై కప్పుకున్న వ్యక్తి మన కళ్లముందు సాగిపోతూ ఉంటాడు.

# మోటార్ సైకిల్ డైరీ

## లాటిన్ అమెరికా



# ఒకరినొకరం అర్ధం చేసుకున్నాము

ఇది విశ్వసించలేని సాహసగాథ కాదు. నిరాశావాది వినిపిస్తున్న కథనం అంతకంటే కాదు. దీన్ని అలా  నడిపించాలన్నది నా ఉద్దేశ్యం కాదని మాత్రం చెప్పదలచాను. ఒకానొక కాలంలో  సమాంతరంగా సాగిన రెండు జీవితాల క్లుప్త చిత్రీకరణ ఇది. ఈ రెండు జీవితాలకు ఒకేరకమైన ఆశలు, కలలు వుండేవి.

ఒక వ్యక్తి తొమ్మిది నెలల తన జీవిత కాలంలో ఎన్నో విషయాల గురించి ఆలోచించగలుగుతాడు. ఆదర్శవంతమైన తాత్విక ధ్యానం మొదలు ఆకలిగొన్నప్పుడు పిడికెడు మెతుకులకోసం అర్రులు చాచటం వరకు – ఆకలి తీవ్రతపై ఆధారపడి అనేక అంశాల గురించి ఆలోచించగలుగుతాడు. అదే సమయంలో ఒకవేళ అదే వ్యక్తి సాహసకృత్యాల అలవాటు ఉన్నవాడైతే ఇతరులకు ఎంతో ఆసక్తిదాయకమైన అంకాల చుట్టూ తిరుగుతాడు. అటువంటి అంకాలకు సంబంధించిన వైనం తైనం లేని రికార్డును పరిశీలిస్తే ఈ నోట్సులాగానే ఉంటుంది.

ఆ విధంగా నాణేన్ని గాల్లోకి వదిలాము. ఆ నాణెం గిరికీలు కొడుతూ ఒక్కోసారి బొమ్మపడుతుంది, ఒక్కోసారి బొరుసు పడుతుంది. అన్ని లక్షణాలను తనలో ఇముడ్చుకోగలిగిన మనిషి ఇక్కడ నా నోటి ద్వారా మాట్లాడతాడు. నా భాషలోనే వర్ణిస్తాడు. నా కళ్లతో చూసినదాన్నే వర్ణిస్తాడు. పైకెగిరిన నాణెం పదిసార్లు బొమ్మ పడితే ఒక్కసారి

మాత్రమే బొరుసు పడుతుంది. లేదంటే పదిసార్లు బొరుసుపడి ఒక్కసారి మాత్రమే బొమ్మపడే అవకాశం కూడా ఉంది. నిజానికి ఇది సాధ్యాసాధ్యాలకు సంబంధించిన అంశం. కారణాలు, క్షమాపణలు ఉండవు. వాస్తవంగా మన కళ్లు దేన్నైతే చూడగలవో దాన్నే పెదాలు వర్ణించగలవు. బహుశా మన దృక్కోణం ఎప్పటికీ సంపూర్ణమైన రూపు తీసుకోదేమో. లేదా నిరంతరం పరిణామం చెందుతూ ఉంటుందేమో. మన నిర్ణయాల్లో మరీ రాజీపడకుండా ఉంటున్నామా? నా చేతి వేళ్ల కదలికను టైపు మిషన్ అర్థం చేసుకున్న భావాలు ఇలా ఉన్నాయి. బహుశా నా కోరికలు, ఇష్టాయిష్టాలు ఇవేనేమో. ప్రస్తుతం అటువంటి కోరికలు లేవు. చనిపోయాయి. దానికి ఎవ్వరూ బాధ్యులు కాదు కూడా.

ఈ నోట్సు రాసిన వ్యక్తి మొదటిసారిగా అర్జెంటీనాలో నేలను తాకిన క్షణంలోనే తనను తాను మర్చిపోయాడు. కోల్పోయాడు. ఆ భావాలను గుర్తించి నగిషీలు చెక్కే వ్యక్తి, అంటే నేను, ఇక ఎంత మాత్రం లేదు. కనీసం ఒకప్పటి నేను నేనుగా మిగలలేదు. నిరంతరం పరిభ్రమిస్తూనే ఉన్నాను. గొప్పదైన మన అమెరికా అన్న నా భావనలు కూడా ఎంతగానో మారిపోయాయి.

ఏ ఫోటోగ్రఫీ ప్రచురణల్లోనైనా ఈ ప్రాంతపు నేల తాలూకు స్పష్టమైన చిత్రాలు అందుబాటులో ఉంటాయి. బహుశా ఇవన్నీ రాత్రుళ్లు తీసినవే అయి ఉంటాయి. నిండు పున్నమి వెలుగులో తీసిన ఫోటోలు కూడా అయిఉండవచ్చు. మిట్టమధ్యాహ్నం చిమ్మ చీకటి అన్న భావన వెనక దాగి ఉన్న రహస్యం మిగిలిన పేజీల్లో కనిపిస్తుంది. ఈ పుస్తకం చదివే పాఠకులకు నా కనురెప్పకున్న సున్నితత్వం గురించి అంతగా తెలిసిఉండకపోవచ్చు. ఆ సున్నితత్వాన్ని గుర్తించటం నాక్కూడా కష్టమే. నా కళ్లు తీసిన చిత్రాల వెనక దాగిఉన్న ఫోటోలు ఏమిటన్నది స్పష్టంగా గుర్తించటం వారికి సాధ్యం కాకపోవచ్చు. ఈ మాటలు చెప్పటంలో నా భావన ఏమిటంటే నేను ఒక ఫోటో తీసి అది రాత్రిపూట తీసింది అని చెబితే అది మీరు నమ్మవచ్చు. నమ్మకపోవచ్చు. అది నాకు పెద్ద సమస్య కాదు. నా ఈ నోట్సులో వర్ణించుకున్న ఫోటో ఏమిటన్నది మీరు తెలుసుకునే అవకాశం లేకపోతే నేనే చెప్పేదానికి భిన్నంగా వాస్తవం ఏమిటన్నది గుర్తించటం మీకు కష్టం. ఇక ఇక్కడ నేను మిమ్ములను వదిలిపెడుతున్నాను...



# ముందస్తు హెచ్చరికలు

అది అక్టోబరు మాసంలో ఒక ఉదయం. 17వ తేదీ శెలవుదినం కావటంతో నేను కొర్డోబాకు పయనం కట్టాను. (అప్పట్లో దేశాధ్యక్షుడు జువాన్ పెరోన్ మొదటిసారిగా జైలు నుండి విడుదలైన రోజును శెలవుదినంగా ప్రకటించేవారు. పెరోన్ 1946 నుండి 55 వరకు, తిరిగి 73 నుండి చనిపోయే వరకు దేశాధ్యక్షుడిగా ఉన్నారు). మేము అల్బెర్టో గ్రెనడో ఇంటివద్ద వైన్, కందమూలాలతో చేసిన మటే సేవిస్తూ జీవితంలో ఈ మధ్యకాలంలో జరిగిన సంఘటనల గురించి పిచ్చాపాటిగా మాట్లాడుకుంటున్నాము. మధ్యమధ్యలో గ్రనడోకు చెందిన లా పొడెరోసా మీద కూర్చుంటున్నాము. శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒక కుష్టు వ్యాధి కాలనీలో తన ఉద్యోగాన్ని వదిలిపెట్టాల్సిన రావటం గురించి, ఇప్పుడు ఇక్కడ ఎస్పనాల్ ఆసుపత్రిలో తనకు వస్తున్న బొటాబొటీ వేతనం గురించిన బాధలు వెళ్లగక్కుతున్నాడు అల్బరోట.నేను కూడా నా ఉద్యోగం వదిలిపెట్టాను. అయితే ఉద్యోగం వదిలిపెట్టినందుకు అల్బెర్టోలాగా నేను విలపించటం లేదు. సంతోషంగా ఉన్నాను. ఉద్యోగంలో ఉన్నప్పుడు నాకు కొంత అసౌకర్యంగా ఉండేది. ఎందుకంటే కలల లోకంలో తేలియాడే నాకు ఆసుపత్రులు, వైద్య పరీక్షలు, వైద్య కళాశాల చదువులు అంటే బొత్తిగా ఆసక్తి ఉండేది కాదు.

ఈ విధంగా పగటి కలలుకంటూ నడుస్తున్న మేము దూరతీరాల్లో ఉన్న దేశాలు చేరుకున్నాము. సముద్రపు లోతులు కొలిచాము. ఆసియా ఖండమంతా పర్యటించాము. ఉన్నట్లుండి మాకు ఊహా కల్పనలోనే ఒక ప్రశ్న తట్టింది.

మనం ఉత్తర అమెరికా ఎందుకు వెళ్లకూడదు? అన్నది ఆ ప్రశ్న.

ఉత్తర అమెరికానా, కానీ ఎలా?

లా రొడెరోసా మీదనే ....

ఈ విధంగా మా ప్రయాణానికి పథకం సిద్ధమైంది. ఈ సమయంలో మేము నిర్దేశించుకున్న ప్రాథమిక సూత్రం దెబ్బతినలేదు. వినూత్నత, మెరుగుపర్చుకోవటం అన్న సూత్రం నుండి మేము కించిత్తు కూడా వెనుదిరగలేదు. అల్బెర్టో సోదరులతో కలిసి మరో దఫా మటె తీసుకున్న తర్వాత మా కలలు నెరవేర్చుకునే వరకూ వెనక్కు పోరాదని నిర్ణయించుకున్నాము. అనుకున్నదే తడవుగా వీసాలు తీసుకోవటం, అవసరమైన ధృవీకరణ పత్రాలు, ఇతర కాగితాలు తయారు చేసుకోవటం మొదలైంది. మరో రకంగా చెప్పుకోవాలంటే భావి ప్రయాణీకులమైన మేము ఆధునిక రాజ్యం సృష్టించిన అనేక అవాంతరాలు అధిగమిస్తూ పోయాము. ఒక సందర్భంలో మా పరువు కాపాడుకోవటానికి మేము చిలీ వెళుతున్నామని మాత్రమే చెప్పాము.

మా ప్రయాణం ప్రారంభించక ముందు సాధ్యమైనన్ని అంశాలకు సంబంధించిన పరీక్షలు పూర్తి చేయటం నా ముందున్న ప్రధాన కర్తవ్యం. సుదూర ప్రయాణానికి అవసరమైన విధంగా బైక్‌ను సిద్ధం చేయటం, ప్రయాణించాల్సిన మార్గానికి సంబంధించిన మ్యాపులు సిద్ధం చేయటం అల్బెర్టో పని. మా ముందున్న బృహత్ కర్తవ్యం క్షణాల్లో సాగిపోయింది. మరుక్షణం బైకు మీద కూర్చున్న మేము మా ముందున్న ధూళి మేఘాలు దాటుకుంటూ పోవటం మా కళ్లముందు కనిపిస్తోంది. విమానంలో ఉత్తర దిక్కుగా క్షణాల్లో కిలోమీటర్ల దూరం అధిగమించటం కనిపిస్తోంది.



# సాగరమథనం

నిండు పున్నమి సముద్ర కెరటాలతో పోటీపడుతోంది. పున్నమి వెలుగులో కెరటాలు వెండివెలుగులు విరజిమ్ముతున్నాయి. ఒడ్డున కూర్చున్న మేము అలల ఆటుపోట్లు చూస్తున్నాము. పోటు తీరాన్ని తాకిన ప్రతిసారీ ఆ ఆలోచనలు కొత్తపుంతలు తొక్కుతున్నాయి. నా మటుకు నాకు సముద్రం అత్యంత విశ్వాసమైనది. సన్నిహిత మిత్రుడు. రహస్యం విన్నది విన్నట్లు తన గర్భంలోనే అట్టిపెట్టుకుని, ఎవ్వరికీ చెప్పకుండా ఉండేంత నమ్మకమైనది. ఎప్పుడూ అత్యుత్తమ సలహానే ఇస్తుంది. అర్థవంతంగా సముద్రపు అలలు

చేస్తున్న శబ్దాలను మనం ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు వ్యాఖ్యానించుకోవచ్చు. అల్బెర్టోకి మాత్రం ఇది ఆందోళన కలిగించే సన్నివేశం. ఎగసిపడే ప్రతి అలను అల్బెర్టో కళ్లు ఎంతో ఆతృతగా చూస్తున్నాయి. అల్బెర్టో ఆతృత అతని కళ్లల్లో కనిపిస్తోంది. 30 ఏళ్ల వయసులో ఉన్న అల్బెర్టో మొదటిసారిగా అట్లాంటిక్ మహాసముద్రాన్ని చూస్తున్నాడు. ఈ మహాసముద్రం భూమండలంలో ప్రతి మూలను తాకుతుందన్న విషయాన్ని మొదటిసారిగా తెలుసుకుంటున్నాడు. సముద్రం మీదుగా వీస్తున్న తాజా గాలులు సముద్రపు ధోరణికి, అందులో ఇమిడి ఉన్న శక్తిని దర్పణం పడుతున్నాయి. సముద్రపు స్పర్శతో మొత్తం మారిపోతుంది. చివరకు కమ్‌బ్యాక్ కూడా (చే స్నేహితురాలికి, ఆయన వెంట ఉన్న కుక్కపిల్లను పిల్చుకునే ముద్దుపేరు) తన చిన్న ముక్కును విప్పార్చి మరీ అలల తీవ్రతను కొలిచేందుకు ప్రయత్నిస్తోంది. నిముషానికి ఒకసారి తన ముందుకు వస్తున్న వెండి తుంపరలను ఆస్వాదించేందుకు ప్రయత్నిస్తోంది.

కమ్‌బ్యాక్ మనుగడ, సంకేతం కూడా.. నేను తిరిగి రావాలన్న కోరికకు అది చిహ్నం. తన దురదృష్టానికి కూడా అది చిహ్నంగా మిగులుతుంది. బండిమీద నుండి పడిపోవటం, నిరంతరం విరోచనాల వ్యాధితో సతమతం కావటం, చివరకు గుర్రపు డెక్కల తన్నులు కూడా తప్పించుకోవటం వంటి సంఘటనలు ఎంతటి ఇబ్బందులకైనా ఓర్చుకుని జీవించటానికి చిహ్నంగా మిగులుతాయి.

మొదటి 1200 కిలోమీటర్లు ప్రయాణించాక మేము మార్ డెల్ ప్లాటా సమీపంలోని విల్లా గిసెల్‌లో మా మావయ్య ఇంట్లో ఆతిథ్యం తీసుకుంటూ ఈ 1200 కిలోమీటర్ల ప్రయాణంలో ఎదురైన అనుభవాలను నెమరు వేసుకుంటున్నాము. ఈ ప్రయాణం సులభంగానే సాగింది. ఈ మాత్రపు దూరం ప్రయాణించినందుకే మాకు గుర్తింపు గౌరవం ఇస్తున్నారు. మేము అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామా లేదా అన్నదానికి సంబంధించి మాకు ఏమాత్రం అవగాహన లేదు. కానీ ముందు ముందు కష్టాలు తప్పవని మాత్రం మాకు స్పష్టంగా తెలుసు. కనీసంగా చెప్పాలంటే ఇప్పటికి మాకున్న అభిప్రాయం అది. ప్రయాణం కోసం సవివరంగా రూపొందించిన పథకాన్ని చూపిస్తూ అల్బెర్టో నవ్వుకుంటున్నాడు. ఈ పథకం ప్రకారం మా ప్రయాణం దాదాపుగా పూర్తి అయ్యింది. కానీ నిజానికి చెప్పాల్సి వస్తే అసలు ప్రయాణం ఇప్పుడే ప్రారంభం అయ్యింది.

మావయ్య ఇచ్చిన మాంసం డబ్బా, బండినిండా కూరగాయలతో మా ప్రయాణం తిరిగి ప్రారంభం అయ్యింది. మేము బారిలోచ్ చేరాక – చేరితే – టెలిగ్రాం ఇమ్మని ఆయన అడిగాడు. ఆ టెలిగ్రాం నంబరుతో ఒక లాటరీ టిక్కెటు కొనొచ్చన్నది ఆయన

ఆలోచన. ఇది కాస్తంత ఆశగానే మాకు అనిపించింది. మరికొందరు కాలినడకకు మోటారుసైకిల్ మంచి సాకు అని హేళన చేయటం మొదలుపెట్టారు. వారి మాటల్లో వాస్తవం లేదన్న విషయం మాకు తెలుసు. వారి అవగాహన తప్పని రుజువుచేయగలమని కూడా మాకు తెలుసు. అయితే సాధారణంగా ఉండే సంకోచం మా ధృఢవిశ్వాసాన్ని వెల్లడించకుండా మమ్ములను అడ్డుకొంది.

రహదారి వెంట మాతో వస్తున్న కమ్‌బ్యాక్ గాలిలో ఎగురుతున్నట్లుగా వస్తోంది. ఈ క్రమంలోనే మరో ప్రమాదం నుండి కూడా బయటపడింది. మోటారు సైకిలును అదుపు చేయటం కష్టంగా ఉంది. వెనక లగేజి బరువు ఎక్కువ కావటంతో ముందు చక్రం అప్పుడప్పుడూ గాల్లోకి లేస్తోంది. ఏమాత్రం ఆదమరిచినా మేము బండితో పాటు గాల్లోకి లేవటం ఖాయం. మాంసం కొట్టు ముందు కొద్దిసేపు ఆపి మా కోసం కొంత మాంసం, మా వెంట ఉన్న కుక్క కోసం కొన్ని పాలు కొనుగోలు చేశాము. కానీ కుక్క మాత్రం ఆ పాలు ముట్టనుకూడా ముట్టలేదు. నేను పాలుకొనటం కోసం వెచ్చించే డబ్బు కంటే ఈ చిన్న ప్రాణి ఆరోగ్యం గురించే ఆందోళన చెందసాగాను. తీరా చూస్తే అది గుర్రపు మాంసం అని తేలింది. అది ఎంత తియ్యగా ఉందంటే మేము తినలేకపోయాము. విసుగుచెంది ఒక ముక్క గాల్లోకి విసిరేశాను. ఎంత ఆశ్చర్యం అంటే ఆ కుక్క పరుగుపరుగున వెళ్లి ఆ ముక్క కిందపడకముందే తన నోట్లో వేసుకుని మింగేసింది. మరో ముక్క విసిరేసినప్పుడు కూడా అదే జరిగింది. దాంతో పాలు తాగడం లేదనే సమస్య తీరిపోయింది. కడుపు నిండిన కమ్‌బ్యాక్ అరుపుల మధ్య మేము మిరామార్‌లో ప్రవేశించాము.

# ముగిసిన నిరీక్షణ

ఈ డైరీ రాయటంలో ఉద్దేశ్యం మిరామార్‌లో కమ్‌బ్యాక్ కొత్త ఇల్లు ఏర్పాటు చేసుకోవటానికి సంబంధించిన జ్ఞాపకాలు తెలియచేయటం కాదు. మిరామార్ చేరాక కమ్‌బ్యాక్ ఒక ఇంట్లో స్థిరపడిపోయింది. ఆ సందిగ్ధ స్వర్గం నడుమ మా ప్రయాణం

తాత్కాలికంగా రద్దయ్యింది. అంగీకారం తెలిపే పదాలు, అనుబంధం పెంచే పదాల ముందు ఇది దిగదుడుపే.

ఈ ప్రమాదం గురించి అల్బెర్టో ముందుగానే ఊహించి అమెరికా రోడ్ల మీద తాను ఒంటరిగా ముందుకు సాగుతున్నట్లు కలగంటున్నాడు. అయితే తన అభిప్రాయాన్ని మాత్రం ఎన్నడూ నోరు విప్పి చెప్పలేదు. ఈ పోరాటం ఆమెకు, నాకూ మధ్య జరుగుతోంది. విజయంతో నేను తిరిగి బయలుదేరినప్పుడు నాకు ఒటెరియో సిల్వా మాటలు జ్ఞాపకం వచ్చాయి.

బోటుపై మెరుపుల మోతలు విన్నాను
చెప్పులు లేని ఆమె కాళ్లు
మా ముఖంలో మారుతున్న రంగులు
ఆకలిగొన్న సాయంత్రం
రహదారి, వీధి, ఆమెకు మధ్య కొట్టుకుంటున్న నా హృదయం
ఆమె కళ్ల నుండి నన్ను నేను విముక్తి చేసుకునేందుకు శక్తి
ఎలా వచ్చిందో నాకే తెలియదు
ఆమె బాహువుల నుండి జారిపోయేందుకు
అద్దాల వెనక, వర్షపు నీడలో ఆమె ఏడుస్తూ నిల్చుండిపోయింది
ముఖంలో మేఘావృతమైన ఆకాశంలా ఉంది
ఏడవలేక ఆమె నిల్చిపోయింది
ఎదురుచూస్తూ, నేను తిరిగివస్తానని
నడుచుకుంటూ తన దగ్గరికి వస్తానని

ఆ తర్వాత అల తాకిడికి ఒడ్డుకు చేరుకున్న చేపలాగే నేను నిజంగా గెలిచానని చెప్పవచ్చా అన్న సందేహం కూడా నాకు కలిగింది. అయితే అది తర్వాతి సంగతి. ఇప్పటి సందర్భానికి తగినది కాదు. రెండు రోజుల కోసం నేను రూపొందించుకున్న పథకం ఎనిమిది రోజులకు సాగలాగబడింది. అతికష్టం మీద వీడ్కోలుతో నా శ్వాస

నాకే ఎదురుతిరుగుతుండగా సాహసోపేత ప్రపంచం వైపుకు లాగబడ్డాను. ఈ సాహస ప్రపంచం నేను ఊహించిన దానికంటే కొత్తగా ఉన్నప్పటి నుండీ మేము ఊహించిన దానికంటే సాధారణంగా ఉన్న పరిస్థితులవైపుకు నేను లాగబడ్డాను.

నాకు రక్షణగా సముద్రం నిలిచిన రోజు నాకు బాగా గుర్తుంది. నేను నలిగిపోతున్న బాహువుల నుండి నన్ను బయటకు తెచ్చింది ఆ సముద్రమే. సముద్రతీరం ఎడారిలాగా మారింది. చల్లని గాలి వీస్తోంది. ఆ నేల తల్లి ఒడిలో కాస్తంత సేదదీరాను. చుట్టూ సముద్రం ఘోష పెడుతూనే ఉంది. నా అంతరాత్మ ఆదేశాన్ని మన్నించి మొత్తం ప్రపంచం, సృష్టి వేగంగా భూతకాలంలోకి ప్రయాణించింది. ఉన్నట్లుండి ఒక బలమైన సముద్రపు గాలి గొంతు మార్చేసింది. నేను ఆశ్చర్యంతో తల పైకెత్తి చూశాను. అయినా అక్కడేమీ కనిపించలేదు. అది లేనిపోని భయం మాత్రమే. నేను తిరిగి నా కలల లోకానికి వెళ్లి సేదదీరనారంభించాను. అప్పుడు చివరిగా నేను సముద్రపు హెచ్చరిక విన్నాను. ఫెళఫెళమంటున్న సముద్ర ఘోష నా లోపలి కోటను బద్దలు కొట్టింది. ఆ విపరీత ప్రశాంతతకు భంగం కలిగించింది.

మేము బెదిరిపోయి సముద్ర తీరం నుంచి వచ్చేశాము. ఆ కల్లోల దృశ్యం నన్ను వదిలి పెట్టలేదు.  కొద్దిపాటి తీరంలోనే సముద్రం నాట్యమాడింది. తన అంతర్గత హెచ్చరికలు పెడచెవిన పెడుతూ, తానే శాశ్వత చట్రాన్ని లెక్కచేయకుండా సముద్రం నాట్యమాడింది. కానీ ప్రేమలో పడిన వ్యక్తి (నిజానికి ఆల్బర్టో ఇంతకన్నా మొరటు పదం వాడాడు) ప్రకృతి నుండి వచ్చే ఇటువంటి పిలుపులు వినిపించుకోడు. నాలో బూర్జువా మనస్తత్వం ఇంకా నిర్మాణ దశలోనే ఉండిపోయింది.

వినూత్న విషయాలు అన్వేషించాలనుకునే వారందరికీ వర్తించే ప్రాథమిక సూత్రం ఒకటుంది. ప్రతి అన్వేషణలోను రెండు స్థానాలుంటాయి. బయలుదేరే స్థానం, తిరిగి వచ్చి చేరే స్థానం. సైద్ధాంతికంగా రెండో అంశమే గమ్యస్థానంగా మార్చుకోవాలని ప్రయత్నించే వారు మార్గాల గురించి ఆలోచించనవసరం లేదు. ఎందుకంటే ఈ ప్రయాణమే అనంతం. భ్రాంతి. అది ఎప్పుడు ముగుస్తుందో అప్పుడే ముగుస్తుంది. కానీ దాన్ని మరో తరహాలో ముగించటానికి లెక్కలేనన్ని మార్గాలున్నాయి. అంటే మార్గాలు కోకొల్లలు.

అల్బెర్టో సూచన నాకు గుర్తుంది. "బ్రేస్‌లెట్ లేదా నువ్వు ఎవరిననుకుంటున్నావో అదే వ్యక్తివి కాబోవు."

నేను సృష్టించిన శూన్యంలో చిచినా చేతులు అంతర్ధానమయ్యాయి. "చిచినా, నీ బ్రేస్‌లెట్ నేను తీసుకోవచ్చా, అది సదా నావెంటే ఉంటూ నన్ను నడిపిస్తుంది."

అమాయకురాలు. (ఆ బ్రేస్‌లెట్‌లో ఉన్న) బంగారం విలువ గురించి కాదు, ఎవరెన్ని చెప్పినా పట్టుకున్న ఆమె చేతి వేళ్లలో ఉన్న ప్రేమామృతం కారణంగానే కోరాను. నిజాయితీగా చెప్పాలంటే దాన్ని అడిగేటప్పుడు నేను ఆలోచించింది అదే. అల్బెర్టో 29 కారట్ల విలువైన నా ప్రేమను కొలిచేందుకు అంత సున్నితమైన వేళ్లు అవసరం లేదని (కొంచెం కొంటెతనంతో) చెప్పాడు.

# ఆఖరి బంధంతో తెగతెంపులు

అక్కడ బయలుదేరిన మేము నెకొచియాలో ఆగాము. అక్కడ అల్బెర్టోకు పరిచయం ఉన్న మాజీ విద్యార్థి ఒకరు ప్రాక్టీసు చేస్తున్నాడు. ఒక ఉదయపు పూట ప్రయాణంతో తేలికగానే అక్కడకు చేరగలిగాము. సరిగ్గా భోజన విరామ సమయానికి అక్కడికి చేరుకున్నాము. అల్బెర్టో మిత్రుడు సాదరంగా స్వాగతం పలికాడు. అతని భార్య నుండి మాత్రం అంత సాదర ఆహ్వానం ఉన్నట్లుగా అనిపించలేదు. మేము ఎంచుకున్న మార్గంలో ఏదో ప్రమాదం ఉందని పసిగట్టినట్లు ఆమె కళ్లలో భావాలు చెప్తున్నాయి.

"నీవు డాక్టరు పట్టా పుచ్చుకోవటానికి కేవలం ఒక్క సంవత్సరమే ఉంది. అయినా ఇలా ఎందుకు తిరుగుతున్నావు? ఎప్పుడు తిరిగి వచ్చేది కూడా మీకే తెలియదు. మరి ఇదేమిటి? ఎందుకిలా?"

ఆమె ప్రశ్నలకు సూటి సమాధానాలేమీ మా వద్ద లేవు. దీంతో ఆమె మరింత బెంబేలెత్తింది. ఆమె మర్యాదగానే వ్యవహరించినప్పటికీ మా పట్ల వున్న వ్యతిరేకతను మాత్రం దాచుకోలేదు. తుది విజయం తనదే అని ఆమెకు తెలిసినా వ్యతిరేకత స్పష్టంగానే ఉంది. ఆమె భర్తను మేము మార్చగల స్థితిలో లేడు.

మార్ డెల్ ప్లాటాలో అల్బెర్టో సన్నిహితుడైన వైద్య మిత్రుడి ఇంటికి వెళ్లాము. ఆయన ఈ మధ్యనే పెరోనిస్టు పార్టీలో చేరాడు. దాంతో పాటే ఆయనకు సదుపాయాలు కూడా వచ్చాయి. నెకొచియాలో ఉన్న వైద్యుడు మాత్రం రాడికల్ భావాల పట్ల నిబద్ధతతోనే ఉన్నాడు. అయినా మేము భిన్న ధృవాల్లా ఉండిపోయాము. రాడికల్స్‌కు మద్దతు ఇవ్వటం నాకు ఎప్పటికీ అంగీకారయోగ్యమైనది కాదు. అల్బెర్టోకు కూడా వారి ప్రాధాన్యం తగ్గిపోతున్న భావన కలిగింది. అయితే ఒకప్పుడు తను గౌరవించే నేతలకు అల్బెర్టో అత్యంత సన్నిహితుడిగా వ్యవహరించిన వాడే.

మూడు రోజుల పాటు మాకు మంచి జీవితాన్ని ఇచ్చిన ఆ జంటకు కృతజ్ఞతలు చెప్పాక అల్బెర్టో తిరిగి బండి ఎక్కాడు. అక్కడి నుండి మేము బాహా బ్లాంకాకు పయనం అయ్యాము. మొదట్లో మరింత ఒంటరితనం అనిపించినప్పటికీ స్వేచ్ఛగా ఉండటమే ఎక్కువ సంతోషంగా అనిపించింది. బాహా బ్లాంకాలో కూడా స్నేహితులు మా రాక కోసం ఎదురు చూస్తున్నారు. ఇంతకు ముందు ఆతిధ్యం ఇచ్చింది అల్బెర్టో స్నేహితులైతే ఈసారి ఇస్తోంది నా స్నేహితులు. వారు మమ్ములను ఆప్యాయంగా ఆదరించారు. దక్షిణాదిన ఉన్న ఈ ఓడరేవు నగరంలో అనేక రోజులు గడిపాము. బండి బాగుచేసుకుని నగరంలో కనిపించిన మూలలల్లా తిరిగి వచ్చాము. మా దగ్గర ఉన్న డబ్బుల మేరకు మాంసం, పొలెంటా, బ్రెడ్‌తో కూడిన పరిమిత భోజనం. బ్రెడ్ రుచిలో మార్పులు వచ్చాయి. “నన్ను అందుకోవటం ఇక అంత తేలిక కాదు మిత్రమా” అంటూ హెచ్చరిస్తుండగా మేము మరింత ఉత్సాహంతో ఆరగించటం ప్రారంభించాము. ఒంటెల్లాగా మా భావి ప్రయాణానికి అవసరమైన శక్తిని కూడగట్టుకునేందుకు ప్రయత్నించాము.

తెల్లవారితే బయలుదేరతాము అనగా ఆ రోజు రాత్రి నాకు తలపోటు, జ్వరం వచ్చాయి. దాంతో ఒక రోజు ఆలస్యంగా బాహా బ్లాంకాను వదిలిపెట్టాము. చివరకు మధ్యాహ్నం మూడుగంటల సమయంలో సూర్యుడు మండుతుండగా మేము బాహా బ్లాంకా వదిలి ప్రయాణం ప్రారంభించాము. మేము మెదనోస్ సమీపంలోని ఇసుక దిబ్బలకు చేరేసరికి వేడి తారాస్థాయికి చేరింది. మోయలేనంత బరువుతో సాగుతున్న వాహనం కూడా అదుపు తప్పటం ప్రారంభించింది. చక్రాలు పదే పదే వంకర తిరగటం మొదలెట్టాయి. ఇసుకతో పెద్దగా పెనుగులాడి తర్వాత అల్బెర్టో తానే గెలిచానంటాడు. ఆ సమయంలో మేము ఖచ్చితంగా చేసింది ఒక్కటే. అదే ఇసుక దిబ్బలపై ఆరుసార్లు విశ్రాంతి కోసం ఆగడం. తర్వాతే మైదాన ప్రాంతానికి చేరాం. మొత్తం మీద మెదనోస్ ఇసుక దిబ్బలను జయించామనే చెప్పాలి.

మెడనోస్‌లో జరిగిన ఆలస్యాన్ని కూడా అధిగమించేందుకు బండి నడిపే బాధ్యత నేను తీసుకున్నాను. అక్కడక్కడా గుంటలతో నిండిన మంచి మట్టి ప్రాంతం ఇది. మొత్తం ప్రయాణంలో ఇక్కడే బండికి గట్టిదెబ్బ తగిలింది. ఈ ప్రమాదం నుండి అల్బెర్టో బయటపడ్డాడు కానీ నేను తప్పించుకోలేకపోయాను. నా కాలుకు సిలిండరు తగలటంతో కాలింది. ఆ మచ్చ చాలాకాలం మానలేదు. ఎందుకంటే అంతకాలం పాటు గాయం కూడా మానలేదు కాబట్టి.

భారీవర్షం కారణంగా మేము సమీపంలో ఉన్న ఒక షెడ్డు నీడన ఆగాల్సి వచ్చింది. అక్కడకు చేరుకోవటానికి సుమారు 300 మీటర్ల చిత్తడినేలను దాటాల్సి ఉంది. మరో రెండుసార్లు గుంటల మీదుగా దూకుతూ వెళ్లాము. స్వాగతం అద్భుతంగానే ఉంది కానీ ఇటువంటి కచ్చా రోడ్లమీద మా మొదటి ప్రయాణం మాత్రం ఎంతో ఇబ్బందికరంగా సాగింది. ఒక్కరోజులోనే తొమ్మిదిసార్లు ప్రమాదాలు జరిగాయి. ప్రయాణం మధ్యలో విశ్రాంతి కోసం ఏర్పాటు చేసుకున్న పడకల పక్కనే మోటారు సైకిలు కూడా నిలిపి ఉంచాము. అయినా భవిష్యత్తు పట్ల ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాము. ఇప్పుడు మేము కొంత స్వచ్ఛమైన గాలి పీలుస్తున్నట్లు అనిపించింది. మా సంక్షుభిత ఊహాలోకాల్లో సుదూర తీరాలు, సుందరాంగులు, సాహసాలు దాటిపోతూ ఉన్నాయి.

అలసిపోయిన నా కళ్లు నిద్రించ నిరాకరిస్తున్నాయి. ఆ కళ్లల్లో రెండు పచ్చని చుక్కలు కనిపించాయి. ఈ రెండు చుక్కలు నా వెనక వదిలివచ్చిన మృత ప్రపంచాన్ని ప్రతిబింబిస్తూ నేను కోరుకొంటున్న స్వేచ్ఛను వెక్కిరిస్తున్నాయి. ఈ చుక్కల్లో నా విమాన ప్రయాణం మొదలు ప్రపంచ సముద్రాల వరకు అనేక అనుభవాలు దాగిఉన్నాయి.

# ఫ్లూ జ్వరంతో మంచమెక్కడం

చాలాదూరం ఎటువంటి ప్రమాదాలకు అవకాశం లేని రోడ్డు మీద ఒంటరిగా విసుగ్గా సాగుతోంది మా వాహనం. మేము కూడా అలసిపోయాము. అప్పటి వరకు

సుఖప్రదంగా సాగుతున్న మా ప్రయాణంలో కంకర రోడ్డులో కష్టాలు మొదలయ్యాయి. రోజంతా ఒకరి తర్వాత ఒకరుగా బండి నడుపుతున్న మేము రాత్రి అయ్యేసరికి చేరుకోగానే నిద్ర పోవాలన్న కోరిక మాలో బలపడసాగింది. విశాలమైన చోలెచోలె  నగరంలోకి ప్రవేశించిన తర్వాతనే మాకు ఉచితంగా బస సదుపాయం లభ్యమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతానికి మేము బెంజామిన్ జొర్రిల్లా చేరగానే అక్కడ ఉన్న రెయిల్‌రోడ్ స్టేషన్‌లో ఒక గది తీసుకున్నాము. ఎంతగా నిద్రపోయామంటే మమ్మల్ని చూసిన వారికి మేము చనిపోయామా  అనిపించింది.

మరునాడు పెందలకాడే నిద్ర లేచాము. మటే చేసుకోవటానికి నీళ్లు తెచ్చుకుందామని వెళ్లిన నాకు శరీరంలో ఏదో కరెంటు ప్రవహించినట్లు అనిపించింది. ఆ వెంటనే వణుకు కూడా వచ్చింది. మరికొద్దిసేపటి తర్వాత నిలువెల్లా వణికిపోతున్నాను. ఎవరో ఒకరు పట్టుకోకపోతే నిలవలేని పరిస్థితి వచ్చింది. నా వద్ద ఉన్న క్వినైన్ మాత్రలు పని చేయలేదు. నా తలలో వింత వింత శబ్దాలు వినిపిస్తున్నాయి. కళ్ల ముందు రంగుల ప్రపంచం కనిపిస్తోంది. గోడల మీద రంగులు మారిపోతున్నాయి. కొద్దిసేపటికి వాంతి చేసుకున్నాను. ఆ రోజు సాయంత్రం వరకు పచ్చి మంచినీళ్లు కూడా ముట్టలేదు. కాస్తంత స్థిమిత పడ్డాను, బండిమీద కూర్చోగలను అనిపించిన తర్వాత అల్బెర్టో బండి నడుపుతుంటే అతని భుజంపై వాలిపోయి చోలె చోలె చేరుకున్నాము. అక్కడ పార్లమెంట్ సభ్యుడు, స్థానిక ఆసుపత్రిలో వైద్యునిగా పని చేస్తున్న డాక్టర్ బార్రెరాను కలుసుకున్నాము. మమ్మల్ని ఆయన సాదరంగా ఆహ్వానించాడు. విశ్రాంతి తీసుకోవటానికి ఒక గది ఏర్పాటు చేశాడు. ఆయన పెన్సిలిన్ ఇంజెక్షన్ ఇచ్చాడు. దాంతో నాలుగు గంటల్లో జ్వరం తీవ్రత నిదానించింది. ఎప్పుడు బయలు దేరటానికి మేము సిద్ధమైనా డాక్టరు తల అడ్డంగా ఊపుతూ “ఫ్లూ జ్వరం, మంచం మీదనే విశ్రాంతి తీసుకోవాలి” అనటం మొదలెట్టాడు (ఉన్నంతలో ఇది ఆయన ప్రాథమిక పరిశీలన). దీంతో కొన్ని రోజుల పాటు అక్కడే విశ్రాంతి తీసుకున్నాం. మాకు రాజభోగం అనదగిన సౌకర్యాలు అందాయి.

ఆసుపత్రిలో నేను మంచం మీద ఉండగా అల్బెర్టో నన్ను ఫోటో తీశాడు. నాలో మంచి మార్పే వచ్చింది. కాస్తంత కండ చేశాను, ముఖం బొద్దుగా మారింది. కళ్లు పెద్దవయ్యాయి. జీబురు గడ్డం పెరిగింది. ఈ  కాలమంతా గడ్డంలో పెద్దగా మార్పు రాలేదు. దురదృష్టం ఏమిటంటే ఈ ఫోటోగ్రాఫు అంత ఆకర్షణీయంగా రాలేదు. అది మారిన మా పరిస్థితులకు గుర్తుగా ఉంది. ఈ నాగరికత నుండి మేము కోరుతున్న నూతన ప్రపంచాన్ని గుర్తు చేస్తుంది.

ప్రతిరోజూ సాధారణంగా మా ప్రయాణానికి తల అడ్డంగా ఊపే డాక్టరు ఒక రోజు ఉదయం అలా చేయలేదు. అదే మాకు చాలు. మా తదుపరి గమ్యస్థానం దిశగా మేము పశ్చిమానికి త్వరత్వరగా ప్రయాణం అయ్యాము. మా తదుపరి గమ్యం సరస్సులు. అప్పటికే అలసిపోయిన సూచనలు ప్రకటిస్తున్న బైక్ ముందుకు సాగటానికి మొరాయిస్తోంది. ప్రత్యేకించి అల్బెర్టోకు ఇష్టమైన వైర్లు కట్టిన భాగం మరింత మొరాయింపు ప్రారంభించింది. ఎక్కడ నుండో ఒక వాక్యాన్ని సేకరించి దాన్ని కార్ల పోటీ ఛాంపియన్ ఆస్కార్ గాల్వెజ్ రాసిందని చెప్తున్నాడు కానీ అది నిజమో కాదో నాకు తెలియదు. "వైరు బదులు స్క్రూ ఉపయోగించే వీలుంటే నాకు వైరు ఇవ్వండి, స్క్రూ వద్దు" అన్న వాక్యం అది. మేము గాల్వెజ్ మాటలు బలపరుస్తున్నామని చెప్పటానికి మా బట్టలు, ఫ్యాంటులు చూస్తే సరిపోతుంది.

అప్పటికే రాత్రి అయ్యింది. అయినా మేము ఏదో ఒక నివాస ప్రాంతాన్ని చేరుకోవాలని ప్రయత్నిస్తూనే ఉన్నాము. మా బండికి లైట్లు లేవు. అందువల్ల ఆ రాత్రి అలాగే ముందుకు పోవటం అంత మంచిది కాదేమో అనిపించింది. టార్చి లైటు ఉపయోగిస్తూ మేము నిదానంగా వెళ్తున్నాము. అంతలో బైకు నుండి ఏదో ఒక వింత శబ్దం వచ్చింది. అదేమిటో మేము గుర్తించలేకపోయాము. జరిగింది ఏమిటో తెలుసుకోవటానికి ప్రయత్నించినా ఆ గుడ్డి చీకటిలో సాధ్యం కాలేదు. దాంతో ఆ రాత్రికి ఉన్న చోటే బస చేయక మాకు తప్పింది కాదు. ఆ చీకట్లోనే మా వద్ద ఉన్న గుడారాన్ని పర్చుకుని అందులోనే దూరిపోయాము. గాఢనిద్ర ద్వారా మా ఆకలిని, దప్పికను మర్చిపోవాలని ప్రయత్నించాము. అతి కొద్ది సమయంలోనే సాయంత్రం గాలులు తీవ్రమయ్యాయి. మా గుడారం ఆ గాలికి లేచిపోయింది. దాంతో మేము చలికి ముడుచుకోవటం తప్ప మరో మార్గం లేకపోయింది. అక్కడే ఉన్న టెలిఫోన్ స్థంభానికి మా బైకు కట్టేసి దానిపై గుడారం వేసి దాని వెనక మేము తలదాచుకున్నాము. దాదాపు తుఫాను వచ్చినట్లుగా వీస్తున్న గాలిలో మా పక్క గుడ్డలు కూడా ఉపయోగించుకోలేక పోయాము. ఏ రకంగా చూసినా అది సంతోషించదగిన రాత్రి కాదు. మొత్తం మీద మమ్ములను తన ఒడిలోకి తీసుకున్న నిద్రాదేవత చలిని పక్కకు నెట్టింది. ఆ విధంగా చలిపై విజయం సాధించాము. బాగా పొద్దుపొడిచాక మరునాడు ఉదయం తొమ్మిది గంటలకు మేము నిద్ర లేచాము.

మా బండి నుండి రాత్రి మాకు వినిపించిన వింత శబ్దం ముందు చక్రం విరగటం వల్ల వచ్చిందని ఆ ఉదయాన తెలుసుకున్నాము. మాకు చేతనైనట్లుగా బాగుచేసి సమీపంలో ఉన్న నగరానికి వెళ్లాక చక్రం వెల్డింగ్ చేయించటం తప్ప మరో మార్గం లేకపోయింది. తాత్కాలికంగా మా చేతుల్లో ఉన్న వైరు సమస్యను పరిష్కరించింది.

సమీపంలో జనావాసం ఎంత దూరంలో కూడా ఖచ్చితంగా తెలియని మేము మూటా ముల్లె సర్దుకుని ప్రయాణం ప్రారంభించాము. అక్కడ నుండి రెండో మూల దాటగానే ఒక ఇల్లు కనిపించటంతో మా ఆశ్చర్యానికి అంతులేదు. ఆ ఇంట్లోని వారు మమ్ములను సాదరంగా ఆహ్వానించారు. మంచిగా ఉడకబెట్టిన లేత మేక మాంసంతో మా ఆకలి తీర్చారు. అక్కడి నుండి మరో 20 కిలోమీటర్లు ప్రయాణించి పియెడ్రా డెల్ ఆగ్విలా అన్న పట్టణానికి చేరాము. అక్కడే విరిగిన చక్రాన్ని బాగుచేయించుకోవటం సాధ్యమైంది. అప్పటికి రాత్రి బాగా పొద్దుపోవటంతో ఆ రాత్రికి ఆ మెకానిక్కు ఇంట్లోనే బస చేయాలని నిర్ణయించుకున్నాము.

ఆ తర్వాత ఒకటి రెండు చిన్నా చితక ఇబ్బందులు తప్ప క్షేమంగా మేము శాన్ మార్టిన్ డె లాస్ ఆండిస్‌కు చేరుకున్నాము. ఈ మధ్యలో బండి కూడా ఏమీ సమస్యలు సృష్టించలేదు. అక్కడి నుండి మొదటిసారిగా దక్షిణానికి ప్రవేశించిన తర్వాత సాఫీగా సాగుతున్న రోడ్డుపై నేను వాహనం నడపటం ప్రారంభించాను. ఈసారి బండికి వెనక టైరు పంచరు కావటంతో అక్కడికి మా ప్రయాణాన్ని నిలపివేయక తప్పింది కాదు. ఈ ప్రమాదం ఎప్పుడో ఒకప్పుడు వస్తుందని మేము ముందునుండే భయపడుతున్నాము. మా దగ్గర ఉన్న అన్ని సామాన్లు బయటకు తీసి జాగ్రత్తగా ట్యూబు బయటికి తీశాక టైరును చక్రం నుండి వేరు చేసేందుకు ప్రయత్నించాము. కానీ మా దగ్గరున్న చిన్న చిన్న రెంచీలకు అది అలవికావటం లేదు. ఈ పని పూర్తి చేసేసరికి దాదాపు రెండు గంటలు పట్టింది. ఈ విషయంలో ఒకింత బద్ధకం ప్రదర్శించామని చెప్పక తప్పదు. ఆ తరువాత సంధ్య వేళకు జర్మనీవాసులు నివసిస్తున్న ఒక నివాసానికి చేరాము. చాలాకాలం క్రితం మా మామయ్య ఒకరు అక్కడే బస చేశారట. ఆయన కూడా బహుదూరపు బాటసారే. ఆయన లక్షణాలనే నేను ఇప్పుడు అనుసరిస్తున్నాను. అక్కడకు సమీపంలో ఉన్న నీటి ప్రవాహం నుండి వస్తున్న చేపలు పట్టుకోవటానికి అవకాశం ఇచ్చారు. అక్కడ ఏమి జరుగుతుందో తెలుసుకోబోయే లోపే అల్బెర్టో తన పని ప్రారంభించారు. గాలం తీసి నీళ్లల్లోకి వేశాడు. కొద్దిసేపటికి ఆ గాలం వెంట ఒక ట్రౌట్ చేప బయటకు వచ్చింది. మంచినీటి చేపల్లో అది చాలా రుచికరమైన చేప. ఈ విజయంతో అల్బెర్టో పదేపదే గాలం వేస్తుండగా నేను చేపల కూర సిద్ధం చేశాను. ఆ తర్వాత గంటల తరబడి గాలం వేసినా ఒక్కచేప పిక్కె కూడా దొరకలేదు. అప్పటికి చీకటిపడటంతో సమీపంలోనే ఉన్న వ్యవసాయ కూలీల వంటగదిలో తలదాచుకున్నాము.

మరునాడు వేకువజామున ఐదుగంటలకు పెద్ద స్టౌవ్ ఒకటి వెలిగించటంతో గది కాంతితో నిండింది. ఒక దఫా తేనీరు వంటి మటె తాగిన వ్యవసాయ కార్మికులు ఒకరిపై ఒకరు జోకులు వేసుకోవటం మొదలుపెట్టారు. సాధారణంగా వారు ఆ విషయాలు

మాకు తెలియచేయాలన్న ఉద్దేశ్యంతో లేరు. తమను సుదీర్ఘకాలం నుండీ దోచుకుంటూ నేటికీ ఆ దోపిడీ సాగిస్తున్న తెల్లజాతి ప్రజల పట్ల అరాకానియన్ జాతికి ఉండే సాధారణమైన అపనమ్మకమే వీరిలోనూ మాకు కనిపించింది. వారు భూములు, వేతనాల గురించి మేము అడిగిన ఒకటి రెండు ప్రశ్నలకు కూడా వారు అవునేమో, కావచ్చు అంటూ భుజాలు ఎగరేస్తూ సమాధానమిచ్చి సంభాషణ త్వరగా ముగించారు.

మాకు మాత్రం విడిగా చెర్రీ పళ్లు తెచ్చి పెట్టారు. ఆ చెర్రీలు ఎంత ఎక్కువగా తిన్నామంటే తిన్నది అరగటానికి నేను మళ్లీ విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. అల్బెర్టో కొద్దిగానే తిన్నాడు. చెట్లపైన మేము బాగానే తిన్నాము. ఎంత ఎక్కువగా తిన్నామంటే చెట్టుకున్న కాయలు పూర్తిచేయటానికి పోటీపడుతున్నామా అన్నంతగా తిన్నాము. మేము వైద్యులమా అని యజమాని సంతానంలో ఒకరు సందేహాస్పదంగా చూశాడు. ఈ వైద్యులు ప్రత్యేకమైన దుస్తుల్లో ఉండటంతో అతను భృకుటి ముడిపడటానికి కారణం అయ్యింది. అయినా అతను నోరుమూసుకునే ఉన్నాడు. దాంతో మాకు నచ్చిన పళ్లన్నీ కోసుకుని తినటానికి వీలైంది. ఆ తిండి ఎంత ఎక్కువైందంటే మేము పొట్టబరువు మోయటానికి నిదానంగా అడుగులు వేయాల్సి వచ్చింది.

బండి తిరుగు ప్రయాణానికి సంబంధించిన ఒకటి అరా సమస్యలు పరిష్కరించుకుని మేము శాన్ మార్టిన్ డె లా ఆండెస్‌కు బయలు దేరాము. పొద్దుగూకటానికి కొద్దిగా ముందుగా లక్ష్యాన్ని చేరాము.

## ఆండెస్ పర్వత సానువుల్లో...

రోడ్డు పల్లపు కొండచరియల గుండా పాములాగా మెలికలు తిరుగుతోంది. ఆండిస్ పర్వతాల ప్రారంభానికి ఇది గుర్తు. అక్కడ నుండి ఈ రోడ్డు తిన్నగా వెళ్లి ఒక పట్టణం అని చెప్పుకోదగ్గ ప్రాంతంలో కలుస్తుంది. ఈ పట్టణం తన చుట్టూ అద్భుతమైన

పచ్చటి  కొండలు, పర్వతాలను పైటలాగా కప్పుకొంది. ఇక్కడే శాన్‌మార్టిన్ కొండ ఆకుపచ్చని లోయలతో నిండి ఉంటుంది. ఈ కొండ నీలిరంగు లాగునా లాకార్ పర్వతాలతో మిళితమవుతుంది.  35 మీటర్ల వెడల్పుతో 500 కిలోమీటర్ల పొడవు గల నీటి ప్రవాహం ఈ రెండు పర్వతాలకు మధ్య సరిహద్దులాగా ఉంది. ఈ సుందర ప్రాంతాన్ని పర్యాటక స్వర్గంగా గుర్తించిన రోజునే ఆ పట్టణ రవాణా, రహదారులు వంటి మౌలిక వసతుల సమస్యలు పరిష్కారమైపోయాయి.

స్థానిక ఆసుపత్రిపై  మా మొదటి దాడి విఫలమైంది. అయితే అదే ప్రయత్నంతో జాతీయ ఉద్యానవనం అధికారులపై కూడా చేయాలన్న సూచన మాకు దొరికింది. ఆ ఉద్యానవనం పర్యవేక్షకుడు అక్కడే ఉన్న చెక్కలతో తయారు చేసిన షెడ్‌లో తలదాచుకోవటానికి మాకు అనుమతిచ్చాడు. రాత్రి కాపలాదారుడు వచ్చాడు. 140 కిలోల బరువున్న ఈ వ్యక్తి చేతిగోళ్లు ఎంత మొద్దుగా ఉన్నాయో ముఖం కూడా అంతే ఉంది. అయినా ఆయన దయతో తన పొయ్యిపై వంట చేసుకోవటానికి మాకు అవకాశం ఇచ్చాడు. మొదటిరోజు రాత్రి సుఖప్రదంగా సాగింది. ఆ రాత్రికి చలిమంట వేసుకుని అక్కడే నిద్రపోయాము. ఈ ప్రాంతంలో ప్రతిరోజు రాత్రి నెగడు వేసుకోవటం అవసరం. వాతావరణం అంత చల్లగా ఉంటుంది.

కొద్దిగా మాంసం కొనుక్కుని అక్కడికి దగ్గర్లోని సరస్సు చుట్టూ చక్కర్లు కొట్టటం ప్రారంభించాము. ఏపుగా పెరిగిన చెట్ల నీడన నాగరికత పురోగమనం నిలిచిపోయింది. మా సంచారం ముగిశాక ఈ ప్రదేశంలో ఒక పరిశోధనశాల నిర్మించాలని నిర్ణయించుకున్నాము. అక్కడ మొత్తం సరస్సును మింగేసే కిటికీలు, నేలను కప్పేస్తున్న మంచు ఊహించుకున్నాము. ఇవతలి నుంచి అవతలి ఒడ్డుకు చెక్క పడవమీద ప్రయాణిస్తూ చేపలు పట్టుకుంటున్నట్లు, యవ్వనంలో ఉన్న అడవిలోకి నిత్యం ప్రయాణిస్తున్నట్లు ఊహించుకున్నాము.

మేము సందర్శించిన మంచి ప్రదేశాల్లో కాస్తంత ఎక్కువ సేపే కాలక్షేపం చేసి, విహరించినా, ఈ ప్రాంతంలో మాకు కలిగిన అనుభవం కేవలం అమెజాన్ అడవుల్లో గాని దొరకలేదు.

మా లక్ష్యం ప్రయాణం చేయటమే అన్న విషయాన్ని నిర్ద్వంద్వంగా మేము గుర్తించాము. ఎందుకంటే అల్బెర్టో కూడా నాలాంటివాడే. అయినా అడపాదడపా దక్షిణాదిన అద్భుతమైన ప్రదేశాల్లో సంచరించేందుకు మాకు అవకాశం దొరికింది. బహుశా ఒకరోజు

మేము ప్రపంచాన్ని చుట్టిరావచ్చు కూడా. ఆ తర్వాత తిరిగి నేను అర్జెంటీనా వెళ్లి ఆండియన్ సరస్సు ఒడ్డున స్థిరపడిపోతాను. అలా శాశ్వతంగా స్థిరపడలేని పక్షంలో ప్రపంచం గురించిన నా ఆలోచనలు అటూ ఇటూ మార్చుకుంటాను.

సంధ్యవేళ తిరుగు ప్రయాణం ప్రారంభించాము. బసకు చేరుకునే సరికి రాత్రి అయ్యింది. రాత్రి కాపలాదారుడు డాన్ పెడ్రో ఓలెట్ ఆ సాయంత్రానికి మా విందు కోసం అద్భుతమైన తినుబండారాలు సిద్ధం చేయటంతో మాకు ఆశ్చర్యం వేసింది. విందులో మా వంతుగా వైన్ కొనుక్కొని వచ్చాము. ఆ తర్వాత ముగ్గురము సింహాల్లాగా తెగబడి తిన్నాము. అర్జెంటీనా వదిలిపెట్టినప్పటి నుండీ ఇంత అద్భుతమైన తిండి దొరక లేదని మాలో మేము చర్చించుకుంటుండగా ఓలెట్ ఒక ప్రతిపాదన మా ముందుంచాడు. వచ్చే వారం స్థానికంగా జరుగుతున్న మోటారు రేసులో పాల్గొనటానికి వచ్చే డ్రైవర్లకు వండి పెట్టే బాధ్యత తనపై ఉంచారని, తనకు ఇద్దరు సహాయకులు కావాలని, మేము సరే అంటే తనకు అభ్యంతరం లేదని చెప్పాడు. అదే సమయంలో "నేను మీకు డబ్బులు ఇవ్వలేను. కానీ మీ ప్రయాణంలో అవసరమైన మాంసం సిద్ధంచేసుకునే అవకాశం మాత్రం ఇవ్వగలను" అని ఓలేట్ స్పష్టం చేశాడు.

ఈ ప్రతిపాదన మంచిదే అనిపించింది. వంట చేయటానికి ఓలేట్‌కు సహాయకులుగా ఉండేందుకు మేము నిర్ణయించుకున్నాము.

అమితోత్సాహంతో వచ్చే ఆదివారం కోసం ఎదురుచూడటం ప్రారంభించాము ఇద్దరం. ఆ రోజు ఉదయం ఆరుగంటలకు మా పని ప్రారంభించాము. ట్రక్కులో వంటచెరుకు చేరవేయటం. ఆ రోజు ఉదయం 11 గంటల వరకు మేము విరామం లేకుండా పని చేస్తూనే ఉన్నాము. ఆ తర్వాత వేడి వేడిగా సిద్ధం చేసిన జాయింట్లు తినటానికి తయారుగా వున్నట్లు సూచన పంపాము.

ఒక కొత్త వ్యక్తి మాకు ఆదేశాలిస్తున్నాడు. అతన్ని సంబోధించాల్సి వచ్చినప్పుడల్లా నేను "సెనోరా" అని పిలుస్తున్నాను. మాతోపాటు పని చేస్తున్న మరో కార్మికుడు డాన్ పెండోన్‌కు కోపం తెప్పించవద్దు అని హెచ్చరించే వరకు ఇదే విధంగా వ్యవహరిస్తూ వచ్చాను.

దాంతో డాన్ పెండోన్ ఎవరు అని ఎదురు ప్రశ్నించాను. నేను సెనోరా అని పిలిచే వ్యక్తే డాన్ పెండోన్ అని తెలియటంతో ఒక్కసారిగా ఒళ్లు చల్లబడింది. అయితే అది ఎంతో సేపు లేదు.

ఇటువంటి విందుల్లో షఊ మామూలు ప్రకారమే ఒక్కొక్కరికి తినలేనంత మాంసం వడ్డించబడింది. దాంతో ఒంటెల్లాగా సాధ్యమైనంత తిండి నిల్వచేసుకోవటానికి మాకు అనుమతి లభించింది. మేము మరింత పకడ్బందీగా పథకం ప్రకారం ఈ పని పూర్తి చేశాము. నేను తాగినవాడిలాగా నటిస్తూ కనిపించిన ప్రతి ముక్కను స్వాహా చేశాను. రెడ్ వైన్ సీసా ఒకటి నా చొక్కాలో దాచుకున్నాను. ఆ రకంగా ఐదు సార్లు దాడి చేసిన తర్వాత మా దగ్గర మంచినీళ్ల సీసాలు, వైన్ సీసాలు పుష్కలంగా పోగుపడ్డాయి. పని పూర్తయి మిగిలిన సామానంతా ట్రక్కులోకి ఎక్కించి తిరిగి పట్టణానికి బయలుదేరే సమయం వచ్చేసరికి నేను డాన్ పెండోన్‌తో కలిసి విరామం లేకుండా పని చేయటం ప్రారంభించాను. పనంతా పూర్తయ్యాక అక్కడే పచ్చికలో వెల్లకిలా పడకుండిపోయాను. ఇక ఒక్క అడుగుకూడా వేయటానికి నాకు ఓపిక లేకపోయింది. అల్బెర్టో నిజమైన స్నేహితుడి ఫోజు పెట్టి నా ప్రవర్తనకు యజమానికి క్షమాపణ చెప్తూ నన్ను చూసుకోవటానికా అన్నట్లు ఆగిపోయాడు. ట్రక్కు వెళ్లిపోయింది. ట్రక్కు శబ్దం దూరంగా వెళ్లాక ఇద్దరమూ ఒక్క ఉదుటున లేచి సమీపంలో ఉన్న వైన్ అంతా సేకరించాము. మరికొన్ని రోజుల పాటు రాజాల్లాగా బతకటానికి అవసరమైన తిండి సిద్ధం చేసుకున్నాము.

ముందుగా అల్బెర్టో బరిలోకి దిగాడు. చుట్టూ ఉన్న సీసాలు ఖాళీ చేశాక అతని ముఖం కామిక్ సినిమా నుండి బయటకు వచ్చినట్లు మారింది. ఒక్క బాటిల్ కూడా మిగల్లేదు. నేను తాగిన విషయం ఎవ్వరినీ మోసం చేయలేకపోయింది. మేము ఎంతగా తాగామంటే చాలా కాలం క్రితం మేము పీకల వరకు వైన్ తీసుకున్నప్పటికీ జ్ఞాపకాలు వెతుక్కుంటూ వెళ్లిపోయాము. దొంగలు పట్టుబడితే ఎలా ఉంటుందో అలా ఉంటుంది అప్పటి మా పరిస్థితి. ఆ రోజు రాత్రి మాకు మరికొంత మాంసం, బ్రెడ్, వెన్న దొరకాల్సింది ఉంది. అందువల్ల ఆ రాత్రికి తిరిగి పట్టణానికి నడుచుకుంటూ వెళ్లాము. మేము బాగా తిన్నాము. తాగాము. శుభ్రంగా స్నానాలు చేశాము. అయితే మేము మూడు కాళ్లతో నడుస్తున్నాము. మా వెనక తోకలు కట్టారు. మమ్ములను ఆటపట్టించటానికి వాళ్లు చేసిన పనులు ఇక్కడ వర్ణించటం సాధ్యం కానంతగా ఉన్నాయి.

మరుసటి రోజున వర్షం పడటంతో వాతావరణం మరింత చల్లబడింది.మా ప్రయాణం ముందుకు సాగటానికి వీలుకాని పరిస్థితి ఏర్పడింది. అప్పుడే లౌడ్ స్పీకర్ల నుండి ఇంకా మోటారు రేసు సాగుతున్నట్లు ప్రకటన వినవస్తోంది. దీంతో వర్షం తగ్గితే వెళ్లి మాంసం వండుకోవచ్చని ఎదురు చూడనారంభించాము. వంట సహాయకులుగా మేము గేటు వద్ద ఎటువంటి ఆటంకం లేకుండా లోపలికి ప్రవేశించాము. జాతీయ

స్థాయిలో గుర్తింపు పొందిన డ్రైవర్లు ఒకరికొకరు పోటీ పడుతుండగా ప్రశాంతంగా కూర్చుని కార్ల రేసు చూశాము.

ఏ దారిలో వెళ్లితే బాగుంటుందా అని ఆలోచిస్తు మా షెడ్ చూరు కింది నిలబడి మటే తాగుతున్నాము. అంతలో సుదూరంగా ఉన్న విల్లా కాన్సెప్షన్ డిల్ టియో నుండి కొందరు అల్బెర్టో స్నేహితులను మోసుకొస్తున్న కారు మా ముందు ఆగింది. ఒకరినొకరం హత్తుకుని వారిని సంతోషంగా లోపలికి ఆహ్వానించాము. లోపలికి వెళ్లగానే మా వద్ద ఉన్న గ్లాసుల నిండా మద్యం నింపాము. అటువంటి సందర్భాల్లో ఈ విధంగా మద్యం సేవించటం గౌరవప్రదమైన విషయంగా ఉండేది.

అల్బెర్టో స్నేహితులు మమ్ములను తమ ప్రాంతానికి ఆహ్వానించారు. వారంతా జునిన్ డి లాస్ ఆండెస్‌లో పని చేస్తున్నారు. మేమంతా కలిసి అక్కడకు వెళ్లాము. మా లగేజీలో కొంత ఉద్యానవనంలోని షెడ్‌లో వదిలిపెట్టటంతో మా బండిమీద మోతబరువు కొంత తగ్గింది.



# వృత్తాకార భ్రమణం

జునిన్ డి లాస్ ఆండెస్. పొరుగున ఉన్న పట్టణం కంటే దురదృష్టవంతమైనది. నాగరికత ఈ నగరాన్ని మర్చిపోవటంతో ఒక మూలన ఉంది. మా మిత్రులు పనిచేసే చోట బారికేడ్లు నిర్మించినా ఈ పట్టణ జీవితంలో నిండుకుని ఉన్న స్థబ్దత నుండి బయట పడలేకపోతోంది. అల్బెర్టో స్నేహితులు అతి కొద్ది సమయంలోనే నాకు కూడా సన్నిహితులుగా మారారు.

విల్లా కాన్సెపాసియన్‌లో మేము గడిపిన తీపి అనుభవాలు గుర్తు చేసుకుంటూ మొదటి రోజు రాత్రిని సాగనంపాము. అక్కడ అపరిమితంగా ఉన్న రెడ్ వైన్ చూశాక మాకు మరింత హుషారు కలిగింది. నాకు శిక్షణ లేదు అంటే పోటీనుండి

విరమించుకోవటమే. దాంతో నన్ను నేను దుంగలా మార్చుకుని అక్కడున్న మంచంమీదకు వాలిపోయాను.

మా మిత్రులు పని చేస్తున్న వర్క్‌షాపులో మా బండికి ఉన్న కొన్ని చిన్నా చితకా సమస్యలు పరిష్కరించుకుంటూ మరునాడు గడిపాము. ఆ రోజు రాత్రి నోరూరించే అద్భుతమైన విందుతో మాకు అర్జెంటీనానుండి వీడ్కోలు చెప్పారు. విందులో లేత మాంసం, సలాడ్, బ్రెడ్ వండి వడ్డించారు. అనేక రోజుల విందులు, వినోదాల తర్వాత మరోసారి ఒకరినొకరం హత్తుకుని వీడ్కోలు తీసుకున్నాము. అక్కడ నుండి అదే ప్రాంతంలో ఉన్న మరో సరస్సు కాత్రుకు బయలుదేరాము. దారి దారుణంగా ఉంది. గుట్టలు వచ్చినప్పుడు నెట్టుకుంటూ వెళ్లినా ఇసుకలో కదల్లేక మొరాయిస్తోంది మా మోటార్ సైకిల్. మొదటి ఐదు కిలోమీటర్లు దాటటానికే మాకు గంటన్నర పట్టింది. ఆ తర్వాత రోడ్డు కాస్తంత సౌకర్యంగానే ఉంది. ఆ తర్వాత ఎటువంటి ఇబ్బంది లేకుండానే మేము కాత్రు చిక్కోకు చేరుకున్నాము. చుట్టూ దట్టమైన అడవి, పర్వతాలతో చుట్టుముట్టబడిన చిన్న ఆకుపచ్చని సరస్సు అది. ఆ తర్వాత దానికంటే విశాలమైన సరస్సు కాత్రు గ్రాండ్‌కు వెళ్లాము. అది ఎంత పెద్దదంటే మోటారుసైకిలుపై కూడా దాని చుట్టూ తిరిగి రాలేకపోయాము. అక్కడ నుండి చీలిలోకి ప్రయాణించటానికి సరస్సుపై కేవలం దుంగల వంతెన మాత్రమే ఉంది. దీన్నే ఉపయోగించి స్మగ్లర్లు చిలీలోకి ప్రవేశించే వారు.

మా బండిని పార్క్ కాబిన్ రేంజర్ ఇంటివద్ద వదిలి పెట్టాము. ఆ సమయంలో ఆయన ఇంట్లో లేడు. అక్కడి నుండి ఎత్తయిన ప్రాంతాన్ని ఎక్కి సరస్సుకు అభిముఖంగా నిల్చున్నాము. అది మధ్యాహ్న భోజన సమయం. ఆ సమయంతో మా దగ్గర కొంత వెన్న, గతం నుండి వెంటపెట్టుకున్న కొంత తినుబండారం మాత్రమే మిగిలాయి. సరస్సు మీదుగా ఎగురుకుంటూ ఒక బాతు వెళ్లింది. అది ఎంత దూరం వుందో లెక్క వేసిన అల్బెర్టో చుట్టూ ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాత బాతును కొట్టేశాడు. ఎవరైనా చూస్తే ప్రత్యేకించి ఉద్యానవన పర్యవేక్షకుడు చూస్తే అపరాధ రుసుము కట్టక తప్పదు. గురి చూసి కొట్టిన ఒకే ఒక దెబ్బకు బాతు గిలగిల్లాడుతూ సరస్సులో పడింది. ఎవరు సరస్సులోకి వెళ్లి బాతును పట్టుకొస్తారన్న అంశంపై వెంటనే మాలో చర్చ మొదలైంది. చర్చలో ఓడిపోయిన నేను సరస్సులో పడ్డ బాతును తేవటానికి నీళ్లలోకి దిగాను. నా చేతి వేళ్ల గుండా చలి శరీరమంతా వ్యాపిస్తోందన్న అనుభూతి కలిగింది. ఇక ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయాను. మంచు, చలి అంటే నా ఒంటికి పడదు, అలర్జీ అన్నమాట. ఆ 20 మీటర్ల దూరం ఈది అల్బెర్టో వేటాడిన బాతును పట్టుకురావటం

నాకు శక్తికి మించిన పనైపోయింది. ఆకలిగా ఉన్న మాకు ఆ బాతు మాంసం ఎంతో రుచికరంగా అనిపించింది. ఈ ప్రయాణంలో మేము తిన్న విందుల్లో రుచికరమైన విందు అదొకటి.

కడుపు నిండటంతో మళ్లీ కొండపైకి ఎక్కటం ప్రారంభించాము. మొదటి నుండీ ఈగలు మమ్మలను చుట్టుముట్టాయి. అవకాశం వచ్చినప్పుడల్లా కుడుతున్నాయి. కొండ ఎక్కడంలో అనుభవం లేకపోవటం, తగిన పరికరాలు లేకపోవటంతో ఈ ప్రయత్నం ప్రయాసగా మారింది. కొంతసేపు ఘర్షణ పడిన తర్వాత శిఖరాగ్రానికి చేరుకున్నాము. మా దురదృష్టం కొద్దీ అక్కడ చూడటానికి సుందరమైన దృశ్యమేమీ కనిపించలేదు. పొరుగునున్న పర్వత శిఖరాలు మొత్తం ప్రకృతి సౌందర్యాన్ని కనిపించకుండా అడ్డుకుంటున్నాయి. ఏవైపు చూసినా ఎత్తయిన పర్వత శ్రేణులే తప్ప మరోటి కనిపించటం లేదు. మంచుతో కప్పబడిన శిఖరాగ్రంపై కొంత సేపు జోకులు వేసుకున్నాక చీకటిపడిపోతుందేమో అన్న ఆందోళనతో కిందకు దిగటం ప్రారంభించాము. మొదటి భాగం వరకు క్షేమంగానే దిగాము. ఆ తర్వాత గాలి వేగం పెరిగిపోవటం, రాళ్లపై కాళ్లు జారిపోతూ ఉండటంతో మమ్మలను మేము తట్టుకుని నిలబడటానికి ఎంతో కష్టపడాల్సి వచ్చింది. చివరకు ఆ గాలి తాకిడికి అంచులనున్న చెట్లు పట్టుకుని ఎక్కడకో కొట్టుకుపోయాము. ఫలితంగా దట్టమైన పొదల మధ్య పడ్డాము. అప్పటికే దట్టమైన చీకటి అలుముకోవటంతో శూన్య ఆకాశంలో ఒక్కో అడుగు వేస్తున్నట్లు అనిపించింది. మధ్య మధ్యలో ఎన్నోరకాలైన వింత ధ్వనులు మమ్మలను బెదరగొట్టే ప్రయత్నం చేశాయి. అల్బెర్టో కళ్లద్దాలు కిందపడిపోయాయి. నా ఫ్యాంటు కాస్తా చీరుకుపోయి నిక్కరుగా మారింది. ఆ విధంగా ఒక చెట్ల వరుసకు చేరుకున్నాము. అక్కడ నుండి ఒక్కో అడుగూ ఎంతో జాగ్రత్తగా వేస్తూ పోయాము. ఎందుకంటే చీకటి చిక్కబడే కొద్దీ మా మస్తిష్కం ప్రతి అడుగులోను, ప్రతి క్షణంలోను ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించసాగింది.

ఆ విధంగా అంతులేని కొండపై సాగుతున్న మేము దిగువన కాగ్రుయి నది ప్రవాహపు గలగలలు విన్నాము. మైదాన ప్రాంతానికి చేరుకున్న తర్వాత మేము ఆసరా చేసుకున్న చెట్ల వరుస మాయమైంది. నదికి ఆవలి నుండి ఈవలి వరకు పెద్ద కాంతిపుంజం వచ్చి పక్కనే ఉన్న పెరిగీ పెరగని పొదల్లో మాయమైంది. ఈ ప్రకృతి నేరుగా మా హృదయాలను తాకింది. ఆ సమయంలో మేము సహజీవనం చేస్తున్న ప్రాకృతిక జీవనం నిశ్చలతకు, ప్రశాంతతకు భంగం కలగకుండా ఉండేందుకు నిదానంగా నడక ప్రారంభించాము.

ఆ ప్రవాహన్ని దాటుకుంటూ వెళ్లాము. ఆ నీళ్లు మా మడమలకు తాకగానే ఏ చలినైతే నేను ద్వేషిస్తానో అదే చలి భావన కలిగింది. నిదానంగా అడుగులు వేసుకుంటూ రేంజర్ నివాసం వద్దకు చేరుకున్నాము. రేంజర్ మాకు దయతో వేడి వేడి తేనీరు మటే అందించాడు. కప్పుకోవటానికి గొర్రెతోలుతో చేసిన దుప్పట్లు కూడా అందించాడు. అప్పుడు నిద్రపోయిన మేము మరునాడు లేచేసరికి మధ్యాహ్నం 12.35 అయ్యింది.

అక్కడ నుండి నిదానంగా కుర్రు కంటే అద్భుతమైన సుందరమైన సరస్సులు చూసుకుంటూ నిదానంగా వెనక్కు వచ్చాము. చివరకు శాన్ మార్టిన్‌కు చేరాము. అక్కడే డాన్ పెండోన్‌కు విందులో సహకరించినందుకు గాను చెరో పది పెసోలు ఇచ్చాడు. అక్కడి నుండి మరింత దక్షిణానికి బయలు దేరాము.

# ప్రియమైన మామకు

**జనవరి 1952**

**బార్సిలోఫ్ వెళ్లే దారిలో**

**ప్రియమైన మామకు**

నా గురించి నీకు ఏమీ సమాచారం లేనట్లే మీ గురించి కూడా నాకు ఏమీ సంగతులు తెలియటం లేదు. నాకు ఆందోళనగా ఉంది. మా అనుభవాలన్నీ చెప్పటం మొదలుపెడితే ఈ లేఖ ఉద్దేశ్యం నెరవేరదు. మా సంగతులు క్లుప్తంగా మీకు తెలియ చేస్తాను. బహియా బ్లాంకా వదిలిపెట్టాక రెండు రోజులకు నేను అనారోగ్యం పాలయ్యాను. 40 డిగ్రీల జ్వరంతో ఒకరోజంతా నేను మంచం మీదనే ఉండాల్సి వచ్చింది. మరునాడు ఉదయం అతి కష్టం మీద ప్రయాణం ప్రారంభించిన నేను చోలె చోలె ప్రాంతీయ ఆసుపత్రిలో చేరాను. అక్కడ నాకు పెన్సులిన్‌తో వైద్యం చేయటంతో నాలుగు రోజుల తర్వాత నేను కోలుకున్నాను...

ఆ తర్వాత మేము ఆండిస్ పర్వత శ్రేణుల్లోని శాన్ మార్టిన్ పర్వతాలను చేరుకున్నాము. దారిలో ఎదురైన అనేక సమస్యలను మా సమయస్ఫూర్తితో పరిష్కరించుకుంటూ ముందుకు సాగాము. ఇంతవరకు ఎవ్వరూ అడుగుపెట్టని దట్టమైన అడవి మధ్య శాన్ మార్టిన్ కొండల్లో అద్భుతమైన సరస్సు ఒకటి ఉంది. తప్పకుండా నువ్వు చూడాల్సిన సరస్సు అది. మా ముఖాలు కార్బొరాండ్‌లాగా మారటం ప్రారంభించాయి. మేము వెళ్లిన ప్రతి ఇంటిలోను మంచి ఉద్యానవనం ఉంది. అక్కడ బస, భోజనం అడిగాము. ఆపైన వారేదైనా ఇస్తే అది మాకు సాయం చేయటమే అని భావించాము. చివరికి వాన్ పుట్నామర్ తోటకు వెళ్లాము. అక్కడ జార్జి స్నేహితులు పని చేస్తున్నారు. అందులో ఒకరు పెరోన్ అనుచరుడు. నిరంతరం మద్యం మైకంలో ఉండేవాడు. నేను అక్కడ ఆక్సిపిటల్ ప్రాంతంలో ట్యూమర్‌ను కనుక్కొన్నాను. అక్కడ ఇంకా ఏమిజరుగుతుందో తెలుసుకోవాలి. బారిలోఛ్ నుండి రెండు మూడు రోజుల్లో ప్రయాణం ప్రారంభిస్తాము. ఆ తర్వాత కాస్తంత వెసులుబాటుతో విరామంగా ప్రయాణించాలని అనుకుంటున్నాము. ఫిబ్రవరి 10, 12 మధ్య చేరుకోగలిగేట్లయితే ఒక లేఖ రాయండి. నా తదుపరి పేజీ లేఖ చిచినాకు రాస్తున్నాను. అందరినీ అడిగినట్లు చెప్పగలరు. అదేవిధంగా పాపి దక్షిణాన ఉందో లేదో ఖచ్చితంగా చెప్పాలి.

**ప్రేమతో**

**నీ కుమారుడు**

# ఏడు సరస్సుల రోడ్డు

ఏడు సరస్సుల రోడ్డు ద్వారా బార్సిలోచ్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నాము. ఆ రోడ్డులో నగరానికి చేరుకోవటానికి ముందే ఏడు సరస్సులు దాటాల్సి రావటంతో ఆ పేరు వచ్చింది. మా మోటారు సైకిల్ నత్తనడకతో మొదటి కొద్ది కిలోమీటర్లు ప్రయాణించాము. అప్పటి వరకు బండికి ఎటువంటి మరమ్మతుల సమస్య ఎదురు

కాలేదు. చీకటిపడటంతో పాత హెడ్‌లైట్ ట్రిక్కును ఉపయోగించి రోడ్డుపక్కన ఉన్న కార్మికుల నివాసంలో పడుకున్నాము. ఆరోజు రాత్రి చలి తీవ్రత అసాధారణంగా ఉంది. ఆ చలి తీవ్రత ఎంతగా ఉందంటే కొద్దిసేపటిలో మరో ప్రయాణీకుడు వచ్చి తాను, తన భార్య సరస్సు ఒడ్డున పడుకున్నామని, చలికి గడ్డకట్టుకుపోతున్నామంటూ దుప్పటి కావాలని అడిగాడు. ఆ ఆదిమకాలపు జంటతో తేనీరు తాగటానికి వెళ్లాము. ఆ జంట కేవలం చిన్న గుడిసెలో ఎంతో కాలం నుండీ సరస్సు ఒడ్డున పెద్దగా ఇతర వస్తువులు ఏమీ లేకుండానే నివసించటం చూశాక మాపట్ల మాకే సిగ్గేసింది.

అక్కడ నుండి ప్రాచీన అడవుల మధ్య ప్రకృతి సువాసనలు మా ముక్కుపుటాలు తాకుతుండగా చిన్న పెద్ద సరస్సులు దాటుకుంటూ వెళ్లాము. మా ఆసక్తికి తగ్గట్లుగా అడివి చివర్లో ఒక సరస్సు, ఆ సరస్సు ఒడ్డున ఒకే ఒక ఇల్లు, దాని వెనక అందంగా తీర్చి దిద్దిన ఉద్యానవనం ఉన్న ప్రాంతానికి వచ్చాము. ఈ అద్భుత స్థాయిలో ఉన్న ప్రాంతాన్ని చూశాక అందులో ఉదాసీనంగా పడి ఉన్న ఏకాత్మకతను గుర్తించకుండా ఉండలేము. ఈ ప్రాంతం ప్రకృతిపరంగా అంత సుందరమైనదైనా మనం దాన్లో లీనం అయిపోలేము. ఆ విధంగా లీనం కావాలంటే చాలా రోజులు అక్కడే ఉండిపోవాలి.

చివరికి ఉత్తరాదిన ఉన్న లాగో నాహుల్ హుపి సరస్సును చేరుకున్నాము. దాని ఒడ్డున నిద్రపోయాము. చోలిచోలిలో అంత భారీగా విందు ఆరగించిన తర్వాత ఇంతపాటి విశ్రాంతి ఎక్కడా దొరకలేదు. తిరిగి ప్రయాణం ప్రారంభించిన తర్వాత బైకు టైరు పంచరయినట్లు గుర్తించాము. ఆ తర్వాత ట్యూబుతోనే అతి కష్టం మీద బండిని నడుపుకుంటూ వెళ్లాము. ట్యూబుకు ఒకవైపు పంచరు వేయిస్తే రెండో వైపు పంచరవుతోంది. ఆ విధంగా ట్యూబు అంతా పంచర్లతో నిండిపోయాక ఉన్న చోట ఆ రాత్రి గడపక తప్పింది కాదు మాకు. యువకునిగా ఉన్నప్పుడు మోటార్ సైకిల్ పందాల్లో పాల్గొన్న ఒక ఆస్ట్రియా పౌరుడు మాకు బస ఏర్పాటు చేశారు. తోటివాళ్లకు సహాయం చేయాలనుకునే ఉద్దేశ్యానికీ, తన యజమాని ఏమైనా అంటాడేమో అన్న సందేహానికీ మధ్య నలుగుతున్న అతను మాకు సహాయం చేయటానికి ముందుకు వచ్చాడు.

వచ్చీరాని స్పానిష్ భాషలో అతను ప్యూమా ఈ ప్రాంతంలోనే ఉన్నట్లు చెప్పాడు. "ప్యూమాలు ప్రమాదకరమైన తెగ. మనుషులపై దాడి చేయటానికి వెనకాడని తెగ. వారి వద్ద పెద్ద పెద్ద ఆయుధాలు ఉన్నాయి" అని తెలిపాడు.

తలుపు మూయటానికి ప్రయత్నించిన మాకు అది మూసుకునేది కాదని తెలిసింది. ప్యూమాల గురించి విన్నప్పటి నుండి మా ఆలోచనలు ఆ విషయంతోనే

నిండిపోయాయి. ఒక వేళ మధ్య రాత్రి అనుకోకుండా వాళ్లు దాడి చేస్తే ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉండటానికి నా రివాల్వర్ తలాపిన పెట్టుకుని పడుకున్నాను. తలుపుపై ఏవో గోళ్ల శబ్దం వినపడటంతో నాకు మెలుకువ వచ్చింది. అప్పుడే మసక మసకగా తెల్లవారుతోంది. నాకు రెండో వైపున నిశ్శబ్దంగా పడి ఉన్న అల్బెర్టో గాఢ నిద్రలో ఉన్నాడు. ఉద్రిక్తత మనసు నిండిన నేను రివాల్వర్‌పై చేతులు బిగించి పట్టుకున్నాను. చెట్ల సందు నుండి రెండు కళ్లు తదేకంగా నన్నే చూస్తున్నాయి. పిల్లిలాగా కళ్లు తిప్పుతోంది ఆ ఆకారం. ఇంతలో మరో నల్లని ఆకారం తలుపువద్దకు చేరుకొంది.

ఇంగితం విఫలమైన సందర్భం అది. నన్ను నేను కాపాడుకునే ఉద్దేశ్యంతో ట్రిగ్గర్ నొక్కాను. తుపాకి పేల్చాను. గుభేలుమన్న శబ్దం గది గోడలకు మధ్య రింగులు తిరిగిన తర్వాత ఒక ఆకారం టార్చి లైటు పట్టుకుని మావైపు అరుచుకుంటూ వచ్చింది. అప్పటికి ఆందోళన నుండి బయట పడిన మేము ఆ ఇంటి యజమాని, అతని భార్య భయంతో అరుస్తున్న అరుపులవి అని తెలుసుకున్నాము. స్థిమితపడ్డాము. చనిపోయిన కుక్క బాబీ శవాన్ని దగ్గరకు తీసుకున్న యజమాని భార్య ఉక్రోషంతో మమ్ములను శాపనార్థాలు పెడుతోంది.

అల్బెర్టో పంచరు వేయించి బండిని సిద్ధం చేయించటానికి అంగోస్టురాకు వెళ్లాడు. దీంతో మమ్ములను హంతకులుగా పరిగణిస్తున్న ఆ ఇంట్లో మంచం అడగలేక ఆ రాత్రి బయటే ఒంటరిగా గడపాలని అనుకున్నాను. అదృష్టం కొద్దీ మా బైకు ఉంచిన కార్మికుని ఇంట్లో నాకు అతని మరో స్నేహితుడితో పాటు నిద్రించేందుకు అవకాశం దొరికింది. వర్షపు శబ్దానికి అర్థరాత్రి నాకు మెలుకువ వచ్చింది. బైకుపై టార్పాలిన్ కప్పుదామని లేవబోతున్నాను. దానికంటే ముందు కొద్దిగా ఆస్తమా మందు పీల్చుకుందామని ఆగాను. తలగడగా మార్చుకున్న గొర్రె తోలు నాకు అసౌకర్యంగా తోచింది. నేను మందు పీల్చుకుంటుంటే నాతో పాటు నిద్రిస్తున్న మిత్రుడు ఆ శబ్దానికి లేచాడు. ఒక్క కుదుపు కుదిపి వెంటనే నిశ్శబ్దంలోకి జారుకున్నాడు. ఆ దుప్పట్ల కింద అతని శరీరం గగుర్పొడుస్తుందని భావించాను. కత్తిపట్టుకుని ఊపిరి పీలుస్తున్నాడు. రాత్రి జ్ఞాపకం తాజాగా మదిలో మెదలాడుతుండగా నేను ఉన్న చోట నుండి కదలరాదని నిర్ణయించుకున్నాను. ఈ ప్రాంతంలో ప్రజలు నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తారని తెలుసుకున్న నేను కత్తిపోట్లకు గురికావటం ఎందుకని నిశ్శబ్దాన్ని పాటించాను.

ఆ తర్వాత మరునాడు సాయంత్రానికి మేము శాన్ కార్లోస్ డి బారిలోచ్‌కు చేరుకుని ఆ రోజు రాత్రి చిలీ సరిహద్దులకు ప్రయాణించే పడవ మోడెస్టా విక్టోరియాకోసం ఎదురు చూస్తూ పోలీసు స్టేషనులోనే గడిపాము.



# ఇప్పుడు నా మూలాలు స్పష్టంగా తెలిశాయి...స్వేచ్ఛగా....

బయట పెద్దపెట్టున వీస్తున్న గాలినుండి తట్టుకోవటానికి పోలీసు స్టేషనులోనే ఉన్న వంటగదిలో మూలన నక్కాము. ఒక లేఖను పదే పదే చదివాను. అది అద్భుతమైనది. ఆ లేఖలోనే ఉన్న విధంగానే ఇంటి గురించిన నా ఊహలు, కలలు, మిరామార్‌లో మాకు వీడ్కోలు చెప్పిన వాళ్ల కళ్లల్లో వ్యక్తం అయిన భావాలతో నిండి పోయాయి. ఉద్రిక్తత నన్ను చుట్టుముట్టింది. మగత నిద్రలో ఉన్నాను. ప్రేక్షకుల్లో ఉన్న అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని జైల్లో ఉన్న బందీలతో సాగుతున్న అంతులేని సంభాషణ విన్నాను. అతని సహచర్యంలో వెచ్చదనాన్ని ఆస్వాదించాను. అతని మాటలు వినటానికి చుట్టూ ఉన్న వాళ్లు మరింత దగ్గరగా జరుగుతుంటే మరింత రెచ్చగొట్టే ఉపన్యాసం సాగిస్తున్న అతన్ని చూశాను.

మంచు తెరల మధ్య గతంలో ఒకసారి బారిలోఛ్‌లో కలుసుకున్న అమెరికా వైద్యుడిని చూశాను. “మీరు అనుకున్న లక్ష్యాన్ని సాధించేలా ఉన్నారు. ఆ సాహసం మీలో కనిపిస్తోంది. మధ్యలో మెక్సికోలో కూడా మీరు ఆగితే మంచిదని అభిప్రాయపడుతున్నాను. మెక్సికో అద్భుత దేశం” అన్నాడు. నేను తలూపాను.

ఇంతలో ఉన్నట్లుండి సుదూర తీరాలకు సాగిపోతున్నట్లు అనిపించింది. నా జీవితంలో ప్రస్తుతం సాగుతున్న నాటకాన్ని వదిలిపెట్టి వెళ్తున్నాననిపించింది. బాగా అసౌకర్యవంతమైన భావన, అలసట నన్ను పట్టేసింది. నేను ఏ విషయాన్ని ఆస్వాదించలేనేమోనన్న భావన తట్టింది. నన్ను చూసి నాకే భయం వేసింది. తర్వాత కళ్ల

వెంట నీళ్లుకారటం మొదలైంది. ఆ తర్వాత నేను రాయలేకపోతున్నాను. రాసే ప్రయత్నం చేయటం కూడా వృధా ప్రయాసే. మమ్ములను చుట్టుముట్టిన మసక వెలుగులో చిరుజల్లులు రాలుతున్నాయి. కానీ ఆమె మాత్రం కళ్ల ముందు నుండి తొలగిపోవటం లేదు. ఈ నిముషం వరకు ఆమెను నేను ప్రేమిస్తున్నాననే నేను నమ్ముతున్నాను. ఆ విషయం తట్టినప్పుడు కూడా నాకు ఏమీ అనిపించలేదు.

ఆమెను మళ్లీ జ్ఞాపం చేసుకున్నాను. ఆమె కోసం పోరాడాలి. ఆమె నాదే. నాదే... అనుకుంటూ నిద్రపోయాను.

తెల్లవారి ఉదయాన్ని గుర్తు చేస్తూ కోమలమైన సూర్యకిరణాలు ఒంటిని తాకాయి. ఆ రోజున మేము అర్జెంటీనా భూమికి వీడ్కోలు చెప్పబోతున్నాను. మా మోటారు సైకిలును మోడెస్టా విక్టోరియా మీదకు తీసుకురావటం అంత తేలికైన పనేమీ కాదు. మొత్తం మీద ఓపిగ్గా ఆ పని పూర్తి చేశాము. ఆ తర్వాత మేము ఆ సరస్సులో సుందరమైన ప్రాంతం ప్యూర్టో బ్లెస్ట్‌లో ఆగాము. అది రోడ్డుకు కొద్ది కిలోమీటర్లు దూరంలోనే ఉంది. బహుశా మూడు, నాలుగు కిలోమీటర్ల దూరం ఉండవచ్చు. ఆ తర్వాత తిరిగి నీళ్ల మీద మా ప్రయాణం ముందుకు సాగుతోంది. ఈసారి మురికి సరస్సు లాగునా ఫ్రియాస్ గుండా మా ప్రయాణం సాగుతోంది.

కస్టమ్స్ అధికారులను చేరుకోవటానికి ముందుగా మరికొద్దిసేపు ప్రయాణించాము. ఆ తర్వాత కొర్డిల్లెరాకు ఆవలి వైపున లోతట్టు ప్రాంతంలో ఉన్న చిలీకి చెందిన ఇమ్మిగ్రేషన్ కార్యాలయానికి వెళ్లాము. ఈ మధ్యలోనే రియో ట్రోనడోర్ పేరున్న అగ్నిపర్వతం నుండి పారుతున్న నీటితో సుందరంగా రూపొందించిన మరో సరస్సు – దాని పేరు కూడా అదే దాటాము. ఎస్మరాల్డ్ సరస్సు అర్జెంటీనా సరస్సుల కంటే భిన్నంగా ఉంది. అద్భుతంగా కూడా ఉంది. నీళ్లు నవ్వుతున్నాయి. అక్కడ స్నానం చేయటం ఆహ్లాదకరంగా ఉంటోంది. ఆ ప్రాంతంలో అత్యంత ఎత్తయిన ప్రదేశం పేరు కాసా పాంగువా. అక్కడి నుండి చూస్తే చిలీ దేశం ఎంతో సుందరంగా కనిపిస్తుంది. అది ఒక రకంగా కూడలి ప్రదేశం. నా మటుకు నాకు అది ప్రస్తుతం ఒక కూడలే. ఇరుకైన చిలీ భూభాగం గుండా నేను భవిష్యత్తులోకి చూస్తున్నాను. రేపు ఏమి జరగనుంది అని ఆలోచిస్తున్న నాకు ఒటెరో సిల్వా పద్యం మదిలో మెదిలింది.

# ఆసక్తికరమైన అంశాలు

మా మోటరు సైకిలును మోసుకెళ్ళుతున్న బోటులో ఏమూల చూసినా నీళ్లే కారుతున్నాయి. నీళ్ల తోడేయటానికి చేసే ప్రయత్నంతో చేతులు కలుపుతూనే నేను పగటి కలల్లోకి జారుకున్నాను. ఎస్మరాల్డ్‌లో ప్రయాణీకులు వేచి ఉండే చోట పియుల్లా నుండి వచ్చిన ఒక వైద్యుడు వేచి ఉన్నాడు. మా బోటు అటు ఇటు ఊగుతూ అక్కడికి వెళ్లి ఆగింది. ఆ కుదుపులకు మా బైకు కదిలిపోయింది. చెమటోడ్చి సంపాదించిన సొమ్ముతో మాకు, మా బైకుకు టిక్కెట్లు కొన్నాము. బోటు మునిగిపోకుండా శతవిధాలా ప్రయత్నం చేస్తున్న మమ్ములను గమనించిన అతని ముఖంలో ఒక ఆసక్తికరమైన భావం వ్యక్తం అయ్యింది.

మా ప్రయాణంలో అనేకమంది వైద్యులను కలుసుకున్నాము. వారికి కుష్టు శాస్త్రం గురించి దండిగా ఉపన్యాసాలు కూడా ఇచ్చాము. మా ద్వారా విషయాలు తెలుసుకున్న కొందరు వైద్యులు ఆండిస్ పర్వతాలకు ఆవలవైపున మా సహచరులు చేస్తున్న కృషిని అభినందించకుండా ఉండలేకపోయారు. వారు ఎందుకు ప్రభావితం అయ్యారంటే కుష్టు వ్యాధి చిలీలో ఒక సమస్య కాదు. అందువల్ల కుష్టు వ్యాధి గురించి గానీ, ఆ వ్యాధిగ్రస్తుల గురించి గానీ వారికి తెలియదు. వాళ్లు తమ జీవిత కాలంలో ఒక్క కుష్టు రోగిని కూడా చూడలేదని నిజాయితీగా అంగీకరించారు. దూరంగా ఆస్టర్ దీవుల్లో ఉన్న కుష్టువ్యాధిగ్రస్తుల కాలనీ గురించి మాకు తెలియచేశారు. అది చూడదగిన దీవి అని కూడా చెప్పటంతో మాలో (ఆ దీవి గురించి తెలుసుకోవాలన్న) ఆసక్తి రెట్టింపైంది.

మేము ఆసక్తికరమైన ప్రయాణం సాగిస్తుండటంతో ఈ వైద్యుడు మాకు అవసరమైన సహాయం చేయటానికి ముందుకు వచ్చాడు. అయితే దక్షిణ చిలీలో మేము గడిపిన సంతోషకరమైన రోజుల్లో ఇంకా మేము సుష్టుగానే తింటున్నాము. అన్ని సౌకర్యాలు అనుభవిస్తున్నాము. అందువల్ల మాకు ఇతని సహాయం పెద్దగా అవసరం పడలేదు.

మమ్ములను ఈస్టర్ దీవి స్నేహితుల సంఘానికి అధ్యక్షునిగా ఉన్న వ్యక్తితో పరిచయం చేయమని మాత్రమే అడిగాము. అతను అక్కడికి సమీపంలోనే వల్పరాయిసోలో ఉంటున్నాడు. ఈ వైద్యుడు మా విజ్ఞప్తిని మన్నించాడు.

సరస్సులో మా ప్రయాణం పెట్రోచులో ఆగిపోయింది. అక్కడ దిగేసి మేము అందరి దగ్గరా వీడ్కోలు తీసుకున్నాము. దక్షిణ చిలీలో కొందరు బ్రెజిల్ అమ్మాయిలు తాము ప్రచురిస్తున్న మాగజైన్ కోసం అంటూ మా ఫోటోలు తీశారు. మాకు తోడుగా మరో జంట కూడా ఉంది. వారికి యూరప్ దేశాల గురించి తెలుసు. వాళ్లే చాలా జాగ్రత్తగా మా చిరునామా రాసుకున్నారు. ఈ చిరునామాకు ఫోటోలు పంపటానికి వీలవుతుందని అతనికి చెప్పాము.

అక్కడి నుండి మేము ఓసోర్నోకు వెళ్లాల్సి ఉంది. అదే పట్టణంలో మాకు తటస్థించిన ఒక మనిషి తన వాహనాన్ని ఓసోర్నోకు తీసుకెళ్లేందుకు సహాయకుల కోసం వెతుకుతున్నాడు. ఆ పని మేముచేయగలమా అని ఆరా తీశాడు. వేగంగా నడిపేటప్పుడు వాహనం గేర్లు ఎలా మార్చాలో అల్బెర్టో నాకు ఒక పాఠం చెప్పాడు. వెంటనే నేను ఆ బాధ్యత స్వీకరించటానికి ముందుకు వచ్చాను. అల్బెర్టో బైకుమీద వస్తుంటే ఆయన వెనక నేను ఈ వాహనాన్ని కుదుపులతో తీసుకెళ్తున్నాను. మూలమలుపు వచ్చినప్పుడల్లా అదో పరీక్షగా మారింది. బ్రేకు వేయటం, క్లచ్ పట్టుకోవటం, గేర్లు మార్చటం, మధ్య మధ్యలో సహాయం కోసం అల్బెర్టోవైపు కేకలు వేయటం ఇదీ తంతు. ఈ రహదారి పల్లెటూర్లలోని అద్భుతమైన ప్రదేశం గుండా ఓసోర్నో అగ్నిపర్వతం కారణంగా అదే పేరుతో స్థిరపడిపోయిన పట్టణం లాగునా ఒసోర్నోకు దాటుకుంటూ వెళ్లాము. నిరంతరం ప్రమాదాలు జరుగుతున్న ఆ రోడ్డుమీద బండి నడపటం ఇక ఏ మాత్రం నావల్ల కానిపనిగా మారింది. మేము కొండ ప్రాంతం నుండి కిందకు దిగుతున్నప్పుడు మా కారు ముందుగా రోడ్డు దాటటానికి ప్రయత్నించిన ఒక పంది కారును ఢీకొట్టింది. అంతగా తప్ప ఈ మధ్యలో మరే ప్రమాదమూ జరగలేదు. ఈలోగా నేను కారు నడపటంలో మంచి అనుభవం సంపాదించాను. ఇక నేను సుశిక్షితుడైన డ్రైవరునని చెప్పవచ్చు. ఓస్నోర్నోను ఒక చుట్టు చుట్టి పట్టణంలోకి ప్రవేశించాము. అక్కడ నుండి తిరిగి మా ప్రయాణాన్ని ఉత్తర దిక్కుగా సాగిస్తూ అద్భుతమైన చిలీ ప్రాంత పల్లెసీమల మీదుగా పోతున్నాము. ఈ ప్రాంతం అంతా చక్కగా ప్రణాళిక ప్రకారం విభజించి ఉంది. బంజరుగా ఉన్న దక్షిణాది కంటే ఈ ప్రాంతం పూర్తిగా భిన్నమైనది. చిలీ ప్రజలు స్నేహప్రియులు. మేము ఎక్కడకు వెళితే అక్కడ మాకు మంచి స్వాగతం లభించింది. ఆదివారం నాటికి ఓడరేవు పట్టణం వాల్దివియాను చేరుకున్నాము. నగర వీక్షణం చేస్తూ అక్కడ దొరికిన ఒక పత్రిక చేతికి

తీసుకున్నాము. కొర్రియో డి వాల్డివియా అన్న పేరుగల పత్రిక మా ప్రయాణం గురించి ఒక కథనం కూడా ప్రచురించింది. ఆ నగరం నాలుగువందల సంవత్సరాల ఉత్సవాలు జరుపుకొంటోంది. దీంతో ఈ ప్రాంతాన్ని జయించిన వాల్డివియాకు మా ప్రయాణం అంకితం చేశాము. అతని పేరుమీదనే ఈ నగరం ఆవిర్భవించింది. ఈస్టర్ దీవుల్లో మేము చేపట్టబోయే కార్యానికి సిద్ధంగా ఉండమని వల్పరాయిసో మేయరు మోలినాస్ ల్యుకోకు లేఖ రాయాలని కూడా అక్కడి వారు మమ్ములను ప్రోత్సహించారు.

మాకు పూర్తిగా కొత్తవైన వస్తువుల గుట్టలతో ఓడరేవు నిండివుంది. మాకు మా దేశంలో తెలిసిన వాటిలో పోల్చి చూసుకుంటే చిలీ ప్రజలు మార్కెట్‌లో అమ్ముతున్న తినుబండారాలు, చెక్కతో నిర్మించిన ఇళ్లు, ఉన్నితో చేసిన దుస్తులు మాకు పూర్తిగా భిన్నమైనవనిపించాయి. పంపా మైదానాలను ముంచెత్తిన మార్కెట్ ఉత్సాహం ఈ ప్రాంతాన్ని ఇంకా తాకినట్లు లేదు. ఈ వస్తువుల్లో స్థానిక అమెరికత్వం ఉట్టిపడుతోంది. దీనికి కారణం చిలీలో స్థిరపడిన ఆంగ్లో శాక్షన్ వలస ప్రజలు మిగిలిన వారితో కలిసిపోకపోవటం అయి ఉండవచ్చు. తద్వారా స్థానికజాతుల స్వచ్ఛతను కాపాడుకుంటూ ఉండటం కావచ్చు. ఈ స్థానిక జాతుల స్వచ్ఛత మా దేశంలో దాదాపు లేదనే చెప్పాలి.

మా దేశవాసులకు, మాకు సోదరుల వంటి ఈ దేశ ప్రజలకు మధ్య సాంప్రదాయక వ్యత్యాసాలు ఎన్ని ఉన్నా మోకాళ్లకు పైగా ఎత్తిపట్టిన నా ప్యాంటును చూస్తున్న వ్యక్తులు వాళ్లకు మంచినీళ్లు ఇవ్వండి అన్న కేకలు మాత్రం ఉమ్మడిగా కనిపిస్తున్నాయి. ప్యాంటు పైకెత్తి పట్టుకోవాల్సి రావటం నా తప్పు కాదు. నిజం చెప్పాలంటే ఒక మిత్రుడు ఉదారంగా వ్యవహరించటంతో నాకు ఈ పరిస్థితి వచ్చింది.



## నిపుణులు

మా పొరుగు దేశంలో ప్రయాణం ఉత్సాహకరంగా ఉండటానికి చిలీ ప్రజలు మాకు ఇచ్చిన ఆతిధ్యం కారణమని నేను పదే పదే చెప్తాను. అటువంటి ఆతిథ్యాన్ని

ఎంతగానో పొందాము మేము. అంతకు ముందు రోజు రాత్రి ఇచ్చిన విందులో మేము ఆరగించిన కెలోరీల శక్తినిచ్చే తిండిని గుర్తు చేసుకుంటూ నేను మెల్లమెల్లగా మంచం మీద నుండి కిందకు దిగాను. ఈ మధ్య జరిగిన సంఘటలను మనస్సులో నెమరు వేసుకున్నాను. పొడెరోసాకు పంచరు పడటం, అనంతరం ఎదురైన అనుభవాలు, వర్షంలో తడవటం మొదలు ఇప్పుడు మేము నిద్రిస్తున్న ఇంటి యజమాని రావుల్‌ను కలుసుకోవటం వరకు అన్ని విషయాలు మననం చేసుకున్నాను. అదేవిధంగా టెముకోలో ఎల్ ఆస్ట్రల్ పత్రికకు ఇంటర్వ్యూ ఇవ్వటంకూడా. రావుల్ పశువుల వైద్యుడు. పెద్దగా కష్టపడేవాడు కాదనిపిస్తోంది. తన వాహనంపై మా పాత బైకును కూడా ఎక్కించాడు. తన వాహనంపైనే మమ్ములను చిలీ మధ్యలో ఈ పట్టణానికి తీసుకొచ్చాడు. నిజం చెప్పాలంటే ఒకటి రెండు సందర్భాల్లో అసలు మేము కలవకుండానే ఉంటే బాగుండేదన్న అభిప్రాయం కూడా అతనికి వచ్చింది. ఎందుకంటే మా వల్ల అతని రాత్రి నిద్రకు అసౌకర్యం కలిగింది. కానీ ఈ పరిస్థితి రావటానికి అతన్ని అతనే నిందించుకోవాలి. ఒక మహిళపై వెచ్చించిన ఖర్చును గుర్తు చేస్తూ అతనే మమ్ములను కేబరేకు ఆహ్వానించాడు. రాత్రి ఉండిపొమ్మని బలవంతంచేశాడు. దీనికయ్యే ఖర్చంతా అతనిదే అనుకోండి. పాబ్లో నెరుడా జన్మస్థలంలో మా బసను మరికొద్ది రోజులు పొడిగించుకోవటానికి ఇతని ఆహ్వానమే కారణం. చివరకు అతను వట్టి చేతులు ఊపుకుంటూ రావటంతో ఆసక్తికరమైన ఆ ప్రాంతానికి వెళ్లే మా ప్రయత్నాన్ని మరికొద్ది రోజులు వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. దానికి బదులు అతను మాకు ఉండటానికి బస, నిద్రించటానికి మంచం ఇచ్చాడు. ఆ విధంగా రాత్రి ఒంటిగంట సమయంలో మేము టేబులు మీద ఉన్నదంతా ఖాళీ చేసి తృప్తిగా అలా ఉన్నాము. ఆ రాత్రి చాలా ఎక్కువగానే తిన్నాము. అతని తండ్రిని శాంటియాగో బదిలీ చేయటంతో ఇంట్లో పెద్దగా సామాను లేకపోయింది. దాంతో అతనికి ఉన్న ఒక్క మంచాన్నే మేము ఆక్రమించుకున్నాము. ఆ విధంగా ఆ రాత్రి అంతా అతను అసౌకర్యంగానే నిద్రించాల్సి వచ్చింది.

కదలటానికి సిద్ధంగా లేని అల్బెర్టో ఉదయపు సూర్య కిరణాలు అతన్ని లేపటానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రతిఘటిస్తున్నాడు. నిదానంగా నేను బట్టలు వేసుకున్నాను. మా రాత్రి బట్టలకు, పగటి బట్టలకు పెద్దగా తేడా ఏమీ ఉండదు. బూట్లు మాత్రమే. అందువల్ల నేను పెద్దగా ఇబ్బంది పడలేదు. మా దేశంలో ఉన్న పత్రికల కంటే ఇక్కడి పత్రికల్లో పేజీలు ఎక్కువే. రెండో భాగంలో ఉన్న ఒక్క వార్త తప్ప మరే అంశమూ ఆ పత్రికలో నన్ను ఆకట్టుకోలేకపోయింది. రెండో భాగంలో ఉన్న వార్త :

**“అర్జెంటీనాకు చెందిన ఇద్దరు కుష్టువ్యాధి వైద్యులు మోటారు సైకిలుపై**

**లాటిన్ అమెరికా పర్యటిస్తున్నారు” అన్న శీర్షికతో ఉంది.**

ఆ తర్వాత చిన్న అక్షరాల్లో ఈ విధంగా రాయబడి ఉంది.

**వాళ్లు టెముకోలో ఉన్నారు. ఆరా నుయి వెళ్లాలనుకుంటున్నారు**

ఇది మన విపరీత స్వభావానికి పరాకాష్ట. అమెరికాలో కుష్టువ్యాధి శాస్త్రంలో నిపుణులమైన మనము, సుమారు 3000 కుటుంబాలకు వైద్య సేవలందించిన అనుభవం కలిగిన మనము, ఆ ఖండంలోని అన్ని కుష్టువ్యాధి కేంద్రాలను సందర్శించి, అక్కడ పరిశోధనలు చేస్తున్న వారిని కలుసుకున్న మనము, ఈ చిన్న సుందరమైన ప్రాంతాన్ని సందర్శించాలని నిర్ణయించుకున్నాము. ఈ పట్టణం పట్ల మాకున్న గౌరవాన్ని వారు అభినందిస్తారని భావిస్తున్నాము. అయితే నిజానికి మాకు ఆ విషయం తెలియదు. కొద్ది సేపటిలో పత్రికలోని ఈ వార్త చుట్టూ జనం గుమిగూడారు. మిగిలిన వార్తలను ప్రజలు పట్టించుకోలేదు. ఆ విధంగా మమ్ములను అభినందించిన ప్రజలకు వీడ్కోలు చెప్పాము. అయినా వారి గురించి మాకు ఏమీ తెలియదు. చివరకు పేర్లు కూడా.

పట్టణ శివార్లలో నివసిస్తున్న ఒక వ్యక్తి ఇంటి వద్ద మా బైకు నిలుపుకునేందుకు అవకాశం ఇవ్వమని అడిగాము. ఆ విధంగా అక్కడికి వెళ్లాము. అక్కడ ఒకరిద్దరు మా బైకును చూస్తు వెళ్తున్నారు. తీసుకెళ్లటానికా అన్నట్లుగా. కానీ ఇప్పుడు మేము నిపుణులం. మాకు ఆ విధంగానే గౌరవం అందుతోంది. అక్కడ మేము మా బండి చిన్న చితక సమస్యలు పరిష్కరించుకోవటానికి ఉపక్రమించాము. మధ్య మధ్యలో ఒక నల్ల మహిళ కొద్దిగా తినుబండారాలు ఇచ్చి పోతూ ఉంది. ఆ రోజంతా ఇదే మా తంతు. మాకు ఆతిథ్యం ఇచ్చిన వాళ్లు మధ్యాహ్నం సమయంలో మాకు అద్భుతమైన తేనీటి విందు ఏర్పాటు చేశారు. అనంతరం సాయంత్రం ఐదుగంటల ప్రాంతంలో మేము టెముకోకు వీడ్కోలు చెప్పి ఉత్తరం దిక్కుగా ప్రయాణమై వెళ్లాము.

# పెరిగిన కష్టాలు

టెముకో నుండి మేము సాగించిన ప్రయాణం పట్టణ శివార్ల వరకు సాఫీగానే సాగింది. ఆ తర్వాత వెనక టైరు పంచరైనట్లు గుర్తించాము. దాంతో అది సరిచేసుకోవటానికి ఆగాల్సి వచ్చింది. చాలా కష్టపడి టైరు మార్చుకున్నా వేసిన టైరుకు గాలిపోతుందని ఆ తర్వాతనే గుర్తించాము. అదికూడా పంచరైంది. ఆ రాత్రి ఇక బండి బాగు చేసుకునే పరిస్థితి కనిపించలేదు. దీంతో ఆ రాత్రికి అక్కడే గడపాల్సివచ్చింది. కానీ మేము ఇప్పుడు అందరిలాగా కాదు కదా. నిపుణులం. అక్కడ సమీపంలోనే రెయిల్ రోడ్ నిర్మాణంలో పని చేస్తున్న కార్మికుడు ఒకరు మమ్ములను చూశాడు. మమ్ములను తన ఇంటికి తీసుకెళ్లి సకల సౌకర్యాలు అమర్చాడు. దాంతో ఆ రాత్రికి మాకు క్షేమంగా సాగిపోయింది.

మరునాడు ఉదయం ట్యూబులు బయటకు తీసి వాటిలో గుచ్చుకున్న ముళ్లు తొలగించి బండిని సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యాము. మేము ఆ ప్రాంతం వదిలే సరికి దాదాపుగా చీకటిపడుతోంది. అయితే అప్పటికే చిలీ భోజనానికి మాకు వచ్చిన ఆహ్వానాన్ని అంగీకరించాము. మాంచి మషాల దట్టించిన ట్రిప్ కూర, అటువంటిదే మరో కూర వైన్‌తో పాటు మా పొట్టలో సాఫీగా చేరిపోయింది. ఎప్పటిలాగానే చిలీ వాసుల ఆతిథ్యం మమ్ములను సమ్మోహనపర్చింది.

అక్కడి నుండి మేము పెద్దగా ముందుకు సాగిందికూడా లేదు. అక్కడి నుండి 80 కిలోమీటర్లు కూడా ప్రయాణించకముందే మేము పార్కు రేంజర్ ఇంట్లో నిద్రించటానికి ఆగిపోయాము. మా వద్ద నుండి తృణమో ఫలమో దక్కుతుందని ఆశించి రేంజర్ మాకు బసకు అవకాశం ఇచ్చాడు. మరునాడు ఉదయం వరకు అతను ఆశించిన తృణం దక్కకపోవటంతో ఉదయం అల్పాహారం అందించటానికి తిరస్కరించాడు. కొద్ది దూరం వెళ్లాక చిన్నగా నిప్పు రాజేసుకుని మటే కాచుకుందామనుకుంటూ విచారవదనాలతో మేము తిరిగి ప్రయాణం ప్రారంభించాము. కొంతదూరం వెళ్లాక ఆగటానికి అనువైన స్థలం

గురించి మేము వెతుకుతున్నాము. ఉన్నట్లుండి బండి పక్కకు లాగేసి గిరికీలు కొడుతూ పడిపోయింది. మేము రోడ్డుమీద వాలాము. మాకు ఏమీ దెబ్బలు తగల్లేదు. ఎందుకిలా జరిగిందని పరిశీలిస్తే స్టీరింగ్‌లో కొంత భాగం పగిలిపోయి ఉంది. గేర్ బాక్స్ దారుణంగా పగిలిపోయింది. ముందుకు సాగటం అసాధ్యంగా మారింది. దాంతో మమ్ములను, మా బండిని మరో పట్టణానికి చేరవేయగల ప్రయాణీకుల వాహనం కోసం ఎదురు చూస్తున్నాము.

అటు గుండా వెళ్తున్న కారు ఒకటి అక్కడ ఏమి జరిగిందో తెలుసుకోవటానికి ఆగింది. అందులో ఉన్న వ్యక్తులు మాకు సహాయం చేయటానికి ముందుకు వచ్చారు. మాకు సహాయపడటానికి ఏం చేసేందుకైనా సిద్ధమే అని చెప్పారు.

"మీకు తెలుసా, పత్రికలో వచ్చిన ఫోటో ఆధారంగా నేను వెంటనే గుర్తించాను" అన్నాడు అందులో ఒకరు.

అయితే వాళ్లను అడగటానికి నా వద్ద ఏమీ మిగల్లేదు. మేము వెళ్లాల్సిన దిశగా వచ్చే వాహనాల గురించి తప్ప. వారికి కృతజ్ఞతలు చెప్పి తిరిగి మటే కాచుకోవటంలో నిమగ్నమయ్యాము. సమీపంలో ఉంటున్న ఒక ఇంటి యజమాని అక్కడకు వచ్చి మమ్ములను ఆహ్వానించాడు. అతని ఇంట్లో వంటగదిలో రెండు చక్కర్లు కొట్టిన మాకు వాయిద్యం పనిముట్టు చరంగో కనిపించింది. మూడు మీటర్ల సుమారు పొడవున్న మూడు నాలుగు తీగలను రెండువైపులా ఖాళీ డబ్బాలతో ముడిపెట్టి ఉంటుంది. (మనకు వీణ, తంబుర వంటిది) ఇనుప గోళ్లనుపయోగించటం వల్ల ఆ తీగలపై గిటారు వంటి శబ్దాలు సృష్టించవచ్చు. 12 గంటల సమయంలో ఒక వాహనం వచ్చింది. అందులో ఉన్న డ్రైవరును పదే పదే వేడుకున్న తర్వాత మమ్ములను పొరుగునున్న పట్టణం లాటరోకు తీసుకెళ్లటానికి అంగీకరించాడు.

అక్కడ విశాలమైన గారేజి దొరికింది. బండి చక్రం బెండు తీయించుకున్నాము. అక్కడ దొరికిన ఒక మిత్రుడు లునా అనే యువకుడు మమ్ములను ఒకటి రెండుసార్లు తమ ఇంటికి భోజనానికి కూడా తీసుకెళ్లాడు. మాకున్న వ్యవధిని బండిని సిద్ధం చేసుకోవటానికి, తిండికి కావల్సిన వస్తువులు అమర్చుకోవటానికి వెచ్చించాము. గారేజిలో మమ్ములను చూడటానికి ఆసక్తిగా వస్తున్న వారి ఇళ్ల నుండే కొన్ని తినుబండారాలు సేకరించాము. గారేజి పొరుగునే ఒక జర్మన్ కుటుంబం ఉంది. బహుశా జర్మనీ మూలాలు ఉన్న కుటుంబం అయి ఉండవచ్చు. వాళ్లు మమ్ములను దివ్యంగానే చూసుకున్నారు. అక్కడే ఉన్న బారక్స్‌లో మేము నిద్రించాము.

బండి దాదాపుగా ప్రయాణానికి సిద్ధమైంది. దాంతో మరునాడు తిరిగి ప్రయాణం కావాలని నిర్ణయించుకున్నాము. మమ్ములను విందుకోసం ఆహ్వానించి వ్యక్తి నుండి కొన్ని సూచనలు, జాగ్రత్తలు తెలుసుకోవాలని భావించాము. చిలీ వైన్ అద్భుతంగా ఉంటుంది. అనుకోని వేగంతో నేను సీసాలు ఖాళీ చేస్తున్నాను. ఎంత ఎక్కువగా తాగానంటే స్థానికంగా ఒక గ్రామంలో నృత్య ప్రదర్శన చూడ్డానికి వెళ్లిన నేనే అందరిమీద పడ్డాను. ఆ రోజు సాయంత్రం మాకు తాగినంత వైన్ తిన్నంత తిండి దొరకటంతో బాగా గడిచింది. మా బండి బాగు చేసిన గారేజిలో ఒకింత స్నేహం ఏర్పడిన మెకానిక్ ఒకరు తన భార్యతో కలిసి నృత్యం చేయమని అడిగాడు. అతను తాగటానికి మద్యం సిద్ధం చేస్తూ ఉండటంతో పాటు నలతగా ఉండటంతో తన భార్యతో నృత్యం చేసేందుకు నన్ను ఆహ్వానించాడు. అతని భార్య మాంచి హుషారుగా ఉంది. దానికితోడు అద్భుతమైన చిలీ వైన్ కిక్కు తలకెక్కటంతో ఇద్దరం కలిసి నృత్యం ప్రారంభించాము. కొంతసేపటి తర్వాత మమ్ములను తన భర్త గమనిస్తున్నాడని గుర్తించిన ఆమె ఇక ఆగిపోతానని చెప్పింది. నేను వినిపించుకోవటానికి సిద్ధంగా లేకపోవటంతో అక్కడికక్కడే వాదన మొదలైంది. ఆమెను తలుపు పక్కకు లాగే ప్రయత్నం చేస్తుండగా అందరూ నిశ్చేష్టులై చూస్తుండిపోయారు. ఆమె నన్ను విడిపించుకోవటానికి చేస్తున్న ప్రయత్నంలో నేను కూడా బలంగా లాగటంతో ఆమె తలుపుకు తగిలి పడిపోయింది.

కోపంతో ఉన్న నృత్యకారులు వెంటాడుతుండగా నేను గ్రామంవైపు పరుగు లంకించుకున్నాను. అల్బెర్టో మాత్రం ఆమె భర్త మాకు ఇవ్వటానికి సిద్ధం చేస్తున్న వైన్ అందుకోలేకపోయామే అని విచారం వ్యక్తం చేశాడు.

## లా పొడెరోసాకు చివరి ప్రయాణం

మరునాడు పెందళకాడే లేచి బండిని సిద్ధం చేసుకుని ఇక ఏమాత్రం మాకు ఆతిథ్యం ఇవ్వటానికి సిద్ధంగా లేని ఈ ప్రాంతాన్ని వదిలి ముందుకు పోవటానికి

సిద్ధమవుతున్నాము. చివరి సారిగా గారేజికి పక్కనే ఉన్న ఒక కుటుంబం మధ్యాహ్న భోజనానికి ఆహ్వానించగా మేము అంగీకరించాము.

ముప్పు ఉంటుందని భావించిన అల్బెర్టో వాహనం నడపటానికి తిరస్కరించాడు. విఫలమవుతున్న గేర్‌బాక్స్‌ను సరి చేసుకోవటానికి ముందు కొద్ది దూరం మాత్రమే ప్రయాణించగలిగాము. మరికొంత ముందుకు పోయాక మాంచి వేగంతో ఒక మూలమలుపు దాటాము. ఈ వేగానికి వెనకవైపు ఉన్న బ్రేకుకు అమర్చిన స్క్రూ బయటకు వచ్చింది. మలుపులో ఆవు తల కనిపించింది. ఆ తర్వాత ఆ ఒక్క ఆవు తలను వెన్నంటి గుంపులు గుంపులుగా ఆవుల మంద కనిపించింది. దీంతో చేతి బ్రేకు వేసిబండి ఆపటానికి ప్రయత్నించాను. చివరికి అది కూడా విరిగిపోయింది. మరికొద్దిసేపటికి మాకు రెండు వైపుల నుండి ముందుకు సాగిపోతున్న ఆవుల మంద, వాటి కాళ్ల నుండి పైకి లేస్తున్న ధూళి తప్ప మాకు మరేమీ కనిపించలేదు.ఇంతలో లా పొడెరోసా మరింత వేగంగా పల్లపు ప్రాంతంలో పరుగులెడుతోంది. అదృష్టవశాత్తూ మేము ఆవుల మందలో నడుస్తున్న చివరి ఆవు కాళ్లు మాకు తగలకుండా బయటపడ్డాము. అంతలో ముందుకు చూస్తే ఒక నది ఉరకలు పరుగుల మీద మావైపే వస్తోందా అన్నట్లు ప్రవహిస్తోంది. దాంతో బండిని మరోవైపుకు తిప్పాను. కళ్లు మూసి తెరిచేంతలో బండి రెండు మీటర్ల ఎత్తున్న గుట్టమీద నుండి తిన్నగా కిందకు దిగిపోయి రెండు రాళ్ల మధ్య ఇరుక్కుంది. అయితే మాకు దెబ్బలేమీ తగల్లేదు.

పత్రికల్లో మా గురించి వస్తున్న వార్తలు ఎప్పుడూ మాకు సహకరిస్తూనే ఉన్నాయి. ఈసారి కొందరు జర్మన్‌లు మమ్ములను ఆదరించారు. ఆ రాత్రి నాకు ఆరోగ్యం బాగాలేదు. విరోచనాలు బాగా అయ్యాయి. చివరకు రాత్రి ఒక సమయంలో కిటికీలోకి వెళ్లి అక్కడి నుండి శూన్యంలో కనిపిస్తున్న చిమ్మచీకటిని చూస్తూ నా బాధను గడిపాను. అలా అనేకంటే చీకటితో పంచుకున్నాను అనటం సబబు. మరునాడు ఉదయం దాని ప్రభావం ఎలా ఉందో చూద్దామని ప్రయత్నించిన నాకు రెండు మీటర్ల దూరంలో ఒక మందపాటి పరుపు మీద సూర్యస్నానం చేస్తున్న వాళ్లు కనబడ్డారు. దీంతో అక్కడి నుండి హుటాహుటిన బయలు దేరాము.

మొదట్లో ఆ ప్రమాదం జరగటానికి ఏదో ప్రాధాన్యత ఉన్నట్లే అనిపించింది. కానీ ఆ తర్వాతనే తెలిసింది ఈ ప్రమాదం కారణంగా మేము ఎంతగా దెబ్బతిన్నామో. గుట్టలు ఎక్కటానికి ప్రయత్నించిన ప్రతిసారీ బండి వింతగా ప్రవర్తించటం మొదలుపెట్టింది. మాల్లెకోకు వెళ్లే ప్రయత్నంలో మాకు బండి సహకరించకపోవటంతో

ఆ వైపుగా పోయే ఎవరైనా  దయామయుడు మాకు సహాయం చేయకపోతాడా అని ఆశగా ఎదురుచూస్తూ రోజంతా గడిపాము. మాల్లెకో నుండి వెళ్లే రైలు మార్గం అమెరికాలోనే అత్యంత ఎత్తయిన రైలు మార్గం అని చిలీవాసుల అభిప్రాయం. అక్కడకు చేరి బండిని కూడా రైల్లో ఎక్కించి ప్రయాణం సాగించాలన్నది మా ప్రయత్నం.

కుల్లిపుల్లి అనే పట్టణంలో మేము నిద్రించాము. ఆత్రంగా ఎదురు చూసిన మమ్మును తోడ్కొని వెళ్లేవాళ్లు దొరకటంతో రానున్న ముప్పును ఊహించుకుంటూ బయలుదేరాము. ఆ మార్గంలో అనేక గుట్టలున్నాయి. అందులో మొదటి గుట్ట ఎక్కగానే పొడెరోసాను చివరికి భూతం ఆవహించినట్లయ్యింది. ఒక వాహనం మమ్ములను లాస్ ఏంజెల్స్ వరకు చేరవేయగా అక్కడ మేము చిలీ సైనికాధికారి నివాసానికి సమీపంలో ఉన్న ఫైర్‌స్టేషన్‌లో నిద్రపోయాము. అర్జెంటీనాలో తనకు దక్కిన సౌకర్యాలకు ఆ చిలీ అధికారి కృతజ్ఞతాపూర్వకంగా అన్నట్లు మమ్ములను మెప్పించటానికి పెద్దగా ఏమీ చేయలేకపోయాడు. మోటారు వాహనంతో అది మాకు చివరి రోజు. మరుసటి దశలో మా ప్రయాణం మరింత క్లిష్టంగా మారనుంది. చక్రాలు లేకుండా ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి వచ్చింది.



# పోరాడే వీరులు, కార్మికులు, ఇతర విషయాలు

నాకు తెలిసినంత వరకు చిలీలో స్వచ్ఛందంగా పని చేసే ఫైర్ బ్రిగేడ్‌లు లేవు. అయినప్పటికీ అది చాలా గుర్తింపు కలిగిన పని. ఎందుకంటే ఫైర్ బ్రిగేడ్‌కు నాయకత్వం వహించటం అంటే నగరంలో అత్యంత గుర్తింపు, గౌరవం వచ్చే పని. అందువల్ల పట్టణంలో సమర్థులైన యువకులు ఈ బాధ్యతలు చేపట్టటానికి ముందుకు వస్తారు. అయితే అటువంటి గౌరవం తెచ్చే ఉద్యోగం ఇదొక్కటే అని మనం నిర్ధారించుకోవాల్సిన అవసరం లేదు. చిలీలో దక్షిణ ప్రాంతంలో నిరంతరం అగ్గి రాజుకుంటూ ఉంటుంది. అది కూడా భారీఎత్తున

ఉంటుంది. ఈ విధంగా అగ్గి రాజుకోవటానికి ప్రధాన కారణం ఏమిటన్నది నాకు స్పష్టంగా తెలియదు. అత్యధికంగా భవనాలు చెక్కతో నిర్మించబడినవి కావటం కారణంకావచ్చు. లేదా ప్రజల సాంస్కృతిక స్థాయి, విద్య, తక్కువగా ఉండటం కావచ్చు. లేదా మరే ఇతర కారణాలైనా కావచ్చు. లేదా ఇవన్నీ కలిపి ఇందుకు దోహదం చేస్తూ ఉండవచ్చు. ఒక విషయం మాత్రం స్పష్టం. ఇక్కడ అగ్గిరాజుకోవటం ఎంత సాధారణం అంటే మేము ఫైర్ స్టేషన్‌లో బస చేసిన రెండు రోజుల్లో రెండు భారీ సంఘటనలు, ఒక చిన్న సంఘటన చోటుచేసుకున్నాయి.

ఆ రాత్రి స్థానిక లెఫ్టినెంట్ నివాసంలో గడిపిన తర్వాత జరిగిన సంఘటనలు వివరించటం మర్చిపోయాను. అక్కడ మమ్మలను నిలిపివేయటానికి పర్యవేక్షకుడి ఇంట్లో ఉన్న ముగ్గురు పిల్లలు కూడా కారణం అని చెప్పాలి. అందంగా ఉన్నా, వికారంగా ఉన్నా చిలీ మహిళలు మొదటి చూపులోనే ఆకట్టుకునేలా కొన్ని ప్రత్యేక లక్షణాలు కలిగి ఉంటారు. నేను చెప్పదల్చుకున్న అంశం నుండి పక్కకు జరుగుతున్నట్లు అనిపిస్తోంది...వాళ్లు మాకు ఒక గది కేటాయించారు. అక్కడ ప్రయాణంలో మా వెంట తెచ్చుకున్న పడకలు సిద్ధం చేసుకున్నాము. ఎప్పటిలాగానే వాటిమీద పడి చచ్చేంతగా నిద్రపోయాము. దాంతో మాకు సైరన్ మోతలు వినిపించలేదు. అక్కడ మేమున్న విషయం వలంటీర్లకు కూడా తెలియదు. మరునాటి మధ్యాహ్నం వరకు మేము నిద్రపోతూనే ఉన్నాము. ఈలోగా వలంటీర్లందరూ తమ తమ మంటలార్పే వాహనాలు తీసుకుని హుటాహుటిన సంఘటనాస్థలానికి వెళ్లారు. మరునాడు మధ్యాహ్నం గానీ అక్కడ ఏమిజరిగిందో మాకు తెలియలేదు. మరోసారి అటువంటి సంఘటన జరిగితే మమ్మలను కూడా వలంటీర్ల బృందంలో చేర్చుకొంటామన్న హామీ వారి నుండి పొందాము. అక్కడ నుండి రెండు రోజుల్లో మమ్మలను, మా వాహనాన్ని తక్కువ ఖర్చుతో శాంటియాగోకు చేరవేయటానికి ఒక ట్రక్కుతో అంగీకారం కుదుర్చుకున్నాము. దీనికి బదులుగా మేము వాహనంలో ఫర్నిచర్ ఎక్కించటానికి సహాయం చేయాలి.

పర్యవేక్షకుని కూతుళ్లు, వలంటీర్లుతో పిచ్చాపాటి మాట్లాడుకుంటూ లాస్ ఎంజెల్స్‌లో రోజులు వెళ్లబుచ్చాము. మాకు మంచి తోడు దొరికింది. నా కళ్లలో నిరంతరం మంటల్లో కాలిపోతున్న పట్టణాన్ని గుర్తుకు తెచ్చే విధంగా అగ్నిజ్వాలలు మెదులుతున్నాయి. అక్కడ మా బసలో అది చివరి రోజు. ఈ సందర్భంగా మాకు మంచి విందు ఏర్పాటు చేసి అందరూ అందంగా వీడ్కోలు చెప్పారు. ఆ తర్వాత తిరిగి మేము మా దుప్పట్లలో దూరిపోయాము. మేము అప్పటి నుండి ఎదురుచూస్తున్న సైరన్ ఆ రోజు అర్థరాత్రి

పెద్దఎత్తున మోగింది. సైరన్ మోతకు అప్పటి వరకు ఉన్న రాత్రిపూట నిశ్శబ్దం మటుమాయమైంది. వలంటీర్లందరూ సిద్ధం కావాలన్న సూచన ఇచ్చేందుకు ఈ సైరన్ మోగిస్తారు. దాంతో మేము కూడా హడావుడిగా సిద్ధమైపోయాము. మంటలార్పే వాహనం చిలీ ఎస్పానా వేగానికి తగ్గట్టుగానే మేము కూడా తలా ఒక చోట నీళ్ల పంపులు పట్టుకుని సిద్ధమయ్యాము. అనంతరం ఆ వాహనం మెరుపువేగంతో ఫైర్‌స్టేషన్ వదిలిపెట్టింది.సుదీర్ఘసమయం పాటు మోగే ఈ అలారం మిగిలినవారినెవ్వరినీ భంగపర్చలేదు. ఎందుకంటే వారికి ఇదేమీ కొత్తకాదుకదా.

మంటలపై నీళ్లుపడుతున్నప్పుడల్లా అక్కడున్న చెక్క ఇళ్లు ఊగిపోతున్నాయి. మంటల బారిన చుట్టుపక్కల ఉన్న ఇళ్లు పడకుండా ఉండేందుకు వలంటీర్లు శతవిధాలా ప్రయత్నిస్తుంటే వారి ముక్కుపుటాలు మాత్రం కాలిన చెక్కల నుండి వచ్చే వాసనకు కందిపోతున్నాయి. అయినా మంటలు ఇరుగుపొరుగుకు విస్తరించకుండా వలంటీర్లు భారీ నీటిపైపులతో కసరత్తు చేస్తూనే ఉన్నారు. మంటలు ఆ ఇంట్లో ఒక చిన్న మూలకు ఇంకా వ్యాపించలేదు. ఇంతలో అదే మూల నుండి పిల్లి ప్రాణభయంతో అరుస్తున్న అరుపులు మా చెవులకు సోకాయి. ఆ పిల్లి బయటకు రావటానికి చిన్న పాటి సందుమాత్రమే మిగిలి ఉంది. మిగిలిందంతా మంటల్లో చిక్కుకుపోయింది. ప్రమాదాన్ని పసిగట్టిన అల్బెర్టో ఒక్క దూకుతో 20 సెంటీమీటర్ల ఎత్తున లేస్తున్న మంటలను దాటుకుంటూ వెళ్లి పిల్లిని బయటకు తెచ్చాడు. దాని యజమానులకు అప్పగించాడు. అల్బెర్టో సాహసానికి చుట్టూ ఉన్న వాళ్లు పెద్దఎత్తున అభినందనలు తెలియచేస్తుండగా అరువు తెచ్చుకున్న హెల్మెట్ నుండి బయటకు కనిపిస్తున్న అల్బెర్టో కళ్లు ఆనందంతో పెద్దవయ్యాయి.

అయితే అక్కడ పనంతా దాదాపు చివరిదశకు వచ్చింది. లాస్ ఏంజెల్స్ మాకు తుది వీడ్కోలు పలికింది. మేము ఎక్కిన వాహనం శాంటియాగోకు ప్రయాణం ప్రారంభిస్తుండగా అల్బెర్టో, నేను మాకు వీడ్కోలు చెప్పటానికి పైకి లేచిన చేతులను ప్రేమతో స్పృజించి వదిలాము. మమ్మలను, పొడెరోసా 2 ను తన వెనక ఎక్కించుకున్న ట్రక్కు ముందుకు సాగిపోయింది.

ఆదివారం నాటికి మేము శాంటియాగో చేరాము. మా మొదటి ప్రయత్నంగా ఆస్టిన్ గారేజికి వెళ్లాము. ఆ గ్యారేజి యజమానికి మమ్మలను పరిచయం చేసే ఒక లేఖ కూడా మా చేతుల్లో ఉంది. కానీ మా ఆశ్చర్యానికి తగ్గట్లు గ్యారేజి మూతపడింది. దీంతో విచారం మమ్మలను కమ్ముకుంది. అతి కష్టం మీద గ్యారేజి కాపలాదారుడు తన వద్ద

మా మోటార్‌సైకిల్ అట్టిపెట్టేందుకు అంగీకరించాడు. దీంతో మా ప్రయాణపు ఛార్జీలు చెల్లించేందుకు వెనక్కు వెళ్లాము.

తొలగింపుదారులుగా మా ఉద్యోగంలో అనేక దశలున్నాయి. మొదటిది, ఆసక్తికరమైనది ఇంటి యజమానులు లేకపోవటంతో రికార్డు సమయంలో రెండు కిలోల ద్రాక్ష పళ్లు ఆరగించటం. రెండోది యజమానుల రాకతో మా పని పెరిగింది. మూడోది ట్రక్కు డ్రైవరుకు అహం ప్రత్యేకించి తన శరీరసౌష్టవం గురించిన అహం ఎక్కువగా ఉందని అల్బెర్టో గుర్తించటంతో వచ్చిన సమస్య. దాంతో ఆ పిచ్చోడు ఎవరు ఎక్కువ ఫర్నిచర్ మోసుకెళ్తారు అంటూ మేము కాసిన అన్ని పందాలు గెల్చుకున్నాడు. మా ఇద్దరం, ఇంటి యజమానితో కలిసి ముగ్గురం మోసిన దానికంటే ఎక్కువ ఫర్నిచర్ మోసుకొచ్చి ఇంట్లో దించాడు.

మా పరిచయస్తుడిని వెతికే పనిలో బడ్డ మాకు అతను ఒక కార్యాలయం అనదగిన నిర్మాణం వద్ద తటస్థించాడు. ఆ రోజు ఆదివారం కావటంతో అక్కడ వరండాలో నిద్రించేందుకు మాకు అనుమతిచ్చాడు. పౌరులుగా మా బాధ్యతల గురించి బోధనలు చేసిన తర్వాత దయతో మాకు చెరో రెండువందల పెసోలు ఇచ్చేందుకు ముందుకు వచ్చాడు. కానీ మేము తెచ్చిపెట్టుకున్న అహంతో తీసుకోవటానికి తిరస్కరించాము. అదే మూడు నెల్ల తర్వాత అటువంటి వ్యక్తి మాకు తారసపడితే పరిస్థితి భిన్నంగా ఉండేది. అప్పటికి అదే ఎంతో పెద్ద మొత్తంగా మాకు కనిపించేది.

శాంటియాగోలో ఉన్నప్పుడు దాదాపుగా కొర్డోబాలో ఉన్న అనుభూతి కలిగింది. అయితే కొర్డోబా కంటే శాంటియాగోలో దైనందిన జీవనం వేగం మెండు. వాహన రద్దీ కూడా అధికమే. దాని భవనాలు, వీధులు, వాతావరణం, ప్రజలు మొత్తం మాకు మధ్యధరా సముద్ర ప్రాంతపు నగరాన్ని గుర్తుకు తెస్తున్నాయి. ఈ నగరం గురించి అంతగా తెలుసుకునే అవకాశం దొరకలేదు. ఎందుకంటే అక్కడ చాలా తక్కువ రోజులు బసచేశాము. మా ప్రయాణం తిరిగి ప్రారంభించటానికి ముందు అనేక విషయాలు చక్కబెట్టుకోవాల్సి రావటంతో విహారయాత్రకు సమయం తక్కువైంది.

అర్జెంటీనా నుండి అధికారిక పత్రాలు చూపించనిదే మాకు వీసా ఇచ్చేందుకు పెరు అధికారి తిరస్కరించాడు. అర్జెంటీనా అధికారి కూడా మాకు ఏవీ ధృవీకరణ పత్రాలు ఇవ్వలేదు. తిరస్కరించాడు. ఈ వాహనం మా ప్రయాణంలో తుదివరకు సహకరించలేదేమో అని, రాయబార కార్యాలయం నుండి సహాయం కోరతారని ఇంకా ఏవో కారణాలు చెప్తూ మాకు వీసా నిరాకరించాడు. బ్రతిమాలగా చివరికి 400 పెసోల రుసుము తీసుకుని పెరు వీసా ఇచ్చాడు. ఆ మాత్రం చెల్లించాల్సి రావటం మాకు

మటుకు భారమే. ఆ రోజుల్లో కొర్డోబా నుండి సుక్వియా వాటర్ పోలో జట్టు శాంటియాగోలో పర్యటిస్తోంది. ఆ జట్టులో ఉన్న వారిలో అనేకమంది మా మిత్రులే. దాంతో వాళ్లు ఆడుతున్న సమయంలో వారిని మర్యాదపూర్వకంగా కలుసుకునేందుకు వెళ్లాము. దాంతోపాటు అక్కడ ఏర్పాటుచేసిన చిలీ తరహా విందుకు ఆహ్వానం కూడా అందుకున్నాము. ఈ విందులో మరికాస్త బ్రెడ్ తీసుకొండి, ఇంకొంచెం వెన్న రాసుకుంటారా, మరికొంచెం వైన్ తీసుకుంటారా అని అడుగుతూ ఉండటం పరిపాటి. మరునాడు నగరం మధ్యలో ఉన్న రాతికట్టడం శాంతా లూసియాకు వెళ్లాము. దానికంటూ ప్రత్యేక చరిత్ర ఉంది. సుక్వియా కాన్వాయ్ అక్కడకు చేరేసరికి నగరాన్ని మా కెమెరాలో బంధించే పని విజయవంతంగా పూర్తి చేశాము. వీరితోపాటు కొందరు అందమైన అమ్మాయిలు కూడా వెంట వచ్చారు. దీంతో చిలీ సమాజానికి చెందిన ఈ గౌరవప్రదమైన మహిళలను మాకు పరిచయం చేయలా వద్దా అన్న సందిగ్ధంలో వీళ్లు పడిపోయారు. చివరికి మేము ఎవరిమో తెలియదన్నట్లు వ్యవహరించారు. చివరికి అటువంటి క్లిష్టసమయాన్ని బాగానే అధిగమించారు. ఆ సమయానికి వాళ్లు జీవించే ప్రపంచం, మేము జీవించే ప్రపంచం పూర్తిగా భిన్నమైనవన్న భావన మాకు కలిగింది.

ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. ఆ రోజున అల్బెర్టో బుగ్గల మీదుగా రెండు కన్నీటి చుక్కలు కిందకు రాలాయి. పొడెరోసాకు కడసారి వీడ్కోలు పలికాము. అక్కడే దాన్ని గ్యారేజిలో వదిలిపెట్టాము. మా ప్రయాణం వల్పరైసో మీద ముందుకు సాగింది. అద్భుతమైన కొండ సానువుల మీదుగా మేము ముందుకు కదిలాము. ఇంతటి నిజమైన ప్రకృతి అద్భుతాలను ఇవ్వగల మరో నాగరికత లేదంటే ఆశ్చర్యపడాల్సిన పని లేదు.

# గియొకొండా నవ్వు

మా సాహసయానంలో మేము ఒక నూతన దశకు చేరుకున్నాము. మేము ధరించే వింత దుస్తులతో మాకు మేమే కొత్తగా అనిపిస్తున్నాము. మేము ఉపయోగిస్తున్న

వాహనం దుస్థితి పట్ల మాకు ఆతిధ్యం ఇచ్చేవాళ్లు కూడా సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే మేము రహదారి వీరులమే. ఈ ప్రాంతంలో దీర్ఘకాలంగా పరిచయం ఉన్న సంచార కులీనవర్గం అన్న తరగతికి చెందినవాళ్లము మేము. మాకున్న బిరుదులను గర్వంగా పిలుచుకుంటున్నాము. ఇప్పుడు ఆ హోదాలన్నీ లేవు. కేవలం రెండు మూటలు వీపులకెక్కించుకుని రోడ్డు మీద ఉన్న దుమ్ము ధూళి అంతా మా మీదనే నిలుస్తుండగా గతకాలపు హోదాలకు మేము నీడలుగా మారాము.

ట్రక్కు డ్రైవరు మమ్ములను నగరానికి ఎగువనున్న మూల వద్ద దింపేసి వెళ్లాడు. ఇప్పుడు మేము నగర ముఖద్వారం వద్ద ఉన్నాము. కాళ్లీడ్చుకుంటూ నగర వీధుల్లోకి ప్రవేశించాము. మాతోపాటే వీధుల్లోకి ఇంతేసి కళ్లతో వింతగా చూస్తున్న జనాల చూపులు కూడా నడుస్తున్నాయి. కొద్దిదూరంలోనే పడవలతో నిండి ఉన్న హార్బర్ కనిపిస్తోంది. మరోవైపున నల్లరంగుతో నిండిన సముద్రం మమ్ములను ఆహ్వానిస్తున్నట్లుగా ఉంది. ఆ నీళ్ళు నుండి వస్తున్న చమురు కంపు మా ముక్కుపుటాలు అదరగొడుతోంది. మా వెంట బ్రెడ్ తెచ్చుకున్నాము. కొనేటప్పుడు పెద్దమొత్తంలో దీనికి వెచ్చించినట్లు అనిపించినా మా ప్రయాణం ఉత్తరాది దిశగా సాగుతున్న కొద్దీ దాని విలువ తెలుస్తోంది. లోతట్టు ప్రాంతాల్లో గుండా మా నడక సాగిస్తున్నాము. అల్బెర్టో అలసిపోయాడు. నేను మాత్రం అలసట మొఖంలో కనిపించకుండా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నాను. అదే మా ఇద్దరి మధ్య ఉన్న తేడా. ట్రక్కు ఆపినప్పుడు మా నీరసపు ముఖాలతో సహాయకుడిని కలుసుకున్నాము. శాంటియాగో నుండి ఇంత దూరం ఈ రోడ్డు మీద ప్రయాణించటం వల్ల కలిగే కష్టాలన్నీ మా ముఖంలోనే కనిపిస్తున్నాయి. అక్కడున్న చెక్కముక్కల మధ్య కొంతసేపు నిద్రించేందుకు మాకు అవకాశం ఇచ్చాడు. మాతో పాటు కొన్ని పరాన్నజీవులు కూడా అక్కడ సేదదీరుతున్నాయి. అయితే మా తలపై అచ్ఛాదనం ఉంది.

ఎంతో నిబద్ధతతో మేము నిద్రకుపక్రమించాము. ఇంతలో మేము నగరంలోకి ప్రవేశించిన వార్త ఇట్టే గుప్పుమంది. పక్కనే ఉన్న ట్రయలర్ పార్క్‌ను ఆనుకుని ఉన్న రెస్టారెంట్‌లో ఉన్న వాళ్ళకు తెలిసిపోయింది. వాళ్లు మమ్ములను కలుసుకునేందుకు ఆదుర్దా పడుతున్నారు. చిలీలో ఒకరు వేరొకరిని కలుసుకోవటం అంటే వారు ఆతిధ్యం ఇవ్వటానికి సిద్ధం కావటమే. ఇటువంటి అవకాశాన్ని జారవిడుచుకోవటానికి మేము సిద్ధంగా లేము. మా సోదరుడు మరింత రెచ్చిపోయి స్పందించి పూటుగా తాగి పడుకున్నాడు. చేపల కూర తిని చాలా కాలం అయ్యింది. వైన్ కూడా చాలా రుచికరంగా ఉంది. మాకు ఆతిధ్యం ఇచ్చిన వ్యక్తి ఎంతో నమ్రతతో పిలవగానే వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాడు.

మొత్తం మీద మేము బాగా తిన్నాము. మరునాడు ఆయన తన ఇంటికి మమ్ములను ఆహ్వానించాడు.

లా డియొకొండాలో పొద్దు పొడిచింది. అంతకు ముందే మేము తేనీరు సిద్ధం చేసుకోవటానికి ఉపక్రమించాము. మా ప్రయాణపు సంగతులు తెలుసుకోవటానికి ఆసక్తిచూపుతున్న యజమానితో పిచ్చాపాటి మాట్లాడుతున్నాము. ఆ తర్వాత నగర సంచారానికి బయలుదేరాము. వల్పరాసియో నగరం రంగులతో నిండి ఉంది. విశాలమైన సముద్రం అంచున ఏర్పడిన బీచ్ పొడవునా నిర్మితమైనది ఈ నగరం. ఆ నగరం విస్తరించే కొద్దీ సముద్రగర్భం వరకు వ్యాపించి ఉన్న పర్వతాలపై నివాసాలు ఏర్పడ్డాయి. మాడ్‌హౌస్ వస్తు ప్రదర్శన శాల పేరుకు తగ్గట్లుగానే ఉంది. ఇనుప నిర్మాణాలతో కూడి ఉన్న దీనిపైకి ఎక్కటానికి టైరు ముక్కలతో మెట్లు ఏర్పాటు చేయబడి ఉన్నాయి. పైకిపోయే కొద్దీ సముద్రపు నీళ్ల రంగుతో ఆ ఇళ్ళు మరింత రంగులీనుతున్నాయి. ఏదో సూక్ష్మ పరిశోధన చేసే వాళ్లలాగా అక్కడున్న దుమ్ముకొట్టుకున్న మెట్లు, చీకటి గుయ్యారాలు దాటుకుంటూ అక్కడ ఎదురుచూస్తున్న అడుక్కుతినే వారితో మాట్లాడుకుంటూ నగరం లోతులు కొలిచాము. మా ముక్కుపుటాలు అక్కడ లోతుగా పాతుకుపోయిన పేదరికపు వాసనలను రుచి చూశాయి.

ఓడరేవుల్లో నిలిపి ఉంచిన పడవలను చూశాము. అవన్నీ తూర్పుతీర దీవులకు వెళ్ళుతున్నట్లుగా ఉన్నాయి. కానీ అక్కడి వార్తలు మాత్రం అంత ఆసక్తిగా లేవు. అక్కడికి చేరటానికి ఆరునెల్లు పడుతుందట. నెలకొకసారి ఇక్కడ నుండి బయలుదేరే విమానం గురించి నామమాత్రపు వివరాలు సేకరించాము.

తూర్పుతీర దీవులు. పైకి ఎగురుతున్న విమానం "అక్కడ శ్వేతజాతి అబ్బాయిని స్నేహితుడిగా కలిగి ఉంటే ఎంతో ఘనం" అన్న మా ఆలోచనలపై నీళ్లు చల్లింది. పని గురించా.... ఓహ్... అక్కడ మహిళలే అన్ని పనులు చేస్తుంటారు. మనం తిని, పడుకుంటే సరిపోతుంది. అయితే మహిళలను మాత్రం సంతృప్తి పరుస్తూ ఉండాలి. ఆ విధంగా అది అద్భుతప్రదేశం. అక్కడ పనీ సరైనదే, మహిళలు సరైనవాళ్లే. వాతావరణం అంతకంటే మంచిది. అక్కడ ఒక సంవత్సరం పాటు మేము విడిది చేశామనుకోండి ఎలా ఉంటుంది? చదువు సంధ్యల గురించి ఎవరు పట్టించుకుంటారు. ఇలా సాగుతున్నాయి మా ఊహలు. మధ్య మధ్యలో కిటికీ గుండా బయటికి చూస్తున్న మాకు సముద్రం నుండి పైకి ఎగురుతున్న క్రే చేప ఒకటి కనిపించింది.

లా గియొకొండాలో మేము మా సహ ప్రయాణీకుల కోసం ఓపిగ్గా ఎదురు చూస్తున్నాము. అయితే అతను వస్తున్న జాడలేమీ కనిపించలేదు. ఇంతలో ఆ ఇంటి యజమానికి మమ్ములను ఆహ్వానించి బయట ఎండలో సూప్, చేపల వేపుడుతో మంచి భోజనం తినిపించాడు. మేము వల్పరాసియోలో ఉన్నంత కాలం అర్జెంటీనా నుండి ఎటువంటి కబుర్లు వినలేదు. అతను కొంత వింతైన వ్యక్తిలాగా ఉన్నాడు. చాలా దయార్ద్ర హృదయుడులాగా కూడా ఉన్నాడు. ఆ రెస్టారెంట్‌లో సాధారణ వ్యక్తులు పెద్దమొత్తంలో చెల్లించాల్సి వస్తుంటే మాకు మాత్రం ఎంతో రుచికరమైన విందు భోజనం ఉచితంగా ఏర్పాటు చేస్తున్నాడు. అక్కడున్నంత సేపు మేము చిల్లిగవ్వ కూడా చెల్లించలేదు. అయినా విందులతో మమ్ములను మేపుతూనే ఉన్నాడు అతను. “ఈ రోజు తినటం మీ వంతు, రేపు నావంతు” అన్నది అతను పదే పదే ఉపయోగించే సామెత. అది వాస్తవం కాకపోయినా వినటానికి ఎంతో బాగుంది.

పెట్రోచులో ఉండే వైద్యులను సంప్రదించటానికి ప్రయత్నించాము. అయితే పనినుండి అప్పుడే తిరిగి వచ్చిన వాళ్ళకు మాతో గడపటానికి సమయం దొరకలేదు. మమ్ములను కలుసుకోవటానికి ఎప్పుడూ అంగీకరించలేదు. అయితే వాళ్లు ఎక్కడ ఉంటున్నారో ఆ విషయం మాత్రం మాకు తెలిసింది. ఆ రోజు మధ్యాహ్నం తర్వాత మేము ఇద్దరమూ చెరో మార్గం గుండా వెళ్లాము. అల్బెర్టో వైద్యులతో మాట్లాడటానికి వెళ్లగా నేను మాత్రం మేము బస చేస్తున్న హోటల్‌కు క్రమం తప్పకుండా వచ్చే ఒక ఉబ్బసం వ్యాధిగ్రస్తురాలైన ముసలావిడను చూడటానికి వెళ్లాను. ఆమె దాదాపు చివరి రోజుల్లో ఉందా అనిపించింది. ఆమె గది నిండా దుమ్ము ధూళి నిండి ఉంది. ఆ దుమ్ము నుండి వచ్చే వాసన ఆమెకు మరిన్ని సమస్యలు సృష్టిస్తోంది. ఆ గదిలో ఉన్న పడక్కుర్చీ ఒక్కటే విలాసవంతమైన వస్తువు. ఉబ్బసం వ్యాధికి తోడు ఆమెకు హృద్రోగ సంబంధమైన వ్యాధి కూడా ఉంది. ఇటువంటి సమయాల్లోనే వైద్యులు ఆమె నిస్సహాయత గురించిన అవగాహన కలిగి ఉన్నవాడైతే, మార్పును కోరుకునే వాడైతే, ఒక నెల క్రితం వరకు హోటల్‌లో కార్మికురాలిగా ఈ మహిళ సగర్వంగా తన జీవితం గడిపేందుకుగాను తన వేతనం తీసుకునే స్థితి నుండి ఆమెకు కలుగుతున్న అన్యాయాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించి ఉండేవాడు. ఇటువంటి పరిస్థితుల్లో ఆర్థిక స్తోమత లేని పేదలు పరిస్థితులకు లోబడే జీవిస్తారు. వాళ్లు తల్లులు, తండ్రులు, చెల్లెలు, అన్నదమ్ములు అవకుండా మిగిలిపోతుంటారు. ఈ జీవన పోరాటంలో ప్రతికూల పాత్రలుగా మిగిలిపోతుంటారు. తత్ఫలితంగా సమాజంలో ఆరోగ్యవంతులుగా ఉన్న వారికి కూడా ఇబ్బందికరంగా

మారుతుంటారు. ఇటువంటి వారికి మద్దతు ఇవ్వాల్సిన పరిస్థితి రావటంతో వారు కూడా ఈ రోగిస్టులను అసహ్యించుకుంటుంటారు. అక్కడే ఆ చివరి క్షణాల్లోనే రేపే తమకు తుది గడువు అనుకునే వారికి సంబంధించి జీవితాలు అంతులేని శోకసముద్రాలుగా మిగిలిపోతుంటాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కార్మికుల జీవితాల్లాగానే. ఆ చనిపోయే కళ్లల్లోనే తమను క్షమించమన్న వేడ్కోలు కనిపిస్తుంది. అంతే కాదు. ఏదో ఒక చిన్న సహాయంతో ఆదుకొమ్మన్న పిలుపు కూడా వినిపిస్తోంది. ఆ పిలుపు మరికొద్ది కాలానికి వారి శరీరంలాగే అనంత వాయువుల్లో లీనమౌతోంది. అసందర్భపు కులం ప్రాతిపదికన ఏర్పడిన ఈ ప్రపంచం ఎంతకాలం తన మనుగడ సాగిస్తుంది అన్న ప్రశ్నకు సమాధానం చెప్పటానికి నావద్ద సాధనాలేమీ లేవు. కానీ పాలిస్తున్న వారు తాము కూడబెట్టుకున్న ఆస్తిపాస్తుల గురించి చెప్పుకోవటం మానేసి అంతకంతకూ ఎక్కువ ధనాన్ని సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చిస్తారో అటువంటప్పుడు మాత్రమే ఇటువంటి ప్రశ్నలన్నింటినీ కొంతమేరకైనా సమాధానం దొరుకుతుంది.

అక్కడ రోగిష్టిగా పడి ఉన్న ఈ మహిళకు నేనే ఏమీ చేయలేకపోతున్నాను. నాకున్నంతలో ఆమె మంచి ఆహారం తీసుకొమ్మని సలహా ఇచ్చి కొన్ని మందులు రాసి ఇచ్చాను. నా వద్ద కొన్ని డ్రమామిన్ బిళ్లలు మిగిలి ఉంటే వాటిని ఆమెకిచ్చాను. అక్కడి నుండి బయటకు వచ్చిన తర్వాత ఆ ముసలావిడ కుటుంబం ఆమె పట్ల ప్రదర్శిస్తున్న అశ్రద్ధ గురించి ఆమె చెప్పిన మాటలు చెవుల్లో గింగిర్లు కొడుతూనే ఉన్నాయి.

మొత్తం మీద అల్బెర్టో ఒక వైద్యుడిని పట్టుకున్నాడు. మరునాడు ఉదయం తొమ్మిది గంటలకు మేము ఇద్దరమూ అతని ఆసుపత్రి వద్ద హాజరుకావాల్సి ఉంది. అప్పటి వరకు మేము లా గియొకొండాలోనే కాలం గడుపుతున్నాము. మేమున్న ఆ చిన్న గది హోటల్‌కు అవసరమైన వంటగదిగాను, హోటల్‌గాను, బట్టలు ఇస్త్రీ చేసే స్థలంగాను, భోజనస్థలంగాను, కుక్కలు, పిల్లులు కాలకృత్యాలు తీర్చుకునే స్థలంగాను, లెక్కపెట్టలేనన్ని సమావేశాలకు వేదికగాను ఉంది. అంతే కాదు. అక్కడ మాతో పాటు ఈ హోటలు యజమాని, చెవిటివాడైనా సహాయం చేసే ఉద్దేశ్యం పుష్కలంగా ఉన్న డోనా కరోలినా, అతనితో పాటు పెద్దపెద్ద మీసాలు కలిగి చూడ్డానికి నేరస్తుడిలా ఉండే మపుచె ఒకరిద్దరు కస్టమర్లు, అక్కడ సమావేశాల్లో రాణి డోనా రోసిటా కూడా ఉన్నారు. మా చర్చ రోసిటా చూసిన ఊచకోత వైపు మళ్లింది. ఆమె దృష్టిలో ఒక మనిషి పొడవాటి కత్తితో పొరుగువాడి తల నరకటం చూసింది తానొక్కతే.

" మీ పొరుగువాడు అరిచాడా, డొనా రోసిటా?"

" అవును. అతను కేకలు వేస్తున్నాడు. ఆ పరిస్థితుల్లో ఎవరు మాత్రం అరవకుండా ఉంటారు? అతను ఆమె బతికుండగానే చర్మం వలుస్తున్నాడు. అంతే కాదు. ఆ తర్వాత ఆమెను సముద్రంలో విసిరేశాడు. అబ్బ... ఆమె అరుపులు వింటే నాకు కళ్లు బైర్లు కమ్మాయి. ఆ సంఘటన మీరు చూసిఉండాల్సింది.."

"నువ్వు పోలీసులకు ఎందుకు చెప్పలేదు?"

" ఓహ్, ఎందుకు ? మీ బంధువుని కొట్టినప్పటి సంగతి గుర్తుందా నీకు? మంచిదే. నేను ఫిర్యాదు చేయటానికి వెళ్లాను. నీకేమైనా పిచ్చా అని అడిగారు. ఇటువంటి సంఘటనలు చూడటం మానకుంటే నన్నే జైల్లో పెట్టేవాళ్లే. ఇకపై అటువంటి సంఘటనల గురించి ఎప్పుడూ నోరువిప్పను."

ఆ చర్చ భగవంతుని దూతవైపు మళ్లింది. స్థానికంగా ఒక వ్యక్తి తనకు దేవుడు ఇచ్చిన శక్తి సామర్థ్యాలను మూగతనం, చెవిటితనం,పక్షవాతం వంటి వ్యాధులు నయం చేయటానికి ఉపయోగిస్తుంటాడు.ఆ తర్వాత చందాలు అడుగుతూ అందరిదగ్గరకు వస్తాడు. ఈ వ్యాపారం మిగిలిన వాటికంటే ఏమంత దరిద్రపు వ్యాపారం కాదు. అతను పంచే కరపత్రాలు విశేషంగా ఉన్నప్పటికీ అది నమ్మటం ప్రజల అమాయకత్వమే. కానీ అదే జరుగుతోంది. అలాగే జరుగుతోంది. డోనా రోసిటా చూసిన ఇటువంటి అంశాల పట్ల నవ్వుకోవటం మొదలెట్టారు.

వైద్యులు మాకు స్వాగతం పలికిన తీరు అతిగా ఏమీ లేదు. కానీ మా లక్ష్యం మాత్రం చేరుకున్నాము. వల్పరాసియో మేయరు మోలినాస్ లుకోకు మమ్ములను పరిచయం చేస్తూ ఒక లేఖ ఇచ్చారు. అన్ని పద్ధతులూ పాటించాక అక్కడ నుండి మేము శెలవు తీసుకున్నాము. అక్కడ నుండి టౌన్ హాలుకు వెళ్లాము. అక్కడ కూర్చున్న వ్యక్తికి మా ముఖాలు చూస్తే నమ్మబుద్ధి వేస్తున్నట్లు లేదు. అయితే మమ్ములను లోపలికి పంపాలని అతనికి ఆదేశాలు వచ్చాయి.

మా లేఖకు స్పందనగా వారు రాసిన ఒక లేఖ ప్రతిని అక్కడి కార్యదర్శి మాకు చూపించాడు. ఈస్టర్ దీవులకు వెళ్లే పడవ అప్పటికే వెళ్లిపోయిందని, ఆ సంవత్సరంలో మరో పడవ అక్కడకు వెళ్లటం లేదని అందువల్ల మేము తలపెట్టిన కార్యక్రమం సాధ్యం కాదన్నది ఆ లేఖ సారాంశం. అక్కడి నుండి మమ్ములను డాక్టర్ మోలినాస్ లుకో

కార్యాలయానికి పంపారు. లూకో కార్యాలయంలో మమ్ములను సాదరంగానే ఆహ్వానించారు. ఏదో నాటకం రిహార్సల్స్ చేస్తున్నట్లు ఈ లేఖలో ఉన్న ప్రతి పదాన్ని ఒత్తి పలుకుతూ చదివాడు అతను. ఈస్టర్ దీవుల గురించి మాట్లాడేటప్పుడు మాత్రమే అతనిలో ఉత్సాహం కనిపించింది. ఈస్టర్ దీవులు చిలీకి చెందినవే అని రుజువు చేసుకోవటం ద్వారా ఇంగ్లీషు వారి ఆధిపత్యం నుండి దీవులను స్వాధీనం చేసుకున్నాడు. పరిణామాలు గమనిస్తూ ఉండాలని అతను మాకు సలహా ఇచ్చాడు. వచ్చే సంవత్సరం తప్పకుండా మమ్ములను తీసుకెళ్తానని హామీ ఇచ్చాడు. "అప్పటికి నేను ఇదే కార్యాలయంలో ఉండకపోవచ్చు. కానీ ఈస్టర్ దీవి మిత్రుల సంఘానికి మాత్రం నేనే అధ్యక్షునిగా ఉంటాను" అంటూ గౌంజాలెంజ్ విడెలా వచ్చే ఎన్నికల్లో ఓడిపోవటం ఖాయం అన్న విషయాన్ని చెప్పకనే చెప్పాడు. అక్కడి నుండి మేము బయటకు వచ్చేటప్పుడు మా కుక్కను తీసుకెళ్లాలని ద్వారంలో ఉన్న వ్యక్తి సూచించాడు. దీంతో మాకు ఆశ్చర్యం వేసింది. దానికి తగ్గట్లుగానే అక్కడ ఉచ్చపోసి కుర్చీని కొరకటానికి ప్రయత్నిస్తున్న కుక్క పిల్లను చూపించాడు. బహుశా ఈ కుక్క మా ఆకారాలు చూసి ముచ్చపడి వెంటవచ్చి ఉంటుంది. ఇది చూసిన ద్వారపాలకుడు మా లాయలాసంలో ఇదొక భాగం అని భావించి ఉండవచ్చు. ఏదేమైనా ఈ కుక్క పిల్ల నాక్కుంటూ మా దగ్గరికి వచ్చింది. అదోలా చూసి ఒక్కసారిగా అరుచుకుంటూ పక్కకు వెళ్లింది. అయినప్పటికీ అది మాపై ఆధారపడి జీవిస్తున్న ప్రాణి అన్న విషయాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నాలు సాగిస్తూనే ఉంది.

అప్పటికి సముద్ర ప్రయాణం చేయటం ద్వారానే ఉత్తర చిలీ ప్రాంతంలో ఉన్న ఎడారిని తప్పించుకోగలమన్న విషయంలో ఒక స్పష్టమైన అభిప్రాయానికి వచ్చాము. దీంతో ఓడరేవులోని షిప్పింగ్ కంపెనీల వెంట తిరుగుతూ మమ్ములను ఏదోవిధంగా ఉత్తరాదిన ఉన్న రేవుపట్టణాలకు ఉచితంగా తీసుకెళ్లమని విజ్ఞప్తి చేస్తూ వచ్చాము. అందులో ఒక కంపెనీ యజమాని మా ప్రయాణానికి సంబంధించి సముద్రయాన సంస్థ అధికారుల నుండి అనుమతి తెచ్చుకునే పక్షంలో మమ్ములను తీసుకెళ్లటానికి సిద్ధమని అంగీకారం తెలిపాడు. అయితే సముద్రయాన సంస్థ నుండి ప్రతికూల స్పందన రావటంతో మా పరిస్థితి మొదటికొచ్చింది. ఆ లిప్తపాటు కాలంలో అల్బెర్టో ఒక చారిత్రక నిర్ణయం తీసుకున్నాడు. ఏదోలా ఒక పడవ ఎక్కి సాయంత్రం వరకు దాక్కోవటం అది. ఈ పని చేసేందుకు మేము ఆ రోజు సాయంత్రం వరకు వేచి ఉండాల్సి వచ్చింది. మా సామాను సేకరించుకుని ఈ పథకాన్ని అమలు చేయటానికి ఎదురు చూస్తూ ఉన్నాము. అతి కష్టం మీద అప్పటి వరకు మాకు అనేక విధాలుగా సహాయం చేసిన పలువురు మిత్రుల వద్ద వీడ్కోలు తీసుకున్నాము. ఓడరేవు ప్రధాన ద్వారాలు దాటుకుంటూ సముద్రయానానికి సిద్ధమయ్యాము.



# స్టోఅవేస్

ఎటువంటి ఇబ్బందులు లేకుండా కస్టమ్స్ అధికారులను తప్పించుకున్నాము. ధైర్యంగా మా లక్ష్యం వైపు సాగిపోతున్నాము. ఆ ఓడరేవులో మేము తీవ్రమైన పని హడావుడిలో ఉన్న శాన్ ఆన్‌టోనియో ఓడను మా లక్ష్యంగా ఎంచుకున్నాము. అది చిన్న పడవ కావటంతో మిగిలిన పడవల్లాగా అది పూర్తిగా తీరానికి చేరలేదు. క్రేన్ల వరకు రావల్సిన అవసరం లేదు. దీంతో ఆ పడవకు, డాక్‌యార్డుకు మధ్య అనేకమీటర్ల దూరంలో ఉంది. దీంతో మేము అక్కడకు చేరే వరకు వేచి ఉండక తప్పటం లేదు. ఈ విలువైన సమయం కోసం ఎదురు చూస్తున్న మేము మా సామాను పైన కూర్చుని వేదాంత ధోరణిలో చూస్తూ ఉన్నాము. అర్థరాత్రి డ్యూటీలు మారే సమయంలో ఓడ తీరానికి వచ్చింది. హార్బర్ మాస్టర్ తన ఉడుకుమోతుతనం చూపించాడు. వలసపోతున్న కార్మికులనందరినీ తనిఖీ చేసే నిమిత్తం ఆయన పడవల వద్దకు వచ్చాడు. ఈలోగా మాతో స్నేహం కుదిరిన క్రేన్ డ్రైవరు ఈ యజమాని దుర్మార్గుడని, మేము మరో అదునుకోసం ఎదురుచూడాల్సిందిగా సలహా ఇచ్చాడు. దాంతో ఆ విధంగా ఎదురుచూస్తూ మేము ఆ రోజు రాత్రంగా చలికి మా ఒళ్లు క్రేన్‌లో దాచుకుంటూ అక్కడే గడిపాము. అది ఆవిరితో నడిచే ఒక పురాతన కంపెనీకి చెందిన క్రేన్. మరునాడు ఆకాశంలోకి వచ్చిన సూర్యుడు కూడా ఎదురుచూస్తున్న మమ్ములను పలకరించాడు. చీకట్లో ఏదో ఒక పడవ ఎక్కాలన్న మా ప్రయత్నాలు విఫలమయ్యే దశకు చేరుకున్నాయనిపిస్తోంది. శాన్ ఆంటోనియా కెప్టెన్ పడవకు నూతన సాధనాలు అమర్చటం వల్ల ప్రస్తుతం ఈ పడవ నేరుగా ఒడ్డుకు చేరనుంది. క్రేన్ డ్రైవరు సలహా మేరకు జాగ్రత్తగా మేము కిందకు దిగి ఒక ఇంట్లోకి చేరాము. మా లగేజితో సహా అధికారుల నివాసాల్లోని ఒక స్నానపుగదిలో జొరబడ్డాము. ఆ తర్వాత "లోపలికి రాకూడదు, మేమున్నాము" అన్న మాటలతో కొంతసేపు అక్కడే గడిపాము. ఆ విధంగా ఎవరైనా తలుపు తెరవటానికి ప్రయత్నించినప్పుడల్లా ఇలా చేయడమే సరిపోతుంది.

సమయం త్వరగా గడిచిపోతుంది. అప్పుడే మధ్యాహ్నం 12 గంటలైంది. పడవ ప్రయాణం మొదలెట్టింది. అయితే మా సంతోషం అట్టే ఎక్కువ సేపు నిలవలేదు. చాలాసేపు టాయిలెట్ తలుపులు మూసి ఉండటం వల్ల కొద్దిసేపటికే భరించలేని కంపు మొదలైంది. దానికి ఉక్కపోత కూడా తోడైంది. మధ్యాహ్నం ఒంటిగంటకల్లా అల్బెర్టో అప్పటి వరకు కడుపులో ఉన్నది వాంతిచేసుకున్నాడు. సాయంత్రం ఐదుగంటలకల్లా ఆకలితో మాడిపోతున్న మేము వేరేదారిలేక దొంగదారిన ప్రయాణం చేయటానికి వచ్చామంటూ పడవ కెప్టెన్ దగ్గరకు వెళ్లాము. మమ్మల్ని ఆ పరిస్థితుల్లో అక్కడ చూసి ఆశ్చర్యపోవటం ఆయన వంతైంది. తన ఆశ్చర్యాన్ని ఇతర అధికారుల ముందు కప్పిపుచ్చుకోవటానికి మావంక గుర్రుగా చూస్తూ "ఏదోలా ప్రయాణించటం అంటే కనిపించిన పడవనెక్కేయటమేనా? ఆ విధంగా చేయటం వల్ల తలెత్తే పర్యవసానాలు గురించి ఆలోచించారా?" అని కోపంగా కేకలు వేశాడు.

నిజానికి ఈ పర్యవసానాల గురించి మేము ఆలోచించను కూడా లేదు.

అక్కడ పని చేసే వాడిని పిలిచి మాకు కూడా పని అప్పగించమని ఆదేశించాడు. ముందుగా ఏదో ఒకటి తినటానికి పెట్టమని కూడా చెప్పాడు. అతను ఇచ్చిన కొద్దిపాటి తిండిని జాగ్రత్తగా ఆరగించాము. తిన్న తర్వాత మేము దాక్కున్న టాయిలెట్‌ను నేను శుభ్రం చేయాల్సి ఉందన్నారు. తిన్నదంతా తిరిగి గొంతులోకి వచ్చినట్లయ్యింది. ఇక నోరుమూసుకుని కిందకు వెళ్లాను. నా వెంటనే అల్బెర్టో కూడా అడుగులు వేస్తూ వచ్చాడు. బంగాళాదుంపలకు చెక్కు తీయటం అతని డ్యూటీ. చెప్పకపోవటం ఎందుకు. స్నేహధర్మాన్ని మర్చిపోయి మా ఉద్యోగాలు మార్చుకుందామా అని ప్రాధేయపడ్డాను కూడా. అక్కడ న్యాయమన్నదే లేదు. తన పని ప్రారంభించటానికి ముందు అల్బెర్టో అప్పటివరకు బిగబట్టి ఉంచుకున్నదంతా లావెట్రీలో వదిలాడు. దాంతో అది కూడా నేనే శుభ్రం చేయాల్సి వచ్చింది.

నిరంతరాయమైన శ్రమతో ఇచ్చిన పని పూర్తి చేసిన తర్వాత కెప్టెన్ తిరిగి మమ్మలను పిలిపించుకున్నాడు. మేము అతనితో గతంలోనే పరిచయం ఉన్నట్లు, మాట్లాడుకున్నట్లు మేము చెప్పవద్దన్నాడు. అదేవిధంగా పడవ తన గమ్యస్థానం అనటోఫాగస్టా చేరుకున్నప్పుడు తాను కూడా మాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తానని హామీ ఇచ్చాడు. శెలవు మీద వెళ్లిన ఒక అధికారి క్యాబిన్‌లో మాకు విశ్రాంతి

తీసుకునేందుకు అవకాశం కల్పించాడు. ఆరోజు రాత్రి అతనితో పాటు కనాస్టా ఆడటానికి, విందుకు కూడా ఆహ్వానించాడు. కరువుతీరా నిద్రపోయి లేచిన మేము మరింత నిబద్ధతతో పని చేయటం ప్రారంభించాము. తద్వారా మా ప్రయాణానికి అయ్యే ఖర్చును వడ్డీతో సహా రాబట్టుకునేందుకు ప్రయత్నించాము. మధ్యాహ్నానికి మేము అవసరానికి మించి పని చేస్తున్నామా అన్న సందేహం వచ్చింది. అక్కడున్న వారిలో మేమే నిబద్ధత కలిగిన వారిమన్న నమ్మకం కుదిరాక తిరిగి పని ప్రారంభించాము. ఆ తర్వాత ఇక నిద్రపోతే బాగుంటుందేమో అన్న అభిప్రాయం వచ్చింది. దాంతో మరునాడు పనికి సిద్ధమవుతామని చెప్తూ మా బట్టలు కూడా ఉతుక్కోవాల్సి ఉందన్న విషయాన్ని చెప్పకుండానే బయలుదేరటానికి సిద్ధమయ్యాము. అయితే ఇంతలో పేకాట ఆడదాం రమ్మని కెప్టెన్ ఆహ్వానించటంతో మా పథకాలన్నీ బెడిసి కొట్టాయి.

అక్కడ అంత స్నేహపూర్వకంగా లేని స్టీవార్డ్ ఒకడు మాతో మరో గంట పని చేయించాడు. అక్కడున్న డెక్‌లు కిరసనాయిలుతో శుభ్రం చేయటం నా పని. రోజంతా చేసినా అది పూర్తి కాలేదు. అల్బెర్టో తిరిగి వంటగదిలోకి వెళ్లాడు. అక్కడ అతనికి తిన్నంత తిండి దొరికింది. దాంతో కడుపులోకి ఏది వెళ్తుంది అన్నది కూడా చూసుకోకుండా తిన్నాడు.

ఆ రోజు రాత్రి అలసిపోయే వరకు కనాసాటా ఆడాము. డెక్ మీద నుండి విశాలంగా కనిపిస్తున్న సముద్రాన్ని చూస్తూ గడిపాము. మధ్యమధ్యలో తెల్ల మేఘాలు, పచ్చని నీళ్లు చూస్తూ ముందుకు సాగాము. ఇద్దరమూ రెయిలింగ్స్‌కు ఆనుకుని నిల్చున్నా మా ఇద్దరి ఊహలు సప్తలోకాల్లో విహరిస్తున్నాయి. అక్కడే మా శేష జీవితమంతా సంచరింటమే ప్రధాన వృత్తి అన్న విషయాన్ని గుర్తించాము. మా కళ్ల ముందుకు వచ్చే ప్రతిదాన్నీ లోతుగా పరిశీలించాలన్న ఆసక్తితో మేము వచ్చే ప్రతి మలుపునూ ఆసక్తిగా చూస్తున్నాము. కానీ దురదృష్టవశాత్తూ ఏ అంశాన్ని సంపూర్ణంగా మూలాలకంటా తెలుసుకోలేకపోయాము. సముద్రగర్భంలో దాగి ఉన్న అంశాలను గమనించటానికి చాలాసేపు వేచి ఉండాల్సి వచ్చింది. భావోద్వేగాలు రేకెత్తించే ఇతర అన్ని అంశాల్లాగానే సముద్ర యానం కూడా మా చర్చలో చోటు చేసుకుంది. కనుచూపు మేరలో అన్‌టోఫాగస్టా దీవిలో వెలుగుతున్న లైట్లు కాంతిని వెదజల్లుతున్నాయి. అంటే పడవ వల్పరాయిసోకు చేరేందుకు సిద్ధమవుతుండటంతో మా సముద్రయానానికి ముగింపు పలకబోతున్నామన్నమాట.

# ఈసారి... ఘోరం

ఇప్పుడు కెప్టెన్‌ను జాగ్రత్తగా గమనిస్తున్నాను. ఇతర తోటి అధికారుల్లాగానే అతను కూడా పూటుగా తాగాడు. ఆయన పక్కనే అంతగానే తాగిన పడవ యజమాని భారీ మీసాలతో నిల్చున్నాడు. కల్తీ వైన్ తాగటం వల్లనేమో వారి చేష్టలు వికారంగా మారుతున్నాయి. మా ప్రయాణాలు గురించి వాళ్లు పెద్దపెట్టున నవ్వుకుంటూ చెప్పుకుంటున్నారు."చూడండి, ఇక్కడ పులులున్నాయి. ఈ పులులు ఇప్పుడు మీ పడవమీదనే ఉన్నాయి. ఖచ్చితంగా. సముద్రం నుండి బయటపడిన తర్వాత మీరు వాటిని చూడగలుగుతారు" అంటూ మమ్ములను చూస్తూ సంభాషణ సాగుతోంది. బహుశా కెప్టెన్ మా గురించి ఎక్కడో నోరుజారి ఉండవచ్చు.

అయితే మాకు ఈ విషయాలేవీ తెలియదు. మరో గంటలో పడవ ప్రయాణం మొదలవుతుందనగా మా పరిస్థితి నిక్షేపంగా మారింది. మా చుట్టూ పుచ్చకాయల వాసన గుప్పుమంటోంది. పడవ నడిపే వారి గురించి మాట్లాడుకుంటున్నాము. వాళ్లు చాలా ఉత్తములు. ఎందుకంటే అందులో ఒకరు చూసీచూడనట్లు వ్యవహరించటంతోటే మేము నిక్షేపంగా పడవనెక్కి ఇప్పుడు క్షేమంగా ఉన్నాము. అంతలో ఎక్కడనుండో ఒక గొంతు పీలగా అరుస్తున్నట్లు వినిపించింది. అంతలో ఏది ఎక్కడుందో స్పష్టంగా తెలిసిన ఒక వ్యక్తి కనిపించాడు. అతనివి మెలితిరిగిన మీసాలు. మా పరిస్థితి గందరగోళంగా మారింది. జాగ్రత్తగా వలిచి పారేసిన పుచ్చకాయల తొక్కలు పొడవుగా సముద్రపు నీళ్లమీద తేలియాడుతున్నాయి. ఆ తర్వాత సరంగు మాతో మాట్లాడుతూ "ఈ వాసన మీ దగ్గరే అని ముందుగానే పసిగట్టి ఉండొచ్చు. కానీ ఇంతలో నీళ్లమీద పుచ్చకాయల ముక్కలు కనిపించటంతో అందరినీ నిలబెట్టి హడావుడి చేస్తున్నాడు. మీరు మరీ అంత ఎక్కువగా తిని ఉండాల్సింది కాదు" అన్నాడు.

మాతో పాటు శాన్ ఆన్టోనియోలో ప్రయాణిస్తున్న ఒక మిత్రుడు తన జీవన తత్వాన్ని ఒక్క వాక్యంలో అద్భుతంగా ఇలా చెప్పాడు. "దొంగదారులు వెతకటం ఆపండి.

ఏవో తిప్పలు పడి దొంగదారులు వెతక్కపోతే ఉన్న దారిలోనే ఇంటికి పోవచ్చు కదా', అతని తత్వం. దాంతో మేము మా సామాను చేతికి తీసుకుని చుకికామాటాకు బయలుదేరాము. అది రాగి గనులకు ప్రసిద్ధి చెందిన ప్రాంతం.

అయితే అక్కడికి మేము నేరుగా వెళ్లలేదు. మధ్యలో ఒక రోజు ఆగాము. గని నిర్వహణ అధికారుల నుండి అనుమతి రాక ఆగాల్సి వచ్చింది. ఈలోగా బచ్చానలియాన్ సరంగుల నుండి మాకు అద్భుతమైన వీడ్కోలు దొరికింది.

రాగిగనులకు వెళ్లే మెట్ట భూముల్లోని రెండు కరెంటు స్థంభాల నీడలో ఒక రోజు గడిపాము. ఒకరి మీద ఒకరం సామాను విసురుకుంటూ ఒక్కో స్థంభం దాటుకుంటూ గడిపాము. ఇంతలో దారిన పోతున్న ఒక ట్రక్కు మమ్ములను బాక్వెడానో మార్గం మధ్యకు చేర్చి వదిలేసింది.

అక్కడ మేము ఇద్దరు దంపతులను కలుసుకున్నాము. వారితో స్నేహం చేశాము. వారు చిలీ కార్మికులు. కమ్యూనిస్టులు. 1948–58 మధ్య ప్రజాస్వామ్య పరిరక్షణ చట్టం కింద చిలీ కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించారు. అనేకమంది నాయకులను ఊచకోత కోశారు కూడా.

అక్కడ గుడ్డిదీపం వెలుగులోనే మేము తేనీరు సేవించాము. వెన్న కలిపిన బ్రెడ్ ముక్కలు కూడా తిన్నాము. అక్కడున్న వ్యక్తి బక్కచిక్కిన ఆకారంతో పాటే ఏదో ఒక తెలియని గాలి మమ్ములను తాకింది. స్పష్టమైన సులభమైన భాషలో ఆయన తన మూడునెలల జైలు జీవితానుభవాలు వివరించాడు. ఆ తరుణంలో ఆకలికి మాడుతున్నా అతని భార్య, పిల్లలు అతన్నే అంటిపెట్టుకుని ఉన్న విషయాన్ని కూడా వివరించాడు. ఈ నిర్భంధ కాలంలో పిల్లలను పొరుగునున్న ఒక దయామయుడి పర్యవేక్షణలో వదిలిపెట్టారు. పని కోసం ఆయన తిరిగిన తిరుగుళ్లు, ఉన్నట్లుండి మాయమైన అతని సహచరుల గురించి మాకు వినిపించాడు. ఆ విధంగా మాయమైనవాళ్లంతా సముద్రగర్భంలో ఎక్కడో ఉంటారన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు.

ఈ దంపతులు చలికి వణికిపోతున్నారు. మాట కూడా వణుకుతోంది. చలిని తట్టుకోవటానికి ఒకరినొకరు గట్టిగా పట్టుకుని కూర్చున్న ఆ దంపతులు ప్రపంచంలో అదే స్థితిలో ఉన్న నికార్సయిన కార్మికవర్గాన్ని ప్రతిబింబిస్తున్నారు. తమను తాము కప్పుకోవటానికి వారి వద్ద ఒక్క చింకి దుప్పటి కూడా లేదు. అందుకే మా దగ్గరున్న దుప్పట్లలో ఒకటి వారికి ఇచ్చాము. రెండోదాంట్లో నేను, అల్బెర్టో లుంగచుట్టుకుని

కూర్చున్నాము. అది నా జీవితంలో నేను అనుభవించిన అతి చల్లని రాత్రుల్లో అదొకటి. అదే సమయంలో ఈ వింత జీవుల పట్ల సోదరభావాన్ని ప్రదర్శించిన రాత్రి కూడా అదే.

మరునాడు ఉదయం ఎనిమిది గంటల సమయంలో చుకికామాటాకు మమ్ములను తీసుకెళ్లగల ఒక వాహనాన్ని పట్టుకున్నాము. అక్కడి నుండి గంధకపు గనుల వైపు వెళ్తున్న ఆ దంపతుల నుండి వీడ్కోలు తీసుకున్నాము. అక్కడి వాతావరణం, పరిస్థితులు చాలా ఘోరంగా ఉంటాయి. అక్కడి పర్వత ప్రాంతం వెళ్లి పని చేయటానికి ప్రత్యేక అనుమతులు అవసరం లేదు. అక్కడి వారంతా మనం అనుసరించే రాజకీయాలు ఏమిటన్న విషయంపైనే శ్రద్ధ చూపిస్తారు. అతను జీవనం గడుపుకోవటానికి అవసరమైన నాలుగు రూకలు సంపాదించుకోవటానికి అతని ఆరోగ్యాన్ని సైతం ఫణంగా పెట్టటానికి సిద్ధమవుతున్న ఆ కార్మికుడిని చూస్తే జాలేస్తుంది.

మా మధ్య పెరుగుతున్న దూరంతో పాటే దూరమవుతున్న ఆ దంపతులు కూడా కనిపించకుండా పోయారు. అయినా కృతనిశ్చయం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న అతని ముఖం మాత్రం మా కళ్ల ముందు ఇంకా కదలాడుతూనే ఉంది. “రండి కామ్రేడ్స్, నేనూ ప్రయాణీకుడినే, మనం కలిసే తిందాం రండి” అంటూ అతను నిస్సంకోచంగా ఆహ్వానించటం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఈ ఆహ్వానంతో పాటే మా గమ్యం లేని ప్రయాణంలో అతను పరాన్నభుక్కుల స్వభావాన్ని గమనించిన విషయం కూడా స్పష్టంగానే తెలిసిపోతుంది.

దురదృష్టమేమిటంటే వారు (పాలకులు) ప్రజలను ఆ విధంగా అణచివేస్తున్నారు. సమిష్టితత్వంతో పాటు కమ్యూనిస్టు స్వభావమే అక్కడ జీవితానికి ఎదురయ్యే ప్రమాదం. అక్కడి ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలు గమనిస్తే కమ్యూనిస్టు భావాల వ్యాప్తి అసహజమేమీ కాదు. ఆకలితో అలమటిస్తున్న ప్రజలు దానికి నిరసనగా ఈ నూతన సిద్ధాంతాన్ని పూర్తిగా అవగతం చేసుకోలేకపోయినా ఆలింగనం చేసుకోవటం కూడా కొత్తకాదు. కమ్యూనిస్టు సిద్ధాంతం సారాంశంగా పేదలకు తిండి అన్నంతవరకు అతను అర్థం చేసుకోగలడు. దానిపై ఆశతోనే అతను సిద్ధాంతాన్ని నమ్ముతాడు.

అక్కడ (ఆ గనుల్లో) యజమానులు, అధికారులు, మేనేజర్లు వచ్చీరాని స్పెయిన్ భాషలో మాతో మాట్లాడుతూ “ ఇదేమీ పర్యాటక స్థలం, పట్టణం కాదు కదా. ఇక్కడ గని గురించి మీకు వివరించి అరగంటలో తిప్పుకురావటానికి ఎవరినైనా సహాయం పంపుతాము. ఆ తర్వాత మాకు ఒక సహాయం చేయండి. మమ్ములను మాత్రం

వదిలిపెట్టండి. మాకు చాలా పని ఉంది" అంటూ తప్పుకున్నారు. ఆ విధంగా వారందరూ సమ్మె చేశారు. అయినా ఈ సహాయకుడు అమెరికన్లకు నమ్మిన బంటు, "ఈ పనికి మాలిన వాళ్ళ సమ్మె వల్ల రోజుకు వేలాది పెసోలు నష్టపోవటానికైనా సిద్ధమవుతున్నారు కానీ పేదవాడికి నాలుగు రూకలు జీతం పెంచటానికి మాత్రం తయారు కావటం లేదు. మా జనరల్ ఇబ్నెజ్ అధికారానికి వస్తే ఈ సమస్యలన్నీ తీరిపోతాయి" అని నిట్టూర్పు విడిచాడు. ఒక ఫోర్‌మెన్ పని చేస్తున్న కవి " ఇక్కడ ప్రతి అంగుళం రాగిని తవ్వి తీస్తాము. మీలాగానే అనేక మంది అనేక సాంకేతిక ప్రశ్నలు వేశారు. కానీ ఇక్కడ ఎంత మంది ప్రాణాలు పోయాయని అడిగిన వారు మాత్రం అరుదు. వైద్యులారా ఈ ప్రశ్నకు నేను సమాధానం ఇవ్వగలను. కానీ అడిగినందుకు కృతజ్ఞతలు" అన్నాడు.

ఈ భారీ గనిలో చలి తీవ్రత, చలి నుండి శరీరాలు కాపాడుకోలేని కార్మికుల అశక్తత కలిసిమెలిసి సాగుతున్నాయి. పరిస్థితుల మీద ద్వేషం ఉన్నప్పటికీ అవే వారందరూ కలిసి జీవించాల్సిన అవసరాన్ని సృష్టిస్తున్నాయి. మరోవైపున ఏదో ఒక రోజున ఈ గనిలో కార్మికుడు సంతోషంతో నిండిపోయే రోజులు చూడలేమా అన్న ఆశ కూడా కలిగించాయి. అప్పటికి అక్కడున్న పరిస్థితి ఇదేనని వారు తెలిపారు. అక్కడ నుండే వెలుగుతున్న ఎర్రని మంటలు ప్రపంచానికి వెలుగునిస్తున్నాయని వాళ్లు చెప్తున్నారు. నాకు మాత్రం తెలియదు.



# చుకికమాటా

చుకికమాటా ఆధునిక నాటకంలో ఒక దృశ్యంలా, అంకంలా ఉంది. అందులో సౌందర్యం లేదని చెప్పలేము. కానీ అందులో సౌందర్యం ఉంది. గొప్పదనం లేదు. ఆకట్టుకునే విధంగా ఉంది. ఆ గనిలో మీరు ఏ మూలకు వచ్చినా మొత్తం ఆ ప్రాంతమంతా ఉగ్గబట్టి ఉందనిపిస్తోంది. అక్కడకు రెండు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న

పట్టణం కలామా పట్టణం వస్తోంది. అద్భుతమైన బూడిదరంగు గుట్ట అది. నిజంగా అది ఎడారిలో ఒయాసిస్సులాగా ఉంది. ఎంతటి ఎడారి...చుకికి సమీపంలో ఉన్న మెక్సెజుమాలో ఉన్న వాతావరణ కేంద్రం ఈ ఎడారిని ప్రపంచపు ఎడారిగా వర్ణిస్తోంది. నత్రజనితో నిండిన ఈ పర్వతాలపై మచ్చుకు ఒక్క గడ్డిపోచ కూడా మొలకెత్తదు. అందుకే అంతటి పర్వతాలు సైతం గాలి, వానకు రక్షణ లేకుండా, ఆఛ్ఛాదన లేకుండా ఉండిపోయాయి. ఈ ప్రాంతపు భౌగోళిక వయస్సుకు, ఆ పర్వతాల ముసలితనానికి మధ్య సంబంధం లేదు. అటువంటి ఎన్ని పర్వతాలు తమ సోదరులతో కలిసి ఇంతటి సంపన్నతను గర్భంలో దాచుకున్నాయో తెలియదుకానీ అదంతా బయటికి తీయటానికి సాయుధులైన కార్మికులు, ప్రాణం లేని ఆయుధాలు అవసరం అవుతున్నాయి. ఈ పనిలో మునిగి ఉన్న మానవ కళేబరాలతో ఈ ఎడారి మరింత రుచికరంగా మారింది. ఈ పేదలే ఈ పోరాటంలో గుర్తింపు నోచుకోని కథానాయకులు. రోజువారీ జీవితం వెళ్లదీయటానికి అవసరమైన నాలుగు రూకల సంపాదన కోసం పనిచేసే వీళ్లే ప్రకృతి తన సంపద కాపాడుకోవటానికి సృష్టించిన వేలాది సమస్యల్లో ఏదో ఒక సమస్యతో చనిపోతుంటారు.

చుకికామాటా అత్యంత విశాలమైన రాగి గని. అక్కడ ఇరువైపులా లోతుగా పదునుగా చెక్కబడిన 20 మీటర్ల ఎత్తయిన అంతస్తులు ఉంటాయి. ఈ అంతస్తుల నుండే ఖనిజాన్ని బయటకు తీసి రైల్లో తరలిస్తారు. ఈ ప్రాంత నిర్మాణాన్ని బట్టి కొన్ని చోట్ల ఉన్న పళంగా కొద్ది శ్రమతో ఖనిజం వెలుపలికి వస్తే మరికొన్ని చోట్ల బాంబులు, డైనమైట్లు ప్రయోగించాల్సి వస్తుంది. ఇందులో టన్ను ఖనిజాన్ని బయటకు తీస్తే అందులో ఒక శాతం రాగి ఉంటుంది. ప్రతి రోజు ఉదయం డైనమైట్లు పేలతాయి. ఆ తర్వాత పెద్ద పెద్ద పారలతో ఖనిజాన్ని రైలు వాగన్లకు ఎత్తుతారు. అక్కడి నుండి రైలు పెట్టెలు గానుగ దగ్గరకు వెళ్తాయి. అక్కడ ఖనిజాన్ని గానుగ ఆడించి చూర్ణం చేస్తారు. ఈ గానుగ ఆడించటం మూడు దశల్లో జరుగుతుంది. ఈ దశల్లో ముడిఖనిజం కాస్తంత మెరుగైన మరసగా మారుతుంది. దాంట్లో గంధక ద్రావణం కలుపుతారు. ఆ విధంగా ఈ చూర్ణంలో ఉన్న రాగినంతటినీ ఆ ద్రావణం సేకరిస్తుంది. ఆ విధంగా ఏర్పడిన కాపర్ క్లోరైడ్‌ను ఇనుప మిశ్రమంతో కలిపి ఫెర్రస్ క్లోరైడ్‌గా మారుస్తారు. అక్కడి నుండి గ్రీన్‌హౌస్ ప్రాంతానికి తీసుకెళ్లి ద్రావణంగా మారుస్తారు. ఆ విధంగా తయారైన ద్రావణాన్ని పెద్దపెద్ద తొట్లలో ఆరబెడతారు. దాన్లో గుండా విద్యుత్ ప్రవహింప చేసిన తర్వాత ఒక రకమైన ఉప్పు తెట్టు ఏర్పడుతుంది. ఆ విధంగా తయారైన ఖనిజం నుండి రాగి బెత్తాలు విడదీస్తారు. ఐదారు రోజుల తర్వాత ఈ బెత్తాలు, ప్లేట్లు మరో దఫా కరిగించటానికి

సిద్ధమవుతాయి. ఆ విధంగా కరిగించిన ద్రావణం లీటరుకు ఎనిమిది నుండి పది గ్రాముల చొప్పున నష్టపోతుంది. దానికి కొత్తగా మరికొన్ని ఖనిజాలు కలిసి ఆ బరువును పూడ్చుకుంటుంది. ఆ విధంగా తయారైన ప్లేట్లను 2000 డిగ్రీల సెంటీగ్రేడుతో 12 గంటల పాటు కొలిమిలో పెడతారు. తద్వారా 350 పౌండ్ల ఇగ్నోట్లు తయారవుతాయి. ఈ విధంగా తయారైన రాగిని ఒక్కో పెట్టెలో 20 టన్నుల వరకు ఎక్కించుకున్న 45 వాగన్ల రైలు అన్టోఫాగస్టాకు బయలు దేరుతుంది.

క్లుప్తంగా చెప్పాలంటే ఇదీ ముడి ఖనిజాన్ని శుద్ధి చేసి రాగిని వెలికి తీసే క్రమం. ఈ మొత్తం ప్రక్రియలో చుకికామాటా గనిలోనే దాదాపు 3000 మంది జీవులు పని చేస్తుంటారు. అయితే ఇప్పుడు వివరించింది ఆక్సైడ్ ఖనిజాన్ని వెలికితీసే క్రమం మాత్రమే. చిలీ గనుల తవ్వకం కంపెనీ గంధక గనులు తవ్వటానికి మరో కర్మాగారాన్ని నిర్మిస్తోంది. ప్రపంచంలోనే అతి పెద్దదైన ఈ ప్లాంటులో 96 మీటర్ల నిడివి కలిగిన రెండు పొయ్యిలుంటాయి. భవిష్యత్తులో అవసరమైన ఉత్పత్తినంతటినీ ఇదే అందించగలదు. ఆక్సైడ్ గని క్రమంగా కరిగిపోతూ ఉండటంతో పాత ప్లాంటును దశల వారీగా మూసి వేయనున్నారు. కొత్త కర్మాగారాన్ని నడపటానికి అవసరమైనంత ముడిసరుకు ఇప్పటికే సిద్ధంగా ఉంది. 1954లో కర్మాగారం ప్రారంభం కాగానే దాంట్లో శుద్ధి ప్రక్రియ మొదలవుతుంది.

మొత్తం ప్రపంచంలో ఉత్పత్తయ్యే రాగిలో 20 శాతం ఒక్క చిలీ దేశంలోనే ఉత్పత్తి అవుతుంది. ఎప్పుడు ఏ ఘర్షణ తలెత్తుతుందో తెలియని ఈ సందిగ్ధ సమయాల్లో రాగి ఉత్పత్తి ఈ ఘర్షణలకు ప్రధాన కేంద్రంగా మారుతోంది. ఎందుకంటే వివిధ విధ్వంసక ఆయుధాల తయారీలో ఇదే ప్రధాన సాధనంగా ఉంది. అందువల్లనే చిలీలో వామపక్షవాదులు, జాతీయవాదుల కూటమి నాయకత్వంలో ఒక సంఘటన ఈ గనులను,వనరులను జాతీయం చేయాలని డిమాండ్ చేస్తుంటే స్వేచ్ఛా వాణిజ్యవాదులు విదేశీ నిధులతో ఈ గనులు నిర్వహించాలని అప్పుడైతే గనులు సమర్ధవంతంగా పని చేస్తాయని, ప్రభుత్వం చేతుల్లో ఉంటే సమర్ధవంతంగా పని చేయలేవని వాదిస్తున్నారు. గనుల తవ్వకం కోసం ప్రభుత్వం ఇస్తున్న పలు రాయితీలను ఈ కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయన్న అంశంపై పార్లమెంట్‌లో వాడిగా వేడిగా చర్చలు సాగుతున్నాయి. ఈ చర్చలు రాగి గనులను జాతీయ సంపదగా పరిగణించాలని వాదించే వారి ఉద్దేశ్యాలను ప్రతిబింబించేవిగా ఉన్నాయి.

ఈ పోరాటంలో విజయం ఎవరిని వరించినా ఈ గనుల పరిసరాల్లో ఉన్న స్మశానం నేర్పుతున్న పాఠాన్ని మాత్రం మర్చిపోవటం మంచిది కాదు. గనుల తవ్వకంలో

ప్రాణాలు కోల్పోయిన వేలాదిమందిలో కొద్దిమంది శరీరాలకు మాత్రమే ఈ స్మశానంలో చోటు దొరికింది.



# మైళ్ల తరబడి బంజరు

ఇక ఇప్పుడు మా వెంట ఉన్న మంచినీళ్ల సీసా కూడా పోయింది. దీంతో ఇంత పెద్ద ఎడారిని కాలినడకన దాటటం మరింత కష్టంగా మారింది. అయినప్పటికీ ఎటువంటి సంకోచం లేకుండా చుకికామాటా నగర సరిహద్దులు దాటుకుంటూ మా ప్రయాణం సాగించాము. చుట్టుపక్కల జనావాసాలు ఉన్నంత వరకు అథ్లెట్‌ల వేగంతో నడిచిన మేము నగరం దాటిన తర్వాత ఎటుచూసినా నిర్మానుష్యంగా ఉన్న ఆండిస్ పర్వతాల తోడుతో ఎండ వేడికి మెడ మండుతుండగా మా వీపుల మీదున్న మూటలు ఎగుడుదిగుడుగా మారుతుంటే మేము తిరిగి వాస్తవంలోకి వచ్చాము. అప్పటి వరకు మేము హీరోల్లాగా నడుస్తున్నామని ఒక పోలీసు వ్యాఖ్యానించాడు. అది నిజమో కాదో తెలియదు కానీ మాది మూర్ఖపు ప్రయత్నమేమో అని సందేహం మొలకెత్తింది.

రెండు గంటలు నడిచాక మహా అయితే 10 కిలోమీటర్లు దూరం ముందుకు సాగి ఉంటాము. తర్వాత కొద్దిపాటి నీడని మాత్రమే ఇవ్వగల "నాకు ఏ ఆలోచనా లేదు" అన్న బోర్డు కింద సేదదీరాము. అక్కడ రోజంతా ఉన్నాము. చివరకు ఈ బోర్డు నీడ కళ్లవరకు వచ్చినా ఫర్వాలేదన్న విధంగా స్థలం మార్చి మార్చి మరీ కూర్చున్నాము.

మావెంట తెచ్చుకున్న లీటరు సీసాలోని నీటిని గడగడా తాగేశాము. అప్పటికి మధ్యాహ్నం దాటి కొంతసేపైంది. నోరు పిడచకట్టుకుపోతున్నది. ఆ స్థితిలో నగర సరిహద్దుల్లో ఉన్న పోలీసు పోస్టు వద్దకు మా సామాను మోసుకెళ్లేసరికి పూర్తిగా అలసిపోయాము.

ఆ చిన్న గదిలో తలదాచుకోవటానికి అనుమతి పొంది అక్కడే ఆ రాత్రి గడిపాము. బయట చలి తీవ్రంగా ఉన్నప్పటికీ గదిలోపల చలిమంట మండుతూండటంతో గది వెచ్చగా ఉంది. అక్కడ రాత్రిపూట కాపలా కాసే సెంట్రీ తనకోసం తెచ్చుకున్న భోజనంలో మాకూ వాటా ఇచ్చాడు. రోజంతా పస్తులు ఉన్న మాకు ఆ దరిద్రపుగొట్టు అన్నమే పరమాన్నమైంది. ఏమీ లేకపోవడం కంటే ఏదో ఒకటి ఉండటం మంచిదేకదా.

మరుసటిరోజు ఉదయాన్నే ఒక సిగరెట్ కంపెనీ ట్రక్కు ఒకటి అటుగుండా వెళ్తూ మమ్మలను కూడా తీసుకెళ్లింది. దీంతో మా గమ్యస్థానం దరిదాపులు చేరాము. అక్కడ నుండి టోకోపిల్లా ఓడరేవుకు వెళ్తూ మేము అక్కడ నుండి ఉత్తరానికి వెళ్లి ఇలావెనకు చేరుకోవాలని భావించాము. దీంతో సిగరెట్ కంపెనీ ట్రక్కు అక్కడికి సమీపంలో ఉన్న కూడలి వద్ద మమ్మలను వదిలిపెట్టి వెళ్లిపోయింది. మేము దిగిన చోట నుండి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న మాకు తెలిసిన ఒక ఇంటివద్దకు చేరుకునేందుకు ఉత్సాహంగా అడుగులు వేయటం ప్రారంభించాము. అయితే సగం దూరం వెళ్లేటప్పటికే బాగా అలసిపోయాము. కొద్దిసేపు విశ్రమించాలని నిర్ణయించుకున్నాము. అక్కడకు సమీపంలో ఉన్న ఒక టెలిఫోన్ స్థంభానికి దగ్గరలోనే ఉన్న మరో స్థంభానికి మధ్య మా దుప్పటి ఒకటి కట్టి ఆ నీడలో టర్కీవాసుల తరహాలో శరీరం నీడలో, కాళ్లు ఎండలో ఉంచి నిద్రపోయాము.

రెండు మూడు గంటల తర్వాత – ఇద్దరి ఒంట్లో నుండీ చెరో మూడు లీటర్ల నీళ్లు చెమట రూపంలో బయటకు వచ్చాక ముగ్గురు వ్యక్తులు ప్రయాణిస్తున్న చిన్న ఫోర్డ్ కారు ఒకటి మా పక్కగా వెళ్లింది. ముగ్గురూ పై తరగతికి చెందిన వారు కావటంతో ఇష్టం వచ్చినట్లు తాగి పెద్దపెట్టున కూనిరాగాలు తీస్తున్నారు. వారు మగడాలెనా గనికి చెందిన కార్మికులు. సమ్మెలో ఉన్నారు. చిన్నపాటి విజయానికే ఉబ్బితబ్బిబ్బు అవుతున్నారు. ఈ రెయిల్‌రోడ్డు వెళ్లినంత దూరం వారు కారులో మమ్మల్ను తీసుకెళ్తారు. దారిలో ప్రత్యర్థి బృందంలో ఆడటానికి గాను ఫుట్‌బాల్ ఆటతో కసరత్తు చేస్తున్న ఒక కార్మిక బృందం ఎదురైంది. అల్బెర్టో తన సంచి నుండి ఒక జత బూట్లు తీసి ఆట ప్రారంభించాడు. దాని ఫలితం అద్భుతం. మరుసటి ఆదివారం జరిగే ఆటకు ఎంపికైన జట్టులో మమ్మలనూ తీసుకున్నారు. అందులో మాకు తగినంత ఆహారం ఇచ్చి బండి ఏర్పాటు చేసి ఇక్విక్యు వరకు మమ్మలను దింపి రావాలన్న ఒప్పందం మీద మేము వాళ్ల జట్టు తరపున ఆడటానికి అంగీకరించాము.

ఆదివారానికి మరో రెండు రోజులుంది. ఆ ఆటలో మా జట్టుకు అద్భుత విజయం చేకూరింది. ఆట ముగిశాక అల్బెర్టో వండిన మేక మాంసం మా జట్టు సభ్యులకు నోరూరించింది. అచ్చమైన అర్జెంటీనా పద్ధతిలో అల్బెర్టో వంట చేశాడు. ఈ రెండు రోజులు మేము చిలీ పరిసరాల్లో ఉన్న నత్రజని శుద్ధి కర్మాగారాలు సందర్శించి వచ్చాము.

ఈ ప్రాంతంలో ఉన్న గనుల నుండి ఖనిజ వనరులు వెలికి తీయటం కంపెనీలకు అంత పెద్ద కష్టమైన పనేమీ కాదు. నేల పై పొరలను తవ్వి తీసి వాటిని శుభ్రం చేయటానికి ప్రత్యేకంగా ఎంపిక చేసిన ప్రాంతాలకు రవాణా చేస్తారు. అక్కడ ఖనిజవనరులనుండి ఇతర వ్యర్థ పదార్థాలను వేరు చేయటంతో నత్రజని, ఉప్పుగళ్లు సిద్ధం అవుతాయి. మొదట్లో ఇక్కడ ఖనిజవనరులు వెలికి తీసేందుకు జర్మన్లకు హక్కులు దఖలు పర్చబడ్డాయి. తర్వాతి కాలంలో వారి కంపెనీలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవటంతో ఇప్పుడు అవన్నీ బ్రిటన్ ఆధీనంలోకి వచ్చాయి. ఆ గనులు మేము వెళ్లదల్చుకున్న దక్షిణ ప్రాంతంలో ఉన్నాయి. రెండు పెద్ద గనుల్లో అత్యధికంగా కేంద్రీకృతమై ఉన్న కార్మికులు సమ్మెలో ఉన్నారు. దీంతో అక్కడకు వెళ్లరాదని మేము నిర్ణయించుకున్నాము. అందుకు బదులుగా ఈ ప్రాంతంలో ఉన్న అతి పెద్ద పరిశ్రమ లా విక్టోరియాకు వెళ్లాము. ఈ కంపెనీ గేట్ల ముందు హెక్టార్ సుపిక్కి సెడెస్ చనిపోయినట్లు తెలియచేసే బోర్డు ఉంది. సెడెస్ ఉరేగ్వేకు చెందిన సమర్థుడైన డ్రైవరు. బండికి పెట్రోలు పోసుకోవటానికి వచ్చిన మరో వాహనం కిందపడి మరణించాడు.

ఒకదానివెంట ఒకటిగా వచ్చిన ట్రక్కులలో మమ్ములను చివరికి మేము చేరదల్చుకున్న ఇక్విక్యుకు వచ్చిచేరాము. చివరి వాహనంలో వెచ్చగా దుప్పట్లు కప్పుకుని వచ్చాము. మేము అక్కడకు చేరే సమయానికి సూర్యాస్తమయం కాసాగింది. సముద్రగర్భంలోంచి బయటకు వస్తున్న సూర్యుని వెలుగులో మా నీడలు నీలిరంగు సముద్రంపైకి ఎగబాకాయి. దాంతో మేము వెయ్యిన్నొక్క రాత్రుల నుండి బయటపడినట్లుగా ఉంది. మాయల దుప్పటిలాగా వాహనం కనిపిస్తుండగా విమానాశ్రయంలో ప్రవేశించాము. ఒకటొకటిగా గేర్లు వేస్తూ విమానం నిదానంగా పైపైకి లేస్తుండగా కిందనుండి మొత్తం నగరానికి నగరమే మమ్ములను అందుకునేందుకు పైకి లేస్తోందా అనిపించింది.

ఇక్విక్యులో ఒక్క బోటు కూడా లేదు. ఇక అక్కడ ఎదురు చూసి ప్రయోజనం లేదని భావించి ఎదురుగా వస్తున్న మరో వాహనంలో ఆరికాకు వెళ్లేందుకు సిద్ధమయ్యాము.

# చిలీ అంచుల్లో...

ఇక్విక్యు, అరికా మధ్య విస్తరించిన ప్రాంతమంతా ఎత్తుపల్లాలుగా ఉంది. మేము విశాలమైన బంజరుభూములు దాటుకుంటూ లోయలోకి ప్రవేశించాము. మధ్యమధ్యలో రాలుతున్న కొద్దిపాటి జల్లులు కేవలం చెట్టు మొదళ్లకు కూడా చాలవు. ఈ పంపా మైదానాలు పగటిపూట పుట్టించే వేడి చాలా దుర్భరంగా ఉంటుంది. చుట్టూ ఎడారి వాతావరణమే ఉన్నా రాత్రుళ్లు మాత్రం చల్లగా ఉంటుంది. గొంతు తడుపుకోవటానికి చిన్న నీటిబొట్టు, ఎండతీవ్రత తట్టుకోవటానికి నీడ దొరకని రోజుల్లో ఒక చిన్న బృందాన్ని వెంటబెట్టుకున్న వాల్దివియా రోజుకు 50, 60 కిలోమీటర్లు ప్రయాణించాడని వింటే నోరువెళ్లబెట్టక తప్పదు. ఈ ప్రాంతం గురించి తెలిసిన వారు విజేతల జాబితాలో వాల్దివియాను అగ్ర స్థానంలో చూస్తారు. ఆయన అమెరికా చరిత్ర పుటల్లోకెక్కిన వారికంటే ఘనుడనేది నిస్సందేహం. సంపన్నులైన దేశాల నేతలు సుదీర్ఘ యుద్ధాల తర్వాత చెప్పుకోదగ్గ సామ్రాజ్యాలు నిర్మించి వారి విజయాలు బంగారంగా మార్చుకున్నారు.

వాల్దివియా ప్రయత్నాలు సాధ్యమైనంత విస్తృత ప్రాంతంపై సర్వాధికారాలు సంపాదించుకోవటానికి ఏవిధంగా ప్రయత్నిస్తారో తెలియచేస్తాయి. రోమన్ సామ్రాజ్యంలో రెండో ముఖ్యవ్యక్తిగా ఉండే కంటే ఆల్ఫ్సు పర్వతాల్లోని గ్రామాల్లో ప్రథమ ముఖ్య వ్యక్తిగా ఉండేందుకే ఇష్టపడతానని సీజర్ చెప్పినట్లు అంటుంటారు. చిలీపై పెత్తనం కోసం జరిగిన పోరాటాల ముందు ఈ మాట కూడా పల్చబడిపోతుంది. ఒక వేళ ఆ విజేత ప్రాణాలకు ముప్పు వస్తే అతన్ని జంతువులాగా వేటాడరు. కానీ వాల్దివియా మాత్రం తన ప్రాణాలు ఫణంగా పెట్టటానికి వెనకాడడన్న విషయంలో నాకు ఎటువంటి సందేహం లేదు. ఆయన భూమిమీద పుట్టిన అరుదైన జాతికి చెందిన వ్యక్తి. అతని దృష్టిలో అంతులేని అధికారాలు అనుభవించాలనుకున్నప్పుడు ఎంతటి ఇబ్బదులనైనా భరించాలి. అందువల్లనే ఆయన శక్తివంతమైన పరిపాలకుడు అయ్యాడు.

ఆరికా ఒక సుందరమైన చిన్న ఓడరేవు. అక్కడ అప్పటి వరకు పాలన చేసిన పెరూవాసుల అనుభవాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదు. ఇది చిలీ, పెరుల సరిహద్దులు కలిసే స్థలంగా కూడా ఉంది. ఉమ్మడి వారసత్వం, భౌగోళిక ఏకత్వం ఉన్నప్పటికీ ఈ ప్రాంతం రెండు దేశాల మధ్య విభజితమై ఉంది. ఈ నగరానికి సౌందర్యాన్ని తెచ్చిపెట్టేది వంద మీటర్ల ఎత్తుకు ఎగిరి కూర్చున్న రాయి. పాం చెట్లు, వేడిమి, సమశీతోష్ణ ప్రాంతంలో దొరికే ఫలాలతో ఈ కరేబియా ప్రాంత పట్టణం ప్రత్యేక ఆకర్షణ కేంద్రంగా మారింది. దక్షిణాదిలోని మిగిలిన ప్రాంతాల కంటే ఇది విలక్షణంగా ఉంటుంది.

సంపన్నవంతమైన బూర్జువా వ్యక్తి ఎవరో  దేశద్రిమ్మరుల పట్ల వ్యతిరేకత, అయిష్టత చూపించినట్లే మా పట్ల ఒక వైద్యుడు కూడా తీవ్ర వ్యతిరేకత ప్రదర్శించాడు. చివరకు అక్కడి ఆసుపత్రిలో నిద్రించేందుకు మాకు అవకాశం ఇచ్చాడు. ఆతిధ్యం ఇవ్వటం తెలియని ఆ ప్రాంతం నుండి తెల్లవారి ఉదయమే మేము బయలు దేరి నేరుగా పెరు దేశ సరిహద్దుల దిశగా సాగిపోయాము. అంతకంటే ముందు పసిఫిక్ సముద్రంలో చివరిసారిగా ఈతవేశాము. పసిఫిక్ సముద్ర సాన్నిహిత్యం సముద్ర ఉత్పత్తులతో తయారైన తినుబండారాల పట్ల అల్బెర్టోలో ఆసక్తి రేకెత్తించింది. ఈత ముగించాక ఓపిగ్గా నత్తగుల్లల కోసం వెదికాము.  ఉప్పగా చప్పగా ఏదో ఒకటి తిన్నా అది మా ఆకలిని తీర్చలేకపోయింది. అల్బెర్టో అయితే త్రేన్పులుకూడా ప్రారంభించాడు. కానీ ఈ తిండి జైల్లో ఉన్న ఖైదీలను కూడా తృప్తిపరచేది కాదు.

సమీపంలోని పోలీసు స్టేషన్ వద్ద తిన్నాక  సరిహద్దు వెంట మేము ప్రయాణించాల్సిన మార్గాన్ని మ్యాపుల్లో  సరిచూసుకున్నాక మేము నిర్ణయించుకున్న సమయంలోనే తిరుగు ప్రయాణం ప్రారంభించాము. ఆ దారిలో వెళుతున్న ఒక వ్యాను మమ్ములను సరిహద్దు స్థావరం వరకు చేరవేసింది. అర్జెంటీనా సరిహద్దులో పని చేసి వచ్చిన కస్టమ్స్ అధికారి ఒకరిని కలిశాము. మటే పట్ల మాకున్న ఆసక్తిని అభినందిస్తూ ఆయన మాకు కొంచెం వేడినీళ్లు ఇచ్చాడు. అన్నింటికంటే మించి మమ్ములను టక్నా వరకు దించి రావటానికి ఏర్పాట్లు చేశాడు. పెరులో అర్జెంటీనావాసుల పట్ల చెప్పలేనన్ని సందేహాలు ఉన్నా సరిహద్దు కావల ఉన్న పోలీసు అధికారి మమ్ములను సాదరంగా ఆహ్వానించాడు. ఆ విధంగా అద్భుత ఆతిధ్యం ఇచ్చిన చిలీ సరిహద్దులు దాటి వెళ్లిపోయాము.

# దూరంగా చూసినప్పుడు చిలీ పట్ల అభిప్రాయం

ఎప్పటికప్పుడు తాజాగా ఉత్సాహంగా ప్రయాణపు నోట్స్ రాసే క్రమంలో ఒకసారి మనసుకు తట్టింది అంత శాస్త్రీయ పరిశీలన లేకుండానే రాశాను. సంవత్సరం తర్వాత రాస్తున్నప్పుడు ఇప్పుడు చిలీ గురించి నా అభిప్రాయం దానికి అవసరం లేదు. కానీ అప్పట్లో నేను రాసింది తిరిగి సమీక్షించదల్చుకున్నాను.

మనకు వైద్యశాస్త్రంలో ఉన్న విజ్ఞానం, నైపుణ్యంతో చూసినప్పుడు చిలీలో ప్రజారోగ్యం గురించి మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని భావించాను. (ఆ తర్వాత అనేక దేశాల నుండి నేను తెలుసుకున్న దానికంటే చిలీలో ఆరోగ్య ప్రమాణాలు బాగున్నాయని అర్ధమైంది) ఉచిత ప్రభుత్వ ఆసుపత్రులు చాలా అరుదు. ఉన్న ఒకటి రెండు ఆసుపత్రుల్లో కనిపించిన బోర్డుల మీద “ఈ ఆసుపత్రి నిర్వహణకోసం నీవు ఏమీ చెల్లించనపుడు నీకు తగిన సౌకర్యం లేదని ఫిర్యాదు చేయటం ఎందుకు” అని రాసి ఉంటుంది. సాధారణంగా చెప్పుకుంటే ఉత్తరాదిన వైద్యసేవలు ఉచితంగానే అందుబాటులో ఉండేవి. కానీ ఆసుపత్రిలో పడకలకు రుసుము చెల్లించాల్సి వచ్చేది. ఈ రుసుము మొత్తాలు కొద్దిపాటి సాయం నుండి చట్టబద్ధమైన దోపిడీ అనే స్థాయి వరకు ఉంటాయి. చుక్వికమాటాలో గని కార్మికులు గాయపడితే వారు రోజుకు 5 ఎస్క్యుడోలు చెల్లించి వైద్యం చేయించుకోవాలి. గనిలో పని చేసేవారు కాకపోతే షుమారు 300 నుండి 500 వరకు ఎస్క్యుడోలు రోజుకు చెల్లించాల్సి ఉంటుంది. ఆసుప్రతులకు నిధులు లేవు. ఔషధాలు, తగిన ప్రాధమిక వసతులు కూడా కరువే. వెలుతురు కూడా సరిగా లేని ఆపరేషన్ గదులు చూశాము. ఈ పరిస్థితి ఏదో చిన్నా చితకా పట్టణాలకు పరిమితం కాదు. వాల్పరాసియో వంటి పెద్ద నగరాల్లో సైతం ఇదే పరిస్థితి. శస్త్రచికిత్స చేయటానికి అవసరమైన పరికరాలు అక్కడ లేవు. స్నానపు గదుల్లో పారిశుధ్యం కరువు. పారిశుధ్యం,

శుభ్రత గురించిన అవగాహనే నామమాత్రం. మరుగుదొడ్లోకు వెళ్లినప్పుడు ఉపయోగించిన టిష్యూ కాగితాన్ని బయట పడేయకుండా అక్కడే ఉన్న వ్యర్థాల బుట్టలో వేయటం చిలీలో అలవాటు (ఇదే పరిస్థితి ఆ తర్వాత దక్షిణ అమెరికా అంతటా గమనించాను).

అర్జెంటీనాలో కంటె చిలీలో జీవన ప్రమాణాలు తక్కువ స్థాయిలో ఉంటాయి. దక్షిణార్ధ గోళంలోని దేశాల్లో అతి తక్కువ వేతనాలు చెల్లించే జాబితాలో చిలీది మొదట వుంటుంది. నిరుద్యోగం కూడా ఎక్కువే. కార్మికులకు ప్రభుత్వ అధికారులు కల్పించే రక్షణలు కూడా నామమాత్రం. ఇటువంటి అనేక కారణాల వల్లనే అనేకమంది చిలీవాసులు అర్జెంటీనాలోకి వలస వెళుతుంటారు. ఆండిస్ పర్వతాలకు పశ్చిమాన నివసించే వారికి అర్జెంటీనా బంగారు గని అని కపట రాజకీయ ప్రచారం సాగేది. అటువంటి బంగారు గనిని అందుకునేందుకు చిలీ వాసులు తెరలు తెరలుగా వలస వచ్చేవారు. ఉత్తరాది దేశాల్లో  రాగి, నత్రజని, బంగారం, సల్ఫర్ గనుల్లో పని చేసే కార్మికులకు మెరుగైన వేతనాలు ఉండేవి. అయితే వారి జీవితంలో ఖర్చు కూడా ఎక్కువగానే ఉంటుంది. వారికి అనేక వినియమ వస్తువులు అందుబాటులో ఉండేవి కాదు. పర్వత ప్రాంత వాతావరణం మరింత దారుణంగా ఉంటుంది. స్థానిక స్మశానంలో విశ్రాంతి తీసుకుంటున్న పదివేలకు పైగా కార్మికుల కుటుంబాలకు ఇచ్చే నష్టపరిహారం ఏమిటని గని మేనేజరును ప్రశ్నించినప్పుడు ఆయన ఇచ్చిన సమాధానంతో ఒళ్లు గగుర్పొడిచింది.

రాజకీయ చిత్రం మరింత గందరగోళంగా ఉంది. అధ్యక్ష పదవికి నలుగురు పోటీలో ఉన్నారు (ఇది ఇబ్నెజ్ విజయానికి ముందు రాసింది). వారిలో కార్లోస్ ఇబ్నెజ్ డెల్ కాంపో విజయం ఖాయంగా కనిపిస్తోంది. పదవీ విరమణ చేసిన ఈ సైనికాధికారిలో నియంతృత్వ ధోరణులు ఎక్కువగా ఉన్నాయి. పెరోన్ లాగానే రాజకీయ ఆకాంక్షలు ప్రబలంగా ఉన్న వ్యక్తి. సైనికుడికి ఉండే ఉత్సాహం, శక్తి సామర్థ్యాలతో తన వెంట ఉన్న ప్రజలను ఆయన ఉత్సాహపరుస్తున్నాడు. అధికారానికి రావటానికి ఆయన పాపులర్ సోషలిస్టు పార్టీపై ఆధారపడి ఉన్నాడు. ఈ పార్టీ వెనక ఐక్యమైన అనేక చిన్న చిన్న ముఠాలు ఉన్నాయి. నాకు తెలిసినంత వరకూ ఈ పోటీలో రెండో స్థానంలో ఉన్న అభ్యర్థి పెడ్రో ఎన్రిరె అల్ఫొన్సో. ఆయన ప్రస్తుత ప్రభుత్వ అధికార అభ్యర్థి. రాజకీయంగా గందరగోళపు మనిషి. అమెరికా వాళ్లకు, న్యాయస్థానాలకు, దాదాపు అన్ని రాజకీయ

పార్టీల వారికి సన్నిహితుడుగా ఉన్నట్లు కనిపిస్తాడు. మాజీ అధ్యక్షులు అలెస్సాంద్రి అల్లుడు, మితవాద వర్గానికి నాయకుడు వ్యక్తి అర్టురో మట్టె లార్రెయిన్. ఆయన దేశంలో ఉన్న అన్ని రకాల ప్రగతినిరోధక శక్తుల బలంపై ఆధారపడ్డాడు. ఈ జాబితాలో ఆఖరి వ్యక్తి పాపులర్ ఫ్రంట్ నాయకుడు సాల్వెడార్ అలెండీ. కమ్యూనిస్టులు ఈయనకు మద్దతు ఇస్తున్నారు. దేశంలో దాదాపు 40 వేలమంది పౌరులు కమ్యూనిస్టు పార్టీకి అనుబంధమై ఉండటం వల్ల వారికి ఓటుహక్కును ప్రభుత్వం రద్దు చేసింది.

ఇబ్నెజ్ లాటిన్ అమెరికా తరహా రాజకీయాలు అమలు చేస్తాడని, అమెరికా వ్యతిరేకత రెచ్చగొడతాడని తద్వారా ప్రజాకర్షణ సంపాదించే ప్రయత్నం చేస్తాడన్నది సాధారణ అవగాహన. అమెరికా భారీఎత్తున పెరుదేశపు ఖనిజవనరులపై పెత్తనం కలిగి ఉన్నప్పటికీ చిలీలో రాగిగనుల జాతీయకరణ పెద్దగా విశ్వాసం కల్పించే చర్యగా ఉండదని నా అభిప్రాయం) చివరకు రాగి గనులను తిరిగి జాతీయం చేయటం, రైల్వేలు, రహదారులు జాతీయం చేసే ప్రక్రియ కొనసాగించటం, అర్జెంటీనా, చిలీ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు విస్తరించటం వంటి చర్చలు చేపట్టే అవకాశం ఉంది.

ఎవరైనా చిలీ దేశంలో పని చేయటానికి ముందుకు వస్తే వారికి ఆర్థిక లాభం చూపించే దేశం చిలీ. అయితే వారు కార్మికవర్గానికి మాత్రం చెందిన వారు కారాదు. నా ఉద్దేశ్యంలో ఎవరైనా కొద్దిపాటి విద్యావంతులై, సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉంటే చాలు. పెద్ద సంఖ్యలో పశువులను పోషించే శక్తి ఈ భూమికుంది. దేశ ప్రజలకు అవసరమైన స్థాయిలో ఆహార ధాన్యాలనందించగలదు. దేశాన్ని ఆర్థికంగా శక్తివంతంగా మార్చేందుకు అవసరమైన ఖనిజవనరులు ఇనుము, రాగి, బొగ్గు, బంగారం, తగరం, వెండి, మాంగనీసు, నత్రజని వంటి పుష్కలంగా ఉన్నాయి. చిలీ చేయాల్సిన పెద్ద ప్రధాన కర్తవ్యం తన వెనక అసౌకర్యంగా ఉన్న యాంకీ మిత్రులను కదిలించటం. అమెరికా చిలీలో పెట్టిన పెట్టుబడులను పరిగణనలోకి తీసుకుంటే ఇది బృహత్కర్తవ్యమే అనటంలో సందేహం లేదు. అమెరికా ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు తన ఆర్థిక శక్తి సామర్థ్యాలు ప్రదర్శించగల స్థితిలో ఉంది.



# తరాతా : ఒక నూతన ప్రపంచం

నగర సరిహద్దులు గుర్తు చేస్తూ మాకు కొద్దిదూరంలోనే పౌరపోలీసు నిఘా కేంద్రం ఏర్పాటు చేసి ఉంది. అప్పటికే మా వీపుల మీద ఉన్న మూటలు గతం కంటే వందరెట్లు బరువు పెరిగాయి. ఎండ తక్కువగా ఉండటంతో గతంలో లాగే ఒంటిమీద నాలుగైదు జతల బట్టలు కలిపి వేసుకున్నాము. లేనిపక్షంలో మాకు జలుబుచేసి ఉండేది. రోడ్డు సాఫీగా ఉండటంతో గ్రామం నుండి కనిపిస్తున్న పిరమిడ్‌ను కొద్దిసమయంలోనే దాటి ముందుకు వెళ్లాము. చిలీతో జరిగిన యుద్ధంలో చనిపోయిన పెరువాసుల జ్ఞాపకార్థం ఈ పిరమిడ్ నిర్మించారు. 1879–83 మధ్య జరిగిన నత్రజని యుద్ధాలు అని పిలిచే యుద్ధాల్లో చిలీ ఖనిజవనరుల్లో సంపన్నవంతమైన పెరు భూభాగం అంటాకార్నాను ఆక్రమించింది. మేము ఆగి ఏదైనా వాహనం దొరుకుతుందేమో మా అదృష్టం పరీక్షించుకునేందుకు ఇదే అదునైన ప్రదేశం అని భావించాము. కనుచూపుమేరలో బంజరు భూమి తప్ప ఏమీ కనిపించటం లేదు. ఈ ప్రాంతంలో ఎటువంటి సేద్యమూ లేదు. ఈ ప్రాంతంలో ఎర్రపెంకులతో కప్పిన ఇళ్లు, దుమ్ము కొట్టుకున్న వీధులు తప్ప మరేమీ కనిపించటం లేదు. అక్కడ ఎదురుచూడటం కష్టంతో కూడుకున్నదనే అనిపించింది. వస్తున్న మొదటి ట్రక్కును చూసిన మాకు ఆందోళన పెరిగింది. బండి ఆపమని పదేపదే సైగలు చేయటం ప్రారంభించాము. మేము ఆశ్చర్యపడినట్లే మాకు కొద్దిదూరంలో డ్రైవరు బండి ఆపాడు. ఆ పాటికే మాకు అర్థమైన భాషలో అల్బెర్టో మా అవసరం ఏమిటో డ్రైవరుకు వివరించాడు. మా ప్రయాణం ఎందుకో కూడా వివరించాడు. మా విజ్ఞప్తిని అంగీకరిస్తూ డ్రైవరు ట్రక్కు వెనక భాగంలో ఉన్న ఇండియన్‌లతో పాటు వెనకే ఎక్కమని తలూపాడు. డ్రైవరుకు కృతజ్ఞతలు చెప్తూ ఉత్సాహంతో మా సామాను తీసుకుని ట్రక్కు ఎక్కబోతుండగా "తరాటా చేర్చటానికి 5 సోల్స్ ఇవ్వాలి. తెలుసుకదా?" అంటూ డ్రైవరు కేక వేశాడు. మమ్ములను డబ్బులు తీసుకోకుండా గమ్యం చేర్చమని అడిగినప్పుడే ఆ మాట ఎందుకు చెప్పలేదని అల్బెర్టో ఉక్రోషంతో అడిగాడు. ఉచితంగా తీసుకెళ్లటం

అంటే ఏమిటో డ్రైవరుకు అర్థమయినట్లు లేదు. తరాతా చేరవేయటానికి ఐదు సోల్స్ తీసుకోవటం గురించి మాత్రం అతనికి తెలుసు.

"వాళ్లందరూ అటువంటి వారే" అని అల్బెర్టో కోపంగా అరిచాడు. ఈ చిన్న మాటలో తనకున్న ఉక్రోషాన్నంతా నాపై వెళ్లగక్కాడు. మొదట్లో నేనే నగరం నుండి బయటకు వచ్చి లిఫ్ట్‌కోసం ప్రయత్నిద్దామని ప్రతిపాదించినందుకు అల్బెర్టో నాపై ఉక్రోషం వెళ్లగక్కుతున్నాడు. అతను కోరుకున్నట్లు అక్కడే ఆగి ఉంటే ఈ చివాట్లు వినాల్సి వచ్చేది కాదు నాకు. అక్కడ మాకు ప్రధానమైన సమస్య ఎదురైంది. అక్కడనుండి వెనక్కు వెళ్లిపోవాలి. అలా చేయటం అంటే మేము ఓటమిని అంగీకరించినట్లే అవుతుంది. లేదంటే ముందు ముందు ఏమి జరుగుతుందన్నదానితో సంబంధం లేకుండా కాలినడకన మా ప్రయాణాన్ని కొనసాగించాలి. ఈ రెండింటిలో దేన్ని ఎంచుకోవటం అన్న ప్రధాన సమస్య మా ముందుకు వచ్చింది. మేము రెండో మార్గాన్నే ఎంచుకున్నాము. కాలినడక ప్రారంభించాము. మేము ఎంచుకున్న ఈ రెండో ప్రత్యామ్నాయం అంత మంచిది కాదని తెలుసుకోవటానికి అట్టే సమయం పట్టలేదు. మరికొద్ది సేపటికి సూర్యాస్తమయం కానుంది. కనుచూపుమేరలో ప్రాణి అన్నదే కనిపించటం లేదు. అయినా సమీపంలోనే ఏదో ఒక గ్రామం కనిపించకపోదన్న ధీమాతో మేము ముందుకు సాగాము.

చుట్టూ దట్టమైన చీకట్లు అలుముకున్నా మాకు ఒక్క గ్రామం కూడా కనిపించలేదు. తేనీరు తయారు చేసుకోవటానికి గానీ, వంట వండుకోవటానికి గానీ అవసరమైన నీరు కూడా లేకపోవటంతో పరిస్థితి మరింత క్లిష్టమై పోయింది. చలి కూడా ప్రారంభమైంది. ఎత్తయిన ప్రదేశంలో ఉండటం వల్లనేమో పరిస్థితులు మరింత ఇబ్బందికరంగా మారాయి. మా విసుగు, అలసట నమ్మశక్యం కానంత స్థాయికి చేరాయి. ఇక ముందుకు సాగే సాహసం చేయలేని మేము అక్కడే దుప్పట్లు పర్చుకొని తెల్లవారేవరకూ నిద్ర పోవాలని నిర్ణయించుకున్నాము. ఆ రాత్రి వెన్నెల కూడా లేదు. ఎటు చూసినా చీకటి. దీంతో మరో మార్గం లేక దుప్పట్లు పర్చి సాధ్యమైనంతగా చుట్టుకుపోయాము.

ఐదు నిమిషాల తర్వాత తాను గడ్డకట్టుకుపోతున్నట్లు అల్బెర్టో చెప్పాడు. దానికి బదులుగా నా శరీరం అంతకంటే చల్లగా మారిందని బదులిచ్చాను. గడ్డకట్టుకుపోవటానికి మేమేమీ పోటీపడటం లేదు కదా. నెగడు రాజేసుకోవటానికి చితుకులు ఏమైనా చుట్టూ దొరుకుతాయేమోనని వెతుకులాట ప్రారంభించాము. ఫలితం మరీ అధ్వాన్నంగా లేదు. ఇద్దరమూ గుప్పెడు కర్రముక్కలు సంపాదించాము. కొద్దిపాటి మంట వెలిగించాము. అయితే అది మా చలిని ఏ మాత్రం ఆపలేకపోయింది. ఆకలి కూడా దహించుకుపోతోంది.

కానీ చలి అంతకంటే ఇబ్బందిగా ఉంది. నెగడు నుండి వస్తున్న నాలుగు కాంతిరేఖలు కూడా నిస్తేజంగా చూస్తూ ఉండిపోయాము. అక్కడ నుండి మా గుడారం మూటకట్టుకుని ఆ చీకట్లోనే తిరిగి నడక ప్రారంభించాము. మొదటి కర్తవ్యం శరీరాలు కాస్తంత వెచ్చబెట్టుకోవటం. దానికోసమని వేగంగా అడుగులు వేయటం ప్రారంభించాము. కానీ కాస్సేపటికి ఊపిరి పీల్చుకోవటం కూడా కష్టంగా మారింది. పొట్టలో పేగులు తీపెక్కుతున్నట్లు అనిపించింది. చలికి కాళ్లు తిమ్మిరెక్కాయి. చలిగాలి ముఖాన్ని కత్తితో కోసినట్లు అనిపిస్తోంది. మరో రెండు గంటలు నడిచాక మేము బాగా అలసిపోయాము. అప్పటికి నా చేతిగడియారం రాత్రి 12.30 అయినట్లు చూపిస్తోంది. మరో ఐదుగంటలు నడిస్తే తెల్లవారుతుందన్న ఆశావహ అభిప్రాయం కలగటానికి ఇది తోడ్పడింది. మళ్ళీ చర్చించుకుని మరో అరగంటసేపు మా దుప్పట్లో ముడుచుకున్నాము. మరో ఐదునిముషాల తర్వాత మళ్లీ మా దారిపట్టాము. దూరంగా వెళుతున్న వాహనాల వెలుగులో చూసినప్పుడు ఆ రాత్రి ఇంకా యవ్వనంలోనే ఉన్నట్లు అనిపించింది. పరిస్థితులు అంత ఆశాజనకంగా ఏమీ లేవు. ఎవరైనా మాకు తమ వాహనాల్లో చోటు ఇస్తారన్న ఆశలు అసలు లేవు. అయితే రోడ్డుపై లైట్లు మాత్రం వెలుగుతున్నాయి. అదే సంతోషం అనిపించింది. మా పక్కగా వెళ్లిన వాహనం మా అరుపులు వినిపించుకోలేదు. కానీ ఆ వాహనం వెలుగు ప్రసరించిన మేరకు ఒక్క చెట్టు, పుట్ట, ఇల్లు కనిపించలేదు. ఆ విధంగా ఆ రాత్రి గడిచిపోయింది. గందరగోళం మరింత పెరిగింది. ఒక్కో నిముషం అంతకు ముందరి నిముషం కంటే నిదానంగా సాగుతున్నట్లు అనిపించింది. చివరకు ఒక్కో నిముషం ఒక్కో గంటలాగా మారింది. రెండు మూడు సార్లు కుక్కల అరుపులు మాలో కొంత ఆశ రేకెత్తించినా కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటిలో మాకేమీ కనిపించలేదు. చివరకు కుక్కలు కూడా ఆ నిశ్శబ్దంలో మరో దిక్కుగా వెళ్లిపోయాయి.

ఉదయం ఆరుగంటల సమయంలో రోడ్డు పక్కన రెండు గుడిశెలు కనిపించాయి. ఉదయపు కాంతి వెలుగుల్లో మెరిసిపోతున్నాయి. వాటిని చూశాక మా వీపుల మీద ఉన్న బరువు ఇట్టే తొలగిపోయినట్లు అనిపించింది. అక్కడ కనిపించినంత మిత్రత్వం మరెక్కడా మాకు కనిపించలేదు. అక్కడ దొరికిన బ్రెడ్, వెన్న తిన్నంత ఇష్టంగా మరెక్కడా తినలేదు. తేనీరు కూడా అంతే. అక్కడున్న సామాన్య ప్రజలకు మేము దైవస్వరూపుల్లాగా ఉన్నాము. అల్బెర్టో వైద్యుడిగా తాను పుచ్చుకున్న పట్టా వారి ముందు ప్రదర్శించాడు. అన్నింటినీ మించి మేము అద్భుత దేశమైన అర్జెంటీనా నుండి వచ్చాము. అక్కడే పేరోన్ తన భార్య ఎవిటాతో కలిసి జీవించాడు. అక్కడ పేదలకు ఎంత సంపద ఉంటుందో,

సంపన్నులకు కూడా అంతే ఉండేది. అంతేకాక ఇండియన్లను దోపిడీ చేసేవారు కూడా కాదు. మా దేశం గురించి, అక్కడ ప్రజల జీవనం గురించి వేలాది ప్రశ్నలకు మేము సమాధానాలిచ్చాము. రాత్రి చలికి ఇంకా మా ఎముకలు వణుకుతుండగా మా గులాబీ రంగు ఊహాలోకంలో అర్జెంటీనా గతం గుర్తుకువచ్చింది. అక్కడి స్థానిక ప్రజలు (చోలోస్, ఇండియన్స్, మెస్టిజోస్) దయా గుణం చూశాక మా ఆశలు మరింత పెరిగాయి. పైకి లేస్తున్న సూర్యకాంతి వెలుగులో నదీతీరంలో దుప్పట్లు పర్చుకుని కంటినిండా నిద్రపోయాము.

మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో తిరిగి మా ప్రయాణం ప్రారంభించాము. ముందటి రాత్రి కష్టాలు మా జ్ఞాపకాల్లో లేవు. పాత విజకచ్చా సలహా, “మనం ఎంత వేగంగా సాగిపోతున్నా రోడ్డు మాత్రం సుదీర్ఘంగానే ఉంటుంది” అన్న సామెత గుర్తు చేసుకుంటూ మా ప్రయాణం సాగించాము. దూరంగా వస్తున్న ట్రక్కు రూపం లీలగా కనిపిస్తుండగా సాయంత్రం ఐదుగంటల ప్రాంతంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవటానికి ఒకచోట ఆగిపోయాము. ఎప్పటిలాగానే ఆ ట్రక్కు కూడా కొందరు మనుషులను మోసుకెళ్లుతోంది. ఇదే అక్కడ అత్యంత లాభదాయకమైన వ్యాపారం. ఆ ట్రక్కు మా పక్కన ఆగటంతో మాకు ఆశ్చర్యం వేసింది. ఆ ట్రక్కులో నుండి టక్నాలో మాకు కలిసిన ఒక పౌర పోలీసు అధికారి నవ్వుతూ పలకరించాడు. ట్రక్కులోకి ఎక్కమని మమ్ములను ఆహ్వానించాడు. ఆ ఆహ్వానాన్ని మరోసారి పునరావృతం చేయాల్సిన అవసరం లేకుండా ట్రక్కు ఎక్కేశాము. ట్రక్కులో ఉన్న ఐమారా ఇండియన్‌లు మా పట్ల ఆసక్తి ప్రదర్శించినా మా గురించి ఏమీ అడగలేకపోయారు. వారిలో కొంతమందితో సంభాషణ మొదలు పెట్టేందుకు అల్బెర్టో ప్రయత్నించాడు. వారు స్పానిష్ భాష అంతబాగా మాట్లాడలేకపోయినప్పటికీ అల్బెర్టో ఈ ప్రయత్నం విరమించాడు. ఈ ట్రక్కు దాదాపుగా ఎడారిగా మారిన నిర్మానుష్య ప్రాంతం నుండి సాగిపోతుంది. మధ్య మధ్యలో ఉనికి కోసం తపనపడుతున్న ఒకటి రెండు పొదలు మాత్రమే దర్శనం ఇస్తున్నాయి. ఉన్నట్లుండి ట్రక్కు ఒక్క కుదుపుతో పైకెక్కినట్లు అయ్యింది. దీంతో పీఠభూమిని చేరుకున్నామన్న ఆనందం కళ్లల్లో మెరిసింది. ఆ తర్వాత మేము ఎస్టాక్యు పట్టణానికి చేరాము. పట్టణ దృశ్యం అద్భుతంగా ఉంది. ఉత్సాహభరితమైన మా కళ్లు మారుతున్న రంగులపైనే కేంద్రీకృతమయ్యాయి. మేము చూస్తున్న ప్రతి దృశ్యానికి సంబంధించిన పేరు, ఆ పేరు రావటానికి గల కారణాలు తెలుసుకోవటంలో మునిగిపోయాము. ఐమారాలకు మేము అంతగా అర్థం కాలేదు. కానీ వచ్చీ రాని స్పానిష్ భాషలో వారు మాకు కొన్ని సూచనలు

ఇచ్చారు. ఆ సూచనలు భావోద్వేగంతో ఉన్న మాకు, పరిసరాలకు మరింత ప్రోత్సాహాన్నిచ్చాయి. మేము ఒక చారిత్రక లోయకు చేరుకున్నాము. దాని అభివృద్ధి శతాబ్దాల క్రితమే నిలువరించబడింది. 20వ శతాబ్దానికి చెందిన మా తరానికి ఆ లోయను చూసేందుకు అవకాశం దొరకటం పట్ల మేము ఎంతగానో సంతోషించాము. ఇంకాలు (లాటిన్ అమెరికా దేశాల్లో ఒకప్పటి రాజవంశం) తమ ప్రజల అవసరాలు తీర్చటానికి నిర్మించిన సాగునీటి కాలువల పర్వతాల మీదుగా లోయలోకి ప్రవహిస్తున్నాయి. అవి వెయ్యి దాకా చిన్న చితక నీటిపాయలతో కలిసి ఉన్నాయి. నీటిప్రవాహం కిందకు జారేకొద్దీ రహదారిపై పడి చెల్లాచెదురుగా మారుతోంది. మాకు కనిపించేంత మేరలో చిన్న చిన్న మేఘాలు కొండ కొనలను తమలో ఇముడ్చుకునే ప్రయత్నం చేస్తున్నాయి. వాతావరణం మరింత స్పష్టంగా ఉన్న చోట్ల పర్వతాలపై కురుస్తున్న మంచును స్పష్టంగా చూడవచ్చు. దాంతో కొండ కోనలు కొద్దికొద్దిగా తెల్లగా మారుతున్నాయి. పర్వత సానువుల్లో చదునుచేయబడ్డ ప్రాంతంలో స్థానిక ఇండియన్ తెగల ప్రజలు వ్యవసాయం చేస్తున్నారు. అనేక పంటలు పండిస్తున్నారు. ఈ ప్రాంతంలో వృక్షశాస్త్రానికి సంబంధించిన నూతన ఒరవడి మాకు కనిపించింది. ఈ పర్వతసానువుల్లో నివసిస్తున్న ఇండియన్‌ల వేషధారణ మా ట్రక్కులో ఉన్న ఇండియన్ తెగ ప్రజలలాగే ఉంది. వాళ్లు తెల్లగా పాలిపోయిన ఉన్ని ధోవతులు చుట్టుకున్నారు. మోకాళ్లకుపైగా వచ్చే ఫాంటులు, పాత టైర్లు, తాళ్లతో చేసిన చెప్పులు వేసుకున్నారు. మేము చూసినవన్నీ మనస్సులోకి ఎక్కించుకుంటూ లోయలో గుండా తరాతాకు పయనం సాగించాము. ఐమారా నిజానికి అద్భుతమైన ప్రకృతి సమ్మేళనం. సమీపంలో ఉన్న పట్టణాలకు కాపలాదారుల్లాగా ఇరువైపులా పర్వతాలు వి ఆకారంలో ఉన్నాయి. అది అత్యంత ప్రాచీన గ్రామాల్లో ఒకటి. అక్కడ జీవితం శతాబ్దాల క్రితం ఎలా ఉందో ఇప్పటికీ అలాగే ఉంది. అక్కడ కనిపిస్తున్న వలస పాలకులు నిర్మించిన చర్చి నిజానికి అద్భుతమైన కట్టడమే. దాని చరిత్ర ఎంత అనేదానికంటే ఆ చర్చి నిర్మాణంతో వలస పాలకులు ఈ ప్రాంతానికి అందించిన శిల్పకళ ఎంత గొప్పదో తెలియచేస్తుంది. ఈ యూరోపియన్ శిల్పకళ స్థానిక ప్రజల స్ఫూర్తితో మిళితమై అద్భుతమైన నిర్మాణాన్ని నిలబెట్టింది (మన దేశంలో గాంధార శిల్పకళ అభివృద్ధి చెందినట్లు అన్నమాట). పట్టణంలో రోడ్లు ఇరుగ్గా ఉన్నాయి. చిన్న చిన్న సందుల్లోను, స్థానిక రోడ్లమీద స్థానికంగా అందుబాటులో ఉండే రాళ్లు పరిచి ఉన్నాయి. తమ పిల్లలను వీపులమీద ఎక్కించుకున్న ఇండియన్ తెగల మహిళలు నడుస్తూ పోతున్నారు. మొత్తంగా ఒక పురాతనమైన దృశ్యాన్ని కళ్లముందుకు తెస్తోంది. ఈ పట్టణపు ప్రతిశ్వాసలోను స్పెయిన్ ఆక్రమణకు పూర్వపు నాగరికత కనిపిస్తోంది. మా ముందున్న ప్రజలు నిరంతరం ఇంకా తెగ పాలనకు

వ్యతిరేకంగా ప్రతిఘటిస్తూ వచ్చిన సాహసోపేత జాతి కాదు. ఇంకా తెగ దండయాత్రల వల్ల ఈ ప్రాంతాల ప్రజలు సరిహద్దుల్లో శాశ్వత సైన్యాన్ని సదా సన్నద్ధంగా ఉంచుకోవాల్సి వచ్చేది. మమ్ములను గమనిస్తూ నగర వీధుల్లో సంచరిస్తున్న ప్రజలు ఓడించబడిన జాతికి చెందిన వారు. వాళ్ల చూపులు దాదాపు భయంతో కూడుకుని ఉన్నాయి. బయటి ప్రపంచంతో పోల్చి చూసినప్పుడు ఇవి పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. వారు ఆ విధంగా ఎందుకు జీవించగలుగుతున్నారంటే ఈ ఒక్క విషయంలో వారికి మరో ప్రత్యామ్నాయం లేకపోయింది కనుక అన్న సమాధానమే వస్తోంది. వారిని చూస్తే ఇటువంటి భావమే కలుగుతోంది. పౌర పోలీసు అధికారి మమ్ములను పోలీసు స్టేషనుకు తీసుకెళ్లాడు. అక్కడ మాకు బస ఏర్పాటు చేశారు. మరికొందరు ఉన్నతాధికారులు మమ్ములను విందుకు ఆహ్వానించారు. కొద్దిసేపు నగరంలో సంచరించి వచ్చి విశ్రాంతి తీసుకున్నాము. ఎందుకంటే వేకువ జామున మూడు గంటల ప్రాంతంలో మేము ప్రయాణీకుల వాహనంపై ప్యునోకు వెళ్లాల్సి ఉంది. పౌర పోలీసు అధికారి పుణ్యమా అంటూ మమ్ములను ఈ వాహనం ఉచితంగానే ప్యునోకు చేరుస్తుంది.

## పచమామా నివసించిన ప్రదేశంలో

పెరు పోలీసులు ఇచ్చిన దుప్పట్ల విలువేమిటో ఆ రోజు ఉదయానికి గానీ మాకు తెలియలేదు. వేకువజామున మూడుగంటలకు ముంచుకొస్తున్న చలిలో సైతం ఈ దుప్పట్ల కారణంగా మా శరీరాలు వెచ్చగా ఉన్నాయి. కాపలా కాస్తున్న పోలీసు అధికారి మమ్ములను తట్టి లేపాడు. ఇల్లావ్‌కు ఒక ట్రక్కు బయలుదేరుతుందనీ చెప్పాడు. వారందరినీ ఈ పరిస్థితుల్లో వదిలి పెట్టటానికి కాస్తంత బాధనిపించింది. ఆ రాత్రి అద్భుతంగా ఉంది. చలి కూడా ఎక్కువగానే ఉంది. ట్రక్కులో మాకు విడిగా కూర్చోవటానికి సీట్లు ఏర్పాటు చేశారు. మా కాళ్ల వద్ద కంపుకొడుతున్న బట్టలు ధరించిన స్థానిక తెగల

ప్రజలు కూర్చొన్నారు. ఈ ట్రక్కులో వాసన నిజంగా లస్సో వాసనను గుర్తు చేస్తోంది. మాకు వారిచ్చిన వసతి విలువ ఏమిటో ట్రక్కు బయలుదేరిన తర్వాతగానీ మాకు అర్థం కాలేదు. ట్రక్కు బయలు దేరిన తర్వాత ముక్కు పుటాలు అదరగొడుతున్న వాసన దూరం అయ్యింది. ఈ వాసన మమ్ములను తాకేట్లయితే తట్టుకోవటం ఎంతో కష్టమై ఉండేది. మరోవైపున శీతల గాలులు స్వేచ్ఛగా వీయటంతో మరికాస్సేపటికి మా ఒళ్లంతా చల్లబడింది. ట్రక్కు పీఠభూమి పైకెక్కే కొద్దీ చలిగాలి తీవ్రత పెరుగుతూ పోయింది. మేము కింద పడిపోకుండా ఉండటానికి మా దుప్పట్ల నుండి చేతులు మాత్రం బయటపెట్టి దొరికింది పట్టుకుని కూర్చున్నాము. ఏమాత్రం కదలాలన్నా తల బయటపెట్టడం సాధ్యం కానంత ఇరుకుగా ఉంది ఈ ట్రక్కు. తెల్లవారేసరికి ఇంజను వేడెక్కటంతో ట్రక్కును కాస్సేపు ఆపాల్సి వచ్చింది. ఈ ఎత్తులో ప్రయాణించే ప్రతి వాహనానికీ ఈ సమస్య తప్పనిసరిగా ఎదురవుతుంది. ఆ రోడ్డులో అత్యంత ఎత్తయిన ప్రదేశానికి మేము దాదాపు దగ్గరలో ఉన్నాము. సముద్రమట్టం నుండి ఆ ప్రాంతం 5000 మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఆకాశంలో ఏదో ఒక మూల సూర్యుడు ఉదయించే ప్రయత్నం చేస్తుండటంతో ప్రసరిస్తున్న కిరణాల వెలుగు అప్పటి వరకు మమ్ములను చుట్టిముట్టిన చీకటిని దూరంగా నెడుతోంది. సూర్యకాంతితో కలిగే మానసిక ప్రభావం వింతగా ఉంది. సూర్యుడు ఇంకా పూర్తిగా వెలుగు ప్రసరించనే లేదు. కానీ ఈ మాత్రానికి మాలో సంతృప్తి వెల్లడవుతోంది. తెల్లారితే ఎంత వేడి ఉంటుందో ఊహించుకుంటేనే మా శరీరాలు కుదుటపడుతున్నాయి.

రోడ్డుకు ఒకవైపు అర్థచంద్రాకారంలో ఫంగై పెరుగుతోంది. ఈ ప్రాంతంలో కనిపించే పంట ఇదొక్కటే. చలిమంట వేయటానికి మేము దాన్ని ఉపయోగిస్తున్నాము. ఈ మంట వేడికి కొద్దిమోతాదులో మంచును నీరుగా మార్చటానికి అది ఉపయోగపడుతోంది. స్థానిక ఇండియన్ తెగల ప్రజలు ధరించిన దుస్తులు మాకు ఎంత ఆసక్తి కలిగించాయో ఆ విధంగా వేడిచేసిన నీళ్లను మేము ఆస్వాదించటం కూడా వాళ్లకు అంతే ఆసక్తిని కలిగించిందని వాళ్ల ముఖాలు చూస్తుంటే తెలిసిపోతుంది. నిముషానికి ఒకరు చొప్పున వాళ్లల్లో నుండి ఒకరు తమ చేతిలో ఉన్న కర్రముక్కతో చేసిన కూజా తెచ్చి మాకు కూడా పోయమని అడగటంలోనే ఇది కనిపిస్తోంది. ఆ వాహనం మమ్ములను మరో అడుగు కూడా ముందుకు తీసుకెళ్లలేని పరిస్థితి వచ్చింది. అక్కడి నుండి అందరమూ మరో మూడు కీలోమీటర్ల పొడవునీ ఆ మంచులోనే కాళ్లీడ్చుకెళ్లాల్సి వచ్చింది. ఈ మంచులో ఇండియన్ తెగల ప్రజలు నడుస్తున్న తీరు ఆశ్చర్యకరమనిపిస్తోంది. మొద్దుగా మారిన వారి పాదాలు ఈ మంచును లెక్కచేయటం లేదు. బూట్లు, ఉన్నితో చేసిన మేజోళ్లు

ధరించినప్పటికీ మా కాళ్ల మునివేళ్లు ఈ మంచులో గడ్డకట్టుకుపోతున్నాయా అన్న భయంతో మేమున్నాము. అడుగులో అడుగువేసుకుంటూ మేము నిదానంగా ఫైళ్ల కట్టలోని కాగితాల మాదిరిగా ఒకరి తర్వాత ఒకరం గమ్యం చేరాము.

ఈ దురదృష్టకర పరిస్థితి నుండి బయట పడిన వాహనం తిరిగి తన పాత ఉత్సాహాన్ని పోగుచేసుకుని మమ్మలను తీసుకెళ్లటం ప్రారంభించింది. కొద్దిసేపటిలోనే అత్యంత ఎత్తయిన శిఖరాన్ని దాటి ముందుకు పోయాము. ఈ శిఖరంపై అడ్డదిడ్డంగా పేర్చిన రాళ్లతో ఒక పిరమిడ్ నిర్మించబడి ఉంది. దానిపై శిలువ గుర్తు ఉంది. ఈ ఎత్తులో ఈ విధంగా నిర్మించాల్సిన అవసరం రావటం మాకు ఆశ్చర్యమనిపించింది. ఈ పిరమిడ్‌ను దాటుకుంటూ ట్రక్కు ముందుకు పోతున్నప్పుడు ట్రక్కులో ఉన్న వారంతా చప్పట్లు కొడుతూ కనిపించారు. ఒకరిద్దరు మాత్రం క్రైస్తవం తరహాలో కళ్లుమూసుకుని ప్రార్ధన చేశారు. ఉత్సాహం కొద్దీ ఎందుకు ప్రార్ధన చేస్తున్నారని మేము ప్రశ్నించినా నిశ్శబ్దమే మాకు సమాధానంగా వచ్చింది.

కొండ దిగువన ప్రయాణిస్తున్నప్పుడు కాస్తంత పొద్దు పొడిచింది. వేడి కూడా బాగానే ఉంది. అక్కడి నుండి మా వాహనం ఒక నది ఒడ్డున ప్రయాణం సాగిస్తోంది. ఈ నదీ ప్రవాహం పర్వత శిఖరాన ప్రారంభమైన దిగువకు వచ్చే సరికి ఒక మోస్తరు ప్రవాహంగా మారింది. మంచు శిఖరాలు నలుదిక్కుల నుండీ మమ్మలనే చూస్తున్నట్లుగా ఉంది. వాహనానికి ఇరువైపులా నిలిచి ఉన్న ఇలామాస్, అల్పాకాస్ చెట్లు నిశ్శబ్దంగా మా ప్రయాణాన్ని గమనిస్తూ ఉన్నాయి. అడ్డగోలుగా తిరిగే కొన్ని ఈగలు, పక్షులు మాత్రం శబ్దం చేసుకుంటూ ట్రక్కుకు ముందూ వెనకా కనిపించాయి.

ఈ ప్రాంతంలో మేము అనేక సార్లు ఆగాము. అందులో ఒక చోట స్థానిక తెగకు చెందిన ఇండియన్ ఒకరు బెరుకు బెరుకుగా తన కొడుకుతోపాటు మా వద్దకు వచ్చాడు. మంచి స్పానిష్ భాష మాట్లాడుతున్నాడు. స్పష్టమైన భాషలో “పెరోన్ భూమి” ఎంత అద్భుతంగా ఉంది అని ప్రశ్నించాడు. మేము ఎంత అద్భుతమైన ప్రకృతి దృశ్యాలు దాటుకుంటూ వచ్చామంటే నిజానికి మా ఊహలు గాల్లో తేలిపోయాయి. ఈ ప్రయాణంలో మాకు కలిగిన అద్భుత అనుభవాలు, మా హృదయాలను తాకిన భావాలు, కోరికలు చిత్రీకరించటం, వీనుల విందుగా వివరించటం పెద్ద కష్టమేమీ కాదు. మా దేశవాసులకైతే వీటిని మరింత సుందరంగా వివరించవచ్చు. తన కొడుకుతో ఆ పెద్దమనిషి వృద్ధులకు తగిన గౌరవం ఇవ్వాలని రాసుకున్న అర్జెంటీనా రాజ్యాంగం ప్రతి కావాలని అడిగించాడు. ఆశ్చర్యపడిన మేము తిరిగి వెళ్లాక తప్పకుండా పంపుతామని వాగ్దానం చేశాము. మేము

తిరుగు ప్రయాణం ప్రారంభించిన తర్వాత ఈ వృద్ధుడు తన దుస్తుల్లో దాచుకున్న తినుబండారాలు తీసి మాకిచ్చాడు. దాన్ని ఇద్దరమూ సమంగా పంచుకుని క్షణంలో కాజేశాము.

మధ్యాహ్న సమయానికి నిండుగా బరువైన మేఘాలు కప్పుకున్న ఆకాశం మాపైనే వాలిపోతుందా అన్నట్లుగా కనిపించింది. ఈ మధ్యలోనే మేము ఒక అద్భుత ప్రదేశాన్ని దాటుకుంటూ పోయాము. అక్కడ భూస్వామ్య తరహాలో నిర్మించిన భారీ కోట ద్వారా నదీ ప్రవాహం గట్లు కోతపడకుండా చూసే ఒక నిర్మాణం అది. ఆ కోట చుట్టూ యుద్ధానికి సిద్ధమైనట్లుగా ఉన్న వ్యక్తులు అనుమానపు దృక్కులతో మమ్ములను చూస్తూ ఉన్నారు. వారిని చూస్తే ఈ మాయా ప్రపంచ పశాంతతను చెదరకుండా ఉండటానికి కాపలా కాస్తున్నారా అనిపిస్తోంది. కొద్దికొద్దిగా మా ముఖాలపై పడుతున్న జల్లు కాస్సేపటిలోనే కుండపోత వర్షంగా మారింది. డ్రైవరు అర్జెంటీనా వైద్యులు కాబిన్‌లోకి రండి అని ఆహ్వానించి మేము తడవకుండా అక్కడ కూర్చోవటానికి అవకాశం ఇచ్చాడు. ఈ ప్రాంతంలో అది పెద్ద మర్యాద కింద లెఖ్క. వెంటనే అదే కాబిన్‌లో ప్యునో నుండి టీచరుగా పనిచేస్తున్న ఒక మిత్రునితో పరిచయం కలిగింది. అమెరికన్ పాపులర్ రివల్యూషనరీ కూటమితో సంబంధాలున్నాయని అతన్ని ఉపాధ్యాయ పదవి నుండి తొలగించారు. ఈ మనిషిలో స్థానిక తెగల రక్తం ప్రవహిస్తూనే ఉంది. అంతేకాక అతను అప్రిస్తా, అంటే మాకు ఏవిధమైన సంబంధమూ లేని వాడు. అతను తన జీవితంలో ఉపాధ్యాయుడుగా తెలుసుకున్న, బోధిస్తున్న వందలాది స్థానిక ఇండియన్ తెగల జీవన విధానాలు, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాల గురించి వల్లెవేస్తూ పోతున్నాడు. ఇతని సహచర్యంలో స్థానిక జీవనానికి సంబంధించిన ఎన్నో విషయాలు తెలుసుకోగలిగాము. ఐమారా రక్తంతో ఉన్న అతను ఈ ప్రాంత రాజకీయ చర్చలో ఐమారాల పక్షాన్నే వహించాడు. ఎడతెగని ఆ చర్చలో అతను ఈ ప్రాంత పరిస్థితులపై నిపుణునిగా చెప్పుకునే కోయాస్‌ను పిరికివాడికింద జమ కట్టాడు.

మాతో పాటు ట్రక్కులో ప్రయాణిస్తున్న ఇండియన్ తెగ ప్రజలు పాటించిన వింతైన ఆచారాలకు సంబంధించి విలువైన సూచన కూడా ఆయన అందించాడు. అత్యంత ఎత్తయిన శిఖరానికి చేరిన తర్వాత ఇండియన్ తెగల ప్రజలు తమకున్న కష్టాలు, విషాదాలు, విచారాలు అన్నీ పంచమామకు వదిలేస్తారు. అంటే భూమాతకు అర్పిస్తారన్నమాట. ఈ అప్పగింతకు సూచికగా ఒక చిన్న రాయిని సమర్పిస్తారు. ఆ విధంగా సమర్పించిన రాళ్లే రానురాను కుప్పలాగా పేరుకు పోయి ప్రస్తుతం పిరమిడ్ ఆకారాన్ని పొందాయి. స్పెయిన్

ప్రజలు ఈ ప్రాంతాన్ని జయించటానికి వచ్చినప్పుడు అటువంటి విశ్వాసాలను, చిహ్నాలనూ ధ్వంసం చేయటానికి ప్రయత్నించారు. కానీ ఈ ప్రయత్నంలో విజయం సాధించలేకపోయారు. స్పెయిన్ మతగురువులు ఈ వాస్తవాన్ని అంగీకరించి ఇండియన్ తెగల మత విశ్వాసాలకు చిహ్నంగా ఉన్న ఇటువంటి రాళ్లకుప్పలపై శిలువను ఏర్పాటు చేయటం ప్రారంభించారు. ఇదంతా నాలుగు శతాబ్దాల క్రితం జరిగిన సంగతి. ట్రక్కులో క్రైస్తవం తరహాలో ప్రార్ధనలు చేసిన వారి సంఖ్యను గమనిస్తే ఈ ప్రాంతంలో ఆ మతం అంతగా పురోగమించలేదని తెలిసిపోతుంది. రవాణా సదుపాయాలు పెరగిన తర్వాత భక్తులు గుట్టపై రాళ్లు పేర్చటానికి బదులుగా నవిలిన కోకా ఆకును ఆ రాళ్ల గుట్టపైకి ఊస్తున్నారు. దీంతో భూమాతతో వారికి కొత్త సమస్యలు తలెత్తుతున్నాయి.

స్వంత ఇండియన్‌ల గురించి, ఒకప్పటి శక్తివంతమైన ఐమారా తెగ ఇంకా తెగల సైన్యాలకు అడ్డుకట్టవేయటం వంటి వాటి గురించి మాట్లాడుతున్నప్పుడు ఈ ఉపాధ్యాయుని గొంతు ఖంగు ఖంగు మంటోంది. ఇప్పటి ఇండియన్ తెగల ప్రజల గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు మాత్రం నీరసంగా ఉంటుంది. ఇప్పటి ప్రజలు ఆధునిక నాగరిక ప్రజల చేతుల్లోను, వారికి బంట్లుగా మారిన వారి చేతుల్లోనే పెద్దఎత్తున దోపిడీకి గురవుతున్నారు. హింసకు లోనవుతున్నారు. ఐమారాలకు శతృవులైన మెస్టిజోస్‌ల చేతుల్లో దాడులకు గురవుతున్నారు. ఐమారాలను అప్పటికి ఇప్పటికీ పోల్చి చూస్తే ఇరువురు రెండు భిన్న ధృవాలకు చెందిన వారుగా కనిపిస్తున్నారు. వ్యక్తులకు తమ ప్రపంచానికి సంబంధించిన అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, విద్యావసతి కల్పించాలని, తమ ప్రపంచంలోనే తాము ఉపయోగకరమైన పాత్ర పోషించేలా వారికి శిక్షణ ఇవ్వాలని, క్లుప్తంగా ప్రస్తుత విద్యావ్యవస్థను మౌలికంగానే మార్చివేయాలని అభిప్రాయాలు వ్యక్తం చేశాడు. ఇప్పటి విద్యా వ్యవస్థ వారిని కేవలం సిగ్గుతో తలవంచుకునే వారిగానే తయారు చేస్తోందని ఆక్రోశం వ్యక్తం చేశాడు. ఈ విద్యావిధానంలో శిక్షణ పొందిన వారు తోటి ఇండియన్ తెగల ప్రజలకు కూడా సహాయం చేయలేకపోతున్నారని, వారిని గుర్తించటాన్ని వ్యతిరేకిస్తున్న తెల్లజాతి సమాజంలో ఉన్న అంతరాలతో కొట్టుకు పోతున్నారని ఆ ఉపాధ్యాయుడు అభిప్రాయపడ్డాడు. అటువంటి దురదృష్టవంతులైన విద్యావంతులు ఏవో కొన్ని దిగువ స్థాయి ప్రభుత్వ ఉద్యోగాలతో తృప్తి పడిపోతున్నారు. అటువంటి మరో పదవి తమ పిల్లలకు దక్కితే చాలుననుకుని తనువులు చాలిస్తున్నారు. వాళ్ల రక్తంలో కేవలం ఒక్క బొట్టు వలసవాదుల రక్తాన్ని వంటపట్టించుకున్న దాని ఫలితమే ఇదంతా అన్నది ఆయన అభిప్రాయం. ఏదోఒకవిధంగా తమ లక్ష్యాలు సాధించుకోవచ్చని ఆఖరి

క్షణం వరకు ఎదురు చూస్తూ ఉంటారు. ఈ విధంగా మాట్లాడటం ద్వారా అతను ఒక విషయాన్ని స్పష్టం చేశాడు. ఎవరైతే తమ దురదృష్టానికి బలవుతారో అటువంటివారికి ఈ ఫలితాలు తప్పవన్నది ఆయన వాదన సారాంశం. దానికి తగ్గట్లుగా కొన్ని ఉదాహరణలు కూడా చూపించాడు. ఏ విద్యావిధానం వల్ల వ్యక్తిత్వం కోల్పోతున్నారని అతను విమర్శిస్తున్నాడో తాను అదే విద్యావిధానపు ఉత్పత్తి కాదా? మెస్టిజో మహిళలు స్థానిక రాజకీయ పెత్తందారులకు తార్చబడటం ద్వారా తమ సంతానానికి వలసవాదుల రక్తం వల్ల వచ్చే రాయితీలు పొందాలకునే కోవకు చెందిన వాడు కాదా. ఈ స్థానిక రాజకీయ పెత్తం దారు కూడా ఆక్రమించుకోవటానికి వచ్చిన స్పెయిన్ వ్యక్తులు తాగిన మైకంలో స్థానిక మహిళలపై అత్యాచారానికి ఒడిగట్టిన ఫలితంగా పుట్టినవారే కదా?

మా ప్రయాణం దాదాపుగా ముగింపుకొచ్చింది. ఉపాధ్యాయుడు కూడా నిశ్శబ్దంలో మునిగిపోయాడు. ఒక మూలమలుపు తర్వాత వచ్చిన బ్రిడ్జి మీదుగా మేము నదిని దాటాము. మేము మొదట చూసినప్పుడు కొండల నడుమ చిన్న ప్రవాహంలాగా ఉన్న నీటిపాయే ఈ నదిగా మారింది. ఇల్లావ్ ఆ నదికి ఆవలి వైపున ఉంది.



# సూర్య సరస్సు

ఆ మహాసరస్సు తన సౌందర్యంలో రవ్వంత మాత్రమే ప్రదర్శిస్తోంది. ప్యునో సరస్సు ఒడ్డు ఇరుకైన నాలిక ఆకారంలో ఉన్న ప్రాంతానికి చుట్టుకుని ఉంది. దీంతో పూర్తి రూపం మరుగున పడింది. సరస్సు ప్రారంభంలో కొన్ని చేపల వేటకు ఉపయోగించే పడవలు కట్టివేయబడి ఉన్నాయి. సరస్సులో ఎర్రరంగు పక్షులు అటూ ఇటూ ఎగురుతున్నాయి. గాలి చల్లగా వీస్తోంది. ఆకాశంలో మేఘాలు మా మదిలో ఆలోచనల్లాగా చిందరవందరగా ఉన్నాయి. మేము ఇల్ల్యావ్‌లో ఆగకుండా నేరుగా ప్యునో వచ్చి, స్థానికంగా ఒక లాడ్జిలో బస సంపాదించి, మంచి రుచికరమైన భోజనమే చేసినప్పటికీ మా అదృష్టం

మమ్ములను వదిలిపోయినట్లు అనిపిస్తోంది. ఆ ప్రాంతంలో బాధ్యతలు చూస్తున్న సైనికాధికారి (కమాండింగ్ ఆఫీసరు) మాకు తలుపు చూపిస్తూ బయటకు పోవాలని ఆదేశించాడు. సౌమ్యంగానే. అది సరిహద్దు తనిఖీ కేంద్రం అయినందున విదేశీ పౌరులు రాత్రుళ్లు బసచేయటం నిషేధం అని వివరించాడు.

ఆ సరస్సు అందాలు తప్పితీయకుండా వెళ్లటం మాకు ఇష్టం లేదు. దాంతో సరస్సు ఒడ్డుకు వెళ్లి ఎవరైనా మమ్ములను బోటు షికారుకు తీసుకెళ్లేవాళ్లు దొరుకుతారా అని వెతికాము. అటువంటి షికారులోనే సరస్సు సౌందర్యాన్ని పూర్తిగా ఆస్వాదించగలము. మత్స్య కార్మికులందరూ నిఖార్సయిన ఐమారా తెగ ప్రజలు కావటంతో అక్కడ స్పెయిన్ భాష తెలిసిన వ్యక్తిని దుబాసిగా పెట్టుకున్నాము. కేవలం ఐదు సోల్స్‌కే మా ఇద్దరినీ మాకు ఈ ప్రాంత విశేషాలు తెలియచేయటానికి వచ్చిన దుబాసినీ సరస్సుమీద షికారుకు తీసుకెళ్లటానికి అంగీకరించారు. మొదట సరస్సులో ఈతవేయాలనుకున్నాము. కానీ మా మునివేళ్లతో నీళ్లలో చలి తీవ్రతను పరిశీలించాక అది మంచిది కాదనిపించింది (అల్బెర్టో బట్టలు, బూట్లు విప్పేసి హడావుడి చేశాడు. చివరకు మరో మార్గం లేకపోవటంతో నోరుమూసుకుని యధాతథ స్థితికి వచ్చాడు).

విశాల ప్రాంతంలో చిన్న చిన్న బిందులు విస్తరించినట్లుగా మా బోటు మీద నుండి బొలీవియా సరిహద్దుకు, ప్యునోక మధ్యలో విహరిస్తున్న మరో బోటులోకి వెళ్లి తేనీరు దొరుకుతుందేమో అని ఆశగా చూశాము. అయితే ఉత్తర బొలీవియా ప్రాంతంలో మటే దాదాపుగా సేవించరు. ఇంకా చెప్పాలంటే వారు దాని గురించి వినికూడా ఉండరు. దాంతో మాకు అరకిలోకూడా దొరకలేదు. మేము ఎక్కిన బోటు ఇంగ్లాండ్‌లో డిజైన్ చేయబడి స్థానికంగా నిర్మించబడినది. దాని సౌందర్యం స్థానిక ప్రాంత పేదరికంతో ఘర్షణ పడుతోంది.

మేము లాడ్జి వదిలి స్థానికంగా ఉన్న పౌర రక్షక దళాధికారి నివాసంలోకి మారటంతో మా బస సమస్య పరిష్కారం అయ్యింది. అక్కడ ఒక లెఫ్టినెంట్ ర్యాంకు అధికారి మమ్ములను సాదరంగా ఆహ్వానించి మాకు మంచి వసతి కల్పించాడు. అనధికారికంగానే అయినా మమ్ములను బాగా చూసుకున్నాడు. మా ఇద్దరికీ ఒక్కటే మంచం ఇచ్చినా ఇద్దరమూ విడిగా నిద్రపోయాము. మరునాడు స్థానికంగా ఉన్న చర్చిని ఆసక్తిగా సందర్శించాము. అక్కడ నుండి ఒక ట్రక్కు కుజ్‌కోకు వెళ్ళటానికి సిద్ధం అవుతుందని తెలుసుకున్నాము. ప్రస్తుతం కుజ్‌కోలో నివసిస్తున్న కుష్టు వ్యాధి మాజీ వైద్యుడు డాక్టర్ హెర్మోసాకు ప్యునోలో వైద్యుడు మా గురించి రాసిన పరిచయ పత్రం మా వద్ద ఉంది.

# వినూత్న ప్రపంచం దిశగా

మా ఈ ప్రయాణంలో మొదటి అంకం సాఫీగానే సాగింది. ట్రక్కు డ్రైవరు మమ్ములను జులియాకావద్ద దింపాడు. అక్కడ నుండి మా గమ్యాన్ని చేరుకోవటానికి ఉత్తర దిక్కుగా వెళ్లే మరో వాహనం పట్టుకోవాలి. ప్యునోలో ఉన్న పౌర పోలీసు అధికారి సలహా మేరకే జులియాకాలో స్థానిక పోలీసు స్టేషన్‌కు వెళ్లాము. అక్కడ బాగా తాగిపడి ఉన్న సార్జెంటు ఒకరు కనిపించారు. మమ్ములను తాకుతూ తాగటానికి రమ్మని ఆహ్వానించాడు. అందరికీ బీరు ఇవ్వాలని ఆదేశించాడు. అది తీసుకున్న తర్వాత నేను తప్ప అందరూ మైకంలోకి వెళ్లిపోయారు.

"ఏమిటి సంగతి మిత్రమా, మీరు తాగలేదు"

"అటువంటిదేమీ లేదు. మా దేశంలో ఇటువంటిది సాధారణంగా తీసుకోము. మరేమీ అనుకోవద్దు. భోజనం చేసేటప్పుడు మాత్రమే మద్యం తీసుకుంటాము."

"కానీ చీ తీసుకోవచ్చు కదా" అన్నాడతను. ముక్కుతో మాట్లాడుతూ మా దేశంలో ఒక తిండి పదార్థం గురించి చెప్తున్నాడు. "ఏమంటావు" అంటూ చప్పట్లు కొట్టి అక్కడ ఉన్న సర్వరుకు ఆదేశాలిచ్చాడు వెన్నతో శాండ్‌విచ్ తెమ్మని ఆదేశాలిచ్చాడు. దాంతో నాకు సంతృప్తి కలిగింది. ఆ తర్వాత పూర్తి మైకంలో ఉన్న అతను గతంలో తాను చేసిన అనేక సాహసాల గురించిన వర్ణనలు వినిపించటంలో మునిగిపోయాడు. ఈ ప్రాంతంలో అతనికి ప్రజలు ఏ విధంగా గౌరవం ఇస్తోంది చెప్పుకుంటూ పోతున్నాడు. ఆ విషయాన్ని రుజువు చేయటానికి తన మొలకు వేలాడుతున్న తుపాకి చేతుల్లోకి తీసుకుని అల్బెర్టో వైపు చూస్తూ "చూడరా, నువ్వు 20 మీటర్ల దూరంలో వెళ్లి నోట్లో సిగరెట్టు పెట్టుకుని నిలబడు. నా మొదటి బుల్లెట్‌తో నీ సిగరెట్ వెలిగించలేకపోతే నేను మీకు 50 సోల్స్ ఇస్తాను" అన్నాడు. అంత మొత్తం డబ్బులమీద ఆశలేని అల్బెర్టో తన కుర్చీలోంచి కదల్లేదు. "సరే 100" అన్నాడు. అయినా అల్బెర్టో కదల్లేదు.

సార్జెంటు 200 సోల్స్ తీసి మేజా బల్ల మీద పెట్టిన తర్వాత అల్బెర్టో కళ్లల్లో వెలుగు కనిపించింది. సందేహాస్పదంగా చూశాడు. ఆ చూపులో తనను తాను కాపాడుకోవాలన్న తపన బాగా కనిపించింది. దాంతో కుర్చీ నుండి కదల్లేదు. దీంతో సార్జెంట్ తన టోపీ తీసి పక్కన పెట్టి అద్దంలో గుండా చూస్తూ నాణేన్ని పైకి ఎగరవేసి గురి చూసి కాల్చాడు. టోపీ శుభ్రంగానే ఉంది. కానీ గోడ పగిలింది. బారు యజమాని కేకలు వేసుకుంటూ పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయటాకి వెళ్లాడు.

మరికొద్ది సేపటిలో అక్కడ జరుగుతున్నదేమిటో తెలుసుకోవటానికి ఒక అధికారి బారుకు వచ్చాడు. సార్జెంట్‌పై కేకలు వేస్తూ ఒక మూలకు తీసుకెళ్లాడు. అతనితో మాట్లాడటానికి. అతని తిరిగి మమ్ములను కలుసుకున్న తర్వాత నా తోటి ప్రయాణీకుడిపై దాదాపు యుద్ధమే మొదలుపెట్టాడు. “చూడు అర్జెంటీనా మిత్రమా, ఇప్పుడు నీవు చూసిన తరహాలో గురిచూసి కాల్చగల వాడిని గతంలో ఎక్కడైనా చూశావా” అని ప్రశ్నించాడు. దీనికి స్పందించిన అల్బెర్టో అతని మొఖం చూస్తే అమాయకత్వం కనిపిస్తోందంటూ పరుగులెత్తాడు. బహిరంగ స్థలాల్లో ఈ విధంగా తుపాకీకి పని చెప్తున్నందుకు సదరు అధికారి సార్జెంట్‌ను కోపగించుకున్నాడు. బారు యజమాని వంక చూస్తూ జరిగిందేదో జరిగిపోయింది కదా, గోడ మీద తుపాకి కాల్పుల గుర్తులు లేకుండా చేసి శుభ్రం చేసుకో అని సలహా ఇచ్చాడు. సార్జెంట్ కూర్చున్న చోట నుండి కొద్దిగా అవతలకు జరగమని అడగటానికి అక్కడ పని చేస్తున్న మహిళ వెళ్లింది. అక్కడ నిక్కదన్ని నిల్చున్నాడు సార్జెంట్. అంతలోనే తనలో తాను ఒక అభిప్రాయానికి వచ్చిన మహిళ నోరు మూసుకొంది. లేనిపక్షంలో అల్బెర్టో చేత తిట్లు తినాల్సి వచ్చేది. “అర్జెంటీనా వాళ్లు అంతా తమదే అనుకుంటారు” అని మొదలు పెట్టింది. మేము ఆ ప్రాంతం వదిలేలోగా మరికొన్ని చివాట్లు వినాల్సి వచ్చింది. మాలో ఒకరం బీరు అందకుండా పోయిందని ఆలోచిస్తుంటే మరొకరం శాండ్‌విచ్ చేజారిందని విచారంగా ఉన్నాము.

లిమా నుండి ఇద్దరు యువకులు ప్రయాణిస్తున్న మరో ట్రక్కు మాకు తటస్థించింది. మౌనంగా ఉండే ఇండియన్‌ల కంటే తాము ఎంతో మెరుగని పదే పదే నిరూపించుకోవటానికి వాళ్లు శాయశక్తులా ప్రయత్నిస్తూ వచ్చారు. వాళ్ల గొప్పలు విన్నామే తప్ప వాటికి స్పందించలేదు. మొదటిగా మేము మరో దిశగా ఆలోచించాము. వాళ్లపై శ్రద్ధ పెట్టలేదు. అయితే మైదాన ప్రాంతం గుండా ఉదాశీనంగా ప్రయాణించాల్సి రావటంతో మధ్య మధ్యలో ఒకటి రెండు మాటలు మాట్లాడాల్సి వచ్చింది. అదికూడా ఆ వాహనంలో ఉన్న ఇతర శ్వేతజాతీయులతోనే. ఎందుకంటే మా పట్ల ఆశ్చర్యంగా చూస్తున్న ఇండియన్‌లు

మా ప్రశ్నలకు జవాబులు ఇచ్చే పరిస్థితిలో లేరు. అందువల్ల మేము ఆ శ్వేతజాతీయులతో తప్ప మరెవ్వరితోను మాట్లాడే పరిస్థితి లేకపోయింది. మేము అడిగిన ఏ ప్రశ్నకైనా ఇండియన్‌లు ఒకే తరహా జవాబు ఇస్తూ వచ్చారు. నిజం చెప్పాలంటే లిమా నుండి వస్తున్న ఈ యువకులు సాధారణంగానే ఉన్నారు. వాళ్లు తమకు, స్థానిక ఇండియన్లకు మధ్య వ్యత్యాసం ఉందని రుజువు చేసుకోవాలనుకున్నారు. మేము కోకా ఆకులు విపరీతంగా నమలటం మొదలు పెట్టే సరికి మాకు కొత్తగా మిత్రులైన వారు మమ్ములను వెనకేసుకు రావటం మొదలెట్టారు. టాంగోల వరదతో మా పట్ల ఎటువంటి అనుమానం వ్యక్తం చేయని ఆ సహచరులను ముంచెత్తింది.

అయావిరా అనే గ్రామంలో ఉన్న ఆఖరి వీధి లైటు వద్దకు చేరుకున్నాము. అక్కడ మేము ఒక హోటల్‌లో బస చేశాము. దీనికయ్యే ఖర్చును పౌర పోలీసు అధికారే భరించారు. ఆయన ఈ నిర్ణయం పట్ల మేము మాటమాత్రంగా అసంతృప్తి వ్యక్తం చేయటంతో ఆయన " క్షమించాలి" అన్నాడు. " ఇద్దరు అర్జెంటీనా వైద్యులు వారివద్ద డబ్బులు లేనంత మాత్రాన ఎలాపడితే అలా బస చేయాలా? అలా కుదరదు" అన్నాడు. అయితే మాకు వెచ్చని పరుపు దొరికినప్పటికీ మేము కళ్లు మాత్రం మూసుకోలేకపోయాము. అపరిమితంగా మేము తిన్న కోకా మాపై ప్రతీకారం తీర్చుకుంది. రాత్రంతా వాంతులు, బేదులు, తీవ్రమైన తలనొప్పితో గడపాల్సి వచ్చింది. ముక్కులు దిబ్బడేశాయి.

అదే వాహనంలో మరునాడు ఉదయం పెందలకాడే బయలు దేరాము.మధ్యాహ్నానికి సికునాయి చేరుకున్నాము. అప్పటికి తీవ్రమైన జలుబు, వర్షం, ఆకలి మమ్ములను దట్టంగా పట్టేశాయి. ఎప్పటిలాగానే ఆ రాత్రికి పౌరపోలీసు అధికారి స్థావరంలో బస చేశాము. ఎప్పటిలాగా అతను కూడా మమ్ములను బాగా చూసుకున్నాడు. సికునాయి మీదుగా ఒక చిన్న నది విల్కానోటా ప్రవహిస్తుంది. ఆ నదీ ప్రవాహాన్ని అనుసరించి మేము ముందుకు సాగుతున్నాము. కొద్దిసేపటికి సముద్రపు మన్ను తగిలింది.

సికునాయి మార్కెట్‌లో అన్ని దుకాణాలకు పెద్దఎత్తున రంగులు పులిమి ఉన్నాయి. అమ్మకం దారుల కేకలు, అరుపులతో మార్కెట్ గింగిర్లు కొడుతోంది. సంతకు వచ్చిన వారు కూడా ఈ గందరగోళానికి తమ వంతు సహాయం చేస్తుండగా మేము ఒక మూలన కొందరు గుమికూడటం గమనించాము. అదేమిటో తెలుసుకోవటానికి అక్కడకు వెళ్లాము.

అక్కడ నిశ్శబ్దంగా ఒక ప్రదర్శన సాగుతోంది. ప్రదర్శనకు అగ్రభాగాన శరీరానికి రంగులు పట్టించిన సాధువులు నడుస్తున్నారు. కొందరు నల్ల దుస్తులు ధరించి ఒక

శవపేటికను మోస్తున్నారు. ఆ విధంగా వాళ్లు అంతిమ యాత్రను ముగించారు. అప్పటికే అక్కడ చేరిన మరికొందరు ఈ యాత్రలో పాల్గొన్నారు. మధ్యలో ప్రదర్శన ఒక చోట ఆగింది. నల్ల దుస్తులు ధరించి చేతిలో పేపర్లు పట్టుకొన్న వ్యక్తి ఒకరు ముందుకు వచ్చాడు. “ఈ విలువైన మనిషికి అంతిమ యాత్ర నిర్వహించటం మన కర్తవ్యం” అని ఇంకా ఏదో చెప్తున్నాడు. ఇతను చెప్పటం పూర్తయ్యాక ప్రదర్శన మరికొంత దూరం ముందుకు సాగింది. అక్కడ నల్ల దుస్తులు ధరించిన మరో వ్యక్తి ప్రత్యక్షమయ్యాడు. “ఎవరో ఒకరు చనిపోతూనే ఉన్నారు. కానీ వారు చేసిన మంచి పనులే మనకు గుర్తుండిపోతాయి” అన్నాడు అతను. ఆ విధంగా పేదలు, వృద్ధులు ఎవరో ఒకరు తమ అంతిమయాత్రల్లో ఈ విధంగా తుది గమ్యానికి చేరుకుంటారు. మధ్య మధ్యలో గ్రామస్తుల నుండి తీవ్ర వ్యతిరేకతను అనుభవిస్తుంటారు. వీధుల్లో నిలబడ్డ ప్రతి ఒక్కరు ఒకరిని తోచుకుంటూ ఒకరు శవాన్ని చూపటానికి వస్తున్నారు. ఆ విధంగా వచ్చిన వారు శవాన్ని చూసి అసహ్యించుకోవటమో, అతను బతికున్నప్పుడు చేసిన మంచి పనులు మెచ్చుకోవటమో చేస్తుంటారు.

అక్కడి మరో రోజు ఇదేలాగా ప్రయాణం చేసి కుజ్కో చేరాము.



# నవల

కుజ్కో నగరం ఆకర్షణీయంగా ఉంది. పేరుకు తగ్గట్లే ఉంది. ఏదో పాత యుగానికి చెందిన మట్టితో వీధులు నిండి ఉన్నాయి. కాళ్లు నేలను తాకినప్పుడు పెద్దఎత్తున గాల్లోకి లేస్తోంది. కానీ అక్కడ రెండు, మూడు రకాల ప్రాంతాలు అదే నగరంలో ఉన్నాయి. ఓక్లో మామ తన బంగారు కత్తిని భూమిలోకి దించినప్పుడు ఆ భూమి దాన్ని పూర్తిగా స్వాహా చేసింది. మొదటి తరం ఇన్‌కాలు తమ కులదైవం విరాకోచా భావితరాల కోసం ఎంచుకున్న ప్రాంతం ఇదే అని తెలుసుకున్నారు. ఆ విధంగా ఇన్‌కాలు తమ సంచార

జీవితాన్ని వదిలి ఈ ప్రాంతాన్ని జయించి స్థిరపడిపోయారు. ఈ జాతి నూతన ప్రాంతాల కోసం అన్వేషణ సాగిస్తుండగా విస్తరిస్తున్న తమ సామ్రాజ్యాన్ని గమనిస్తూ వచ్చారు. ఇన్కాలు ఈ నగరం చుట్టూ కంచెలాగా ఏర్పడి ఉన్న పర్వతాల వరుస తమకు అడ్డుకట్ట వేయలేదన్న భావనతో ఉండేవారు. ఇన్కాలలోకి మారిన మిగిలిన సంచార జాతులు కూడా తహువాన్టిన్సుయోకు విస్తరించి ఆ విధంగా జయించిన భూభాగానికి రాజధానిగా మార్చుకున్నారు. ఈ విన్నూత్న ప్రాంతాన్నే కజ్కో అని పిలవటం ప్రారంభించారు. ఇక్కడే సామ్రాజ్యాన్ని పరిరక్షించుకోవటానికి అవసరమైన విధంగా నగరాన్ని నలుదిక్కుల నుండి నగరం, రాజప్రాసాదాలు, దేవాలయాలు శతృవుల బారిన పడకుండా కాపాడుకునేందుకు గాను సక్సాహువామన్ను నిర్మించుకున్నారు. కజ్కోస్ గురించిన పూర్తి దృశ్యం ఈ ప్రాంతాన్ని జయించటానికి వచ్చిన స్పెయిన్ సైన్యాలు మూర్ఖత్వంతో ధ్వంసం చేసిన ప్రాంతాలను చూస్తేగానీ తెలియదు. అదేవిధంగా శిధిలమైన దేవాలయ నిర్మాణాలు, కూలగొట్టబడిన ప్రాసాదాలు ఆ నగరానికి ఉన్న చరిత్రను, దానిపై దాడి చేసిన ఘాతుక జాతిని గుర్తు చేస్తుంటాయి. ఈ నగరం తనను రక్షించటానికి మనలను వీరుడిగా మారమని ఆహ్వానిస్తున్నట్లు ఉంటుంది. ఇన్కాల జీవనం, స్వేచ్ఛల కోసం చేతులు కలపాలని ఆహ్వానిస్తుంది.

నగరానికి పైఎత్తున మరో కజ్కోను కూడా చూడవచ్చు. అక్కడ శిధిలమైన కోటలను పక్కన పెడితే రంగు రంగు రాళ్లతో నిర్మించిన పైకప్పులు, బోరోకు చర్చికి చుట్టూ ఒకే విధంగా ఉన్న నిర్మాణాలు కనిపిస్తాయి. నగరంలోకి ప్రవేశించిన తర్వాత అక్కడ మాకు ఇరుకైన వీధులు మాత్రమే కనిపిస్తున్నాయి. స్థానిక ప్రజలు విలక్షణమైన వేషధారణతో ఉన్నారు. అన్నీ స్థానిక రంగుల్లోనే ఉన్నాయి. ఈ కజ్కోలు మనలను సందిగ్ధంలో ఉన్న పర్యాటకుగా మారమని ఆహ్వానిస్తున్నారు. కనిపించే విషయాల పట్ల మక్కువ పెంచుకోరాదనీ, చూసి చూడనట్లు వదిలేయాలని, శీతాకాలపు ఆకాశం అందాల కింద విశ్రాంతి తీసుకొమ్మని లాగేస్తున్నారు.

అక్కడే మరో కజ్కో కూడా ఉంది. అది చురుకైన నగరం. అది స్పెయిన్ పేరుమీద ఈ ప్రాంతాన్ని జయించిన ధీరుల సాహసానికి ప్రతిబింబంగా ఉంటుంది. కజ్కోను అక్కడ పురావస్తుశాల, గ్రంథాలయం, చర్చిల్లోనే చూడాల్సి ఉంటుంది. అక్కడ కనిపించే శ్వేతజాతి పెద్దలు ఇప్పటికీ ఈ విధంగా జయించటం గర్వించదగిన అంశం అని అభిప్రాయపడుతుంటారు. ఈ కజ్కో మనలను ఆయుధాలు ధరించి గుర్రం ఎక్కి రక్షణ లేని ఇండియన్ల శరీరాలు చీల్చుకుంటూ పొమ్మని ప్రోత్సహిస్తుంది. అక్కడ ఈ రక్కసి పదఘట్టనల కింద మానవ జీవితాలు శిధిలమవుతూ ఉంటాయి.

ఈ మూడు కజ్కోలను దేనికి దానికే చూసి మెచ్చుకోవాలి. మేము అక్కడ నివసించిన సమయంలో మూడింటికి సమాన ప్రాధాన్యత ఇచ్చాము.



# ఇన్కాల జన్మస్థలం

కజ్కో పట్టణం చుట్టూ పర్వతాలు పేరుకుపోయి ఉన్నాయి. ఈ పర్వతాలు కజ్కోకు రక్షణ కల్పించే కంటే వారి నివాసాలకు ప్రమాదకరంగా మారేందుకే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. తమను తాము రక్షించుకోవటానికి ఇన్కాలు సక్సాహువామన్ అనే ప్రాంతంలో విశాలమైన కోటను నిర్మించారు. పైపైన చూసే వారికి ఈ వర్ణన సంతృప్తికలిగించేదిగానే ఉంటుంది. అయితే ఈ వర్ణను మాత్రం నేను అంగీకరించలేను. దానికి కారణాలు స్పష్టమే. ఆ నగరానికి పురాతన కోట ప్రధాన కేంద్రంగా పని చేసిందన్న వరకు వాస్తవమే అయి ఉండవచ్చు. సంచార జీవితం నుండి స్థిర జీవితానికి అలవాటు పడ్డ తొలిదశలో ఇన్కాలు కేవలం పెద్దఎత్తున కోరికలు, లక్ష్యాలు కలిగిన జాతి అని చెప్పటం సమంజసం కాదు. ఆ విధంగా స్థిరపడ్డ ప్రజలను శక్తివంతమైన ప్రత్యర్థుల దాడి నుండి కాపాడుకోవటానికి సక్సాహువామన్ అనువైన ప్రాంతం అని చెప్పవచ్చు. విశాలమైన కోట గోడలు పరిశీలిస్తే ఈ వర్ణన సమంజసంగా ఉందని చెప్పవచ్చు. ఈ విధంగా నగరం రెండు విధాలుగా ఉపయోగ పడింది. కేవలం శత్రు సైన్యాలను తిప్పికొట్టటమే ఈ కోట నిర్మాణం వెనుక ప్రధాన ఉద్దేశ్యం అని చెపితే నమ్మటం కాస్తంత కష్టమే. అది కూడా మిగిలిన భూభాగమంతా ఎటువంటి రక్షణ మార్గాలు లేకుండా వదిలేయటం ఈ అభిప్రాయాన్ని మరింత బలపరుస్తోంది. ఈ కోట నిర్మాణంలో మరో ప్రత్యేకత కూడా ఉంది. నగరానికి సమీపంలో ఉన్న రెండు లోయలపైనా ఆధిపత్యం కలిగి ఉండే విధంగా ఉండటం ఆ రెండో ప్రత్యేకత. నిర్మాణం తీరును పరిశీలిస్తే ఒక వేళ శత్రుసైన్యాలు ప్రవేశించినప్పుడు మూడు దశల్లో ఆత్మరక్షణ విధానాలు

అవలంభించేందుకు వీలుగా ఉంది. శతృసైన్యాన్ని బందీగా ఉంచేందుకు ఈ మూడు దశల్లోను ఏర్పాట్లు ఉన్నాయి. ఈ మూడు రక్షణ వలయాలను అధిగమిస్తూ శతృసైన్యం పురోగమిస్తే అటువంటప్పుడు వాళ్లను నిలువరించటానికి కూడా ఏర్పాట్లు ఉన్నాయి. దాడిని ఎదుర్కొంటున్న వాళ్లు ప్రతిదాడికి సిద్ధమవుతూ మరోవైపున దాడికి పాల్పడుతున్న సైన్యాలతో బేరసారాలు ఆడటానికి అవసరమైన సమయాన్ని ఇచ్చేవిగా ఈ నిర్మాణాలున్నాయి.

ఇవి, వీటిననుసరించి నగరానికి వచ్చిన కీర్తి ప్రతిష్టలు గమనిస్తే కచువా సైన్యాలు తమ రక్షణ వ్యవస్థలను కాపాడుకోవటంలో విజయవంతం అయ్యారని, ప్రత్యర్ధి సైన్యాల నుండి వస్తున్న దాడులు పదే పదే నిలువరించారని తెలుస్తోంది. ఈ రకమైన రక్షణాత్మక విధానాలు ఆ ప్రజలకు విన్నూత్న విషయాలు కనుక్కోవటం పట్ల ఆసక్తి ఉందన్న విషయాన్ని రుజువు చేస్తోంది. గణితంలో ప్రవేశం ఉన్నట్లుగా కనిపిస్తోంది. అదేవిధంగా ఈ ప్రజలు ఇన్‌కాలకు పూర్వపు దశలో ఉన్న నాగరిక జీవితంలో భౌతిక జీవితాలను సమృద్ధిగా అనుభవించారని, కచువాలు సాధించలేని సాంస్కృతిక అభివృద్ధిని వీరు సాధించారని అయితే కళలు, నిర్మాణంలో మెరుగైన ప్రగతిని ప్రదర్శించారని నాకు అనిపిస్తోంది. కచువా సైన్యాలు శక్తి సామర్ధ్యాల కారణంగా దాడికి వచ్చిన అన్ని స్థానిక జాతులు కజ్కోను దాటి ముందుకు వెళ్లలేకపోయారు. తద్వారా వాళ్లు ఏర్పాటుచేసుకున్న రక్షణ వలయాలను కోటతో సహా కాపాడుకున్నారు. అయితే ఈ అభివృద్ధి చెందుతున్న జాతిని ఈ ప్రయత్నాలు నిలువరించలేక పోయాయని, అందువల్ల ఈ జాతి పొరుగునున్న ఇతర లోయల్లోకి కూడా విస్తరించిందని ఆ విధంగా ఆ లోయల్లోని జలవనరులు కూడా ఉపయోగించుకున్నారని భావిస్తున్నాను. ప్రస్తుత కీర్తి ప్రతిష్టల గురించి వారికి ఎంతో అవగాహన ఉన్న ఈ ప్రజలు తమ గతం గురించి దృష్టి సారించారు. గతంలోను, ఇప్పుడు తాము, తమ జాతి కనబరుస్తున్న ఆధిపత్యానికి మూలాలు ఏమిటో తెలుసుకునే ప్రయత్నం, శోధించే ప్రయత్నం చేశారు. ఏ దేవుని దయతో ఈ ప్రజలు ఈనాడున్న ఆధిపత్య స్థాయికి చేరుకున్నారో ఆ దేవుడిని కొలిచేందుకు దేవాలయాలు నిర్మించుకున్నారు. ఆ దేవాలయాల్లో దైనందిన కార్యాలు చూసేందుకు పూజారుల కులం తయారైంది. ఆ విధంగా తమ గొప్పదనాన్ని రాళ్లల్లో పదిలపర్చుకుంటూ కజ్కో పట్టణం క్రమంగా నగరంగా విస్తరించింది. ఈ నగరాన్ని చివరిగా స్పెయిన్ దేశస్తులు జయించారు.

ఈనాటికి కూడా (స్పెయిన్ దేశస్తులు ఈ ప్రాంతంపై) సాధించిన విజయం ఎంత క్రూరమైనదో బాహాటంగా తెలియచేసేందుగాను అనేక చర్యలు తీసుకోబడ్డాయి.

వీటి ఫలితంగా ఒకప్పుడు అజేయంగా ఉన్న ఇన్‌కా తెగ ఇప్పుడు అంతరించి పోతోంది. కానీ వాళ్లు నిర్మించిన రాతి నిర్మాణాలు మాత్రం చెక్కు చెదరకుండా నిలిచాయి. కాలం సృష్టించిన అవాంతరాలు అధిగమించి నిలిచాయి. అప్పటికే ఓడిపోయిన నగరాన్ని తెల్లజాతి సైన్యాలు ధ్వంసం చేస్తూ ఇన్‌కాల దేవాలయాలను అడ్డు అదుపు లేని సమరోత్సాహంతో కూలగొట్టటం ప్రారంభించారు. ఇంతి అనే పేరుతో వ్యవహరించే సూర్యభగవానుడి దేవాలయంలో గోడలకు తాపడం చేసిన బంగారాన్ని దోచుకునే తమ ప్రయత్నంలో అందరూ ఒక్కటయ్యారు. ఈ విధంగా సంతోషకరమైన ఒక జాతికిగుర్తుగా వారు ఈ సంపద దోచుకుపోయారు. ప్రస్తుతం అన్నార్తులుగా మారిన ఈ ప్రజలు ఒకప్పుడు ఎంతో ఆహ్లాదకర జీవితాన్ని అందించారు. ఇంతి దేవాలయాలు నేలమట్టం చేయటమో, ఆ దేవాలయాల గోడలు నూతన మత చిహ్నాలైన చర్చిలకు కేంద్రాలకు మార్చటం వంటి అనేక చర్యలకు ఒడిగట్టారు స్పెయిన్ దేశస్తులు. విశాలమైన రాజభవనం ఉన్న చోట ఇప్పుడు కాథడ్రల్‌ను నిర్మించారు. ఒకప్పుడు ఇంతి సూర్యదేవాలయాన్ని మోసిన గోడలు ఇప్పుడు శాన్ డామింగో చర్చిని మోస్తున్నాయి. అది విజేతలు అందించిన శిక్ష, నేర్పిన గుణపాఠం కూడా. అయినా తరచుగా అమెరికా ప్రాంతానికి హృదయ స్థానాన్ని ఆక్రమించిన ఈ ప్రాంతంలో అంతులేని పీడన, అణచివేత ఆండిస్ వెన్నుల్లో వణుకు పుట్టిస్తోంది. దీంతో పెను ఉప్పెన లేస్తోంది. పగిలిన రాళ్ల శబ్దానికి శాన్ డామింగో గోపురం మూడు సార్లు కిందపడిపోయింది. అప్పటికే శిథిలావస్థలో ఉన్న గోడలు కూడా కూలిపోయాయి. అయినా వాటిని నిలబెట్టిన పునాదులు మాత్రం చెక్కు చెదరలేదు. సూర్యదేవాలయం నిలిచి ఉన్న చోట బూదరరంగు రాళ్ళు ఇప్పటికీ దర్శనం ఇస్తుంటాయి. అయినా అణచివేతకు పాల్పడిన వాళ్లు ఎంత ఘోరంగా వ్యవహరించినా అక్కడి నుండి ఒక్క రాయిని కూడా కదిలించలేకపోయారు.

ఇన్‌కా తెగకు జరిగిన అవమానం కంటే కాన్ ప్రతీకారం తీర్చుకోవటానికి చేసిన ప్రయత్నం చిన్నదిగానే ఉంది. తమను కాపాడుతున్న దేవుళ్ళను ఆ బూదర రంగు రాళ్లు ప్రార్థించి ప్రార్థించి అలసిపోయాయి. విజేతలైన జాతిని నాశనం చేయమని వేడుకున్నాయి. కానీ ఇప్పుడు అవి కూడా కేవలం ఆ ప్రాంతాన్ని సందర్శించే పర్యాటకులకు తమ గోడుకు వినిపించేందుకా అన్నట్లు మిగిలిపోయాయి. ఇటుకల నిర్మాణంలో అందెవేసిన, ఆర్చిలు తయారు చేయటం చేయితిరిగిన ఈ తెల్లజాతి ప్రజలు ఇన్‌కా రోక్కా భవనం కట్టడానికి ఉపయోగించిన రాళ్లు, శిల్పకళను ధ్వంసం చేస్తున్నప్పుడు ఎంత పరిజ్ఞానం ఉంటే మాత్రం ప్రయోజనం ఏమిటి?

ఆగ్రహం చెందిన ఇండియన్‌లు తమ దేవుళ్లు విజేతలపై దారుణంగా కక్ష సాధిస్తారని ఎదురు చూస్తున్నారు. కానీ దానికి బదులుగా చర్చిలు ఆకాశం ఎత్తున లేవటాన్ని, కనీసం గతం ఉన్న విషయాన్ని కూడా కప్పిపెట్టే ప్రయత్నాలను చూస్తున్నారు. ఇన్‌కా రోకా భవనంలోని ఆరు మీటర్ల ఎత్తున్న గోడలు కేవలం తమ వలస పాలకుల భవనాల ఎత్తు కొలవటానికి మాత్రమే ఉపయోగపడ్డాయి. ఆవిధంగా నిర్మితమైన రాతి నిర్మాణాల కింద ఓడిపోయిన జాతి గొంతులు చేస్తున్న గోల వినిపిస్తోంది.

కానీ ఈ జాతి ఒల్లాంటే వంటి అద్భుత కళా ఖండాలు సృష్టించింది. అటువంటి జాతి కజ్కో రూపంలో తన పాతతరం జ్ఞాపకాలను, వీరోచిత గతాన్ని వదిలిపెట్టింది. విల్కనోటా, ఉరుబంబా నదుల పొడవునా వంద కిలోమీటర్ల నిడివిలో ఇన్‌కాల గతం విస్తరించి ఉంది. వాటన్నింటిలో ఎల్లప్పుడూ ముఖ్యమైనవి నిలువెత్తున ఉన్న పర్వతాలు. ఈ కొండల్లోనే ఇన్‌కాలు నిర్మించుకున్న కోట దుర్భేధ్యంగా నిలిచి ఉంది. మెరుపుదాడులను సైతం తట్టుకుని ఈ కోట నిలిచింది. రెండు గంటల పాటు రాళ్ల మార్గంలో ప్రయాణించిన తర్వాత మేము పిసాక్ పర్వత శిఖరానికి చేరుకున్నాము. మాకంటే స్పెయిన్ దేశస్తులు కత్తులతో ఇక్కడకు చేరుకున్న మాట వాస్తవమే. ఈ ప్రయత్నంలో స్పెయిన్ సైన్యం పిసాక్ చుట్టూ ఏర్పాటైన రక్షణ వలయాన్ని, రక్షకులను, చివరకు దేవాలయాలను కూడా ధ్వంసం చేస్తూ పోయారు. ఈ దాడులు ప్రతిదాడుల్లో పైకిలేచిన రాళ్ల ముక్కలు చూస్తే ఒకప్పుడు అది పటిష్టమైన కట్టడంగా ఉండేదన్న విషయాన్ని మనం అంగీకరించక తప్పదు. అక్కడ ఇంటివాతనా నివసించాడు. అంతే కాదు. మిట్టమధ్యాహ్నం మండే సూర్యుడిని పట్టి బంధించాడు కూడా. (దేవాలయంలో) అక్కడే పూజాదికాలు క్రమం తప్పకుండా చూసేందుకు అర్చకులు నివసించిన ప్రదేశం కూడా ఇదే. ఇప్పుడు అందులో మిగిలింది దాదాపు శూన్యం. విల్కనోటా ప్రవాహం వెంట నడుస్తూ మధ్య మధ్యలో అంతగా ప్రాధాన్యం లేని ఒకటి రెండు స్థలాలు చూసుకుంటూ మేము ఒల్లాంటిటాంబోను చేరుకున్నాము. మంకో 2 స్పెయిన్ దాడులకు వ్యతిరేకంగా ఆయుధం పట్టి నిలిచిన విశాలమైన కోట ఇక్కడ ఉంది. ఇక్కడే హెర్నాడో పిజ్జారో దళాలను ప్రతిఘటిస్తూ నాలుగు ఇన్‌కా తెగలను కలుపుకుని చిన్నపాటి సామ్రాజ్యాన్ని నిర్మించింది ఇక్కడే. మంకో రాజ్య ప్రతినిధిని కజ్కో నగర కూడలిలో వైస్రాయ్ టోలెడో ఆదేశాల మేరకు హతమార్చేంత వరకు ఇన్‌కా సామ్రాజ్యం, స్పెయిన్ ప్రభుత్వం రెండు పక్కపక్కనే మనుగడ సాగించాయి.

100 మీటర్ల ఎత్తున్న పెద్ద రాతి పర్వతం నేరుగా రియో విల్కానోటాపైకి వాలినట్లుంది. శికరాగ్రాన ఉన్న కోటకు రెండో వైపున పర్వతాల మధ్య నుండి ముందుకు

సాగిపోతున్న ఇరుకైన మార్గాలతో కలపబడి ఉంది. ఈ మార్గం పొడవునా పటిష్టమైన రక్షణ ఏర్పాట్లున్నాయి. ఈ రాళ్లనిర్మాణం కోట పైకి వచ్చే ఎటువంటి దాడినైనా తేలికగా నిలువరించగలదు. ఈ నిర్మాణంలో దిగువన ఉన్న భాగం కేవలం ఆత్మకరక్షణ అవసరాల దృష్ట్యా నిర్మించబడింది. తక్కువ లోతట్టు ప్రాంతంలో ఉన్న దీన్ని 20 భాగాలుగా విడదీసి అన్ని స్థాయిలో రక్షణ వలయాలు ఏర్పాటు చేయబడ్డాయి. తద్వారా ఈ ప్రాంతంలో దాడికి వచ్చే సైన్యాలపై రెండు వైపుల నుండి ప్రతిదాడి చేయటానికి వీలుగా ఈ నిర్మాణం ఉంది. కోటకు ఎగువ భాగాన సైనిక ఆవాసాలు, వారు చేసిన దోపిడీ సొమ్మును నిలువ ఉంచేందుకు ఉపయోగించే దేవాలయం విలువైన లోహాల రూపంలో ఉన్నాయి. అయితే అందులో ప్రస్తుతం గుర్తు పెట్టుకోవటానికి వీసమెత్తు కూడా మిగల్లేదు. చివరకు దేవాలయం కోసం ఉపయోగించిన భారీ రాళ్లు కూడా అక్కడ నుండి తొలగించబడ్డాయి.

సస్కాహువామాన్ సమీపంలో రోడ్డు తిరిగి కజ్కోను చేరుకొంటోంది. ఇన్‌కాల నిర్మాణ శైలిలో ఒక విలక్షణత కనిపిస్తోంది. మావెంట ఉన్న గైడ్ అభిప్రాయంలో ఇది ఇన్‌కాల స్నానవాటిక. ఈ విషయం నాకు వింతగా అనిపించింది. ఎందుకంటే కజ్కో నగరానికి, ఈ స్నానవాటిక అని చెప్పబడుతున్న ప్రాంతానికి మధ్య అంత దూరం ఉంది. బహుశా ఇది రాజుగారు ప్రత్యేక సందర్భాల్లో స్నానం చేయటానికి ఉపయోగించే స్నానవాటిక అయితే అయి ఉండవచ్చనిపించింది. పురాతన ఇన్‌కా తెగ రాజులు తమ వారసుల కంటే మందపాటి శరీరాన్ని కలిగి ఉండే ఉంటారు. ఎందుకంటే ఈ ప్రాంతంలో ఉన్న నీళ్లు తాగటానికి బాగానే ఉన్నప్పటికీ స్నానం చేయటానికి మాత్రం చాలా చల్లగా ఉంటాయి. ఈ ప్రాంతంలో వివిధ మార్గాల్లో వస్తున్న మూడు భారీ ప్రవాహాలు సమ్మిళితమవుతాయి. ఇన్‌కాలు నివసించే లోయకు ఇది ముఖ ద్వారం అని చెప్పవచ్చు.

కానీ మంచుపిచ్చు ప్రాంతంలో ఉన్న అన్ని ఇతర స్థలాలతో పోల్చుకున్నప్పుడు కజ్కోకున్న పురాతత్వ ప్రాధాన్యత, పర్యాటక ప్రాధాన్యత చాలా ఎక్కువ. మంచుపిచ్చు అంటే స్థానిక భాషలో పురాతన పర్వతం అని అర్థం. ఈ ప్రాంతంలో స్థిరపడిన నూతన తరాలతో పోల్చుకున్నప్పుడు ఈ పేరు పూర్తిగా కొత్తగా ఉంటుంది. ఈ ప్రాంతంలో శిథిలాలు మొదటిసారిగా కనుగొన్న అమెరికా పురాతత్వ శాస్త్రవేత్త బింగహాం దృష్టిలో ఈ ప్రాంతం కేవలం దాడులను అడ్డుకోవటానికి ఏర్పాటు చేసుకున్న శరణార్థి శిబిరం కాదు. నిజానికి ఈ ప్రాంతంలో ఆధిపత్యం వహించిన జాతి కచువాలకు ఇది నివాస ప్రాంతం. వారికి ఇది పవిత్రమైన స్థలం. తర్వాతి కాలంలో స్పెయిన్ ఈ ప్రాంతాన్ని జయించినప్పుడు ఇది ఓడిపోయిన సైన్యం తల దాచుకునేందుకు వీలుగా ఉపయోగపడింది.

ఇక్కడి అనేక అంశాలు గమనిస్తే పైన ప్రస్తావించిన పురావస్తు శాస్త్రవేత్త అభిప్రాయాల్లో వాస్తవం లేకపోలేదనిపిస్తోంది. మంచుపిచ్చు ప్రాంతంలో ఉన్న అత్యంత పటిష్టమైన ఆత్మరక్షణ శిబిరాల్లో ఒల్లాంటాయ్‌టాంబో చాలా ముఖ్యమైనది. దానివెనుక ఉన్న పల్లం అవరోధంగా వున్నా ఇంతకు మించిన మంచి రక్షణ స్థావరం ఈ ప్రాంతంలో లేదని చెప్పవచ్చు. ఇక్కడ కనిపించే మరో ముఖ్యమైన అంశం బయటి ప్రపంచం నుండి ఈ ప్రాంతాన్ని దాచి ఉంచాలనుకోవటానికి సంబంధించినది. అయినప్పటికీ బయటి నుండి వచ్చిన పలు దండయాత్రల ఫలితంగా వీరు నాశనం అయ్యారు. మంచు పిచ్చు ప్రాంతం నుండే ఆఖరి ఇన్‌కా తెగ మనిషిని బంధించబడ్డాడు. బింగ్‌హాం ప్రాంతంలో కనిపించిన కళేబరాలన్నీ మహిళలవే కావటం గమనార్హం. అది కూడా తమ జీవితాలు సూర్యభగవానుడికి అంకితం చేసిన దేవదాసీలుగా మారిన యువతులవే. ఇది ఒక మతపరమైన క్రతువు వంటిది. ఈ క్రతువును నిలిపివేయటానికి స్పెయిన్ దేశస్తులు చేసిన ప్రయత్నాలు ఏమీ ఫలించలేదు. ఇటువంటి నిర్మాణాల్లో ఇది సాంప్రదాయం కావటంతో ప్రసిద్ధి గాంచిన ఇంతివాటనాతో కలిసి సూర్యభగవానుడి దేవాలయం ఈ నగరానికి కంఠహారంగా మారింది. ఈ దేవాలయంలో ఇంతివాటనా విగ్రహాన్ని కాళ్ల నుండి పీఠం మొదలు తల వరకు ఒకే రాతితో మలిచారు. అక్కడ శుద్ధిగా చెక్కిన పాలిష్ రాళ్లను చూస్తే అది అత్యంత ప్రాధాన్యత గల ప్రదేశమని తెలుస్తూనే ఉంది. నదికి ఆవలి వైపున కచువా నిర్మాణం తరహాలో మూడు ట్రాపెజోడియల్ కిటికీలు ఉన్నాయి. బింగ్‌హాం చెప్పే ప్రకారం ఈ కిటికీల ద్వారానే అయిల్లస్ సోదరులు బాహ్య ప్రపంచంలోకి ప్రవేశించారని ఇన్‌కా పురాణాలు చెప్తున్నాయి. అక్కడి నుండే ఈ ప్రాంత ప్రజలకు దైవసమానమైన ఈ భూమివైపు సాగిపోయారని పురాణాలు చెప్తున్నాయి. నాకు అర్థమైనంత వరకు ఈ ఆలోచన వింతగానే ఉంది. ఈ వ్యాఖ్యానాన్ని ఎందరో మేధావులు, పరిశోధకులు సవాలు చేశారు. సూర్యభగవానుడి దేవాలయం నిర్మాణంపైనా, దాని పనితీరుపైనా కూడా పెద్దఎత్తున పండిత చర్చలు జరిగాయి. ప్రచురణలు వెలువడ్డాయి. ఆ చర్చలన్నింటా బింగ్‌హాం మాత్రం దేవాలయ నిర్మాణం వృత్తాకారంలో ఉందని, కజ్కోలో అటువంటి దేవుడికే అంకితం చేసిన దేవాలయం తరహాలోనే ఉందని బలంగా నమ్ముతూ వచ్చాడు. ఏది ఏమైనప్పటికీ నిర్మాణరూపం, రాళ్లు ముక్కలు చేసిన విధానం గమనిస్తే దానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని మాత్రం తెలుస్తోంది. ఈ రాళ్ల కింద, దేవాలయం పునాదుల్లోనే ఇన్‌కాలు, లేదా ఇన్‌కా (తెగ మూలపురుషుడు) సమాధి ఉందని భావిస్తుంటారు.

గ్రామంలో ఉన్న వివిధ సామాజిక వర్గాల మధ్య ఉన్న అంతరాలను తేలికగానే గుర్తించవచ్చు. ఆయా సమాజంలో వారు చేస్తున్న పనిని బట్టి, మిగిలిన సమాజంతో వీరు ఎంత స్వతంత్రులుగా ఉన్నారన్నదాన్ని బట్టి వారి సామాజిక హోదా నిర్ణయమౌతుంది. కప్పుకు సంబంధించి మరే సమాచారమూ తెలుసుకోలేకపోవటం విచారించదగినదే. ఆ తర్వాతి కాలంలో (దేవాలయపు) పైకప్పు మూసి ఉందని దానిపై ఇంకా విలాసవంతమైన నిర్మాణాలు ఉన్నాయని గుర్తించారు. నిర్మాణ శాస్త్ర నిపుణుల సహకారం లేనిపక్షంలో ఈ సమస్యను పరిష్కరించటం మరింత క్లిష్టంగా మారి ఉండేది. యోధుల కోసం కేటాయించిన భవనాల రాతిగోడల్లో మార్గాలు ఉన్నాయని చూపించారు. కొన్ని చోట్ల చిన్న చిన్న మందిరాలు కూడా అమర్చబడి ఉన్నాయి ఈ గోడల్లోనే. నిజానికి ఇది శిక్షలు విధించే చోటు అయి ఉంటుంది. శిక్షలు విధించబడిన వ్యక్తులు ఈ గోడల సందులో చేతులు పెట్టాలి. అవతలి వైపు నుండి అతని ఎముకలు విరిగే వరకు చేతులు లాగబడతాయి. ఈ వివరణ నాకు నమ్మకంగా అనిపించింది. అందువల్ల పరీక్షించటానికి నా చేతులు ఈ రెండు సందుల్లోను దూర్చాను. అల్బెర్టో నన్ను చిన్నగా నెట్టాడు. చిన్నపాటి ఒత్తిడికే ఎంతో నొప్పివేసింది. గట్టిగా నెట్టేట్లయితే  ఎముకలు చూర్ణం కావటం ఖాయమన్న నమ్మకం  కలిగింది.

అక్కడికి కొంచెం దూరంలో ఉన్న హువాయ్‌నా పిచ్చు పర్వతం నుండి చూస్తే ఈ నగరం, దానిచుట్టూ నిర్మించబడిన కోట అద్భుతంగా కనిపిస్తోంది. ఈ ప్రాంతంనుండి దూరపు వస్తువులు, పరిసరాలు చూడటానికి ఉపయోగించేవాళ్లని చెప్పవచ్చు. అక్కడ పెద్దగా నివాసాలు గానీ, రక్షణ పరమైన నిర్మాణాలు గానీ లేవని శిధిలాలను చూస్తే తెలిసిపోతుంది. రెండు వైపులా ఉన్న ప్రకృతి సంపదను చూస్తే మచ్చుపిచ్చు నిండు గర్భిణిగా ఉంటుంది. ఒకవైపున 300 మీటర్ల లోతైన లోయలో ప్రవహిస్తున్న నది, మరోవైపున చిన్నటి వంతెన లాంటి నిర్మాణంతో మరో కొండను కలుపుకుపోతోంది. అత్యంత బలహీనమైన మార్గం ఉన్న వైపున రక్షణ వ్యవస్థలు బలీయంగా ఉన్నాయి. ఈ ప్రాంతం నుండి దాడిచేయటానికి ప్రయత్నిస్తే దాన్ని వృధా ప్రయాసగా మార్చేందుకు కావల్సినన్ని రక్షణ వలయాలు నిర్మించబడి ఉన్నాయి. దీనికి దక్షిణాన విశాలమైన కోట నిర్మాణాలతో పాటు ఇరుకైన మార్గం ఉంది. ఈ మార్గాన్ని అధిగమిస్తేనే దాడి సులువుగా ఉంటుంది. కానీ ఈ ఇరుకు మార్గాన్ని అధిగమించటం అంత తేలికకాదు. విల్కానోటాలు పర్వత సానువుల చుట్టూ గుంపులు గుంపులుగా పరిభ్రమించిన విషయాన్ని గుర్తు చేసుకుంటే ఈ ప్రాంతాన్ని నివాస ప్రాంతంగా ఎంచుకోవటంలో మొదటి తరం మచ్చుపిచ్చులు తెలివిగానే వ్యవహరించారని చెప్పవచ్చు.

పురాతనకాలంలో ఈ నగరం ఆవిష్కరణకు గల మూలాలు ఏమిటన్నది ప్రస్తుతానికి అంత ముఖ్యమైన సమస్య కాదు. ఆ చర్చను పురావస్తు శాస్త్రవేత్తలకు వదిలివేయటం మంచిది. అన్నింటికంటే ముఖ్యమైనది, తిరస్కరించదగినది మా దృష్టికి వచ్చిందేమిటంటే ఈ ప్రాంతంలో శక్తివంతమైన స్థానిక జాతి ఒకటి ఇంకా సజీవంగానే ఉంది. శ్వేతజాతి సైన్యాలు వచ్చిపోయినా వీరి జీవన శైలిలో మార్పు ఏమీ లేదు. ఈ కోటల మధ్యలో ఉన్న భూమి నిరంతరం పర్యాటకులకు మధుర జ్ఞాపకాలు మిగులుస్తోంది. ప్రపంచం గురించిన వాస్తవిక పరిజ్ఞానం ఉన్న ఉత్తర అమెరికా పర్యాటకులు ఈ గోడల మధ్య తాము చూసిన అవసాన దశలోని జాతులను తాము ఇతర ప్రాంతాల్లో చూసిన జాతులతో పోల్చి చెప్పగలరు. దక్షిణ అమెరికా ప్రాంతాన్ని వేరు చేస్తున్న భౌతిక అంశాలు ఉన్నప్పటికీ రెండింటి మధ్య ఉన్న నామమాత్రపు ప్రత్యేకతను స్పష్టంగా చూడవచ్చు.

## భూకంపాల దేవుడు

భూకంపాల నడుమ మారియా ఆంగోలా చర్చి గంట మొదటిసారిగా మోగింది. అక్కడ వాడుకలో ఉన్న కథల ప్రకారం ప్రపంచంలో అతి పెద్దదైన ఈ గంట నిర్మాణానికి 27 కిలోల బంగారం ఉపయోగించారు. దీన్ని మారియా అంగులా అనే మహిళ దానం ఇచ్చిందని చెప్పుకుంటారు. వాడుక పదాల శబ్దక్రమం కారణంగా చివరకు ఈ గంట పేరునే మార్చేశారు.

1950లో వచ్చిన భారీ భూకంపంలో శిథిలమైన ఈ చర్చి గోపురం, గంటను పునర్నిర్మించటానికి అవసరమైన ఖర్చును జనరల్ ఫ్రాంకో ప్రభుత్వం భరించింది. దీనికి కృతజ్ఞతగా స్పానిష్ జాతీయ గీతం ఆలపించటానికి ఇక్కడి ప్రజలు అంగీకరించారు. గంట నుండి వచ్చే మొదటి శబ్దంతో అక్కడ బోధనలు చేసే బిషప్ చేతులు కట్టుకుని

మొఖం కందగడ్డలాగా మార్చుకుని కూర్చుని "ఆపు ఆపు. ఏదో పొరపాటు జరిగింది" అని గొణిగాడు. అక్కడున్న స్పానియార్డు ఒకడు "రెండేళ్ల శిక్షణ తర్వాత ఈ విధంగా వాయిస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశాడు. మంచి ఉద్దేశ్యంతోనో లేక మరోరకంగానో తెలియదు కానీ, స్పెయిన్ రిపబ్లిక్ గీతంతో బ్యాండ్ మొదలైంది.

మధ్యాహ్నం పూట ఆయన చర్చిలోని తన రాజసం ఉట్టిపడుతున్న ఇంట్లో ఉంటాడు. ఆ ఇంటి పేరు భూకంపాల భగవానుడు. అతను మరెవరో కాదు. దట్టమైన గోధుమ రంగు కలిగి ఉన్న క్రీస్తే. ఆయన నగరమంతా సంచరించాడు. నగరంలోని ప్రధాన చర్చిలన్నీ దర్శించుకుంటూ వెళ్లాడు. ఆయన ముందుకు సాగుతున్నప్పుడు అక్కడున్న అనుచరణగణం ఆయనకు పుష్పాలతో స్వాగతం పలికేందుకు పోటీ పడుతోంది. నచ్చు అని స్థానిక భాషలో పిలిచే ఈ పూలు కొండసానువుల్లో పుష్కలంగా దొరుకుతాయి. పువ్వుల ఎర్రదనం, క్రీస్తు గోధుమ రంగు, క్రీస్తును మోసుకెళ్లటానికి ఉపయోగిస్తున్న వెండి పీఠం అది భారీ ఉత్సవం అని తెలియచేస్తున్నాయి. స్థానిక ఇండయన్ తెగల ప్రజలు ధరించిన రంగు రంగుల దుస్తులతో ఈ ఉత్సవానికి మరింత కళ వచ్చింది. ఇటువంటి సందర్భాల్లో వీళ్లు తమ వద్ద ఉన్న సాంప్రదాయ దుస్తుల్లో మంచివాటిని ధరిస్తారు. ఈ ధోరణి, విలువలు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. దీనికి భిన్నంగా ఈ ప్రదర్శనకు ముందు పీఠిన యూరోపియన్ దుస్తులు ధరించిన ఇండియన్‌ల గుంపులు నడుస్తున్నాయి. వారి చేతుల్లో బానర్లు కూడా ఉన్నాయి. అలసిపోయిన వారి ముఖాలు చూస్తే మంకో 2 చక్రవర్తి పిలుపును అంగీకరించటానికి తిరస్కరించిన కచువా తెగ ప్రజలు గుర్తుకొస్తున్నారు. పీజ్జారో పేరుమీద ప్రతిజ్ఞ తీసుకున్న వీరు ఓడిపోతున్న సమయంలో సైతం తాము స్వతంత్ర జాతి అన్న .భావనను నిలుపుకున్నారు.

ముందుకు సాగుతున్న ఈ ప్రదర్శనను చూడటానికి దారిపొడవునా స్థానిక ఇండియన్ తెగల ప్రజలు గుంపులు గుంపులుగా నిల్చున్నారు. ఉత్తర అమెరికా బ్లాండ్ పెద్ద అప్పుడప్పుడూ దర్శనం ఇస్తున్నాడు. అతని చేతిలో కెమెరా, క్రీడాకారులు ధరించే దుస్తులు చూస్తే ఏ దేశపు మనిషో ఇంకాల సామ్రాజ్యంలో దారితప్పి తిరుగుతున్నట్లు అనిపిస్తోంది.

# విజేతల జన్మస్థలం

ఒకప్పుడు ఇంకాల సామ్రాజ్యానికి రాజధానిగా దీర్ఘకాలం ఒక వెలుగు వెలిగిన ఈ నగరం చాలా కాలం పాటు తన గొప్పదనాన్ని కాపాడుకుంటూనే వచ్చింది. ఈ నగర సంపదలపై విలసిల్లుతున్న కొందరు ఎదుగుతున్నారు. అయితే అవన్నీ ఇంకాల సామ్రాజ్యం నాటి సిరిసంపదలే. వాటిని సుదీర్ఘకాలం జాగ్రత్తగా పరిరక్షించటమే కాదు. ఈ ప్రాంతంలో ప్రారంభమైన బంగారం, వెండి గనుల తవ్వకాల తర్వాత కూడా వీటిని జాగ్రత్తగా కాపాడు తున్నారు. కజ్కో నగరం ఇక ఏమాత్రం ఈ ప్రపంచపు వినూత్న నగరం అన్న కిరీటాన్ని నిలుపుకోలేదు. మిగిలిన నగరాలతో పాటు అది కూడా ఒక నగరమని మాత్రమే చెప్పుకుంటుంటారు. ఈ నగర సిరిసంపదలన్నీ ప్రపంచంలో మరోచోట ప్రజల విలాసాలకు, ప్రభువుల వినోదాలకు పెట్టుబడిగా మారటానికి తరలిపోయాయి. ఇండియన్‌లు కేవలం తమ మాతృభూమి కోసమే కట్టుబడి పని చేసేవారిగా లేరు. అయినప్పటికీ విజేతలు రోజువారీ తమ ఉనికి కాపాడుకునేందుకు గాను ఈ భూమి కోసం పోరాటం చేయటానికి రావటం లేదు. కేవలం అత్యాశ ద్వారానో లేదా సాహసోపేత చర్యల ద్వారానో త్వరితగతిన సంపన్నులయ్యేందుకు మాత్రమే ఇక్కడకు వస్తున్నారు. క్రమంగా కజ్కో వెనకబడిపోయింది. పక్కకు నెట్టబడింది. మరోవైపున పసిఫిక్ తీరంలో లిమా నగరం రూపంలో నూతన ప్రత్యర్థి వెలిసింది. తెలివైన మధ్యవర్తులు వసూలుచేసిన పన్నుల ద్వారా వచ్చిన ఆదాయంతో సంపన్నమైన ఈ నగరం రూపంలో పెరు సంపద అంతా తరలి వెళ్లటం ప్రారంభమైంది. ఈ మార్పును గుర్తించటానికి అవసరమైన పరికరం ఏదీ లేదు. కేవలం అద్భుతమైన ఇన్‌కా రాజధాని ఇప్పటి స్థితికి చేరటం ఒక్కటే ఈ మార్పును గుర్తించే సాధనంగా మారింది. గడచిన కాలాన్ని గుర్తు చేసే శిధిల నిర్మాణంగా నిలిచింది. అక్కడ ఉన్న నిర్మాణాల సముదాయంతో పోటీ పడటానికా అన్నట్లు ఇప్పుడిప్పుడే అక్కడ కొన్ని కొత్త నిర్మాణాలు తలెత్తుతున్నాయి. లేనిపక్షంలో ఇది అప్పటి పర్వత సానువుల్లో

దాగిఉన్న వలసవాద కాలం నాటి సొగసులన్నీ ఇంకా చెక్కు చెదరకుండా ఉండేవని చెప్పవచ్చు.

ఈ చర్చి నగరానికి ప్రధాన కూడలిలో వుంది. చర్చి ప్రదర్శిస్తున్న సంఘీభావం, అది ప్రాతినిధ్యం వహించే కాలానికి ప్రతిబింబమా అన్నట్లు, చర్చి అన్న భావన కంటే అది ఒక కోట అన్న భావన వ్యక్తం అవుతోంది. ఆ చర్చి ఆంతరంగిక నిర్మాణంలో కనిపిస్తున్న మెరుపులు గత వైభవాన్ని గుర్తు చేస్తున్నాయి. లోపలి గోడలకు వేళ్లాడుతున్న నిలువెత్తు చిత్రపటాలు అక్కడ నుండి తరలి వెళ్లిన సంపదను ప్రతిబింబించకపోయినా ఎందుకనో గానీ అసందర్భం అనిపించటం లేదు. నీళ్ల మధ్యలో పుట్టి వచ్చిన సెయింట్ క్రిస్టోఫర్ చర్చి నాకు మాత్రం అద్భుత నిర్మాణం అనిపిస్తోంది. అక్కడ కూడా భూకంపం విధ్వంసం సృష్టించింది. చిత్రపటాలు కిందపడి పగిలిపోయాయి. ఉన్నవి కూడా అక్కడక్కడా గీతలుపడ్డాయి. బంగారపు ద్వారాలు, అంచుల ప్రభావం మరింత కొత్తగా ఉంది. ఈ వెలుగులు దాని వయసు తెలియచేస్తున్నాయా అనిపిస్తోంది. వెండికున్నంత వెలుగు బంగారానికి లేదు. వయసు పెరుగుతున్న కొద్దీ వెండి మరింతగా వెలిగిపోతుంది. ఆ విధంగా చర్చి అలంకారం వయసు మళ్లిన మహిళకు అవసరానికి మించి నగిషీలు అద్దినట్లుగా ఉంది. చాయిర్ స్టాల్స్‌లో కళత్వం ఉట్టిపడుతుంది. ఈ స్టాల్స్‌ను స్థానిక ఇండియన్‌లు, మెస్టిజో తెగ ప్రజలు చెక్కతో తయారు చేశారు. సాధువుల జీవితాలను చెక్కలతో మల్చిన పటాల్లో ఎంతో నైపుణ్యంతో ఇముడ్చారు. కాథలిక్ చర్చి వెంట వచ్చిన కళాకృతులు ఆండియన్ ప్రజల కళారాధనతో మరింత వెలుగులు విరజిమ్ముతున్నాయి.

కజ్కోలోని వజ్రసమానమైన నిర్మాణాల్లో ఒకటి శాన్ బ్లాస్ బాసిలికా. ఈ ప్రాంతంలో పర్యటించిన ప్రతి పర్యాటకుడు ఇది తప్పక చూడాల్సిన ప్రదేశం. చూపరులను ఆకట్టుకోవటానికి అక్కడ పెద్దగా ఏమీ లేదు. కేవలం ఒక వంపు మాత్రమే ఉంది. అక్కడి నుండి మనం సాగిపోయే ముందు చర్చి వద్ద ఏర్పాటు చేసిన కాయిర్ స్టాల్స్‌లాగా ఇది కూడా సమకాలీన ప్రపంచంలోని రెండు పరస్పర విరుద్ధ జాతుల మధ్య ఉన్న సంబంధాలను విదితం చేస్తుంది. మొత్తం నగరం ఒక కళాప్రదర్శన శాలగా ఉంటుంది. చర్చిల సంగతి సరేసరి. అవి కాక ప్రతి ఇంట్లోను వీధిపైకి తొంగిచూస్తున్నట్లున్న బాల్కనీలు గతాన్ని గుర్తు చేసే సాధనాలుగా ఉన్నాయి. అయితే ఇవన్నీ ఒకేరకమైన పొగడ్తలకు నోచుకోవనుకోవు. ఇప్పటికిప్పుడు అంత దూరం నుండి రాస్తున్న నాకు నా ముందున్న నోట్సు కళ తప్పినట్లు అనిపిస్తోంది. అక్కడున్న వాటిలో ఏది నన్ను బాగా ప్రభావితం చేసింది, ఆకట్టుకుంది అని చెప్పలేకపోతున్నాను. అందంగా తీర్చిదిద్దబడిన చర్చిలతో

పాటు భూకంపం తాకిడికి గుట్టగా పడిఉన్న బెలెన్ చర్చి కొండపక్కల చనిపోయిన భారీ జంతువులాగా కనిపిస్తోంది.

జాగ్రత్తగా పరిశీలిస్తే అందులో కొన్ని మాత్రమే సూక్ష్మ పరిశీలన తర్వాత కూడా అద్భుత కళా ఖండాలనిపిస్తాయి. ఏదో ఒక రంగుల చిత్రాన్ని చూడటానికైతే కజ్కో నగరానికి వెళ్లాల్సిన అవసరం లేదు. దానికంటే మొత్తం నగరానికి నగరమే ఒకప్పుడు అక్కడ నిలిచి ఉన్న ప్రశాంతమైన నాగరికతను ప్రతిబింబిస్తోంది.

# కజ్కో కొండలు

కజ్కో సంస్థాపన వివరాలు చరిత్ర నుండి తొలగిస్తే అక్కడ చరిత్ర లేని కుగ్రామం ఒకటి ఉంటుంది. అయినప్పటికీ ఆ గ్రామం గురించి తెలుసుకోవాల్సింది ఎంతోకొంత ఉంటుంది. కాక్‌టైల్ కలిపినట్లు మా అభిప్రాయాలన్నీ ఒకేసారి ముందుకు తెచ్చాము. ఈ రెండు వారాల్లో మా జీవితం మిగిలిన ప్రయాణం మొత్తంలో మళ్లీ తిరిగి రాలేదు. డాక్టర్ హెర్మోసాకు మమ్ములను పరిచయం చేస్తూ ఇచ్చిన లేఖ కొంతవరకు ఉపయోగపడినట్లే అని చెప్పవచ్చు. అయితే ఆయన ఎటువంటి పరిచయం లేకపోయినా సహాయం చేయటానికి ముందుకు వచ్చే వ్యక్తి కనుక ఆ లేఖతో పెద్దగా అవసరం లేకపోయింది. అల్బెర్టో మరో తోటి వైద్యుడు ఫెర్నాండెజ్‌తో కలిసి పని చేశాడన్న విషయం ఒక్కటి చాలు ఆయనకు. ఫెర్నాండెజ్ అప్పట్లో అమెరికాలోనే పేరుగాంచిన కుష్టువ్యాధి నిపుణుడు. తన చాకచక్యంతో అల్బెర్టో ఈ పాచిక ప్రయోగించాడు. ప్రత్యేకంగా మాతో జరిపిన చర్చల్లో హెర్మోసా ప్రధానంగా పెరుకు సంబంధించిన జీవన పద్ధతులు గురించి వివరించాడు. ఇదే అదనుగా తీసుకుని తన కారులో మమ్ములను ఇన్‌కా లోయ అంతటా తిప్పుకువచ్చాడు. మా పట్ల ఎంతో దయతో వ్యవహరించాడు. అంతేకాదు. మంచుపిచ్చు వరకు మాకు రైలు టిక్కెట్లు కూడా కొనిచ్చాడు.

ప్రాంతీయ రైళ్లు సాధారణంగా గంటకు 10-20 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఎడతెగని ఎత్తుపల్లాలతో ఈ వేగం మరింతగా మందగిస్తోంది. ఎత్తయిన ప్రాంతాల్లో రైలు ఇబ్బందిపడకుండా ఉండేందుకు గాను నగరం వదిలిన తర్వాత రైలు మార్గం ముందుకు వెనక్కు మారుతుంది. అంటే కొద్దిసేపు ముందుకు ప్రయాణించిన రైలు మరికొంత సేపు వేరే మార్గంలో వెనక్కు వచ్చి కొత్త దారిలో ప్రయాణం ప్రారంభిస్తుంది. ఆ విధంగా అనేకసార్లు జరిగిన తర్వాత తుది కొనకు చేరుతుంది. ఆ తర్వాత అక్కడ నుండి కిందకు దిగటం ప్రారంభిస్తుంది. ఆ విధంగా దిగువకు వచ్చే రైలు నది పొడవునా ప్రయాణించి విల్కానొటాకు చేరుతుంది. ఈ రైలు ప్రయాణంలో ఇద్దరు చిలీకి చెందిన జ్యోతిష్యులను కలిశాము. మా పట్ల వారు ఎంతో స్నేహంగా వ్యవహరించారు. మా వద్ద ఉన్న తేనీరు తాగటానికి వారిని ఆహ్వానించిన తర్వాత వారివద్ద ఉన్న భోజనాన్ని మాకు కూడా పంచి ఇచ్చారు. అక్కడ శిథిలాలకు చేరేసరికి ఫుట్‌బాల్ జట్టు ఒకటి కనిపించింది. మమ్ములను చూసి ఆడటానికి ఆహ్వానించారు. కొన్ని మంచి కాచ్‌లు పట్టుకొని చూపించటానికి నాకు అది ఒక అవకాశంగా మారింది. ఆ తర్వాత నేను అల్బెర్టోతో కలిసి బ్యూనస్‌ఎయిర్స్‌లో ప్రీమియర్ లీగ్ వరకు ఆడిన మాట చెప్పాను. స్థానికులు పంపా అని పిలిచే ఈ మైదానంలో మధ్యశ్రేణి ఆటగాడిగా అల్బెర్టో తన ప్రతాపం ప్రదర్శించాడు. మేము ఇద్దరమూ మెరుగైన ఆట తీరు ప్రదర్శించటం ఈ బంతి యజమాని, ఒక హోటలుకు కూడా యజమాని అయిన వ్యక్తి కళ్లలో పడింది. అక్కడ మరో రెండు రోజుల పాటు విడిది చేయటానికి మమ్ములను ఆహ్వానించాడు. దాంతో ఆ తర్వాత వచ్చే రైలులో మరికొందరు ఉత్తర అమెరికా పౌరులు వచ్చేవరకు మేము వేచి ఉన్నాము. సెనార్ సోటో వ్యక్తిగా చాలా మంచివాడు మాత్రమే కాదు. చాలా విషయాలు తెలిసిన వ్యక్తి కూడా. ఆటల గురించి మేము మాట్లాడటం పూర్తయ్యాక మేము సుదీర్ఘంగా ఇన్‌కా సంస్కృతి గురించిన చర్చ మొదలు పెట్టాము. ఈ అంశాల్లో ఆయనకు విశేష పరిజ్ఞానం కూడా ఉంది.

అక్కడి నుండి బయలు దేరాల్సిన సమయం రావటంతో మాకు విచారం కలిగింది. అక్కడి నుండి మరో 12 గంటలు ప్రయాణించి కజ్కో చేరటానికి గాను మేము రైలు ఎక్కాము. అంతకు ముందే అద్భుతమైన కాఫీ తాగాము. ఇటువంటి రైళ్లల్లో స్థానిక ఇండియన్ తెగ ప్రజలకోసం కేటాయించిన మూడోతరగతి రైలు పెట్టెలుంటాయి. అవన్నీ అర్జెంటీనాలో సరుకులు చేరవేయటానికి ఉపయోగించే డబ్బాలను పోలి ఉంటాయి. తేడా ఒక్కటే. ఆవులు వేసే పేడ మనుషుల దానికంటే మెరుగ్గానే ఉంటుంది కదా.

ఇండియన్ తెగల ప్రజలను పశువులతో పోల్చటం అంటే వయసుతోను, స్త్రీ పురుష వ్యత్యాసంతోను పని లేకుండా వారంతా తమ కాలకృత్యాలు తీర్చుకోవటానికి రోడ్ల వెంబడి ప్రదేశాన్ని ఉపయోగిస్తారన్నమాట. కాలకృత్యాలకు వెళ్లిన తర్వాత మహిళలైతే తమ బట్టలతోనే శుభ్రం చేసుకుంటారు. పురుషులకు అది కూడా ఉండదు. ప్రసవించిన మహిళలైతే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. వారి లోబట్టలు దాదాపుగా నీరుగారుతుంటాయి. అయితే సౌకర్యవంతమైన రైలు పెట్టెల్లో ప్రయాణించే పర్యాటకులకు ఈ ఇండియన్ తెగ ప్రజల జీవన ప్రమాణాలు, స్థితిగతుల గురించిన అవగాహన నామమాత్రంగానే ఉంటుంది. రైలు వేగం పెరిగే కొద్దీ వారి వేగం కూడా పెరుగుతుంది. మధ్య మధ్యలో ఆగిఉన్న వారిని దాటుకుపోవటానికి రైలు కూడా నిదానిస్తుంది. అమెరికాకు చెందిన పురావస్తు శాస్త్రవేత్త బింగ్‌హాం ఈ విశేషాలన్నింటినీ వెలికి తీసి సులభశైలిలో వ్యాసాల ద్వారా ప్రజలకు తెలియచేశాడంటే అప్పటికి దేశంలో ఉత్తరాదిన మంచుపిచ్చు ప్రాంతం బాగా ప్రాచుర్యం సంతరించుకుంది. పెరు దేశ పర్యటనకు వచ్చే మెజారిటీ ఉత్తర అమెరికా వాసులు ఈ ప్రాంతానికి తప్పనిసరిగా వస్తారు.

కజ్కోలోని పురావస్తు ప్రదర్శనశాల దారుణ స్థితిలో ఉంది. అక్కడ వివిధ ప్రాంతాల నుండి అక్రమంగా రవాణా అవుతున్న విలువైన వస్తువుల గురించి అధికారులు కళ్లు తెరిచేలోపుగా అప్పటికే ఆలస్యం అయిపోయింది. పురాతన వస్తువులు దొంగిలించేవారు, పర్యాటకులు, పురావస్తుశాస్త్రవేత్తలు ఒకరేమిటి, ఈ విషయాల్లో ఆసక్తి ఉన్నవారంతా ఈ ప్రాంతం నుండి పురావస్తు శిధిలాలు లూటీ చేయటంలో తమవంతు పాత్ర పోషించారు. ఇదంతా ఒక పద్ధతి, ప్రణాళిక ప్రకారం జరిగింది. చివరకు ఈ ప్రాంతంలో మిగిలిన ముక్కలను మాత్రమే వస్తుప్రదర్శనశాల కోసం సేకరించగలిగారు అధికారులు. అయినప్పటికీ పురావస్తు విద్యలో ప్రవేశం లేని మావంటివారికి అక్కడ చూడటానికి చాలా ఉంది. అందుకే అక్కడ చాలా రోజులు గడిపాము. అక్కడ వస్తు ప్రదర్శనశాల పర్యవేక్షకుడు మెస్టిజో తెగకు చెందిన వాడు కావటంతో తమ స్వంత జాతి గురించి ఊపిరిసలపకుండా చెప్పుకోగల ప్రతిభ సంపాదించాడు. చాలా విషయాలు అతనికి కరతలామలకం. అతను గత వైభవం గురించి, ఇప్పటి ఇక్కట్ల గురించి విపులంగా వివరించాడు. తక్షణం ఇండియన్ తెగ ప్రజలను విద్యావంతులను చేయాల్సిన అవసరం గురించి నొక్కి చెప్పాడు. ఆ విధంగా వారిని విద్యావంతులను చేయటం పునరావాసం కల్పించటంలో మొదటి అడుగు. తక్షణం ఇండియన్ తెగ ప్రజల ఆర్థిక స్థాయి పెంచటం ద్వారా కోకా, తాగుడు వంటి వ్యసనాల బారిన పడకుండా వారిని కాపాడవచ్చని

అభిప్రాయపడ్డాడు. అదేవిధంగా కచువా తెగ ప్రజల గురించిన వాస్తవిక అవగాహన కలిగించుకోవటం ద్వారా ఆ తెగ ప్రజలు తమ గత వైభవం గురించి గర్వపడేలా చేయవచ్చని ఆవిధంగా ఇప్పటి ఇండియన్ మెస్టిజోస్ తెగ దుస్థితికి వెరవకుండా ఉండవచ్చని ఆయన చెప్పాడు. ఆ సమయంలో కోకా సమస్య గురించి ఐక్యరాజ్యసమితి కూడా చర్చిస్తోంది. కోకా వ్యసనం గురించి దాని పర్యవసానాల గురించి మాకు వృత్తిపరంగా తెలిసింది అతని దృష్టికి తెచ్చాము. తాను కూడా ఈ పర్యవసానాలను అనుభవించినట్లు అతను తెలిపాడు. అదేవిధంగా ప్రజలను వ్యసనపరులను చేస్తూ తమ లాభాలు పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్న వారిపై నిప్పులుకక్కాడు. పెరులో కొల్లా, కచువా జాతుల ప్రజలు అత్యధికంగా నివసిస్తుంటారు. వాళ్లే కోకా సేవిస్తుంటారు. ఆ పర్యవేక్షకునిలో స్థానిక తెగల తాలూకు కొన్ని లక్షణాలు కనిపిస్తున్నాయి. అతని కళ్లు ఉత్సాహంతో మెరుస్తున్నాయి. భవిష్యత్తు పట్ల నమ్మకం, వస్తుప్రదర్శన శాలలో వచ్చిచేరుతున్న నూతన వస్తువులు ఈ ఉత్సాహానికి కారణం అయితే ఈ తెగ ప్రజలు తమ నిత్యజీవితంలో గుర్తింపు కోసం సాగిస్తున్న పోరాటం మరో ప్రదర్శనశాలగా మారింది.



## హువాంబో

అక్కడ కాలింగ్‌బెల్ మోగించి మోగించి అలసిపోయిన మాకు ఉత్తరం దిక్కుగా పోవాలని గార్డెల్ సలహా ఇచ్చాడు. మేము అంకేలో ఆగక తప్పలేదు. ఎందుకంటే అక్కడి నుండి ట్రక్కులు హువాన్‌కరామా వైపు వెళ్తున్నాయి. హువాంబో కుష్టురోగుల కాలనీ చేరుకునేలోగా ఎదురయ్యే ఆఖరి పట్టణం అది. గతంలో లాగానే పౌర పోలీసు అధికారి వద్దనో, ఆసుపత్రి పరిసరాల్లోనే బస సంపాదించుకునే మా పద్ధతుల్లో ఏ మాత్రం మార్పు లేదు. అదేవిధంగా ప్రయాణంలో లిఫ్ట్ అడగటం కూడా. మధ్యలో ఈస్టర్ పండగ రావటంతో ఈ రెండు రోజుల పాటు ఒక్క ట్రక్కు కూడా తిరగలేదు. దాంతో మేము

రెండు రోజులూ ఎదురుచూపులతోనే కాలం గడపాల్సి వచ్చింది. ఒక చిన్న గ్రామం చుట్టూ పనీపాట లేకుండా తిరిగాము. అయితే ఆసక్తికరమైనదేమీ కనిపించలేదు. కనీసం మా ఆకలిని మర్చిపోవటానికి కూడా పనికొచ్చేదేమీ కనిపించలేదు. అక్కడ ఆసుపత్రిలో ఇచ్చే భోజనం చాలా పరిమితంగా ఉంది. గ్రామం శివార్లలో నీటి ప్రవాహానికి పక్కనే ఉన్న పొలాల్లో కూర్చున్న మేము సాయం సమయంలో ఆకాశం వంక చూస్తూ పాత జ్ఞాపకాలు నెమరువేసుకుంటున్నాము. కనిపించిన ప్రతి మేఘంలోను ఏదో ఒక చిత్రం నమూనా కోసం వెతుకుతూ ఆ సాయంత్రం గడిపాము.

సాయంత్రానికి నిద్రపోవటానికి పోలీసు స్టేషనుకు బయలుదేరిన మేము దగ్గరదారి వెతికే క్రమంలో మొత్తంగా దారే మర్చిపోయాము. పొలాలు, గట్లు దాటుకుంటూ చివరకు ఒక ఇంటి చూరు కింద చేరాము. చూరుగోడ నుండి లోపలికి తొంగి చూస్తే లోపల ఒక కుక్క, దాని యజమాని నిండుపున్నమి వెలుగుల్లో దెయ్యాల్లా కనిపించారు. ఆ రాత్రి నీడలో మా ఆకారాలు అంతకంటే భయంకరంగా కనిపిస్తున్న విషయాన్ని మేము గుర్తించలేదు. గుడ్ ఈవినింగ్ అన్న నా పిలుపుకు సమాధానంగా ఎవరది అన్న కేక వినిపించింది. ఆ తర్వాత స్నేహపూర్వకంగా మేము వేస్తున్న కేకలు వినిపించుకోకుండా అతను కుక్కను తీసుకుని లోపలికి వెళ్లిపోయాడు. దాంతో కిమ్మనకుండా బయటి గేటు నుండి వచ్చి సరైనదే అనిపిస్తున్న ఒక దారిపట్టుకుని నడవటం ప్రారంభించాము.

అలా బోరు కొడుతున్న సమయంలో స్థానిక ఉత్సవాలు గమనించటానికి సమీపంలో ఉన్న చర్చి వద్ద ఆగాము. అక్కడున్న పూజారి మూడుగంటల పాటు జరిగే ఈ ఉత్సవాన్ని నిర్వహించే ప్రయత్నం చేస్తున్నాడు. అప్పటికే గంటన్నర సమయం గడిచింది. తన దగ్గరున్న మాటల మూటలు కరిగిపోవటంతో మిగిలిన గంటన్నర కార్యక్రమం కొనసాగించటం ఎలా అన్న సంశయంతో చూస్తున్నాడు పూజారి. అక్కడున్న వారి వంక చూస్తూ పూజారి ప్రాధేయపడుతున్నాడు. చర్చి లోపల నలుదిక్కులా అతని చూపులు దేనికోసమో వెతుకుతున్నట్లున్నాయి. "చూడండి, చూడండి, భగవంతుడు మనపై దయతల్చాడు. మనకు ప్రత్యక్షమయ్యాడు. దేవుడు వస్తున్నాడు. అతని స్ఫూర్తి మనలను నడిపిస్తుంది." అన్నాడు. మరి కొద్ది క్షణాల తర్వాత సదరు పూజారి మరో ప్రకంపన సృష్టించేందుకు సిద్ధమయ్యాడు. నాటకీయంగా అతను మౌనం పాటించే సమయానికి మరోసారి అటువంటి అర్థం లేని మాటలు మాట్లాడటం ప్రారంభించాడు. ఆ విధంగా ఐదారు సార్లు చేసిన తర్వాత ఒక రోగిని క్రీస్తుగా ముందుకు తెచ్చారు. దాంతో మాకు ఏదో ఆవహించినట్లయ్యింది. ఉన్న ఫళంగా ఆ ప్రాంతం వదిలివెళ్లిపోయాము.

ఉబ్బసం రావటానికి నిజంగా కారణం ఏమిటన్న విషయాన్ని నేను చెప్పలేను కానీ హున్‌కరామా చేరేసరికి నా కాళ్లమీద నేను నిలబడలేని పరిస్థితి వచ్చింది. నా ఉబ్బసం వ్యాధి తీవ్రమైంది. అక్కడున్న పోలీసు రగ్గులో నన్ను నేను చుట్టుకున్నాను. నా దగ్గర అడ్రెనలిన్ అయిపోయింది. వర్షపు నీళ్లను చూస్తూ ఒకదాని తర్వాత ఒకటిగా నల్లని సిగరెట్లు తాగుతున్నాను. దాంతో ఏదో కొంత ఊరట అనిపించింది. అలా చేస్తూ నేను అక్కడున్న స్థంభానికి ఆనుకుని నిద్రకు జారుకున్నాను. తెల్లారేసరికి నా పరిస్థితి కొంత మెరుగనిపించింది. ఎక్కడి నుండో కొంత అడ్రెనలిన్ సంపాదించాడు అల్బెర్టో. దాంతో పాటు ఆస్ప్రిన్ కూడా తీసుకోవటంతో నాలో కొత్త ఉత్సాహం వచ్చింది.

అక్కడ గ్రామపెద్దకు మా రాక గురించి తెలియచేసుకున్నాము. కుష్టురోగుల కాలనీకి వెళ్లటానికి రెండు గుర్రాలు ఇప్పించమని కోరాము. అతను స్నేహపూర్వకంగా స్పందిస్తూ ఐదే ఐదు నిముషాల్లో గుర్రాలు అక్కడుంటాయని హామీ ఇచ్చాడు. మేము గుర్రాల కోసం ఎదురు చూస్తుండగా పక్కనే ఒక సైనికుడి ఆదేశాలు పాటిస్తూ వ్యాయామం చేస్తున్న ఒక గుంపును చూడటానికి ఆగాము. వీళ్లే ఆ ముందురోజున మాతో ఎంతో స్నేహపూర్వకంగా వ్యవహరించారు. అక్కడ మా రాకను గమనించిన సైనికుడు విలక్షణ రీతిలో అభివాదం చేశాడు. వెంటనే తన ఆధీనంలో ఉన్న వారికి వ్యాయామానికి సంబంధించి అనేక సూచనలు ఇవ్వటంలో మునిగిపోయాడు. ప్రతి ఐదుగురు యువకుల్లో ఒక్కరు మాత్రమే పెరులో సైనిక సేవలో శిక్షణ పొందుతారు. అయితే మిగిలిన యువకులంతా ఆదివారాల్లో ఈ సైనికుల పర్యవేక్షణలో వ్యాయామం చేయాల్సి ఉంటుంది. అటువంటి అభాగ్యులనే మేము చూస్తున్నాము. నిజానికి వారంతా అభాగ్యులే. పర్యవేక్షకుడి ఆదేశాల ప్రకారం శరీరాన్ని వంపులు తిప్పే అభాగ్యులు. ఈ పర్యవేక్షకుడు స్పెయిన్ భాషలో ఇచ్చే సూచనలు అర్థం కాక, శరీరాన్ని ఎప్పుడు ఎటు తిప్పాలో తెలియక, బాసు ఆదేశాల ప్రకారం నడవటం, ఆగటం చేయలేక ప్రతి పనీ అన్యమనస్కంగా అసంపూర్ణంగానే చేస్తున్నారు. వారిని చూసిన వారికి ఎవరికైనా కోపం వస్తుందంటే రాదా మరి.

గుర్రాలు వచ్చాయి. ఆ సైనికుడు మాకు తోడుగా ఒక స్థానిక వ్యక్తిని కూడా పంపాడు. అతనికి అచ్చమైన కచువా భాష తప్ప మరేమీ రాదు. అక్కడి పర్వత శ్రేణుల మధ్యగా సాగుతున్న మార్గం ఎంత దుర్గమంగా ఉందంటే వేరే గుర్రాలైతే అడుగు కూడా ముందుకు వేయలేవు. రహదారి మరీ ఇబ్బందిగా ఉన్న చోట ఆ స్థానికుడు కిందకు దిగి కళ్లాలు పట్టుకుని గుర్రాలను నడిపిస్తున్నాడు. మూడింట రెండువంతుల ప్రయాణం పూర్తయ్యే సమయానికి ఒక ముదుసలి, ఒక బాలుడు ప్రత్యక్షమయ్యారు. ఉన్నట్లుండి

పేనుబెత్తాలతో మాపై దాడి మొదలెట్టారు. ఆవిడ చేతుల్లో చాలా బుట్టలు ఉండటంతో వాళ్లు బుట్టలమ్ముకునేవారని మొదట భావించాను. "నాకు బుట్టలక్కరలేదు" అని చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. వాళ్లు కచువా జాతి ప్రజలు అన్న విషయాన్ని అల్బెర్టో గుర్తు చేసి ఉండకపోతే నేను అదేవిధంగా మాట్లాడుతూ ఉండేవాడిని. ఇంతలో అటుగా వస్తున్న వ్యక్తి స్పెయిన్ భాష తెలిసినవాడిలాగా ఉన్నాడు. అతను జోక్యం చేసుకుని ఈ గుర్రాలు వారివి అని వివరించాడు. ఆ ముసలావిడ, బాలుడు గ్రామపెద్ద నివాసం ముందుగా ప్రయాణిస్తుండగా ఆ గుర్రాలు వాళ్ల వద్ద నుండి గుంజుకుని మాకు ఇచ్చారట. నేను ఎక్కిన గుర్రపు యజమాని తన సైనిక విధుల నిర్వర్తించటానికి ఏడు లీగ్‌ల దూరం వెళ్లాడు. ఆ మహిళ మేము ప్రయాణిస్తున్న దిశకు అభిముఖంగా ఉంది. అందరు మంచి వాళ్లు చేసినట్లే మేము కూడా అక్కడ వ్యవహరించాము. ముందు గుర్రాలు దిగాము. గుర్రాలను వారికి అప్పగించి కాలినడకన ప్రయాణం ప్రారంభించాము. మా వెంట వచ్చిన స్థానికుడు మా సామానంతా తన భుజాలమీద మోసుకుని నడుస్తున్నాడు. ఆ విధంగా కుష్టురోగుల కాలనీకి చేరుకున్నాము. అప్పటి వరకు మాతోపాటు వచ్చిన స్థానికుడికి ఒక సోల్ ఇచ్చాము. దానికి అతను ఎంతగానో కృతజ్ఞతలు తెలిపాడు. నిజానికి అది చాలా చిన్న మొత్తం. అంత పెద్ద పనికి తగ్గ వేతనం కాదు.

ఆసుపత్రి పర్యవేక్షకుడు సెనోర్ మోంటెజో మాకు స్వాగతం తెలిపాడు. అక్కడిక్కడే మాకు విడిది కల్పించలేకపోయినా ఈ ప్రాంతంలో ఉన్న ఒక భూస్వామి ఇంట్లో విడిది ఏర్పాటు చేస్తానని చెప్పాడు. ఆ విధంగానే చేశాడు. ఆ ఆసామి మాకు కావల్సిన గది, తిండి ఏర్పాటు చేశాడు. ఆ చిన్న ఆసుపత్రిలో ఉన్న రోగులను చూడటానికి మరునాడు ఉదయం బయలుదేరి వెళ్లాము. అక్కడున్న వాళ్లు నిజానికి అద్భుతమైన పని చేస్తున్నారు. అయితే వారి కృషిని ఎవరూ గుర్తించటం లేదు. అక్కడి వాతావరణం మాత్రం దారుణంగా ఉంది. ఆ ప్రాంతంలో మూడింట రెండు వంతులు 'సిక్ జోన్'గా వేరు చేశారు. అందులో మొత్తం 31మంది రోగులు ఉంటున్నారు. వాళ్లంతా చావుకోసం ఎదురుచూస్తూ కాలం వెళ్లబుచ్చుతున్న వాళ్లే. పారిశుధ్యం పరిస్థితి ఘోరంగా ఉంది. అయితే అక్కడి పర్వత ప్రాంతంలో నివసిస్తున్న ఇండియన్ తెగ ప్రజలపై ఈ అపరిశుద్ధం వల్ల వచ్చే తేడా ఏమీ లేదు. కానీ కొద్దిపాటి విద్యావంతులైన వారు, ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వారికి మాత్రం పరిస్థితులు ఘోరంగా కనిపిస్తున్నాయి. అక్కడి నాలుగు గోడల మధ్యలోనే, తెలియని భాష మాట్లాడే ప్రజలతో కలిసి తమ జీవితాలు వెళ్లబుచ్చటం అన్న ఆలోచనే వెన్నులో వణుకు పుట్టిస్తుంది. వీరు కాక అప్పుడప్పుడూ వచ్చి రోగులను చూసి వెళ్లే నలుగురు సహాయకులు మాత్రమే అక్కడ ఉన్నారు.

రెల్లుగడ్డితో కప్పిన ఒక గదిలోకి వెళ్లాము. పైకప్పుకు వెదురు బద్దలు అమర్చబడ్డాయి. నేలపై కూర్చున్న ఒక తెల్లమ్మాయి క్వైయిరోస్ రాసిన కజన్ బాసిలియో పుస్తకం చదువుతోంది. ఆ అమ్మాయితో మేము మాట్లాడటం మొదలుపెట్టగానే ఓదార్చలేనంతగా ఆమె భళ్లుమని ఏడుపు లంకించుకుంది. తన జీవితం నిత్యం నరకంగా మారిందని చెప్పింది. అమెజాన్ ప్రాంతానికి చెందిన ఆవిడ కజ్కో వెళ్లింది. వ్యాధి నయం కావటానికి మరింత మెరుగైన ప్రదేశానికి పంపుతామన్న దుర్వార్త అక్కడ ఆమెకు ఎదురైంది. కజ్కోలో ఉన్న ఆసుపత్రి కూడా ఏమంత పరిపూర్ణమైనది కాదు. కానీ ఇక్కడి కంటే కాస్తంత మెరుగైనదే అని చెప్పాలి. నిత్యం నరకం అన్న ఆమె వ్యక్తీకరణను నేను అంగీకరిస్తున్నాను. నమ్ముతున్నాను. ఆమె పరిస్థితికి అది సరైన వ్యక్తీకరణే. ఇక్కడ బాగా ఉన్నట్లు చెప్పగలిగేది మందులు ఇవ్వటం మాత్రమే. మిగిలిందంతా మనం పడే బాధలోనే మర్చిపోవాలి. ఇంతటి బాధను భరించటమే పెరులో పర్వత ప్రాంత ఇండియన్లకు ఉన్న ప్రత్యేక లక్షణం.

ఇరుగు పొరుగు ప్రాంతాల ప్రజలు పాటిస్తున్న అంటరానితనంతో ఈ కాలనీలో నివసిస్తున్న రోగులు, వారికి చికిత్స చేస్తున్న సిబ్బంది మరింత ఒంటరితనం అనుభవిస్తున్నారు. ప్రధాన వైద్యుడు భారీ శస్త్రచికిత్స ఒకటి చేయాల్సి వచ్చిందని, ఎంత ప్రయత్నించినా వంటగదిలో ఉన్న మేజాబల్లపై అటువంటి శస్త్రచికిత్స పూర్తి చేయటం సాధ్యంకాదు. పైగా అందుకవసరమైన పరికరాలు కూడా లేకపోవటంతో పొరుగునున్న అన్‌దాహుయల్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయటానికి వసతి కావాలని కోరిన విషయాన్ని ఒకరు మా దృష్టికి తెచ్చారు. కానీ అక్కడి సిబ్బంది అందుకు ససేమిరా అనటంతో ఆ రోగి చనిపోయాడు. ప్రసిద్ధిగాంచిన కుష్టువ్యాధి నిపుణులు డాక్టర్ పెస్కె చొరవతో ఇక్కడ కుష్టువ్యాధి చికిత్స కేంద్రం ఏర్పాటు చేసినప్పుడు కొత్త సేవలు అందించే ఏర్పాటు చేయటానికి తానే బాధ్యత తీసుకున్నట్లు సెనోర్ మోంటెజో తెలిపారు. అయితే తాను హువాన్‌కరామాలో రాత్రి బస చేయటానికి ఒక్క గది కూడా దొరకలేదని చెప్పాడు. అక్కడున్న ఒకరిద్దరు మిత్రులు సైతం తనకు ఆశ్రయం ఇవ్వటానికి తిరస్కరించారని తెలిపాడు. దానికి వాళ్లు వర్షం వచ్చే ప్రమాదం ఉందన్న సాకు చూపించారు. దాంతో పందుల చావిట్లో తలదాచుకోవాల్సి వచ్చింది. మేము అంతకు ముందు మాట్లాడిన రోగి

పరిస్థితి కూడా అంతే. ఆమెతో మాట్లాడేవాళ్లే కరువు కావటంతో ఇక్కడదాకా రావల్సి వచ్చింది. ఇదంతా కాలనీ ఏర్పాటు చేసిన చాలా సంవత్సరాల తర్వాత కనిపించిన పరిస్థితి (నిజంగా కాలనీ ఏర్పాటు చేసినప్పుడు పరిస్థితి ఎంత నికృష్టంగా ఉండేదో).

తమదైన శైలిలో మాకు స్వాగతం చెప్పాక అక్కడికి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న నూతన ఆసుపత్రిని చూపించటానికి తీసుకెళ్లారు. కొత్త ఆసుపత్రి గురించి మా అభిప్రాయం అడగటంతో అక్కడున్న ఆర్డర్లీ అదంతా తమ సృష్టే అన్నట్లు కళ్లు పెద్దవి చేశారు. ముక్కోణాకారంలో ఉన్న ఇటుకలతో తామే నిర్మించినట్లు సంబరపడిపోతున్నారు. మా విమర్శలను పునరావృతం చేయటం అంటే మాకు హృదయం లేదని రుజువు చేసుకోవటమే అవుతుంది. అయితే కొత్త కాలనీలో కూడా పాత కాలనీలో ఉన్నన్ని సమస్యలున్నాయి. పరిశోధనాశాల లేదు. శస్త్రచికిత్సకు అవసరమైన వసతులు లేవు. పరికరాలు లేవు. ఇది చాలదన్నట్లు ఈ ప్రాంతంలో దోమల బెడద కూడా ఎక్కువే. అక్కడ ఒక రాత్రి గడపిన వారెవరైనా హింస భరించక తప్పదు. కొత్త ఆసుపత్రిలో 250 మంది రోగులకు వసతి ఏర్పాటు చేయవచ్చు. నిరంతరం అందుబాటులో వైద్యుని నివాసానికి కూడా వసతి ఏర్పాట్లున్నాయి. పారిశుధ్యం మరికొంత మెరుగ్గా ఉంది. అయితే ఇంకా బాగు చేయాల్సింది చాలా ఉంది.

మాకు బస ఏర్పాటు చేసిన ఆసామి ఇచ్చిన గుర్రాలతో మేము తిరుగు ప్రయాణం ప్రారంభించాము. మాతో వచ్చిన స్థానిక కచువా తెగ వ్యక్తి తిరుగు ప్రయాణంలో కూడా మమ్ములను వెన్నంటి వచ్చాడు. ఆసామి ఆదేశాల మేరకు మా మూటలు కూడా వీపు నెత్తుకున్నాడు. అక్కడున్న సంపన్నులకు ప్రయాణంలో పాదచారిగా సేవకుడు ఒకడిని వెంటపెట్టుకు పోవటం అలవాటుగా ఉంది. గుర్రాలమీద ప్రయాణించే వీళ్లు తమ సామానుతో పాటు అసౌకర్యాన్ని కూడా సేవకుల వీపుకెత్తటం సాధారణంగా మారింది. మొదటి మూల తిరిగిన తర్వాత మేము స్థానిక కచువా సేవకుడు మోస్తున్న సామాను తీసుకున్నాము. అతని ముఖం కృతజ్ఞతాభావంతో వెలిగిపోయింది.

హువాన్‌కరామాలో మళ్లీ పౌర పోలీసు అధికారి బసలోనే తలదాచుకున్నాము. మేము నిర్ణయించుకున్నట్లు ఉత్తర దిక్కుగా వెళ్లే మరో ట్రక్కు దొరికే వరకు అక్కడే కాలక్షేపం చేశాము. మరునాడే ట్రక్కు మాకు దొరికింది. రోజంతా ప్రయాణించి చివరికి అందహుయ్‌లాస్ పట్టణం చేరుకున్నాము. అక్కడకు చేరుకోగానే నేను కోలుకునేందుకు నేరుగా ఆసుపత్రికి వెళ్లి విశ్రాంతి తీసుకున్నాను.



# మరింత ఉత్తరం దిక్కుగా

ఆసుపత్రిలో రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకుని కొద్దిగా కోలుకున్నాము. పౌర పోలీసు అధికారి ఇచ్చే ఆతిధ్యాన్ని అందుకోవటం కోసం ఈ విశ్రాంతి కేంద్రాన్ని వదిలిపెట్టాము. గతంలో వలెనే అతను మమ్ములను సాదరంగా ఆహ్వానించాడు. మా దగ్గర డబ్బులకు ఎంతటి కొరత ఉందంటే చివరకు రోజువారి తిండి కూడా ఇబ్బందైంది. అయితే లిమా చేరేవరకు మేము పని చేయటానికి సిద్ధంగా లేము. అక్కడ మరింత ఎక్కువ వేతనం వచ్చే పని దొరికే అవకాశాలున్నాయన్న ఆశతో సాగుతున్నాము. ఆ విధంగా కాస్తంత డబ్బులు పోగుపడితే తిరిగి రోడ్డు ప్రయాణం కొనసాగించటానికి వీలవుతుందన్నది మా ఆశ. ఆ విధంగా మేము తిరుగు ప్రయాణం పట్టాల్సిన అవసరం లేకుండా చేసుకోవాలని ఎదురు చూస్తున్నాము.

ఆ సరిహద్దు కేంద్రానికి పర్యవేక్షకునిగా ఉన్న అధికారి కాస్తంత ఉదారుడు కావటంతో మొదటి రాత్రి సాఫీగానే జరిగిపోయింది. అతను మమ్ములను భోజనానికి కూడా ఆహ్వానించాడు. కడుపునిండా తినటమే కాక మరికొద్ది రోజులకు కూడా శక్తినిచ్చేంతగా భోజనం చేశాము. అయితే ఆ తర్వాతి రెండు రోజుల్లోను ఆకలి తప్పలేదు. దాంతోపాటు విసుగు, బోరుకొట్టటం కూడా మామూలైపోయింది. మేము వెళ్తున్న ట్రక్కు సరిహద్దు కేంద్రానికి ఎంతో దూరం వెళ్లలేదు. అక్కడే ట్రక్కు డ్రైవర్లు రవాణాకు సంబంధించిన కాగితాల తనిఖీ చేయించుకోవాల్సి రావటంతో అటువైపు వెళ్లాము.

మూడో రోజు చివరికి మేము ఎదురు చూస్తున్న విధంగా అయాకుచోకు వెళ్లే వాహనం ఒకటి తారసపడింది. అప్పటికి అందహుయ్‌లాస్ పట్టణంలో ఐదురోజులు గడిపాము. అక్కడ స్థానిక ఇండియన్ తెగకు చెందిన మహిళ పట్ల అసభ్యంగా ప్రవరిస్తున్న సైనికులను చూసి అల్బెర్టో కోపం తెచ్చుకున్నాడు. అటువంటి సమయంలో ఆ వాహనం తారసపడటం కలిసి వచ్చింది. ఆ ఇండియన్ తెగ మహిళ పోలీసు నిర్బంధంలో ఉన్న

తన భర్తకు అన్నం తెచ్చింది. వారిని అసలు మనుషులుగానే చూడని అటువంటి వాతావరణంలో అల్బెర్టో స్పందన అక్కడి వారికి వింతగానే తోచింది. ఈ సంఘటన తర్వాత మాకు గతంలో మాదిరిగా సదుపాయాలు దొరకలేదు.

చాలా రోజులు గత్యంతరం లేక ఆ గ్రామంలో చిక్కుకుపోయిన మేము పొద్దుగూకటంతోనే ప్రయాణం ప్రారంభించాము. ఇప్పుడు ట్రక్కు ఎత్తయిన గుట్టల మీదుగా ప్రయాణం సాగించాల్సి వచ్చింది. ముందుకు సాగే కొద్దీ ఒక్కో నిముషానికి చలి పెరిగిపోతుంది. ఇదంతా చాలదన్నట్లు ఈ ప్రాంతంలో వచ్చే భారీ తుఫాను కారణంగా మేము తడిసి ముద్దయిపోయాము. దీన్నుండి మమ్ములను మేము రక్షించుకోవటానికి ఎటువంటి అవకాశమూ లేకపోయింది. మేము వెళ్తున్న ట్రక్కులోనే వెనుకవైపు లిమాకు తీసుకెళ్లటానికి గాను పది గిత్తలు కూడా కట్టబడి ఉన్నాయి. వాటి జాగ్రత్తలు చూడాల్సిన బాధ్యత మాకు అప్పగించబడింది. మధ్యలో మేమంతా ఒక రాత్రి చికెరోస్ అనే పేరుగల పట్టణంలో గడిపాము. మేము ఎంత చలితో ఉన్నామంటే మేము నిరాశ్రయులమన్నవిషయాన్ని మర్చిపోయి ఇద్దరకూ కలిసి ఒక మంచమైనా కావాలని అడిగాము. ఈ విజ్ఞప్తి చేసేటప్పుడు మేము దాదాపు ఏడ్చినంత పని చేశాము. మా ప్రయత్నాలు యజమానిపై పని చేసినట్లు కనిపించాయి. అతను కల్పించే ప్రతి వసతికి ఐదు సోల్స్ చెల్లించాలని చెప్పాడు. మరునాడంతా పంపా మైదానాల మధ్యగుండా మా ప్రయాణం సాగింది. పంపాలంటే పెరులోని పర్వత ప్రాంతాల్లో కొండ కోనలు ఉన్న మైదానాలన్నమాట. అక్కడ భౌగోళిక పరిస్థితి ఎంత అడ్డదిడ్డంగా ఉంటుందంటే చెప్పుకోవటానికి ఒక్క మైదాన ప్రాంతం కూడా కనిపించదు. అమెజాన్ తీరంలో ఉన్న అడవులు తప్ప. సమయం గడుస్తున్న కొద్దీ మా కష్టాలు మరింత పెరుగుతున్నాయి. ప్రయాణం ఎత్తుపల్లాలతో సాగుతుండటంతో గిత్తలకు కట్టిన తాళ్లు సడలిపోయాయి. దాంతో అవి కదిలి అప్పుడప్పుడు ఒకదానిమీద ఒకటి పడిపోతున్నాయి. దాంతో వాటిని తిరిగి లేపటం మా వంతైంది. లేనిపక్షంలో మిగిలిన వాటి కాళ్లకింద పడి అది నలిగిపోయే ప్రమాదం ఉంది.

ఒక సందర్భంలో అల్బెర్టో ఒకదాని గిట్టలు మరోదాని కళ్లకు తగిలేంత దగ్గరగా ఉండటం గమనించి పక్కనే ఉన్న ఇండియన్‌కు చెప్పాడు. అతను తనకున్న అసహ్యాన్నంతా ప్రదర్శిస్తూ “అయితే ఏంటట” అన్నట్లు చూశాడు. ఆ విధంగా చూసిన ఆ వ్యక్తి గిత్తలను కట్టేసిన తాళ్లు బిగించటంలో మునిగిపోయాడు.

చివరకు మేము అయకుచో చేరాము. లాటిన్ అమెరికా చరిత్రలో ప్రసిద్ధిగాంచిన పోరాటాలకు ఈ పట్టణం ప్రధాన కేంద్రంగా నిలిచింది. ఇక్కడే బొలీవర్ పట్టణాన్ని చుట్టుముట్టి విజయం సాధించాడు. ఇక్కడ వెలుతురు మరింత అధ్వానంగా ఉంది. వీధి లైట్లు అవసానదశకు చేరినట్లున్నాయి. ఈ లైట్ల చుట్టూ విస్తరిస్తున్న కొద్దిపాటి నారింజరంగు కాంతితో రాత్రంతా సాగుతోంది. అక్కడ విదేశీ నాణేలు సేకరించే అలవాటున్న ఒక వ్యక్తి ఆ రాత్రికి నిద్రించేందుకు రావాల్సిందిగా ఆహ్వానించాడు. మరునాడు ఉదయం మమ్ములను ఉత్తరం దిక్కుగా తీసుకెళ్లే మరో ట్రక్కు తారసపడింది. దాంతో ఆ పట్టణంలో ఉన్న 33 చర్చిల్లో కేవలం రెండింటిని మాత్రమే చూసేందుకు మాకు వీలుపడింది. మాకు ఆశ్రయం ఇచ్చిన స్నేహితుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ లిమా దిశగా సాగిపోయాము.

# పెరు మధ్యలో గుండా...

మా ప్రయాణం గతంలో మాదిరిగానే ముందుకు సాగింది. ఎవరైనా దయామయులు కనికరిస్తే ఒకపూట తిని,మరోపూట తినక ముందుకు సాగుతున్నాము. అప్పటికి ఇంకా మా పొట్టలు నిండలేదు. ఒక రోజు సాయంత్రం మేము ప్రయాణిస్తున్న మార్గం మధ్యలో మట్టిపెళ్లలు విరుచుకుపడిపోయాయని, మేము ముందుకు సాగటం కష్టమని చెప్పారు. అప్పటికే మా పొట్టలో పేగులు ఆకలికి కేకలు వేస్తున్నాయి. ఈ అంతరాయంతో రాత్రి సమీపంలోని కుగ్రామం ఆన్‌కోలోనే గడపాల్సి వచ్చింది. మరునాడు ఉదయమే తిరిగి ప్రయాణం ప్రారంభించాము. ట్రక్కులో కొద్దిదూరం వెళ్లగానే మట్టిపెళ్లలు మార్గమధ్యలో అడ్డుగాపడి ఉన్న ప్రాంతానికి చేరుకున్నాము. ప్రయాణీకులకు కలిగిన ఈ అవాంతరాన్ని తొలగించేందుకు పెద్ద ఎత్తున మందుగుండు సామాగ్రి ఉపయోగిస్తున్న కార్మికులను చూస్తూ ఆ పగలంతా ఆకలితో అక్కడే గడిపాము. ఒక్కో కార్మికుడిని పర్యవేక్షించేందుకు దాదాపు ఐదుగురు బాస్‌లున్నారు. పదే పదే అరుస్తూ డైనమైట్

పేల్చే పనికి ఆటంకం కలిగిస్తున్నారు. వాళ్లు నిజంగా పని చేసే వారంటే నమ్మటం కష్టమే.

ఆ ప్రాంతానికి కొంచెం దిగువన ఉన్న నీటి ప్రవాహంలో ఈదటం ద్వారా మా ఆకలిని మర్చిపోదామని ప్రయత్నించాము. వడిగా ప్రవహిస్తున్న నీళ్లలో ఈత మొదలుపెట్టాము. అయితే మరీ చల్లగా ఉండటంతో ఎక్కువసేపు నీళ్లల్లో ఉండలేకపోయాము. మా ఇద్దరి శరీరాలు చలిని తట్టుకోవటానికి సిద్ధంగా లేవు. చివరకు మా దీనగాథల జాబితాకు మరో గాథ చేరిన తర్వాత అక్కడున్న వారిలో ఒకరు మాకు మొక్కజొన్న కండె ఒకటి ఇచ్చాడు. మరొకతను ఇంకో తినుబండారం ఇచ్చాడు.

అక్కడున్న మహిళల్లో ఒకావిడ మాకు తన కుండ అరువు ఇచ్చింది. దాంతో మేము వంట ప్రారంభించాము. అయితే డైనమైట్లు పేలుస్తున్న కార్మికులు సగం వరకు వెళ్ళే దారి కల్పించడంతో మా ట్రక్కు ముందు కురికింది. ఆ మహిళ తన కుండను తిరిగి తీసుకోవటంతో మేము మొక్కజొన్న కండె ఉడకబెట్టకుండానే తినాల్సి వచ్చింది. మా సమస్యల కళ్లెం తీయటానికా అన్నట్లు చీకట్లు ముసురుకుంటున్నాయి. కుండపోతగా కురుస్తున్న వర్షంతో రోడ్డు బురదమయమయింది. అక్కడ నుండి ఒకసారి ఒక వాహనం మాత్రమే వెళ్లటానికి అవకాశం ఉంది. దీంతో మట్టి పెళ్లలకు ఆవలవైపున ఉన్న వాహనాలు ముందుగా కదిలాయి. ఆ తర్వాత మా వైపునున్న వాహనాల వంతు. మావైపు వరుసలో మాదే మొదటి వాహనం కానీ వాహనాలకు సహాయం చేయటానికి వచ్చిన ఒక ట్రాక్టరు బిరుసుగా తిప్పటంతో ఒక ట్రక్కు ఇరిగిపోయింది. దాంతో మళ్లీ ట్రాఫిక్ గాడితప్పింది. చివరకు ఆవలి వైపునుండి వచ్చిన ఒక జీపు ఇరిగిపోయిన ట్రాక్టరును పక్కకు లాగేయటంతో మిగిలిన వాళ్లం తిరిగి ప్రయాణం ప్రారంభించాము. అప్పటి వరకు కాస్తో కూస్తో నీడనిచ్చే లోయల గుండా ప్రయాణించిన మేము ఆ రోజు రాత్రి మాత్రం ఎటువంటి ఆచ్ఛాదన లేని పంపా మైదానాల గుండా ప్రవహించాల్సి రావటంతో మంచుగాలులతో మా శరీరాలు ముద్దయి పోయాయి. చలికి ఒళ్లు పగుళ్లుబారాయి. ఇద్దరము కాళ్లు ముడుచుకుని కూర్చోవటంతో అవి మరింత మొద్దుబారిపోయేలా వున్నాయి. ఆ ప్రమాదం లేకుండా వంతుల వారీగా కాళ్లు చాపుకుంటూ ప్రయాణం సాగించాము. ఆకలికి శరీరమంతా వింత జంతువు పాకినట్లు అనిపిస్తోంది. పేగుల్లో ఎలుకలు తిరుగుతున్నాయన్న భావన కలిగింది. మా సహనం హరించుకుపోతున్నది.

మేము హువాన్‌కల్లో చేరిన తర్వాత ట్రక్కు మమ్మల్ని వదిలేసిన చోటు నుండి 15 బ్లాకులు దాటి స్థానిక పౌర పోలీసు అధికారి నివాసానికి చేరాము. కాస్తంత బ్రెడ్డు

కొనుక్కుని తేనీరు సేవించాము. ఎండుమాంసం ముక్కలు వెచ్చబెట్టుకునేందుకు ప్రయత్నించాము. రాజేసిన బొగ్గులు ఇంకా ఆరకముందే అటువైపుగా ఆక్సాపంపాకు వెళ్తున్న వాహనం ఒకటి మమ్ములను కూడా తీసుకెళ్లటానికి సిద్ధమైంది. ఆ ప్రాంతానికి వెళ్లటానికి మేము ఆసక్తి చూపటానికి ప్రధాన కారణం అక్కడే మా ప్రచారకుల్లో ఒకరి తల్లి నివశించటం. ఆవిడ అక్కడే వుంటున్నదో లేదో ఇదమిద్ధంగా తెలియదు కానీ మేము మాత్రం అలా భావించాము. మా ఆకలిని కొన్ని రోజులు తీర్చుకోడానికైనా ఆవిడ సహకరించకపోతుందా అన్న ఆశతో ముందుకు సాగాము. ఒకటో రెండో రూకలు కూడా వస్తాయన్న ఆశ మరింత మమ్ములను ప్రోత్సహించింది. దాంతో హువాన్‌కల్లో చూడకుండానే మేము ముందుకు సాగాము.

ఆక్సా పంపా దారిలో సగం దూరం రోడ్డు బాగానే ఉంది. సాయంత్రం ఆరయ్యే సరికి మా వాహనం సన్నని ఇరుకు లోయ అంచునున్న మార్గంలో వాలుగా దిగటం ప్రారంభించింది. ఆ రోడ్డు ఎంత ఇరుకుగా ఉందంటే ఆ దారిలో ఒకసారి ఒక వాహనం మాత్రమే వెళ్లగలదు. అంటే ఎదురుగా ఏదైనా వాహనం వచ్చిందంటే ఇక అంతే సంగతులు. ఒక్కో రోజు ఆ మార్గం గుండా ఒకవైపునుండే వాహనాలు వెళ్లటానికి అవకాశం ఇస్తారు. కానీ ఏవో తెలియని కారణాల వల్ల ఈ రోజు మాత్రం రెండు వైపుల నుండి వాహనాలు వెళ్లటానికి అవకాశం ఇచ్చారు. దాంతో అరుపులు, కేకల మధ్య ఒక్కో వాహనం మలుపు దాటుతోంది. ఇరుకుమార్గంలో ఎదురుబొదురుగా వాహనాలు రావటంతో ముందు చక్రాలు ప్రమాదకరమైన లోయ అంచుల వరకు వెళ్తున్నాయి.

ఈ మధ్యలో అల్బెర్టో, నేను ట్రక్కులో ఆ మూల నుండి ఈ మూలకు దొర్లుతున్నాము. ఏదైనా ప్రమాదం జరుగుతుందనిపిస్తే దూకటానికి వీలైన అవకాశం ఎక్కడ ఉందో చూస్తున్నాము. కానీ మాతో ప్రయాణిస్తున్న ఇండియన్ తెగల ప్రజలు ఒక్క అడుగు కూడా అటు ఇటూ కదల్లేదు. పర్వత సానువుల్లో ఉన్న అనేక మలుపులు ఎందరో డ్రైవర్ల ప్రాణాలు బలిగొన్నాయన్న అంశమే మమ్ములను ఆ విధంగా ప్రేరేపించింది. ఈ మార్గంలో గుండా వెళ్తున్న ప్రతి వాహనంలో కిక్కిరిసినట్లు మనుషులున్నారు. దిగువన రెండువందల మీటర్ల నిడివిలో ప్రవహిస్తున్న నది ఒకటి కనిపిస్తోంది. స్థానిక గణాంకాల ప్రకారం ఇక్కడ జరిగే దుర్ఘటనల్లో అందరూ చనిపోయారు. ఒక్కరు కూడా గాయాలతో బతికి బయటపడలేదు.

ఈసారి అదృష్టవశాత్తూ జరగకూడనిది ఏదీ జరగలేదు. రాత్రి పదిగంటల సమయానికి లా మెర్సెడ్ అన్న గ్రామం చేరాము. ఈ గ్రామం లోతట్టు సమశీతోష్ట

ప్రాంతంలో ఉంది. అటవీ ప్రాంతాల్లో ఉన్న అన్ని గ్రామాల్లాగానే ఇది కూడా కనిపిస్తోంది. అక్కడ మరో కరుణాత్ముడు మాకు పడుకోవటానికి మంచం ఇచ్చాడు. సుష్టుగా భోజనం కూడా పెట్టాడు. ఆ భోజనం కూడా చివరి నిముషంలో వచ్చింది. మమ్ములను పలకరించటానికి వచ్చిన వ్యక్తి కొన్ని నారింజతొనలతో మా ఆకలిని చల్లార్చుకోవటానికి మేము చేస్తున్న ప్రయత్నం చూసిన తర్వాత పరిస్థితి గ్రహించి భోజనం తెప్పించాడు.

ఇటుగుండా వెళ్లే ప్రతి వాహనం పట్టణంలోని పౌర పోలీసు అధికారి కార్యాలయం వద్ద ఆగాల్సిన అవసరం లేదన్న విషయాన్ని తెలుసుకున్న తర్వాత మా పరిస్థితి కుడితిలో పడ్డట్లయ్యింది. అక్కడ నుండి మమ్ములను తోడ్కొని వెళ్లటానికి ఏదో ఒక వాహనం దొరికే అవకాశాలు తక్కువకావటమే అందుకు కారణం. ఇంతలో అక్కడ ఒక హత్య జరిగినట్లు తెలసింది. చనిపోయిన వ్యక్తి కొడుకు ద్వారా చంపిన వ్యక్తి ఇతనికి దగ్గరి స్నేహితుడన్న విషయాన్ని తెలుసుకున్నాము. ఈ సంఘటన అనుమానాస్పద పరిస్థితుల్లో కొన్ని రోజుల క్రితం జరిగింది. ఇందులో ప్రధాన ముద్దాయి ఒక ఇండియన్. అతని ఫోటోను అక్కడికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు తెచ్చారు. సార్జెంట్ ఈ ఫోటో మాకు చూపిస్తూ "చూడండి వైద్యులారా, ఈ హత్య సన్నివేశాన్ని చూడండి" అనటంతో మేము ఆసక్తిగా తలలూపాము. అక్కడి నుండి బయటకు వచ్చిన తర్వాత అల్బెర్టోని "అందులో హంతకుడు ఎవరు" అని అడిగాను. అల్బెర్టో కూడా నేను ఆలోచించినట్లే ఆలోచిస్తున్నాడు. ఇండియన్ వ్యక్తి కంటే నల్లగా ఉన్నవాడిలోనే హంతకుడి పోలికలు మెండుగా ఉన్నాయని అభిప్రాయపడ్డాము.

మా ప్రయాణం కోసం చాలాసేపటి నుండి ఎదురు చూస్తున్న మేము అక్కడ ఉన్న కొందరితో స్నేహం చేసుకున్నాము. అందులో ఒకరు మా ప్రయాణానికి కావల్సిన అన్ని ఏర్పాట్లూ చేస్తామని దానికి ఖర్చేమీ కాదని చెప్పి ముందుకు వచ్చాడు. దానికి తగ్గట్లుగానే అతను ఒక ట్రక్కు డ్రైవరుతో మాట్లాడారు. అతను కూడా మమ్ములను తీసుకెళ్లటానికి అంగీకరించాడు. ఆ తర్వాత తెలిసింది తలకొక్కింటికి ఐదు సోల్స్ చొప్పున మాట్లాడి అతను ట్రక్కును అమర్చాడన్న విషయం. ఇది మామూలు ఛార్జీనే. మేము పూర్తిగా దివాళా తీశామని వేడుకున్నాము. అయితే అతను మాకు అప్పు ఇవ్వటానికి అంగీకరించాడు. ఇచ్చాడు కూడా. అక్కడికి చేరుకున్న తర్వాత అతని ఇంటికి తీసుకెళ్లాడు.

రోడ్డు ఇరుకుగా ఉంది. అయితే అంతకు ముందున్నంత ఇరుకుది కాదు. అటవీ ప్రాంతాలు, పళ్లతోటల మధ్యగా సాగాము. ఆక్సాపంపా చేరేలోగా రోడ్డు ఎత్తుపల్లాలు చూసింది. దాదాపు సముద్రమట్టానికి వెయ్యి మీటర్ల ఎత్తులో మేము ప్రయాణిస్తున్నాము. ఈ ప్రధాన మార్గంలో అది మా ప్రయాణపు చివరి ఘట్టం.

అప్పటి వరకు హత్య గురించి చెప్పిన నల్లని వ్యక్తి ఉన్న వాహనంలోనే మేము ప్రయాణించాము. రహదారి పక్కనే ఒక చోట మాకు అతను భోజనం తెప్పించాడు. ఆ తర్వాత కాఫీ తెప్పించాడు. మేము భోజనం చేసి కాఫీ తాగుతున్నంత సేపూ మాట్లాడుతూనే ఉన్నాడు. బొప్పాయి కాయల గురించి నల్ల జాతి బానిసల గురించి అతను చెప్పాడు. అతని తాత బానిస అన్న విషయాన్ని కూడా వివరించాడు. అతను బహిరంగంగా ఈ విషయాన్ని చెప్తున్నా అతని గొంతులో మాత్రం సిగ్గు స్పష్టంగా కనిపిస్తోంది. ఏదేమైనా అతని స్నేహితుడిని చంపిన నేరాన్ని మర్చిపోయేందుకు నేనూ, అల్బెర్టో సిద్ధమయ్యాము.

# చెదిరిన ఆశలు

మా అర్జెంటీనా స్నేహితుడు మాకు తప్పుడు సమాచారం ఇచ్చాడని, చాలా కాలం క్రితం వాళ్ల అమ్మ ఆక్సాంపాలో నివసించింది కాని ఇప్పుడు కాదన్న విషయం మరునాడు ఉదయానికి గానీ మాకు తెలియలేదు. దాంతో ఉసూరుమన్నాము. ఇప్పుడు అతని తల్లికి బదులు బావ ఒకడు అక్కడ నివశిస్తున్నాడు. దాంతో మా భారం అతను మోయాల్సి వచ్చింది. మా రాక సందర్భంగా ఏర్పాటు చేసిన ఆహ్వాన సభ భారీగా జరిగింది. మెరుగైన భోజనం సుష్టుగా లభించింది. ఆ తర్వాత మాకు తెలిసిందేమిటంటే మేము అతిధులం కాబట్టి పెరు సాంప్రదాయాలను మించి మాకు స్వాగతం పలికారన్న విషయం ఆ తర్వాతనే మాకు తెలిసింది. మమ్మలను సాగనంపేందుకు జరుగుతున్న ఏర్పాట్లు తప్ప మరేదీ పట్టించుకోదల్చుకోలేదు. ఎందుకంటే అప్పటికే మా చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. దాంతో పాటు అనేక రోజుల నుండీ ఆకలితో మాడిపోతున్నాము. దాంతో మమ్మలను తిరస్కరిస్తున్న స్నేహితుల ఇంట్లో సుష్టుగా భోజనం చేయటం తప్ప మరేమీ పట్టించుకోలేదు.

ఆరోజు మాకు అద్భుతమైన రోజు. నదిలో ఈతవేశాము. మా బాధలన్నీ మాయమయ్యాయి. పసందైన భోజనం సుష్టుగా ఆరగించాము. మంచి కాఫీ కూడా

దొరికింది. అయితే ఈ మంచి సంగతులన్నీ ముగింపు దశకు చేరుకున్నాయి. రెండోరోజు రాత్రికల్లా ఈ ఇంజనీరు తనను తాను మమ్ములనుండి విముక్తి చేసుకోవటానికి గాను ఒక నూతన ఫార్ములాతో ముందుకు వచ్చాడు. అది మంచిదే కాక చౌకైన ఫార్ములా కూడా. రహదారుల తనిఖీ అధికారి ఒకరు మమ్ములను లిమా వరకు తీసుకెళ్లటానికి అంగీకరించాడు. ఇక్కడ మా పరిస్థితి పంజరంలో ఉన్నట్లుండటంతో ఈ ఆలోచన బ్రహ్మాండం అనిపించింది. దాంతో రాజధానికి వెళ్లి మా అదృష్టాన్ని పరీక్షించుకోవాలని నిర్ణయించుకున్నాము.

ఆ రోజు రాత్రి మేము ఎక్కిన ట్రక్కు ఎముకలు కొరికే చలిలో మేము జోగుతుండగా లిమాకు సగం దూరం కూడా పోకముందే శాన్ రామోన్ అనే చోట మమ్ములను వేకువజామున రెండుగంటలకు దించేసింది. అక్కడ కొద్ది సేపు వేచి ఉండాలని ఈలోగా తాను వాహనం మార్చుకుని వస్తానని డ్రైవరు చెప్పాడు. మాలో రేకెత్తుతున్న సందేహాలను సమాధానపర్చటానికా అన్నట్లు తన క్లీనరును కూడా మావెంట అట్టిపెట్టాడు. మరో పది నిముషాల తర్వాత అతను కూడా సిగరెట్లు కొనుక్కొస్తానంటూ వెళ్లాడు. ఆ రోజు తెల్లవారి ఐదుగంటల సమయంలో మా కళ్లు కప్పగలిగామన్న ఆనందంలో కడుపునిండా అల్పాహారం తిన్నారు.

అటువంటి సమయంలో డ్రైవరుకు తగిన శాస్తి జరగాలని మాత్రమే నేను ఆశించాను. ఇదొక్కటే చాలదన్నట్లు ఒక ఎద్దు కంగారులో వాహనాన్ని ఢీకొన్నదని, డ్రైవరు చనిపోయాడని కూడా మరో అబద్ధం ఆడాడు (ఇదిలా ఉన్నప్పటికీ ఏదో ఒక పొరపాటు జరిగిందన్న విషయం నా మనసుకు తోస్తోంది. కానీ అతన్ని చూస్తే మంచివాడిలాగానే కనిపించాడు. దాంతో మేము అంతా నమ్మాము... చివరకు ట్రక్కు మాయమైందన్న విషయంతో సహా).

మరికొద్దిసేపటిలో తెల్లవారుతుందనగా మాకు ఇద్దరు తాగుబోతులు తారసపడ్డారు. దాంతో మేము అప్పుడప్పుడూ జరిపే వార్షికోత్సవం పథకం ప్రకారం జరిపాము. ఆ పద్ధతి ఇలా ఉంటుంది.

1. మమ్ములను అర్జెంటీనావాసులని గుర్తుపట్టటానికి వీలుగా ఏదో ఒక కేక వేయటం. అందులో చె అన్న పదం కూడా వినిపించేట్లు చేయటం. మేము ఎక్కడినుండి అని తర్వాత అడగటం. ఆ విధంగా సంభాషణ ప్రారంభించటం.

2. మా కష్టాల గురించి చెప్పటం ప్రారంభిస్తాము. ఎవరో ఒకరు చుట్టూ తిరగాడుతున్నారా లేదా అన్నది గమనించుకుంటూ ఈ పని చేస్తాము.

3. నేను జోక్యం చేసుకుని తేదీ ఎంత అని అడుగుతాను. పక్కనున్న వాళ్లలో ఒకరు ఫలానా తేదీ అని చెప్తారు. దాంతో నేను చూసావా సరిగ్గా నేటికి సంవత్సరం అంటాను. ఆ తర్వాత పక్కనున్న వ్యక్తి సరిగ్గా సంవత్సరం క్రితం ఏమిటని ప్రశ్నిస్తాడు. దానికి సమాధానంగా సరిగ్గా సంవత్సరం క్రితం ఇదేరోజున మేము ప్రయాణం ప్రారంభించాము అని సమాధానం చెప్తాను.

4. అల్బెర్టో నాకంటే ధైర్యవంతుడు. పెద్దపెట్టున నిట్టూర్పు విడుస్తూ "మేము ఇటువంటి పరిస్థితుల్లో ఉన్నామంటే నిజంగా జాలేస్తుంది. మేము మా వార్షికోత్సవాన్ని జరుపుకునే పరిస్థితిలో లేము" అని చెప్తాడు. దాంతో పక్కనున్న వ్యక్తి ఎంతో కొంత సహాయం చేయటానికి ముందుకు వస్తాడు. మొదట్లో బెట్టు చేసిన మేము చివరకు అతని సహాయాన్ని స్వీకరిస్తాము.

5. కాస్తంత మద్యం సేవించిన తర్వాత రెండో గుటక వేయటానికి నిరాకరిస్తాను. దాంతో అల్బెర్టో నా పట్ల కోపంగా చూస్తాడు. ఆ అతిధేయుడు కాస్తంత కోపగించుకుని మరికాస్త తీసుకొమ్మని ఒత్తిడి తెస్తాడు. కారణం చెప్పకుండా నేను తిరస్కరిస్తాను. అతను పదే పదే కారణం ఏమిటని అడిగిన మీద అర్జెంటీనాలో తాగేటప్పుడు ఏదో ఒకటి తినటం సాంప్రదాయం అన్న విషయాన్ని చల్లగా చెవిన వేస్తాను. ఆ తర్వాత మేము ఎంత తింటాము అన్నది మాకు ఆతిధ్యం ఇస్తున్న వ్యక్తి ముఖ కవళికలను బట్టి ఉంటుంది. మొత్తం మీద ఇది బాగా నాజూకైన కిటుకు.

శాన్ రామోన్‌లో కూడా ఇదే కిటుకు ప్రయోగించాము. ఎప్పటిలాగానే మేము తాగినంత తాగి కావల్సినంత ఆహారం కూడా సంపాదించుకోగలిగాము. ఆ ఉదయం నదీతీరంలో విశ్రాంతి తీసుకున్నాము. ఈ నదీతీర సౌందర్యం మా కళ్లకు కనిపించకపోయినా అది ఆకర్షణీయమైన ప్రదేశమే. అయితే అది క్రమంగా అనేక తైలవర్ణ చిత్రాల్లా మారిపోతోంది. సమీపంలో కంచె నుండి తొంగిచూస్తున్న నారింజ తోట కనిపించింది. ఎంత ఆబగా తిన్నామంటే కేవలం నిముషంలో మా పొట్టలు నిండిపోయాయి. ఇంత త్వరగా నిండిపోవటం విచారకరంగా కూడా ఉంది. మరుక్షణంలోనే కడుపులో మంట కూడా మొదలైంది.

దిగాలుపడిన మేము మాతో ఉన్న కాస్తంత సిగ్గు కూడా వదులుకోవాలని నిర్ణయించుకున్నాము. ఆ విధంగా స్థానిక ఆతిధ్యం సంపాదించాలని ప్రయత్నించాము. ఆసారి అల్బెర్టో కాస్తంత బిడియపడ్డాడు. దాంతో మర్యాదపూర్వకమైన ఈ కింది సంభాషణ ప్రారంభించటానికి సరైన పదాలు వెతకాల్సి వచ్చింది.

అక్కడున్న స్థానిక ఆసుపత్రిలో కనిపించిన వైద్యుడిని సంబోధిస్తూ, "డాక్టర్, నేను వైద్య విద్యార్థిని. నా వెంట ఉన్న వ్యక్తి జీవ రసాయనశాస్త్ర విద్యార్థి. మేమిద్దరమూ అర్జెంటీనా నుండి వస్తున్నాము. బాగా ఆకలిగా ఉంది. ఏదో ఒకటి తినాలి" అన్నాను. ఉన్నట్లుండి అటువంటి పరిస్థితి ఎదురుకావటంతో తడబడిన ఆ వైద్యుడు చేసేదేమీ లేక మాకు భోజనం కొనిపెట్టటానికి అంగీకరించాడు. అతను తింటున్న హోటల్ నుండే భోజనం తెప్పించాడు. దాంతో మాకు కాస్తంత ధైర్యం వచ్చింది.

అల్బెర్టో ఎంత నిస్సిగ్గుగా వ్యవహరించాడంటే కనీసం అతనికి కృతజ్ఞతలు కూడా చెప్పలేదు. ఆ తర్వాత మరో ట్రక్కును పట్టుకోవటం కోసం ఎదురుచూస్తున్నాము. చివరకు పట్టుకున్నాము కూడా. సుఖంగా డ్రైవర్ కాబిన్లోనే కూర్చుని ఇప్పుడు మేము లిమా దారిలో పడ్డాము.

చాలా ఇరుకైన కొండమార్గంలో ప్రయాణిస్తున్న మాకు భయం కూడా వేసింది. మార్గమధ్యలో వస్తున్న ప్రతి మూల గురించిన చరిత్రను తన్మయత్వంతో చెప్పుకుపోతున్నాడు డ్రైవరు. అంతలో రోడ్డు మధ్యలో భారీ గుంటను తాకింది వాహనం. ఎటువంటి మూర్ఖుడికైనా అది కనిపిస్తుంది. నిరంతరం వేగం పెంచుకుంటూ వాహనం నడపటం ఎలాగో డ్రైవరుకు తెలియదనుకున్నాము. కానీ ప్రాథమిక పరిజ్ఞానంతో ఆలోచిస్తే అది అసాధ్యం కాదనిపించింది. అది కూడా ఇటువంటి రోడ్డు మీద. ఎంతో అనుభవం ఉన్న డ్రైవర్లయితే ఎప్పుడో అంచులు చూసుకుంటూ వెళ్లి ఉండేవారు. పథకం ప్రకారం ఓపిగ్గా మాట్లాడి అసలు కథ ఏమిటో రాబట్టాడు అల్బెర్టో. ఆ డ్రైవరు ఒక ప్రమాదానికి లోనుకావటంతో కంటి చూపు మందగించిందని నిదానంగా వెల్లడించాడు అతను. ఆ కారణంగా వాహనం గుంటల మీదుగా పోనిస్తున్నాడు. దాంతో ప్రమాదాన్ని అతని దృష్టికి తెచ్చేందుకు ప్రయత్నించాము. అతనికి గల ప్రమాదం, అతనితో పాటు ప్రయాణిస్తున్న వారికి గల ప్రమాదాన్ని తెలియచేశాము. కానీ మా మాట వినటానికి అతను సిద్ధంగా లేడు. ప్రయాణీకుల భద్రత గురించి పట్టించుకోవటం అతని పని అనీ, తన యజమాని తనకు మంచి జీతం ఇస్తున్నాడని అతను చెప్పాడు. కానీ డ్రైవరు ఎలా గమ్యాన్ని చేరుకుంటున్నాడు అన్న విషయాన్ని మాత్రం యజమాని అడగటం లేదు. అంతే కాదు. డ్రైవింగ్ లైసెన్సు తీసుకోవటానికి కూడా పెద్దమొత్తంలో అతను లంచం ఇవ్వాల్సి వస్తోంది. దాంతో అది కూడా ఖరీదైనదిగానే మారింది.

ట్రక్కు యజమాని పైకెక్కి కొద్దిదూరం ప్రయాణించాడు. అతను మమ్మల్ని లిమా వరకు తీసుకెళ్లటానికి సంతోషంగానే అంగీకరించాడు. అయితే దానికి ఒక షరతు

కూడా విధించాడు. మేము పైకి ఎక్కి కూర్చోవాలన్నది ఆ షరతు. ఆ విధంగా పోలీసు తనిఖీ కేంద్రం వచ్చినప్పుడు మేము కనిపించకుండా ఉండవచ్చన్నది అతని సలహా. ఎందుకంటే సరుకుల రవాణాకు ఉపయోగించే వాహనాల్లో ప్రయాణీకులను ఎక్కించుకోవటంపై నిషేధం ఉంది. ఆ ట్రక్కు యజమాని మంచివాడిలాగానే ఉన్నాడు. రాజధాని వరకు అతను మాకు మధ్యలో అవసరమైనన్నిచోట్ల భోజనం కూడా పెట్టించాడు. రాజధానికి ముందు మేము గనులున్న మరో పట్టణం లా ఒరోయో వచ్చింది. అక్కడ దిగి చూడాలని ఎంతగా ఉబలాటపడ్డా చూడలేకపోయాము. సముద్రమట్టం నుండి లా ఒరోయో 4000 మీటర్ల ఎత్తులో ఉంది. ఆ పట్టణాన్ని చూసీ చూడటంతోనే గని కార్మికుల జీవితాలు ఎంత హీన స్థితిలో ఉన్నాయో ఇట్టే తెలిసిపోతుంది. నిలువెత్తున నిల్చున్న పొగగొట్టాలు భారీ ఎత్తున పొగ వదులుతున్నాయి. వీధుల్లోకి వస్తున్న కార్మికుల మొఖాలు కూడా మసిబారిఉన్నాయి. ముఖమంతా బూదరరంగులోకి మారిపోయి కళ్లు, ముక్కు అన్న తేడా లేకుండా ముఖమంతా ఒకటిగానే కనిపిస్తోంది. వాళ్ల శరీరాలు కూడా పక్కనున్న కొండల రంగుతో కలిసిపోతున్నాయి. ఈ మధ్యలో మేము ఆ రోడ్డులో అత్యంత ఎత్తయిన ప్రదేశం, సముద్రమట్టం నుండి 4853 మీటర్ల ఎత్తులో ఉన్న ప్రదేశాన్ని దాటి ముందుకు పోయాము. అది పగలే అయినా చలితీవ్రత ఎక్కువగానే ఉంది. దుప్పటి చుట్టుకున్న నేను రెండు వైపులా కనిపించినంత వరకు ఉన్న దృశ్యాన్ని చూస్తున్నాను. నేను చేస్తున్న వింత శబ్దాలు ట్రక్కు మోతలో కలిసిపోతున్నాయి.

నగర శివార్లలో ఆ రోజు రాత్రి నిద్రపోయాము. మరునాడు పెందలాడే లిమా నగరంలో ప్రవేశించాము.



## వైస్రాయిల నగరం

మా ప్రయాణంలో ఒక ముఖ్యమైన దశ ముగింపుకు చేరాము. మా దగ్గర చిల్లిగవ్వ లేదు. తొందరగా డబ్బులు సంపాదించుకునే మార్గం కూడా కనుచూపు మేరలో కనిపించటం లేదు. అయినా మేము సంతోషంగానే ఉన్నాము.

లిమా అందమైన నగరం. ఈపాటికే ఆ నగరం తన వలసవాద అనుభవాలను తన నూతన భవనాల కింద పాతిపెట్టింది. నగరరాజం అన్న దాని బిరుదు నగరానికి తగినట్లు లేకపోయినప్పటికీ నగర శివార్లు సముద్రతీరంలో ఉన్న విహార కేంద్రాల వరకు విస్తరించి ఉన్నాయి. లిమా ప్రజలు కేవలం కొద్దిసేపటిలో నగర వీధుల గుండా నడుచుకుంటూ కల్లావో ఓడరేవుకు చేరుకోగలరు. ఓడరేవులో చెప్పుకోదగ్గ ప్రత్యేక ఆకర్షణ అంటూ ఏమీ లేదు. కేవలం రేవు తప్ప. ఈ రేవుపట్టణం అనేక యుద్ధాలకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది. ఆ రేవు చుట్టూ నిర్మితమైన భారీ గోడల నడుమ మేము నిల్చున్నాము. లాటిన్ అమెరికా విముక్తి సంగ్రామాల్లో అగ్రస్థానం అలంకరించే పోరాటంలో లార్డ్ కొచెర్నే తన సైనికులతో ఈ పట్టణంపై దాడి చేసి ఎలా స్వాధీనం చేసుకున్నాడా అన్న విషయాన్ని ఆలోచించుకుంటూ నిల్చున్నాము.

ఈ నగరంలో ఒక భాగాన్ని గురించి మాత్రం వివరించాల్సిందే. అది చర్చి చుట్టూ ఉన్న నగరం నడిబొడ్డు. కజ్కోలో ఉన్న మోనాస్టరీలతో పోల్చిచూస్తే ఈ ప్రాంతం పూర్తిగా కొత్తగా ఉంటుంది. అక్కడ విజేతలు తమ గొప్పతనాన్ని చాటుకునే విధంగా నిర్మాణాలు సాగించారు. లిమాలో మాత్రం నిర్మాణాలు తనదైన శైలిలో ఉన్నాయి. చర్చి గోపురాలు నిలువెత్తున ఆకాశంలోకి దూసుకుపోతున్నాయా అన్నంతగా ఉన్నాయి. స్పెయిన్ వలసల్లో ఉండే అన్ని చర్చిల కంటే ఇవి అందంగా ఉన్నాయి. కజ్కోలో చూసిన చెక్కపనితనం ఇక్కడ బంగారపు పూతను సంతరించుకుంది. స్థానికులు అక్కడ నల్లగా ఉంటే ఇక్కడ మాత్రం తెలికపాటి రంగుల్లో ఉన్నారు. వర్ణచిత్రాలు కూడా ఇక్కడ మరింత వెలుగులనిస్తున్నాయి. ఆహ్లాదకరంగా ఉన్నాయి. ప్రాచీన కాలపు గుడిశెలతో పోల్చి చూస్తే పాఠశాలలు కూడా ఆధునికంగానే ఉన్నాయి. పాఠశాలలపై దేవదూతల రూపాలు చిత్రించబడిఉన్నాయి. అన్ని చర్చిల్లోను చగ్రిగుగ్రెస్క్యు చిత్రకళ బంగారపు కాంతులీనుతోంది. విశాలమైన పైకప్పులను రంగురంగు చిత్రాలు, దృశ్యాలతో నింపే స్పెయిన్ చిత్రకళను చగ్రిగుగ్రెస్క్యు అంటారు. ఇంతటి విశాలమైన సంపదల కారణంగానే అమెరికా విముక్తి సైన్యాలను వీరు చివరి నిముషం వరకు ప్రతిఘటించగలిగారు. భూస్వామ్య అవశేషాలతో నిండిన ఒక వలస ప్రాంత స్థాయిని మించి పెరు దేశం అభివృద్ధి కాలేదు అని చెప్పటానికి లిమా పెద్ద ఉదాహరణ.

ఈ అద్భుత నగరంలో ఒక మూల మాకు ఎంతో ఇష్టమైంది. మంచుపిచ్చులో మాకు ఎదురైన అనుభవాలు నెమరు వేసుకోవటానికి తరచుగా అక్కడికి వెళ్లేవాళ్ళము. ఇక్కడ పురావస్తుశాస్త్రం, ఆంత్రోపాలజీకి సంబంధించిన వస్తు ప్రదర్శనశాల. అక్కడ

క్యురేటర్‌గా డాన్ జులియో టెల్లో ఉన్నారు. అచ్చమైన ఇండియన్ సంతతికి చెందిన మేధావి. పరిశోధకుడు. అన్నిరకాల సంస్కృతులను ప్రతిబింబించే విలువైన విషయసేకరణ అక్కడ లభ్యమవుతుంది.

కొర్డోబా కంటే భిన్నమైనది లిమా. అయితే కొర్డోబాలాగానే వలసవాద సంస్కృతి ప్రభావం ఈ నగరంమీద కూడా ఉంది. అక్కడ రాయబార కార్యాలయాన్ని సందర్శించాము. మాకోసం కొన్ని ఉత్తరాలు అక్కడ ఎదురుచూస్తున్నాయి. ఆ ఉత్తరాలు చదువుకున్న తర్వాత అక్కడి విదేశాంగశాఖ అధికారికి మమ్ములను పరిచయం చేస్తూ మాతో చేతిలో ఉన్న లేఖ ఒకటి తీసుకుని లోపలికి వెళ్లాము. అయితే అతనికి మేము తెలియదు. దాంతో ఒక పోలీసు స్టేషను నుండి మరో పోలీసు స్టేషనుకు తిరుగుతూ మధ్యాహ్నానికి మేము కుష్టువ్యాధి నిపుణుడు డాక్టర్ హుగో పెస్కేను కలుసుకున్నాము. అక్కడి పేరుగాంచిన వైద్యకేంద్రానికి ఆయన ప్రధాన అధికారి. అతను మమ్ములను ఎంతో హృదయపూర్వకంగా ఆహ్వానించాడు. మాకు కుష్టువ్యాధి ఆసుపత్రిలోనే బస ఏర్పాటు చేశాడు. అంతేకాక ఆ రోజు రాత్రి తన ఇంటికి విందుకు ఆహ్వానించాడు. అతనికి సంభాషించటం అంటే సరదా. దాంతో బాగా పొద్దుపోయాక మేము పక్కలమీద ఒరిగిపోయాము.

ఉదయం అల్పాహారానికి కూడా మేము ఆలస్యంగానే లేచాము. అక్కడ మాకు అల్పాహారం వడ్డించమని ఆదేశాలు లేకపోవటంతో కల్లావో రేవుకు బయలుదేరాము. అది మే 1వ తేదీ కావటంతో మా ప్రయాణం చాలా నిదానంగా సాగింది. ప్రభుత్వ రవాణా సదుపాయాలు కూడా ఏమీ లేవు. దాంతో 14 కిలోమీటర్ల దూరం కాలినడకనే సాగించాల్సి వచ్చింది. అక్కడ చూడటానికంటూ ప్రత్యేకంగా ఏమీ లేదు. ఇక అర్జెంటీనా పడవల సంగతి సరేసరి. బాగా నీరసపు ముఖాలు వేసుకుని సమీపంలో ఉన్న పోలీసు స్టేషను వద్దకు వెళ్లి కాస్తంత భోజనం పెట్టమని కోరాము. ఆ తర్వాత వేగంగా లిమాకు తిరుగు ప్రయాణం కట్టాము. చివరకు మళ్లీ పెస్కో ఇంట్లోనే తినాల్సి వచ్చింది. ఆ తర్వాత వివిధ రకాల కుష్టురోగం నయం చేయటంలో తన అనుభవాలను ఆయన వివరించాడు.

మరునాడు ఉదయం మేము స్థానికంగా ఉన్న పురావస్తు ప్రదర్శన శాలకు వెళ్లాము. అది ఎంత అద్భుతంగా ఉందంటే తగినంత సమయం లేకపోవటం వల్ల చూడాల్సినవన్నీ చూడలేకపోయాము. ఆ మధ్యాహ్నం పూట కుష్టువ్యాధి ఆసుపత్రి గురించి తెలుసుకోవటానికి వెచ్చించాము. డాక్టర్ మోలినా మాకు మార్గదర్శకత్వం వహించారు. అతను అనువజ్ఞుడైన కుష్టువ్యాధి వైద్యుడే కాదు. గొంతు సంబంధిత వ్యాధుల్లో కూడా ఆయన నిపుణుడే. తర్వాత అలవాటు ప్రకారం తిండికోసం పెస్కె ఇంటికి వెళ్లాము.

మా దగ్గరున్న యాభై స్వీడన్ నాణేలు మార్చే ప్రయత్నంలో శనివారం ఉదయమంతా మార్కెట్ చుట్టూ తిరిగాము. మొత్తం మీద ఈ ప్రయత్నంలో విజయం సాధించాము. ఆ తర్వాత సాయంత్రం వరకు పరిశోధనా శాలలో గడిపాము. అందులో చూడటానికి పెద్దగా ఏమీ లేదు. నిజం చెప్పాలంటే ఇంకా సంపూర్ణంగా తయారు కావల్సిన పరిశోధనాశాల అది. అక్కడున్న విషయకోశం చాలా శ్రద్ధతో రూపొందించబడింది. విపులంగా, విస్పష్టంగా చదవటానికి వీలుగా ఉన్నది. ఆ రాత్రి భోజనం కోసం కూడా పెస్కె ఇంటికే వెళ్లాము. యధాప్రకారంగా తన మాటలచాతుర్యాన్ని ప్రదర్శించాడు ఆ వైద్యుడు.

మరునాడు ఆదివారం. మాకు చాలా ముఖ్యమైన రోజు. ఆ రోజే మేము ఎద్దుల పోరాటం చూడటానికి సిద్ధమయ్యాము. పోరాటానికి సిద్ధమైన ఎద్దులు పెద్దగా బలిష్టమైనవి కాకపోయినా అది మాకు కొత్త కావటంతో ఉత్సాహంగా చూశాము. ఆటలో ఎంతగా లీనమయ్యామంటే నా చేతిలో ఉన్న టెల్లో పుస్తకాన్ని చదవటం కూడా నాకు సాధ్యం కాలేదు. ఆ ఉదయాన్నే గ్రంధాలయం నుండి ఈ పుస్తకం తెప్పించాను. మేము అక్కడకు చేరేసరికి ఆట మొదలైంది. ఒక నొవిషియేట్ ఎద్దును చంపుతున్నాడు. అయితే అది సాధారణ పద్ధతిలో కాదు. వెన్నెముకకు కట్టుకున్న కత్తితో ఎద్దును చంపుతున్నాడు. దాంతో ఎద్దు బాధగా అరుస్తూ కిందపడిపోయింది. అతను ఎద్దు ప్రాణం పోయే వరకు పొడిచే ప్రయత్నం చేస్తున్నాడు. బయటి నుండి జనాల అరుపులు. మూడో ఎద్దు ప్రవేశించేటప్పటికి ఆట మరింత ఉత్సాహంగా మారింది. ఆ ఎద్దు వచ్చీ రావటంతోనే ఆటగాడిని కొమ్ములతో ఎత్తి దూరంగా విసిరేసింది. ఆ పోరాటం ఆరో ఎద్దు చనిపోవటంతో ముగిసింది. కళ, ఒకింత ధైర్యం, పాటవం, నిపుణత ఒక్కటీ కనిపించలేదు ఈ ఆటలో నాకు. ఒక్కమాటలో చెప్పాలంటే అక్కడ ఆదివారం చేయటానికి ఏముందన్నదానిపై ఆధారపడి ఉంటుంది.

సోమవారం ఉదయం మరోసారి మ్యూజియంకు వెళ్లాము. ఆ రోజు సాయంత్రం పెస్కో నివాసంలో మనస్తత్వ నిపుణులు డాక్టర్ వాలెంజాను కలుసుకున్నాము. అతను కూడా మంచి మాటకారే. అతను అనేక విషయాలు చెప్పాడు. “ఒకరోజున కాంటిన్‌ఫ్లాస్‌తో కలిసి సినిమా చూడటానికి వెళ్లాను. అందరూ నవ్వుతున్నారు కానీ నాకు మాత్రం ఏమీ అర్థం కాలేదు. అయితే అదేమీ కొత్తకాదు. మిగిలిన వాళ్లకు కూడా అర్థమైంది ఏమీ లేదు. కానీ వాళ్లు ఎందుకు నవ్వుతున్నారు?వాస్తవంలో వాళ్లను చూసి వాళ్లే నవ్వుకుంటున్నారు. ప్రతి ఒక్కరు తమలో ఒక భాగం గురించి నవ్వుతున్నారు. మా

దేశం ఇప్పుడే యవ్వనంలో అడుగుపెడుతోంది. మాకు ఒక సాంప్రదాయము, సంస్కృతీ లేవు. ఈ మధ్యనే మేము వెలుగు చూశాము. శైశవ దశలో ఉన్న మా నాగరికత సరిచేయలేని అనేక సమస్యలను చూసి వాళ్లు నవ్వుతున్నారు...కానీ ఇప్పుడు ఉత్తర అమెరికా పూర్తిగా పరిపక్వస్థాయికి చేరుకొందని చెప్పవచ్చా? అక్కడ ఆకాశాన్నంటే భవనాలున్నాయి. రోడ్డు మీద వాహనాలు బారులుతీరి ఉంటాయి. అయినా తన యవ్వనాన్ని వదిలేసిందా? లేదే. వ్యత్యాసం రూపంలోనే ఉంది. ఈ వ్యత్యాసం మౌలికమైనది కాదు. ఈ విషయంలో అమెరికా  దేశాలన్నీ సోదరులే. కాంటినెఫ్లాస్ చూస్తున్న నాకు విశాల అమెరికాయిజం అర్థం అయ్యింది." అన్నాడు.

మ్యూజియం సందర్శనలో మంగళవారం కూడా పెద్దగా మార్పు ఏమీ లేదు. మధ్యాహ్నం మూడుగంటల సమయంలో డాక్టర్ పెస్కో అల్బెర్టోకు ఒక తెల్లని సూట్, నాకు అదేరంగులో ఉన్న ఒక జాకెట్ ఇచ్చాడు. మేము మనుషుల్లాగా ఉన్నామని అందరూ అంగీకరిస్తారు. ఆ రోజులో మిగిలిన భాగంలో అంతగా చెప్పుకోదగ్గ సంగతులేమీ లేవు.

ఈ విధంగా చాలా రోజులు గడిచాయి. మేము కాలుకాలిన పిల్లుల్లా తిరుగుతూనే ఉన్నాము. కానీ అక్కడి నుండి ఎప్పుడు బయలుదేరతామో అన్నది మాత్రం స్పష్టంగా తేలలేదు. రెండు రోజుల క్రితమే మేము అక్కడి నుండి బయలు దేరాల్సి ఉంది. కానీ మేము బయలుదేరాల్సిన ట్రక్కు ఇంకా అక్కడి నుండి కదల్లేదు. మా ప్రయాణంలో మిగిలిన భాగమంతా సజావుగానే సాగుతోంది. మా విజ్ఞానాన్ని పెంచుకునే క్రమంలో మేము గ్రంధాలయాలు, పురావస్తుప్రదర్శన శాలలు సందర్శిస్తూనే ఉన్నాము. కానీ అందులో చెప్పుకోదగ్గది కేవలం డాక్టర్ టెల్లో ప్రారంభించిన పురావస్తు, ఆంత్రొపాలజీ మ్యూజియం ఒక్కటే. శాస్త్రీయంగా చూసినప్పుడు ఇప్పుడున్న పెస్కె మొదలు అతని శిష్యులందరూ చెప్పుకోదగ్గ విజయం సాధించాలంటే చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది. ఎందుకంటే జీవరసాయన శాస్త్ర నిపుణులెవ్వరూ పెరులో లేరు. అక్కడ లాబొరేటరీ నిర్వహిస్తున్నవారితో అల్బెర్టో సంభాషించాడు. బ్యూనస్ఎయిర్స్‌లో కొందరితో వారికి పరిచయం ఏర్పాటు చేయించాడు. అందులో ఇద్దరితో బాగానే మాట్లాడాడు కానీ మూడో వ్యక్తికి విషయంలోనే కాస్తంత ఇబ్బంది అయ్యింది. కుష్టువ్యాధి నివారణలో ప్రావీణ్యం సంపాదించిన డాక్టర్ గ్రెనడోకు అతన్ని అల్బెర్టో పరిచయం చేశాడు. అతన్ని ఒక వైద్యుని వద్దకు కూడా తీసుకెళ్లారు. కానీ ఈ అమాయకుడు ప్రశ్నించటంతో " లేదండీ, ఇక్కడ ఎవ్వరు బయోకెమిస్టులు లేరు. ఫార్మసీలు ఏర్పాటు చేయకూడదని ఇక్కడ చట్టం అమల్లో ఉంది. ఫార్మసిస్టులకు అర్థం కాని విషయాల్లో వారిని తలదూర్చనియ్యము" అన్న సమాధానం

వినాల్సివచ్చింది. దీంతో అల్బెర్టోకు పెద్దపెట్టున కోపం వచ్చింది. చిన్నగా గిల్లి అతన్ని సర్దిపుచ్చాను.

ఎంతో సాధారణంగా ఉన్నప్పటికీ లిమాలో రోగులు మాకు వీడ్కోలు చెప్పిన తీరు మాత్రం హృదయానికి హత్తుకునేలా ఉంది. అందరివద్దనుండీ 100 1/2 సోల్స్ పోగుచేసి మాకు ఇచ్చారు. దాంతో పాటు మనసును తాకేలా రాసిన ఒక లేఖ కూడా ఇచ్చారు. అందులో కొందరు చివరి వరకు వచ్చి వీడ్కోలు చెప్పారు. ఒకరిద్దరైతే ఆ కొద్దిరోజులు వారితో కలిసి మేము పంచుకున్న ఆనందాన్ని గుర్తు చేసుకుంటూ ఆనంద భాష్పాలు కూడా రాల్చటం కనిపించింది. వారికి చేతులు పట్టుకుని కృతజ్ఞతలు తెలిపాము. వాళ్లిచ్చిన బహుమతులు అందుకున్నాము. వాళ్లతో పాటు కూర్చుని రేడియోలో ఫుట్‌బాల్ ఆటపై వస్తున్న వ్యాఖ్యానం విన్నాము. కుష్టునివారణ కోసం మమ్ములను అంకితం చేసేంతగా ప్రభావితం చేసిన అంశం ఏదైనా ఉందంటే అది మా ప్రయాణంలో కలుసుకున్న రోగులు మా పట్ల ప్రదర్శించిన ఆప్యాయత, ఆదరాభిమానాలే.

ఒక నగరంగా లిమా తన అధికార కేంద్రం హోదాకు తగిన విధంగా లేదు. కానీ శివార్లలో ఉన్న నివాస ప్రాంతాల్లో మాత్రం అందమైన, విశాలమైన, శుభ్రమైన వీధులు ఉన్నాయి. కొలంబియా దూత నివాసం చుట్టూ పోలీసుల సంఖ్య ప్రత్యేకించి ఆసక్తికరమైన అంశంగా ఉంది. అక్కడ 24గంటల పాటు కనీసం 50 మందికి తగ్గకుండా యూనిఫారంలో ఉన్న పోలీసులు, సాధారణ దుస్తులు ధరించిన పోలీసులు గస్తీ తిరుగుతున్నారు. కాపలా కాస్తున్నారు.

లిమా దాటిన తర్వాత మొదటిరోజు ప్రయాణంలో చెప్పుకోదగ్గ విషయాలేవీ లేవు. లిమా నగరం బయట నుండి మొదలయ్యే రోడ్డు లా ఒరోయా వరకు వెళ్లింది. ఆ తర్వాత అదే మార్గంలో మేము రాత్రంతా ప్రయాణించాము. తెల్లవారే సరికి కెర్రో డి పస్కోకు చేరుకున్నాము. బెకెర్రా సోదరులతో కలిసి మేము ప్రయాణించాము. వాళ్లను కంబాలాక్ లేదా కంబా అని పిలుస్తూ వచ్చాము. మరునాడు రోజంతా ప్రయాణిస్తూనే ఉన్నాము. వాళ్లు మంచివాళ్లలాగానే ఉన్నారు. ప్రత్యేకించి పెద్దతను. వెళ్లే కొద్దీ మరింత సుందరమైన ప్రదేశాలు కనిపిస్తూ వచ్చాయి. టిక్లియోలో సముద్రమట్టానికి 4853 మీటర్ల ఎత్తులో ప్రయాణిస్తున్నపుడు మొదలైన నా తలనొప్పి ఇప్పుడు శాంతించనారంభించింది. మేము హువానుకో దాటి టింగో మారియాకు చేరబోతుండగా బండికి ముందు ఇరుసు ఇరిగిపోయింది. అదృష్టవశాత్తూ చక్రం మడ్గారులో చిక్కుకుపోవటంతో బండి తిరగబడలేదు.

ఆ రాత్రి అక్కడే గడపాల్సి వచ్చింది. నాకు నేనే స్వంతంగా సూదిమందు వేసుకుందా మనుకున్నాను. కానీ అదృష్టమంటే అదే. ఇంజక్షన్ కూడా ఇరిగిపోయింది.

మర్నాడు సాఫీగానే సాగిపోయింది. నా ఉబ్బసం వ్యాధి తిరగబెట్టింది. కానీ ఆ రాత్రి అదృష్టం మా పక్షాన నిలిచినట్లుంది. మే 20వ తేదీ అయిన ఈ రోజున మేము ప్రయాణం ప్రారంభించి ఆర్నెల్లు పూర్తికావస్తున్న రోజు అని వేదాంత ధోరణిలో అల్బెర్టో ప్రస్తావించాడు. పిస్కో దక్కించుకోవటానికి అది వంక. మూడో సీసా తాగేసరికి అల్బెర్టో పడిపోయాడు. తన చిన్న చేతుల్లో పట్టుకుని ఉన్న కోతిని వదిలిపెట్టాడు. ఆ తర్వాత అక్కడి నుండి మాయమయ్యాడు. కంబా సోదరుల్లో చిన్నవాడు మరో అరసీసా తాగాక అక్కడికక్కడే సృహకోల్పోయాడు.

మరునాడు హడావుడిగా బయలుదేరాము. మేము బస చేసిన ఇంటి యజమానురాలు లేవకముందే మేము ప్రయాణం కట్టాము. ఇరుసుకు మరమ్మతులు చేయించాల్సి రావటంతో కంబా సోదరుల వద్ద డబ్బులు నిండుకున్నాయి. దాంతో ఆమెకు కిరాయి చెల్లించలేదు. మార్గమధ్యలో ఒక చోట వర్షం కురుస్తున్నప్పుడు ప్రయాణికులను ఆ మార్గంలో నివారించటానికి సైనికులు ఏర్పాటు చేసిన బారికేడ్ల వద్దకు వచ్చే వరకు మా ప్రయాణం సాగుతూనే ఉంది.

ఆ తర్వాత కూడా మరోసారి బారికేడ్ల వద్ద మేము నిలిచిపోవాల్సి వచ్చింది. ఆ రోజు సాయంత్రానికి గానీ మమ్ములను వాళ్లు వదల్లేదు. అయినా ఆరోజుకి చివరిసారిగా నెస్కుయిల్లా అనే చిన్నపట్టణం వద్ద మమ్ములను ఆపేశారు.

అక్కడినుండి ఉన్న రహదారిలో మరునాడు కూడా రాకపోకలు రద్దయ్యాయి. దాంతో కాస్తంత భోజనం దొరుకుతుందేమో అని అక్కడే ఉన్న సైనిక స్థావరానికి వెళ్లాము. మధ్యాహ్నానికి అక్కడి నుండి బయలుదేరిన మేము ఒక గాయపడిన సైనికుడితో మాట్లాడుతున్నాము. అతను సైనికులు ఏర్పాటు చేసిన బారికేడ్లను మేము అధిగమించటానికి సహాయపడ్డాడు. ఆ తర్వాత మరో నాలుగు కిలోమీటర్లు దిగువకు వెళ్లాము. అక్కడే మాతో సహా అనేక వాహనాలను నిలిపివేశారు. కొంచెం సేపటి తర్వాత మమ్ములను మాత్రం పకల్లపా మార్గం గుండా వెళ్లటానికి అనుమతించారు. సాయంత్రమయ్యేసరికి అక్కడికి చేరుకున్నాము. అక్కడకు వెళ్లాక కంబా సోదరుల్లో చిన్నవాడు మా నలుగురికీ భోజనానికి అయిన ఖర్చు ఇచ్చాడు. మేము విడిపోవటానికి చిహ్నంగా నలుగురమూ నాలుగు సీసాలు మందు తాగాము. వీడ్కోలు చెప్పుకుంటున్న

సమయంలో కంబా సోదరులు సెంటిమెంటల్‌గా ఫీలయ్యారు. దాంతో అతను మమ్ములను శాశ్వతంగా ప్రేమిస్తూనే ఉంటానని హామీ ఇచ్చాడు. ఆ తర్వాత మేము నిద్రించటానికి వీలుగా ఒక హోటల్లో గదికి అవసరమైన ఖర్చును అతనే భరించాడు.

మా ముందున్న ప్రధాన లక్ష్యం ఇక్విటోస్‌కు వెళ్లటం. అందువల్ల ఆ విషయం మీదనే మేము కేంద్రీకరించాము. ఈ దిశగా మేము కలిసిన మొదటి వ్యక్తి కోహెన్ పేరుతో ఉన్న వ్యక్తి. అతను ఆ నగరానికి మేయరు కూడా. అతని గురించి చాలా విన్నాము. మంచివాడే కానీ డబ్బుల విషయంలో పక్కాగా ఉంటాడని తెలిసింది. డబ్బుల విషయంలో పట్టింపు ఉన్నవాడైతే సరే. కానీ మంచివాడేనా కాదా అన్నది మా సమస్య. అతను మమ్ములను షిప్పింగ్ ఏజెంట్ల వద్దకు పంపాడు. వాళ్లు కెప్టెన్‌తో మాట్లాడారు. కెప్టెన్ కూడా దయతో మా విజ్ఞప్తిని మన్నించాడు. మొదటి తరగతిలో ప్రయాణించటానికి అవకాశం ఇస్తూ మూడో తరగతి చార్జీలు చెల్లిస్తే చాలునని అతను హామీ ఇచ్చాడు. అంతమాత్రాన మేము సంతోషపడలేదు. అక్కడున్న గారిసన్ ప్రధానాధికారిని కలవటానికి వెళ్లాము. కానీ అతను కూడా ఏమీ చేయలేనని చేతులెత్తేశాడు. ఆ తర్వాత కెప్టెన్ తర్వాత పడవలో రెండో స్థాయి అధికారి ఒకరి వద్దకు వెళ్లాము. సవాలక్ష ప్రశ్నలు వేసిన తర్వాత మాకు సహకరించేందుకు అంగీకరించాడు.

ఆ రోజు మధ్యాహ్నం ఎగువ పరనాలాగా కనిపించే రియో ఉకయాలిలో ఈతవేయటానికి వెళ్లాము. అక్కడ ఒక దిగువస్థాయి అధికారి తారసపడ్డాడు. మాకోసం భారీ సహాయం సిద్ధం చేసినట్లు అతను చెప్పాడు. అదేదో అతనే సాధించినట్లు మూడోతరగతి చార్జీలు చెల్లిస్తే చాలునని, మొదటి తరగతిలో ప్రయాణించటానికి కెప్టెన్ అంగీకరించాడని చల్లగా తెలియచేశాడు.

మేము ఈతవేసే చోట అరుదుగా కనిపించే చేపల జంట ఒకటి కనిపించింది. స్థానికంగా ఈ చేపలను బఫే చేపలని  పిలుస్తుంటారు. ఆ చేపలు మనుషులను తినేస్తాయని, మహిళలపై అత్యాచారం చేస్తాయని ఇంకా వెయ్యిరకాల హింసలకు పాల్పడతాయని స్థానిక కథలు ప్రచారంలో ఉన్నాయి. కానీ నిజానికి అతి నదుల్లో ఉండే డాల్ఫిన్ చేప. దానికి ఇతర లక్షణాలతో పాటు స్త్రీల శరీర నిర్మాణాన్ని పోలి ఉంది. ఆ రోజు రాత్రి మా సహచరులందరినీ బసకు అవకాశమివ్వమని అడిగాము. ఆసుపత్రిలో ఉన్న వారి నుండి బసకు వసతి పొందటం పెద్ద సమస్యగా మారింది. ఊహించినట్లే వాళ్లు ఏమంత ప్రేమగా వ్యవహరించలేదు. మా విజ్ఞప్తికి తల అడ్డంగా ఊపారు. వారిని ఒప్పించలేకపోయాము. చివరకు రెండు పరుపులు ఇచ్చి బయట చలిలోనే ఆ రాత్రి వెళ్లబుచ్చాల్సిందిగా శెలవిచ్చారు.



# ఉకలియా దిగువన

సామాను భుజానికెత్తుకుని, అన్వేషకుల్లా కనిపిస్తున్న మేము చిన్న పడవ లా కెనెపా బయలుదేరబోయే సమయానికి ఎక్కాము. ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం కెప్టెన్ మమ్ములను మొదటితరగతి ప్రయాణీకులు ఉండే గదుల్లోకి వెళ్లనిచ్చాడు. ప్రయాణానికి సిద్ధమవుతున్నట్లు సూచనలు అందించిన కొద్దిసేపటికి మా పడవ సముద్రజలాల్లోకి ప్రవేశించింది. ఈ విధంగా శాన్ పాబ్లోకు మా ప్రయాణం ప్రారంభమైంది. మరికొద్దిసేపటికి పకల్లపా నివాసాలు పూర్తిగా కనుమరుగయ్యాయి. దాంతో చుట్టూ ఎటు చూసినా దట్టమైన అడవి తప్ప మరేమీ కనిపించటం లేదు. పడవలో ఉన్న ప్రయాణీకులు రైలింగ్ వదిలి కాలక్షేపం కోసం పేకాటకు సిద్ధమవుతున్నారు. నేను కొంత ఆచితూచి ఆడుతున్నా అల్బెర్టో మాత్రం రెచ్చిపోయాడు. దాంతో 21 అని పిలిచే ఆటలో 90 సోల్స్ గెల్చుకున్నాడు. ఈ విజయంతో మిగిలిన ఆటగాళ్లు మా పట్ల గుర్రుగా చూడనారంభించారు. ఎందుకంటే మేము కేవలం ఒక సోల్‌తో ఆట మొదలు పెట్టి ఇప్పుడు 90 సోల్స్‌కు చేరుకున్నాము.

మా మొదటి రోజు ప్రయాణంలో ప్రయాణీకులెవ్వరు మాతో పెద్దగా స్నేహంగా వ్యవహరించలేదు. దాంతో మేము దాదాపుగా ఒంటరిగా ఉండిపోయాము. సాధారణ సంభాషణల్లో తలదూర్చలేదు. నది లోతు తక్కువగా ఉండటంతో రాత్రి ప్రయాణాన్ని నిలిపివేశారు. అక్కడ పెద్దగా దోమలు లేవు. అది సాధారణ పరిస్థితే అని చెప్పుబడుతున్నప్పటికీ మాకు నమ్మబుద్ధి కాలేదు. ఎందుకంటే ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురైనప్పుడు స్థానికులు కొండంతలు చేసి చెబుతుంటే వినటానికి అలవాటుపడ్డాము.

మరునాటి ఉదయం త్వరగానే ప్రయాణం ప్రారంభించాము. ఆ రోజు కూడా పెద్దగా చెప్పుకోదగ్గ సంగతులు లేవు. ఒక మహిళతో మాత్రం స్నేహం చేయగలిగాము. డబ్బులు గురించి ఎన్ని సార్లు ప్రస్తావించినా మేము మొసలి కన్నీరు కారుస్తున్నప్పటికీ

మా వద్ద కొద్దో గొప్పో డబ్బులు ఉన్నాయని ఆ అమ్మాయి నమ్ముతోంది. ఆ రోజు సాయంత్రానికి పడవ నది ఒడ్డుకు చేరుకొనే సమయానికి దోమలు గుంపులు గుంపులుగా బయటకు వచ్చాయి తమ ఉనికిని నిరూపించుకుంటూ. దాంతో రాత్రంతా దోమలదాడిని ఎదుర్కొంటూ గడిపాము. వలతో మొఖాన్ని కప్పుకుని నిద్రకు ఉపయోగించే గొంగట్లో దూరిన అల్బెర్టో ఏదోలా నిద్రపోయాడు. కానీ నాకు మాత్రం ఉబ్బసం తిరగబెట్టినట్లు సూచనలు కనిపించాయి. దాంతో ఉబ్బసం, దోమల బెడద మధ్య మరునాటి ఉదయం వరకు నాకు కంటిమీద కునుకు లేదు. ఆ రోజు రాత్రి నా జ్ఞాపకం నుండి తెరమరుగైనా ఆ రోజు కుట్టిన దోమల దెబ్బకు ఇంతెత్తున వాసిన నడుం చూసుకున్నప్పుడు మాత్రం ఆ జ్ఞాపకాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఆ పగలంతా ఏదో ఒక మూల కూర్చుని కునుకు తీస్తూనే ఉన్నాను. ఉబ్బసం తగ్గుతున్న దాఖలాలేవీ కనిపించలేదు. దాంతో పెద్దమొత్తం ఖర్చు పెట్టి మందులు తీసుకోవాల్సి వచ్చింది. కాస్తంత ఉపశమనం దొరికింది. నదికి ఆవలి ఒడ్డునుండి కనిపిస్తున్న అడవుల వంక చూస్తున్న మాకు ఆ అడవి మమల్ని ఆహ్వానిస్తున్నట్లు అనిపించింది. కానీ నాకున్న ఉబ్బసం, దోమల బెడద భయంతో వెనకంజ వేశాము. కానీ ఆ అడవులు మా వంటి ఉత్సాహవంతుల కోసం ఎదురుచూస్తున్నట్లు పదే పదే తదేకంగా మావంకే చూస్తున్నాయి. దాంతో మా ఆశలు వున్న ఆటంకాలను దాటి విహరించనారంభించాయి.

రోజులు యధాలాపంగా సాగిపోతున్నాయి. మాకున్న వినోదమల్లా పేకాట ఒక్కటే. కానీ మా ఆర్థిక పరిస్థితి కారణంగా దానిపట్ల పెద్దగా ఉత్సాహం చూపలేకపోతున్నాము. మరో రెండురోజులు చెప్పుకోదగ్గ ఎటువంటి సంఘటన లేకుండా సాగిపోయాయి. ఈ ప్రయాణానికి సాధారణంగా నాలుగు రోజులు సరిపోతుంది. కానీ నదిలో నీటిమట్టం తక్కువగా ఉండటంతో ప్రతి రోజు రాత్రిపూట ప్రయాణం నిలిపివేయాల్సి వచ్చింది. దాంతో ఏరోజుకారోజు మేము దోమలకు ఆహారంగా మారుతూ వచ్చాము. మొదటిశ్రేణి ప్రయాణంలో భోజనవసతి మెరుగ్గానే ఉంది. దోమల దాడి మిగిలిన వాళ్లతో పోల్చితే తక్కువగానే ఉంది. ఈ బేరసారాల్లో మేము సాధించింది ఏమిటంటే స్పష్టంగా చెప్పలేను. మేము అంతకంతకూ సాధారణ సరంగుల వద్దకు చేరుతూ వచ్చాము. పడవలో ఉన్న కొద్దిపాటి మధ్యతరగతి వ్యక్తులను వదిలిపెట్టి సరంగుల జాబితాకు చేరాము. వాళ్లంతా చెప్పుకోదగ్గ సంపన్నులో కాదో తెలియదు కానీ కాణీ లేని ఇద్దరు ప్రయాణీకులతో వారు తమను తాము జోడించుకున్నారు. సాధారణంగా అందరికీ ఉండే అమాయకత్వమే వారికీ ఉంది. అయితే వారిజీవితంలో సాధించిన కొద్దిపాటి విజయాలు వాళ్ల తలకెక్కాయి.

వారి చెత్త అభిప్రాయాలను మరింత అహంతో వెల్లడిస్తున్నారు. నిజానికి అటువంటి అభిప్రాయాలను వాళ్లే పెంచిపోషిస్తున్నారు. క్రమం తప్పకుండా మందులు తీసుకుంటున్నప్పటికీ నా ఉబ్బసం వ్యాధి మరింత ముదిరింది.

వ్యాధిగ్రస్తుడినైనా నా పట్ల ఆ అమ్మాయి చూపించిన వాత్సల్యం నాకు ఈ సాహసోపేత ప్రయాణానికి బయలుదేరక ముందరి రోజులను గుర్తు చేసింది. ఆ రోజు రాత్రి కూడా యధాతథంగా దోమలు నా నిద్రను దూరం చేశాయి. దాంతో చిచినా గురించిన కలలతో నా మనసు నిండిపోయింది. నా కల ముగిసే సమయానికి ఆమె పట్ల వ్యతిరేకత కంటే మరింత ప్రేమతో నా మనసు నిండింది. ఆమెకు గాలిలోనే ఒక తియ్యని ముద్దు పంపాను. ఆమెను అర్థం చేసుకున్న పెద్ద వ్యక్తి తరహాలో ఇచ్చిన ముద్దు అది. ఆ తర్వాత మలాగెయెనోకు సంబంధించిన ఆలోచనలతో నా మది నిండిపోయింది. అది అనేక నిద్రలేని రాత్రులు విడిది అవకాశం ఇచ్చిన గొప్ప భవనం. అక్కడ ప్రతిసారీ ఆవిడ మాట్లాడుతున్నప్పుడు కొత్త వ్యక్తితో తన ఆలోచనలు పంచుకున్నట్లుగా ఉంది.

నా కళ్లు అందమైన స్వర్గాన్ని వెదుకుతున్నాయి. సుందరమైన ఆకాశం నాపైకి వంగినట్లుగా కనిపిస్తోంది. నాలో రేగుతున్న ప్రశ్నలకు " ఇదినిజంగా ఇంత విలువైనదా " అన్న ప్రశ్నకు సమాధానంగానా అన్నట్లు సుందరమైన ఆకాశం నాపై వంగి కనిపిస్తోంది.

మరో రెండు రోజులు గడిచాయి. చెప్పుకోదగ్గ మార్పేమీ లేదు. ఉకయాలి, మరనాన్ ప్రవాహాలు రెండూ కలిసి దిగువ ప్రాంతంలో బ్రహ్మాండమైన నదికి జన్మనిస్తున్నాయి. ఈ నదీజన్మస్థానంలో పరిస్థితులేమీ మారలేదు. మురికినీటి ప్రవాహాలు రెండు కలిసి ఒకటిగా మారాయి. బహుశా మరింత విశాలమైన, లోతైన ప్రవాహంగా మారాయి.అంతకు మించిన మార్పు ఏమీ అక్కడ కనిపించలేదు. నాదగ్గరున్న ఉబ్బసం మందు అయిపోవచ్చింది. వ్యాధి పెరుగుతోంది. నేను కేవలం పిడికెడు మెతుకులు మాత్రమే తిని మటే తాగుతున్నాను. చివరి రోజున, మా ప్రయాణం ముగింపుకు వచ్చేసరికి మా పడవ తుఫాను సుడిలో చిక్కుకుంది. అంటే మా ప్రయాణం నిలుపుచేయాల్సి వచ్చిందన్నమాట. గతం కంటే దారుణంగా దోమల దండు మాపై దాడి ప్రారంభించింది. బహుశా మాపై దాడికి ఇదే చివరి అదును కావటంతో కసితీరా కుడుతున్నట్లున్నాయి. ఆ రోజు రాత్రి అంతులేని రాత్రిగా మారింది. రాత్రంతా దోమలను చంపే ప్రయత్నం, పేకాట, కాలక్షేపం కోసం నోటికొచ్చింది మాట్లాడటం ఇలా సాగింది. మరునాడు ఇక పడవ దిగిపోతున్నామన్న భావన మనసుకు తట్టటంతో నేను అక్కడే కూర్చుండిపోయాను. మొఖం మీద గుడ్డవేసుకున్నాను. ఏదో లోకాలకు వెళ్తున్నట్లు కలకంటున్న నన్ను అల్బెర్టో

ఒక్క కుదుపుతో "బట్టతలా... గమ్యం చేరాము" అంటూ తట్టి లేపాడు. విప్పారిన నదీ తీరాన భారీ అంతస్తులు కలిగిన ఒక నగరం దర్శనమిచ్చింది. ఆ నగరం చుట్టూ భూమిని తమ కడుపులో దాచుకున్న అడవులు చుట్టుముట్టి ఉన్నాయి.

అది ఆదివారం. ఆరోజున మేము ఇక్విటోస్‌లో ప్రవేశించాము. త్వరత్వరగా పడవ దిగి అక్కడున్న అంతర్జాతీయ సహకార విభాగం అధికారిని కలుసుకోవటానికి వెళ్లాము. డాక్టర్ చావేజ్ పాస్టార్‌కు మమ్ములను పరిచయం చేస్తున్న ఒక లేఖ మా చేతుల్లో ఉంది. అయితే అతను ఇక్విటోస్‌లో లేడు. మొత్తం మీద వాళ్లు మా పట్ల దయతో వ్యవహరించారు. యల్లోజ్వరం వ్యాధిబారిన పడిన నన్ను ఆసుపత్రిలో ఒక వార్డులో చేర్పించారు. భోజనవసతి కల్పించారు. నా ఉబ్బసం సమస్య ఇంకా తీవ్రంగానే ఉంది. నేను పెద్దగా లేవలేకపోయాను. రోజుకు నాలుగు ఇంజక్షన్లు, అడ్రినలిన్ తీసుకున్న తర్వాత కూడా నాలో పెద్దగా మార్పు కనిపించలేదు.

మరునాడు కూడా నాలో మెరుగుదల కనిపించలేదు. దాంతో మరోసారి అడ్రినల్ తీసుకోవటానికి బదులు ఆసుపత్రి మంచం మీదనే కాలం వెళ్లబుచ్చాను.

మరునాడు ఉదయం నియమిత ఆహారం తీసుకున్నాను. రోజూ రాత్రి పూట అన్నం మెతుకులు మాత్రమే తిన్నాను. నాలో కొద్దిగా మెరుగుదల కనిపించింది. ఆ రోజురాత్రి రోస్సెల్లిని దర్శకత్వంలో ఇంగ్రిడ్ బెర్గ్‌మన్ నటించిన స్ట్రాంబోలి చూశాను. అది చూశాక చండాలం అన్న భావన తప్ప మరోటి బుర్రకుతట్టలేదు.

బుధవారం మాకు మాత్రం ముఖ్యమైన రోజుగా మారింది. ఎందుకంటే ఆ మరునాడు మేము అక్కడి నుండి బయలుదేరవచ్చని ఆసుపత్రి సిబ్బంది తెలియచేశారు. ఆ వార్త మాకు సంతోషం తెచ్చిపెట్టింది. ఉబ్బసం కారణంగా నేను కదలేని స్థితిలో ఉండటంతో ఇంతకాలం మంచంమీదనే గడిపాము.

మరునాడు పెందలకాడే బయలుదేరటానికి మానసికంగా సిద్ధమవుతున్నాము. ఆ రోజుకూడా గడిచింది కానీ మేము అక్కడే ఉండిపోయాము. మరునాడు మధ్యాహ్నం మేము బయలుదేరాల్సి ఉంటుందని ప్రకటించారు.

అక్కడి యజమానులు అంత త్వరలో మమ్ములను పంపేట్లు లేరని భావించిన మేము గాఢంగా నిద్రపోయాము. లేచి కాస్త ఇటూ ఇటూ నడిచి, స్థానిక గ్రంధాలయానికి వెళ్లొచ్చేటప్పటికి అక్కడి సహాయకుడు ఎల్ సినె పడవ ఉదయం 11.30కు బయలు దేరుతుందని ఒగరుస్తూ చెప్పాడు. అప్పటికే ఉదయం 11.05 అయ్యింది. మా సామానంతా హడావుడిగా సేకరించాము. నేను అప్పటికి ఇంకా ఉబ్బసంతో ఇబ్బంది పడుతుండటంతో అక్కడి నుండి రేవుకు చేరటానికి టాక్సి తీసుకున్నాము. పెరు కరెన్సీ లిబ్రాలో సగం చార్జీ చేశాడు అతను. మేము పడవను చేరుకున్న తర్వాత కానీ అది సాయంత్రం మూడింటి వరకు బయలుదేరటం లేదన్న విషయం తెలియలేదు. మేము ఒంటిగంటకే పడవ ఎక్కాల్సి ఉంది. రేవు వదిలిన ఆసుపత్రికి వెళ్లి తినొద్దామన్న సాహసం చేయలేని మేము ఆసుపత్రి వాళ్లిచ్చిన సిరంజి గురించి మర్చిపోవటానికి అక్కడే గడపాలని నిర్ణయించుకున్నాము. యగువా తెగకు చెందిన ఇండియన్లతో కలిసి స్థానిక భోజనం భారీగా లాగించాము. యగువా తెగ ప్రజల వేషధారణ వింతగా ఉంది. ఎర్రరంగు స్కర్టులు, మెడలో నక్లెసు ధరించారు. అతని పేరు బెంజమిన్. కానీ అతను ఏ మాత్రం స్పానిష్ మాట్లాడలేకపోతున్నాడు. అతని భుజానికి కొద్దిపైఎత్తున బుల్లెట్ దూసుకుపోయిన గుర్తు కనిపిస్తోంది. స్థానిక కక్షల్లో తగిలిందని అతను చెప్తున్నాడు.

ఆ రోజు రాత్రి కూడా దోమలు మా శరీరాలను నంజుకుతినే ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. ఆ ప్రయాణంలో మా మానసిక ధోరణికి మరో విషయం కూడా తోడైంది. అక్కడినుండే మనోస్ పట్టుకుంటే నదిలో ప్రయాణిస్తూ వెనిజులా చేరుకోవచ్చన్న విషయం అక్కడే మాకు తెలిసింది. మరునాడు సాఫీగానే సాగింది. రాత్రి దోమల దెబ్బకు దూరమైన నిద్రాదేవిని ఆహ్వానించటానికి సాధ్యమైనంత ప్రయత్నం చేశాము. నేను కళ్లు మూసిన కొద్దిసేపటికే అంటే రాత్రి ఒంటిగంట సమయంలో మమ్ములను నిద్రలేపారు. శాన్ ప్లాబో వచ్చిందని చెప్పారు. అక్కడ మాకు స్వాగతం చెప్పటానికి వచ్చిన డాక్టర్ బ్రెస్కియాని ఆసుపత్రిలోనే ఒక గది తీసుకొమ్మని విశ్రాంతి తీసుకొమ్మని సలహా ఇచ్చాడు. అతను కూడా మమ్ములను సాదరంగానే ఆహ్వానించాడు.

# ప్రియమైన పాపికి

**ఇక్విటోస్**

**జూన్ 4, 1952**

నది ఒడ్డులన్నీ నివాసప్రాంతాలతో నిండిపోయాయి. ఆదిమ తెగల ప్రజలను కలుసుకోవాలంటే ఈ నదీపాయల వెన్నంటి లోపలికి వెళ్లాల్సిందే. ఆ విధంగా ఆ సారి చివరికి ఆ రకమైన ప్రయాణం చేయాలని మాత్రం మేము భావించటం లేదు. ప్రాణాంతకమైన వ్యాధులు మాయమయ్యాయి. అయినప్పటికీ ఇక్కడ మాకు టైఫాయిడ్, విషజ్వరం వంటివి సోకకుండా ఉండేందుకు వాక్సిన్ ఇచ్చారు. ఏట్రిన్, క్వినైన్ వంటి మందులు సరఫరా కూడా తగినంతగా ఉంది.

మెటబాలిక్ డిసార్డర్ వల్ల వచ్చే అనేక వ్యాధులు ఉన్నాయి. ఆ అడవుల్లో దొరికే భోజనం స్వయంగా పోషకవిలువలు కలిగినది. వారమంతా విటమిన్‌లు తీసుకోకుండా ఉంటే తీవ్రంగా జబ్బునపడే ప్రమాదం ఉంది. నదీ ప్రవాహం వెంటబడి దీర్ఘకాలం ప్రయాణించేట్లైతే తగిన ఆహార లేమిని కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఆ విషయం మాకు తెలిసినందున బగోటాకు విమానంలో వెళ్లే అవకాశాల గురించి పరిశీలిస్తున్నాము. కనీసం లెగ్యుయిసామో వరకన్నా విమానంలో ప్రయాణించాలని చూస్తున్నాము. ఆ తర్వాత రోడ్లు సౌకర్యంగానే ఉంటాయి. నదీ ప్రయాణం ప్రమాదకరంగా ఉంటుంది కాబట్టి విమాన ప్రయాణం గురించి ఆలోచిస్తున్నామనుకోవటం సరికాదు. డబ్బులు పొదుపు చేయటానికి ఈ ఆలోచన చేస్తున్నాము. తర్వాత ఆ డబ్బులు నాకు చాలా అవసరమవుతాయి.

మేము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటానికి అవసరమైన శాస్త్రీయ పరిష్కారకేంద్రాలకు దూరంగా సాగుతున్న మా ప్రయాణం కుష్టువ్యాధి ఆసుపత్రులకు మాత్రం ఒక విశేషమే. మేము పరిశోధకులమైనందున, వారి కేంద్రాలను

సందర్శిస్తున్నప్పుడు మాపై వాళ్లు అభినందనల వర్షం కురిస్తున్నారు. కుష్టువ్యాధి శాస్త్రం పట్ల నేను ఆసక్తి పెంచుకున్నాను. అయితే ఈ ఆసక్తి ఎంతకాలం కొనసాగుతుందో అన్నది మాత్రం చెప్పలేను. లిమా ఆసుపత్రిలోని రోగులు మాకు ఇచ్చిన వీడ్కోలు ఎంత హృద్యంగా ఉందంటే కుష్టువ్యాధి పట్ల మా ఆసక్తి మరింత పెరిగింది. మా ప్రయాణంలో ఉపయోగించుకోవటానికి అవసరమైన పొయ్యి, వంద సోల్స్ కూడా వాళ్లు పోగుచేశారు. మాకు వీడ్కోలు చెప్తున్నప్పుడు వాళ్లలో కొందరి కళ్లవెంట నీళ్లు కూడా వచ్చాయి. ఇంతటి స్పందనకు కారణం ఏమిటంటే (మేము వారితో కలిసి ఉన్నపుడు) జోళ్లు గానీ, ఇతర ఆఛ్ఛాదనాలు ఏవీ ఒంటికికప్పుకోలేదు. ఎవరితోనైనా ఇట్టే కరచాలనం చేశాము. హత్తుకున్నాము. వాళ్లతోనే కూర్చున్నాము. అన్ని రకాల విషయాలు పిచ్చాపాటి మాట్లాడుకున్నాము. చివరికి ఫుట్‌బాల్ కూడా ఆడాము. ఇదంతా లక్ష్యం లేని సాహసమేననిపిస్తున్నప్పటికీ ఆ పేద వాళ్లకు మా సాహచర్యం ఇచ్చిన మానసిక స్ఫూర్తి మాత్రం లెక్కకు అందనిది. మిగిలిన వాళ్లందరూ కుష్టువ్యాధి గ్రస్తులను పశువులకంటే హీనంగా చూసేవారు. ఇప్పటి వరకు అక్కడ పని చేస్తున్న వైద్య సిబ్బందిలో కేవలం ఇండోచైనా సంతతికి చెందిన ఒక వ్యక్తికి మాత్రమే వ్యాధి సోకింది. అతనివద్ద ఉన్న రోగులతోనే మేము కాలం గడిపాము.



# శాన్ పాబ్లో కుష్టురోగుల కాలనీ

మరునాడు ఆదివారం. మేము సమీపంలో ఉన్న కుష్టురోగుల కాలనీని సందర్శించటానికి బయలుదేరాము. అక్కడికి వెళ్లటానికి మధ్యలో నదీ ప్రయాణం కూడా అవసరం అయ్యింది. అది ఆదివారం కావటంతో వెళ్లలేకపోయాము. దాంతో ఆ కాలనీ పర్యవేక్షకురాలిని కలిశాము. ఆవిడ పేరు మదర్ సోర్ అల్బెర్టో, క్రైస్తవ సేవిక. ఆ తర్వాత

ఆమెకొడుకులతో కలిసి ఫుట్‌బాల్ ఆడాము. మా ఆటతీరు చాలా పేలవంగా ఉంది. నా ఉబ్బసం ఉపశమించనారంభించింది.

సోమవారం నాడు మా దగ్గరున్న బట్టల్లో ఎక్కువ ఉతకటానికి ఇచ్చాము. ఆ తర్వాత కాలనీలో రోగులు నివశిస్తున్న ప్రాంతానికి వెళ్లాము. వాళ్లను చూడటానికి. అక్కడ 600 మంది రోగులున్నారు. ఒక్కొక్కరు అడవిలో విడివిడిగా ఏర్పాటు చేసిన గుడిశెల్లో నివశిస్తున్నారు. తోచిన పని చేసుకుంటున్నారు. వాళ్లను వాళ్లే పోషించుకుంటున్నారు. వాళ్లు తమ స్థాయికి, అవసరానికి తగ్గట్లు ఒక సంస్థను ఏర్పాటుచేసుకున్నారు. స్థానికంగా ఒక అధికారి, ఒక న్యాయమూర్తి, ఒక పోలీసు వంటివాడు ఆ సంస్థలో ఉన్నారు. వాళ్లకు డాక్టర్ బ్రెస్కియానిపట్ల అపారమైన గౌరవం ఉంది. ఆ కాలనీలో నివశిస్తున్న వివిధ సముదాయాల మధ్య అడపాదడపా తలెత్తే విభేదాలు, వివాదాలు పరిష్కరించటమే కాక ఆ కాలనీని కాపాడటంలో కూడా బ్రెస్కియాని విశేష కృషి చేస్తున్నాడు.

మంగళవారం నాడు మళ్లీ కాలనీ సందర్శించాము. డాక్టర్ బ్రెస్కియానితో కలిసి కాలనీ అంతా చుట్టివచ్చాము. రోగులను పరిశీలించాము. 400 కేసుల ఆధారంగా కుష్టువ్యాధి వల్ల కండరాలు ఏవిధంగా ప్రభావితం అవుతాయి అన్న అంశంపై ఆయన ఒక పరిశోధనా పత్రం తయారు చేస్తున్నాడు. ఇది నిజంగా ఆసక్తికరమైన అంశం. ఎందుకంటే ఈ ప్రాంతంలో సంభవించే కుష్టువ్యాధి రోగుల కండరాలపై ప్రభావం చూపుతోంది. ఇటువంటి లక్షణాలు లేని ఒక్క రోగిని కూడా ఇక్కడ నేను చూడలేదు. ఈ కాలనీలో నివసించే రోగుల పిల్లల్లో బాల్యంలోనే ఈ వ్యాధి వల్ల కండరాలు ఏ విధంగా ప్రభావితం అవుతున్నాయన్న అంశంపై డాక్టర్ సౌజా లిమా ఆసక్తిగా పరిశీలిస్తున్నారని ఆయన తెలిపారు.

ఆ కాలనీలో కాస్తంత ఆరోగ్యంగా ఉన్న వారి కోసం ఒక ప్రత్యేక బస ఏర్పాటు చేశారు. అటువంటివారు అక్కడ 70 మంది ఉన్నారు. అక్కడకు కూడా మేము వెళ్లాము. అక్కడ ఉండాల్సిన ప్రాథమిక వసతులు కూడా లేవు. కరెంటు, రిఫ్రిజిరేటర్లు, చివరికి ప్రయోగశాల కూడా లేవు. వాళ్లకు మంచి మైక్రోస్కోపు, దాన్ని చేత పని చేయించటానికి ఒక సాంకేతిక నిపుణుడు అవసరం. ప్రస్తుతం ఈ పని మదర్ మార్గరిటా చేస్తున్నారు. ఆమె మంచిదే కానీ పెద్దగా విషయపరిజ్ఞానం ఉన్నావిడ కాదు. కళ్లు, నరాలకు సంబంధించిన శస్త్రచికిత్స చేయగలిగిన వైద్యుడు ఒకరు కావాలి. పెద్దఎత్తున కండరాలకు

సంబంధించిన సమస్యలు ఉన్నప్పటికీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే వాళ్లలో గుడ్డివాళ్లు చాలా తక్కువగా ఉండటం.అంటే దానికి సంబంధించిన చేయటానికి ఇక్కడేమీ లేదన్నమాట. అటువంటి వారికి చికిత్స కూడా అందటం లేదు.

బుధవారం నాడు కూడా కాలనీని చుట్టివచ్చాము. మధ్యమధ్యలో ఈతవేయటం, చేపలుపట్టం వంటి పనులతో కాలక్షేపం చేశాము. ఆ రోజు రాత్రి డాక్టర్ బ్రెస్కియానితో కలిసి చెస్ ఆడాను. అనేక విషయాలు మాట్లాడుకున్నాము. అక్కడున్న దంతవైద్య నిపుణుడు డాక్టర్ ఆల్ఫ్రో చాలా ప్రత్యేకమైన వ్యక్తి. చాలా నిదానంగా ఉంటాడు. స్నేహపూర్వకంగా ఉంటాడు. గురువారం నాడుకాలనీలో విశ్రాంతి దినం. అందువల్ల మా దినచర్యను మార్చుకున్నాము. ఆరోజు కాలనీ చుట్టిరావటానికి వెళ్లలేదు. చేపలు పట్టటానికి విఫలయత్నం చేశాము. మధ్యాహ్నం ఫుట్‌బాల్ ఆడాము. అందులో గోల్ చేయటంలో నా ప్రయత్నం ఘోరంగా ఉంది. శుక్రవారంనాడు తిరిగి కాలనీ ప్రహరీ దగ్గరికి వచ్చాము. మార్గరిటాతో పాటు బాసిల్లోస్కోప్ తీయాల్సి ఉండటంతో అల్బెర్టో అక్కడే ఆగిపోయాడు. సంబి, మోటా అనే రెండు రకాల చేపలు పట్టుకోగలిగాను. అందులో ఒకటి డాక్టర్ మోన్‌టోయాకు ఇచ్చాను.



## సెయింట్ గువెరో వర్ధంతి

1952 జూన్ 14, శనివారం నాడు నేను 24వ ఏట ప్రవేశించాను. జీవితంలో రజతోత్సవ సంవత్సరానికి చేరుకున్న నేను అన్ని విషయాలు పరిశీలించుకుంటే రికార్డు ఏమంత దారుణంగా లేదు. చేపలు పట్టటంలో మరోసారి నా అదృష్టాన్ని పరిశీలించుకోవటానికి ఆ రోజు ఉదయాన్నే నదికి వెళ్లాను. కానీ అది పేకాట వంటిది. కొందరికి విజయం దక్కుతుంది. మరికొందరికి ఓటమితప్పదు. ఆరోజు మధ్యాహ్నం కొంచెం సేపు ఫుట్‌బాల్ ఆడాము. గతంలో కంటే ఈ సారి నా ఆటతీరు బాగుంది. ఆ

రోజు సాయంత్రం బ్రెస్కియాని ఇంటికి పసందైన విందుకోసం వెళ్లాము. అక్కడ కాలనీ భోజనశాలలో మాకు విందు ఏర్పాటు చేశారు. ఇటువంటి సందర్భాల్లో ఏర్పాటు చేసే జాతీయ గౌరవ చిహ్నంగా ఏర్పాటు చేసే పెస్కో మందు కుమ్మరించారు. దాని ప్రభావం కండరాలపై ఏ విధంగా ఉంటుందన్న విషయాన్ని అధ్యయనం చేయటంలో అల్బెర్టో మంచి నిపుణుడు. అందరూ తలా కాస్త తాగి తూలుతున్న సమయంలో కాలనీ డైరెక్టరు మాకు స్వాగత చిహ్నంగా గ్లాసు పైకెత్తాడు. నేను కూడా సమాధానంగా చేతులో ఉన్న గ్లాసు పైకెత్తి డైరెక్టరు ఈ కింది విధంగా విపులంగా సమాధానం ఇచ్చాను.

బ్రెస్కియాని ఏర్పాటు చేసిన ఈ విందు సందర్భంగా స్పందించటం నా బాధ్యత. బ్రెస్కియానీ సాంప్రదాయాన్ని మించి ఈ విందు ఏర్పాటు చేశారు. దేశ ద్రిమ్మరులుగా ఇప్పుడు మేమున్న దశలో (ఇటువంటి విందు మా గౌరవార్థం ఏర్పాటు చేయటం అంటే ) మేము (కృతజ్ఞతలు చెప్పటానికి) పదాల కోసం వెతుక్కోవాల్సిందే. ఆ విధంగా వెదికిన పదాలతో ఇప్పుడు నేను కృతజ్ఞతలు చెప్పబోతున్నాను. నా సహచర దేశ ద్రిమ్మరులకు, మా గురించి ఏ మాత్రం తెలియకపోయినా ఈ విధంగా నా పుట్టిన రోజు వేడుకలు ఏర్పాటు చేసిన కాలనీ వాసులందరికీ కృతజ్ఞతలు. అందరూ కలిసి ఈ మధ్యాహ్నం ఇంత అద్భుతమైన విందు ఏర్పాటు చేశారు. మరికొద్ది రోజుల్లో మేము పెరు భూభాగాన్ని వదిలిపెట్టనున్నాము. అందువల్ల ఈ పదాలు వీడ్కోలు చెప్పాలన్న దానికంటే మరో అంశానికి ఉద్దేశించనవి. ఈ దేశ ప్రజలందరికీ మేము రుణపడి ఉంటాము. టక్నా మీదుగా పెరులో ప్రవేశించినప్పటి నుండీ ఈ దేశ ప్రజలందరూ మాకు ఎంతగానే సహకరించారు. ఆదరించారు.

ఇంకా మరోటి చెప్పదల్చుకున్నాను. ఈ సందర్భానికి సంబంధించినది కాదు అది. ఇటువంటి విలువైన అంశానికి సంబంధించి మేము అధికార ప్రతినిధులము కాకపోయినా ఈ ప్రయాణం పూర్తి చేసిన తర్వాత గతంకంటే మిన్నగా లాటిన్ అమెరికాను ఈ విధంగా అస్థిరమైన దేశాలుగా సరిహద్దులు గీయటం వట్టి బూటకపు చర్య అని మాత్రం చెప్పదల్చుకున్నాను. మనదంతా ఒకే మెస్టిజో జాతి. మెక్సికో మొదలు మెగల్లా జలసంధి వరకు మనమంతా ఒకేరకమైన జాతి లక్షణాలు కలిగి ఉన్నవాళ్లము. అందువల్ల నన్ను నేను చిన్న పాటి ప్రాంతీయవాదపు దురభిమానం నుండి దూరం చేసుకోవటానికి గాను నేను పెరు, ఉమ్మడి లాటిన్ అమెరికా కలకాలం వర్ధిల్లాలని కోరుకుంటూ ఈ విందు స్వీకరిస్తున్నాను.

నా ఈ ఉపన్యాసానికి భారీ స్పందన వచ్చింది. ఈ విందులో సాధ్యమైనంత మద్యం సేవిస్తూ వేకువజామున మూడు గంటల వరకు సాగింది. ఆ తర్వాత అందరమూ విశ్రాంతి ప్రకటించి తలోదారిన గమ్యస్థానాలకు వెళ్లాము.

ఆదివారం ఉదయం మేము స్థానిక ఇండియన్ తెగ యగువా ప్రజలను సందర్శించటానికి వెళ్లాము.చీమలు దూరని చిట్టడవి, కాకులు దూరని కారడవి, అడుగుపెట్టే తావు కూడా ఉండదు వంటి అనేక ప్రచారాలు వింటూ మేము ఆ దారిలో అరగంటసేపు నడకసాగించిన తర్వాత యగువ తెగ ఇండియన్‌లు నివశిస్తున్న గుడిశెలను చేరుకున్నాము. వారి జీవన శైలి విశేషంగా ఆకర్షణీయంగా ఉంది. బట్టబయల్లో చెట్ల కింద చిన్న పాటి పరంజీలు కట్టుకుని వాటిపై కాస్తంత రెల్లుగడ్డి కప్పుకుని, దోమల తాకిడిని తట్టుకోవటానికి చిన్నపాటి తలుపు అమర్చుకుని ఉన్నారు. మహిళలు సాంప్రదాయక దుస్తులు ధరించటాన్ని విడనాడారు. పిల్లలకు పొట్టలు లావెక్కిఉన్నాయి. కానీ కాస్తంత వయసు పైబడిన వాళ్లలో విటమిన్ లోపం ఉన్నట్లేమీ కనిపించటం లేదు. సాధారణంగా ఈ ప్రజలు స్థానికంగా లభ్యమయ్యే యక్కా, అరటిపళ్లు, పాం చెట్లు పళ్ల తోపాటు జంతుమాంసం ఆహారంగా తీసుకుంటారు. జంతువులను వేటాడటానికి రైఫిళ్లు ఉపయోగిస్తున్నారు. వాళ్ల పళ్లు దారుణంగా గారపట్టాయి. వాళ్లు స్థానిక మాండలికంలోనే మాట్లాడతారు. కొందరు మాత్రం స్పెయిన్ భాషను అర్థం చేసుకోగలరు.

మరునాడు మధ్యాహ్నం కొద్దిసేపు ఫుట్‌బాల్ ఆడాము. గతం కంటే నా ఆట తీరు కాస్తంత మెరుగుపడింది. గోల్ కీపర్ పని నాకు అప్పగించారు. ఆ రోజు రాత్రి విపరీతమైన కడుపునొప్పి అంటూ అల్బెర్టో నన్ను నిద్రలేపాడు. తీరా చూస్తే అది పొట్టకు కుడివైపున దిగువ భాగాన నొప్పి. నేను ఎంతగా అలసిపోయి ఉన్నానంటే ఇతరుల నొప్పులు, తీపుల గురించి పట్టించుకునే ఓపిక లేకపోయింది. దాంతో నీ చావు నువ్వు చావని అల్బెర్టోకు సలహా ఇచ్చి మరునాడు ఉదయం వరకు దుప్పటి తన్నిపెట్టి నిద్రపోయాను.

సోమవారం నాడు సాధారణంగా ఆ ప్రహరీ చుట్టూ మందులు పంచిపెడతారు. మదర్ మార్గరీటా పోషణలో ఉన్న అల్బెర్టో కూడా నాలుగు గంటలకు ఒకసారి క్రమం తప్పకుండా పెన్సిలిన్ ఇంజక్షన్ తీసుకుంటున్నాడు. అక్కడకు జంతువులను తీసుకొచ్చే ఒక నాటుపడవ కోసం ఎదురు చూస్తున్నామని బ్రెస్కియాని తెలిపాడు. అదే తరహాలో అందుబాటులో ఉన్న కర్రలు పోగేసి మేము కూడా బల్లకట్టు ఒకటి తయారు చేసుకోవచ్చని సలహా ఇచ్చాడు. ఆ ఆలోచన మాకు నచ్చింది. దీంతో మనావోస్‌కు వెళ్లేందుకు ఏర్పాట్లు

చేసుకోవటంలో నిమగ్నమైపోయాము. నా కాలికి గాయం కావడంతో ఆ రోజు మధ్యాహ్నం ఫుట్‌బాల్ ఆటకు వెళ్లలేకపోయాను. ఆటకు బదులు అక్కడే కూర్చుని బ్రెస్కియానితో మాట్లాడుతూ ఉండిపోయాను. ఆలస్యంగా నిద్రపోయాను.

మంగళవారం ఉదయానికి అల్బెర్టో పూర్తిగా కోలుకున్నాడు. మరోదఫా ప్రహరీ వద్దకు వెళ్లాము. అక్కడ డాక్టర్ మోంటోయా కుష్టువ్యాధి సోకిన కండరాలకు శస్త్రచికిత్స చేశారు. ఫలితాలు అద్భుతంగా ఉన్నాయి. అయితే శస్త్రచికిత్స చేసిన తీరు మాత్రం పాత పద్ధతుల్లో వుంది. పక్కనే ఉన్న పతుల్లో చేపలు పట్టటానికి వెళ్లాము ఆ మధ్యాహ్నం. అయితే ఏమీ దొరకలేదనుకోండి. తిరిగి వచ్చేటప్పుడు మాత్రం అమెజాన్ నదిలో ఈతవేయాలని నిర్ణయించుకున్నాను. దాదాపు నాకు రెండు గంటల సమయం పట్టింది. అంతసేపు వేచి ఉండేందుకు మోంటాయో సిద్ధంకాకపోవటంతో ఆయన వెళ్లిపోయాడు. ఆ రోజు రాత్రి చిన్న పాటి విందు ఏర్పాటు చేశారు. చివరకు అంతర్ముఖి అని చెప్పదగిన సెనోర్ లెజామా బెల్‌ట్రెయిన్‌తో పెద్ద గొడవతో ఆ విందు ముగిసింది. అతను బాగా తాగిన తర్వాత నోటికొచ్చినట్లు వాగటం మొలెట్టాడు. తనను విందుకు ఆహ్వానించినందుకు గాను ఇతరులను అవమానించటానికి తిట్లకు సిద్ధమయ్యాడు. దీంతో పొరుగునున్న ఒకతను సెనోర్ ముఖం మీద కొట్టడంతో కంటికి దెబ్బ తగిలింది. ఆ తర్వాత సెనోర్ తన్నులు కూడా తిన్నాడు. అతను ఆ విధంగా తన్నులు తినాల్సి రావటంతో మాకు విచారం కలిగింది. అతనికి ఎన్ని అవలక్షణాలున్నా మా పట్ల మాత్రం సభ్యతగానే వ్యవహరించాడు. మా ఇద్దరికీ చెరో పది సోల్స్ కూడా ఇచ్చాడు. దాంతో నా వద్ద మొత్తం 479 సోల్స్, అల్బెర్టో వద్ద 163 1/2 సోల్స్ జమపడ్డాయి.

బుధవారం నాడు వర్షంలో తడిసి ముద్దయ్యాము. ప్రహరీకి వెళ్లలేకపోయాము. ఆ రోజంతా వృధాగానే గడిచింది. కొంచెం సేపు గార్సియా లోర్కా పుస్తకం చదువుతూ ఉండిపోయాను. ఆ తర్వాత మేము తయారు చేసుకున్న బల్లకట్టును జెట్టితో కలిపి కట్టటాన్ని చూడటానికి వెళ్లాము. గురువారం ఉదయం వైద్యసిబ్బందికి శెలవురోజు. డాక్టర్ మోంటాయోతో కలిసి అన్నం కొని తెచ్చుకోవటానికి నది ఆవలి ఒడ్డుకు వెళ్లాము. అమెజాన్ నది పాయ వెంట దిగువకు ప్రయాణించి బొప్పాయి, యక్కా, గోధుమలు, చేపలు, చెరకుగడలు కారుచౌకగా కొనుక్కుని మరికొన్ని చేపలు కూడా పట్టుకుని తిరిగి వచ్చాము. నాకు మోటా దొరికింది. మోంటాయోకు రోజూ కనిపించే చేపలే దొరికాయి. వెనక్కు వచ్చేటప్పుడు పెద్దఎత్తున ఈదురుగాలులు వీయడంతో కెప్టెన్ రోజెర్ అల్వారెజ్ దాదాపు బట్టలు తడుపుకున్నంత పని చేశాడు. చుక్కాని ఇవ్వమని అడిగాను కానీ అతను తిరస్కరించాడు. నది శాంతించే వరకు ఒడ్డుకు చేరి అక్కడే వేచి ఉన్నాము. మేము

ఇంటికి చేరేసరికి మధ్యాహ్నం మూడుగంటలు దాటింది. పట్టుకొచ్చిన చేపలు వండుకు తిన్నా మా ఆకలి తీరలేదు. రోజర్ మాకిద్దరికీ చెరో చొక్కా నాకు రెండు పాంట్లు ఇచ్చాడు. దాంతో నా రూపం కాస్తంత మెరుగైంది.

బల్లకట్టు దాదాపు తయారైంది. కేవలం మోకు ఒకటి కావాలి. ఆ రోజు రాత్రి కాలనీలో రోగులు మాకు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఒక అంధుడు స్థానికంగా వాడుకలో ఉన్న అనేక పాటలు పాడి వినిపించాడు. ఫ్లూటు, గిటారు, అకోర్డియోన్‌తో ఆర్కెస్ట్రా తయారైంది. అవి ఉపయోగిస్తున్న వారికెవ్వరికీ చేతివేళ్లు లేవు. (కుష్టువ్యాధిలో ముందుగా నష్టపోయేది చేతి వేళ్లు, కాలి వేళ్లు) అందులో ఒకింత ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి శాక్సోఫోన్ వాయిస్తున్నాడు. ఆ తర్వాత ఉపన్యాసాల వంతు వచ్చింది. నలుగురు రోగులు సాధ్యమైనంత బాగానే మాట్లాడారు. వారి ఉపన్యాసాలు కాస్త ఇబ్బందిగానే ఉన్నాయి. అందులో ఒకరు మాట్లాడటానికి ఏమీ లేకపోవటంతో "ఈ వైద్యులకు మూడు అభినందనలు" అని కేకలు వేసి దిగిపోయాడు. వారందరికీ కృతజ్ఞతలు చెబుతూ అల్బెర్టో మాట్లాడాడు. మమ్ములను ఎంతో గౌరవంగా చూసుకున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. పెరు భౌగోళిక అందాలు కూడా ఈ వీడ్కోలు సభ ముందు వెలవెలబోతాయని వ్యాఖ్యానించాడు. దాదాపు మాటలు పూర్తయ్యాక పేరోన్ తరహాలో చెయ్యెత్తి మరీ అభివాదం చేస్తూ "మీ అందరికీ కృతజ్ఞతలు" అన్నాడు.

రోగులు అభినందిస్తుండగా మా పడవ నీళ్లమీదకి వచ్చింది. వాళ్లు పట్టుకున్న లాంటర్లు నీడలో వాళ్ల ఆకారాలు దెయ్యాలను తలపిస్తున్నాయి. ఆ తర్వాత బ్రెస్కియాని ఇంటికి వెళ్లి కాస్త మద్యం తీసుకున్నాము. కాస్సేపు మాట్లాడుకుని నిద్రపోయాము.

శుక్రవారం మా ప్రయాణం. ఆ రోజు ఉదయం రోగులందరినీ చివరిసారిగా చూసి వచ్చాము. వాళ్లతో కొన్ని ఫోటోలు కూడా తీసుకున్నాము. రెండు పైనాపిల్ పళ్లు తీసుకుని తిరిగి వచ్చి వాటిని డాక్టర్ మోంటాయోకు బహుమతిగా ఇచ్చాము. స్నానం చేసి తిండి తిని మధ్యాహ్నం మూడుగంటలవుతుందనగా అందరి వద్దా వీడ్కోలు తీసుకుంటూ ప్రయాణానికి సిద్ధమయ్యాము. సాయంత్రం మూడున్నర సమయంలో మాంబో టాంగో అనేపేరుతో ఉన్న మా బల్లకట్టు తిరిగి ప్రయాణం ప్రారంభించింది. మాతోపాటు కొంతదూరం బ్రెస్కియాని, బల్లకట్టు నిర్మించిన అల్ఫారో, చావేజ్‌లు కూడా వెన్నంటి వచ్చారు.

నది మధ్య వరకు వచ్చి అక్కడి నుండి మమ్ములను ముందుకు సాగమని చెప్పి వెళ్లిపోయారు.



# లిటిల్ కొంటికిలో ప్రవేశం

ఒకటి రెండు దోమలు నా నిద్రను పాడుచేయాలన్న లక్ష్యాన్ని దూరం చేయలేకపోయాయి. కొద్దిసేపట్లోనే నా నిద్ర దోమలపై పైచేయి సాధించింది. అరమోడ్పు కనులతో నిద్రిస్తున్న నేను అల్బెర్టో అరుపులతో కళ్లు తెరిచాను. కళ్లెదురుగా మినుకు మినుకు మంటున్న దీపాలతో ఒక పట్టణం కనిపిస్తోంది. దాన్ని చూస్తుంటే లెటిసియా పట్టణం అనిపిస్తోంది. నదికి ఎడమగట్టుపై ఉంది. ఆ తర్వాత మా బల్లకట్టును ఆ దీపాల దిశగా తరలించటానికి పెద్దఎత్తున కష్టపడాల్సి వచ్చింది. ఈ ప్రయత్నంలో ఒక ప్రమాదం కూడా జరిగిపోయింది. బల్లకట్టు మా మాట వినటానికి నిరాకరించింది. నదీ ప్రవాహం వెంటబడి ముందుకు సాగుతోంది. బల్లకట్టు ప్రయాణం దిశ మార్చటానికి మేము బలంగా తెడ్డు వేస్తున్నాము. మా లక్ష్యం దిశగా ప్రయాణించనున్నాము అన్న నమ్మకం కలిగినంతలోనే బల్లకట్టు అర్థచంద్రాకారంలో తిరిగింది. మళ్లీ ప్రవాహం మధ్యలోకి కొట్టుకొచ్చింది. పట్టణపు దీపాలు దూరమవుతుండగా మేము ఆందోళనతో చూస్తూ ఉండిపోయాము. చివరికి దోమలతో సాగుతున్న పోరాటంలోనన్నా విజయం సాధించాలన్న కృతనిశ్చయంతో మేము తెల్లవారే వరకూ నిద్రపోవాలని నిర్ణయించుకున్నాము. ఆ తర్వాత చేయాల్సిందేమిటో నిర్ణయించుకోవచ్చని అనుకున్నాము. మా అదృష్టం అంత ఆశాజనకంగా ఏమీ లేదు. నదీ ప్రవాహం వెంటబడి సాగిపోతే మనావోస్ వరకు చేరుకుంటాము. అక్కడకు చేరుకోవటానికి కనీసం 10 రోజులకు తక్కువ పట్టదు. ముందు రోజు జరిగిన ప్రమాదంతో మా వద్ద ఉన్న గాలాలన్నీ అయిపోయాయి. చేపలు పట్టుకునేందుకు వేరే మార్గం కూడా లేదు. నిత్యావసర వస్తువులు కూడా పెద్దఎత్తున మాదగ్గర నిల్వ ఏమీ లేవు. అనుకున్నట్లు ఒడ్డుకు చేరతామన్న ఆశ కూడా లేదు. తగిన పత్రాలు లేకుండానే బ్రెజిల్‌లో ప్రవేశించాము. ఆ దేశపు భాష కూడా మాకు రాదు. అయితే ఈ సమస్యలేవీ మమ్మలను దీర్ఘకాలం సతాయించలేదు. ఎందుకంటే త్వరగానే అంత గాఢంగా నిద్రపోయాము. సూర్యకిరణాల వేడి వంటికి తాకటంతో నిద్రలేచిన

నేను దోమతెర బయటకు తలపెట్టిన ఎక్కడున్నామో తెలుసుకునేందుకు ప్రయత్నించాను. మా చిన్న పడవ నది ఒడ్డున సేదదీరుతోంది. నది ఒడ్డునున్న ఒక ఇంటికి సంబంధించిన జెట్టీతో పాటు నిల్చుంది. పరిసరాల పరిశీలన మానుకునేందుకు సిద్ధమయ్యాను. ఎందుకంటే ఇంకా దోమల బెడద నుండి మేము దూరంకాలేదు. ఏమాత్రం అవకాశం వచ్చినా మా రక్తాన్ని విందుగా ఆరగిస్తున్నాయి. పక్కన అల్బెర్టో గాఢ నిద్రలో ఉన్నాడు. నేను కూడా అతన్ని అనుసరించి నిద్రపోవటానికి సిద్ధమయ్యాను. ఉన్నట్లుండి ఏదో కడుపులో దేవినట్లు అనిపించింది. అదేమిటన్నది నిర్ణయించుకునేలోగానే పరిస్థితులు ఎంత దరిద్రంగా మారినా వాటిని సరిచేసుకోలేమన్న భావనకు తావివ్వరాదని నిర్ణయించుకున్నాను.

# ప్రియమైన మామకు

బగోటా, కొలంబియా

జూన్ 6, 1952

**ప్రియమైన మామకు**

నేను ఇక్కడి నుండి రాస్తున్నాను. మా ప్రయాణం మరికొద్ది రోజుల్లో వెనిజులా చేరనుంది. ఈ మధ్యలో మరికొంత డబ్బు ఖర్చు అయ్యింది. నీ పుట్టిన రోజు సందర్భంగా ముందుగా అభినందనలు తెలియచేస్తున్నాను. పుట్టిరోజు సందర్భంగా కుటుంబ సభ్యులందరితో కలిసి ఆనందంగా గడిపావని అనుకుంటున్నాను. నేను క్లుప్తంగా ఇక్విటోస్ నుండి బయలు దేరాక మేము సాగించిన సాహసయానం గురించి వివరిస్తాను. నిర్ణయించుకున్న పథకం ప్రకారం కాస్తంత అటు ఇటుగా మా ప్రయాణం సాగింది.

దోమల దండు వెంటరాగా రెండు రాత్రుల ప్రయాణం తర్వాత శాన్ ప్లాబో చేరాము. అక్కడ మాకు బస దొరికింది. అక్కడున్న వైద్యుడు చాలా మంచివాడు. మమ్మలను ఎంతగా ఇష్టపడ్డాడు. మొత్తం మీద ఆ కాలనీలో మేము సుఖంగానే కాలం వెళ్లబుచ్చాము. అక్కడ పని చేస్తున్న నర్సులు మాత్రం ప్రజల వద్దకు ఎందుకు వెళ్లటం లేదని ప్రశ్నించారు. ఈ ప్రాంతాన్ని వీరే పర్యవేక్షిస్తున్నారు. ప్రజల వద్దకు వెళ్లని వారికి తక్కువ రేషన్ ఇస్తున్నారు. ఈ చిన్నపాటి ఘర్షణ తప్ప జీవితం సాఫీగా సుఖంగా సాగింది. 14వ తేదీన నాకు విందు ఏర్పాటు చేసి పెద్దమొత్తంలో డబ్బులు కూడా ఇచ్చారు. బాగా మత్తు తలకెక్కించే జిన్ కూడా అందించారు. కాలనీ డైరెక్టరు ఏర్పాటు చేసిన విందులో నేను ఖండాంతరాలకు విస్తరించిన అమెరికనిజం గురించి మాట్లాడాను. తాగిన మత్తులో మునిగి తేలుతున్న వాళ్లంతా నా ఉపన్యాసానికి చప్పట్లు కొట్టారు. అక్కడ అనుకున్నదానికంటే కొంచెం ఎక్కువ సమయమే గడిపాము. చివరికి కొలంబియాకు ప్రయాణం కట్టాము. గడచిన రాత్రి మాకు వీడ్కోలు చెప్పటానికి ఒక చిన్న పడవలో చుట్టుపక్కల కాలనీల వాళ్లు వచ్చారు. ఆటపాటలతో కాలం గడిపాము. పెరోన్‌కు వారసుడినని భావిస్తున్న అల్బెర్టో భారీ స్థాయిలో ఇచ్చిన ఉపన్యాసానికి అక్కడి వాళ్లంతా నవ్వుకున్నారు. మా ప్రయాణంలో ఒక ముఖ్యమైన ఆసక్తికరమైన ఘట్టం అది. కుడిచేతికి వేళ్లు లేని ఒక వ్యక్తి చిన్న చిన్న పుల్లలు కట్టుకుని తంబుర వాయించాడు. వీడ్కోలు సమయంలో వారి చేతుల్లో ఉన్న లాంతర్ల నీడ నీళ్లమీద పడటంతో హర్రర్ చిత్రంలోని దృశ్యంలా మారింది అక్కడి పరిస్థితి. సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఒక ఆదిమ తెగ ఇండియన్‌లు నివశిస్తున్న ప్రాంతాన్ని కూడా సందర్శించాము. చేపలు పట్టి శక్తివంతమైన ఆహారం సమకూర్చుకునేందుకు ఎంతగానో శ్రమించాము. ఇవన్నీ చూసి మేము మాటో గ్రాస్సియో నది దాటి ప్రయాణిస్తున్న అనుభూతి పొందాము. పెరాగ్వే నుండి అమెజాన్ మీదుగా ప్రయాణించిన మేము దారిపొడవునా వైద్య సేవలందిస్తూనే వచ్చాము. ఈప్రాంతమంతా ఒకప్పుటి నీ నివాసంలాగా కలల ప్రపంచంగా ఉంది. మేము అధికారిక అన్వేషకులమన్న భావన మాకు కలిగింది. వాళ్లు మా కోసం నిర్మించిన విలాసవంతమైన బల్లకట్టుతో దిగువకు ప్రయాణం అయ్యాము. మా ప్రయాణం సుఖంగానే సాగింది. సాధారణంగా చుట్టూ ఉన్న విషయాలు పరిశీలించే ఆసక్తి కలిగిన మేము దీనికి భిన్నంగా మొదటిరోజు ప్రయాణంలోనే దీర్ఘనిద్రకుపక్రమించాము. కాలనీ వాసులు ఇచ్చిన దోమతెరతో మాకు కాస్తంత రక్షణ దొరికింది. తెల్లవారి చూసేసరికి బల్లకట్టు ఒడ్డుకు చేరి కనిపించింది.

షార్కు చేపల్లా తెగబడి తిన్నాము. ఆ రోజంతా క్షేమంగానే సాగింది. కొత్తసమస్యలేమీ తలెత్తకుండా ఉండటానికి గాను గంటకొకరు చొప్పున వంతుల వారీగా కాపలా కాయాలని నిర్ణయించుకున్నాము. సాయంత్రానికి ఈ ప్రవాహం మమ్ములను ఒక ఒడ్డుకు చేర్చింది. నది ఒడ్డున బాగా కిందకు దిగి ఉన్న చెట్టు కొమ్మల్లో చిక్కుకున్న మా బల్లకట్టు అక్కడే నిలిచిపోయింది. మేము వండుకున్న బాతుల్లో ఒకటి చేజారి నీళ్లలో పడటంతో పాటు ప్రవాహం వెంట కొట్టుకుపోయింది. శాన్‌ప్లాబోలో ఉన్న గజ ఈతగాడైతే దాన్ని వెంబడించి తిరిగి తెచ్చేవాడేమో కానీ చుట్టూ మొసలి పిల్లలు కనిపించటంలో ఈ ప్రయత్నాన్ని మేము విరమించుకున్నాము. నాకు నీళ్లంటే ఉన్న భయం పూర్తిగా తొలగిపోకపోవటం కూడా ఇందుకు కారణం కావచ్చు. కానీ ఇక్కడ నువ్వుంటే నీళ్లలో పడినబాతును బయటికి తెచ్చి ఉండేవాడివి. ఎందుకంటే నాకు లాగా రాత్రిపూట ఉండే భయాలు నీకు లేవు.

మా గాలానికి తగిన భారీ చేపను బల్లకట్టు మీదకు చేర్చేసరికి మాకు అలుపొచ్చింది. మరునాడు ఉదయం వరకు వేచి ఉన్న మేము బల్లకట్టు ఒడ్డుకు చేరగానే దోమతెర నుండి బయటకు వచ్చాము. తనివితీరా నిద్రపోయిన అల్బెర్టో ఆ రోజు రాత్రి మా గాలాలన్నీ నీళ్లపాలుకావటం గమనించాడు. అతనికి చేపల కూరకంటే కోడికూర అంటే ఇష్టం. గాలాలు కూడా కరువవటంతో అతను నీరసపడ్డాడు. కనుచూపు మేరలో ఒక ఇల్లు కనిపించటంతో అక్కడకు వెళ్లి లెటిసియాకు ఎంతదూరముందో తెలుసుకోవాలనుకున్నాము. ఆ ఇంటి యజమాని పోర్చుగీసు భాషలో మాట్లాడుతూ ఇప్పుడు మేము బ్రెజిల్‌లో ఉన్నామని, మరో ఏడుగంటలు ప్రయాణిస్తే తప్ప లెటిసియాను చేరుకోలేమని చెప్పాడు. దాంతో ఎవరు కాపలా కాసేటప్పుడు నిద్రపోయారని వాదించుకోవటం మొదలెట్టాము నేనూ, అల్బెర్టో. మేము సాధించేది ఏమీ లేకపోవటంతో ఒక చేపను, నాలుగు కిలోల బరువున్న పైనాపిల్ పండును ఆ ఇంటి యజమానికి ఇచ్చి ఆ రోజు రాత్రి అక్కడే గడిపాము. మరునాడు నదికి ఎగువభాగానికి అతను మమ్ములను తీసుకెళ్లాడు. లెటిసియాలో పోలీసు స్టేషను వద్దనే తిండి, బస వసతి దొరికింది. కానీ మా విమాన ప్రయాణానికి అవసరమైన సొమ్ములో సగం కూడా కూడబెట్టలేకపోయాము. మొత్తం మీద విమాన ప్రయాణం చేయాలంటే మాకు 1500 అర్జెంటీనియన్ పెసోలు కావాల్సి ఉంది. విమానం కోసం ఎదురు చూస్తున్న మమ్ములను స్థానిక ఫుట్‌బాల్ జట్టుకు శిక్షణ ఇవ్వాల్సిందిగా కోరారు. మేము ఎక్కాల్సిన విమానం 15 రోజులకొకసారి మాత్రమే వస్తుంది. మొదట్లో వారికి శిక్షణ ఇచ్చి వదిలేయాలని

భావించిన మేము వారు మరీ దరిద్రంగా ఆడటంతో చివరకు మేము జట్టుతో కలిసి ఆడాలని నిర్ణయించుకున్నాము. మేము జట్టులో చేరటంతో పరిస్థితి పూర్తిగా తారుమారైంది. ఎందుకూ పనికిరాదనుకున్న జట్టు కాస్తా అన్ని అవరోధాలు అధిగమించి ఒకరోజు అంతర్జాతీయ పోటీలో ఫైనల్‌కు చేరుకొంది. ఫైనల్లో కూడా పెనాల్టీ కార్నర్స్‌లలో మాత్రమే ఓడిపోయింది. అర్జంటైనా ఫుట్‌బాల్ క్రీడాకారుడు పెడెర్నెరాలాగా అల్బెర్టో కూడా శూన్యంలోకి చూస్తున్నాడు. ఆటలో బంతి అందించటంలో అల్బెర్టో పెడెర్నెలాగా వ్యవహరిస్తూ ఉండటంతో అతనికి ఆ పేరువచ్చింది. పెనాల్టీలో ఎదుటి జట్టుకు వచ్చే పాయింట్‌ను నేను అడ్డుకున్నాను. ఇది లెసతో చరిత్రలో నిల్చిపోతుంది. చివర్లో వాళ్ల కొలంబియా జాతీయగీతం ఆలపించకుండా ఉన్నట్లయితే మొత్తం విజయోత్సవాలు బాగా జరిగి ఉండేవి. అదేసమయంలో నా మోకాలికి అంటిన రక్తం మరకలను తుడుకునేందుకు నేను తలవంచాను. దాంతో కల్నల్ కోపంగా నన్ను చూసి కేకలు వేశాడు. నేను ఎదురు తిరగటానికి దాదాపు సిద్దమయ్యాను. అంతలో మా ప్రయాణం, దాని అవసరాలు గుర్తుకు రావటంతో నాలిక్కరుచుకున్నాను. తర్వాత విమానంలో సుఖంగా బగోటాలో దిగాము. మధ్యలో సుష్టుగా భోజనం చేసి మద్యం కూడా సేవించాము. మాతో కలిసి వస్తున్న కొందరు ప్రయాణీకులతో అల్బెర్టో ముచ్చట్లు ప్రారంభించాడు. ఒకసారి పారిస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ కుష్టువ్యాధి సమావేశాలకు హాజరయ్యేందుకు గాను అట్లాంటిక్ సముద్రం మీదుగా సాగించిన ప్రయాణపు అనుభవాలు వివరిస్తూ చర్చ మొదలెట్టాడు. అప్పట్లో నాలుగు ఇంజన్లు విఫలం కావటంతో ఇక అట్లాంటిక్ జలాల్లో మునగటమే తరువాయి అనుకున్నాము. అప్పట్లో అతను నమ్మశక్యంగానే చెప్తున్నా నేను మాత్రం ఆందోళనతోనే ఉన్నాను.

ప్రపంచాన్ని రెండు సార్లు చుట్టివచ్చినట్లు మాకనిపిస్తోంది. బగోటాలో మొదటిరోజు బాగానే గడిచింది. యూనివర్శిటీ ఆవరణలోని భోజనశాలలో భోజనం దొరికింది కానీ వసతి మాత్రం దొరకలేదు. ఐక్యరాజ్యసమితి అందిస్తున్న సహాయంతో నిర్వహిస్తున్న కోర్సులకు హాజరయ్యేందుకు వచ్చిన విద్యార్థులతో కాంపస్ అంతా నిండిపోయింది. అందులో ఒక్కరు కూడా అర్జెంటీనా వాసి లేరనుకోండి. ఒకరోజు తర్వాత ఎట్టకేలకు మేము ఆసుపత్రిలో బస సంపాదించాము. అంటే అదేదో విశాలమైన గదికాదు. కూర్చుని నిద్రపోవటానికి ఒక కుర్చీ మాత్రమే దొరికింది. మేము మరీ అంత పేదలమైతే కాదు కానీ మా వంటి సంచారులు బూర్జువా స్థాయిలో హోటళ్లల్లో అయ్యే ఖర్చులు భరించటం కష్టం. ఆ తర్వాత కుష్టురోగుల సేవకు సిద్ధమయ్యాము. పెరు

నుండి డాక్టర్ పెస్కె సంతకంతోమమ్ములను పరిచయం చేస్తూ తెచ్చిన లేఖతో వాళ్లు మా పట్ల అనుమానాలు వ్యక్తం చేయటం మొదలెట్టారు. అయినప్పటికీ మొదటి రోజు సాఫీగానే సాగింది. అల్బెర్టో తన దగ్గరున్న ధృవీకరణ పత్రాలన్నీ వారికి చూపించి వారిని నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడు. అంతలో అలర్జీ విషయంలో నేను చేసిన కృషిని వివరించి వాళ్లు గుక్కతిప్పుకోవటానికి కూడా వీలు లేకుండా ప్రశ్నలు వేయటంతో స్థిమితపడ్డారు. ఫలితంగా మా ఇద్దరికీ ఉద్యోగాలు ఇవ్వటానికి అక్కడి వాళ్లు సిద్ధమయ్యారు. ఇక్కడ ఉద్యోగాలు చేయాలన్న ఆసక్తి నాకు లేకపోయినప్పటికీ వివిధ కారణాల వల్ల అల్బెర్టో అందుకు సిద్ధపడ్డాడు. వీధిలో రోడ్డు మీద ఒక రోబర్టో కత్తితో బొమ్మ వేయటానికి ప్రయత్నిస్తున్నాను. ఇంతలో అక్కడ పెద్దఎత్తున గందరగోళం చెలరేగింది. పోలీసులు మమ్ములను ఎంతగా వేధించారంటే అల్బెర్టో కూడా అక్కడ ఆగిపోవాలన్న ఆలోచన మానుకుని సాధ్యమైనంత త్వరగా వెనిజులా చేరుకోవటం ఎలాగా అని ప్రయత్నాలు ప్రారంభించాము. ఈ మధ్యలో ఈ లేఖ రాస్తున్నాను. ప్రయాణానికి నేను దాదాపుగా సిద్ధమయ్యాను. ఒక వేళ సమాధానం రాయాలనుకుంటే కుకుటా, సంటాండెర్ డెల్ నోర్టె, కొలంబియా చిరునామాకు రాయండి. లేదంటో సాధ్యమైనంత త్వరగా బగోటాకు రాయండి. మరునాడు నేను మిల్లోనారియోస్ ఆట చూడటానికి రియల్ మాడ్రిడ్‌కు బయలుదేరుతున్నాను. ఇక్కడ మంత్రుల నుండి డబ్బులు వసూలు చేసుకోవటం కంటే తోటివారి నుండి వసూలు చేయటం చాలాకష్టం అందువల్ల నేను తక్కువ ఖర్చుతో టిక్కెట్టు కొనుక్కుని ఆట చూడటానికి వెళుతున్నాను. మేము తిరిగిన అన్ని దేశాల కంటే ఇక్కడ భావప్రకటనా స్వేచ్ఛ దారుణంగా ఉంటుంది. రైఫిళ్లతో పహరా కాస్తున్న పోలీసులు అడుగడుక్కు మన ధృవీకరణ పత్రాలుచూపించమని వేధిస్తుంటారు. అలా చూపిస్తే కొందరు వాటిని తలకిందులుగా చేసి చదువుతుంటారు. వాతావరణం ఎంత ఉద్రిక్తంగా ఉందంటే విప్లవం పురివిప్పుకుంటుందా అన్న సందేహం కలుగుతోంది. గ్రామీణ ప్రాంతాలు ఇప్పటికే తిరుగుబాటు పంథాను చేపట్టాయి. ఈ తిరుగుబాటును సైన్యాలు అణచలేకపోతున్నాయి. మితవాదులు తమలో తాము గొడవపడుతున్నారు. ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నారు. ఉదారవాద రాజకీయ నేత జార్జి ఎలిసెర్ గైటన్ హత్య ఇంకా అందరి మనస్సులో మెదలాడుతూనే ఉంది. 1948, ఏప్రిల్ 9న జరిగిన ఈ సంఘటన ప్రభావం నుండి దేశం బయటపడలేదు. వేసవిలో బాగా ఉక్కపోస్తోంది. ఈ పరిస్థితి ఎదుర్కోవాలని కొలంబియా వాసులు నిర్ణయించుకుంటే మంచిదే. కానీ మేము మాత్రం ఇక్కడ నుండి సాధ్యమైనంత త్వరగా బయటపడతాము. నిజానికి కారకాస్‌లోనే అల్బెర్టోకు మంచి ఉద్యోగం దొరికే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.

మీరెలా ఉన్నారన్న సంగతులు ఎవరొకరు నాలుగు ముక్కలు రాస్తారేమో అని ఆశిస్తున్నాను. ఈసారి బియార్టిజ్ లేదా మరో మధ్యవర్తి ద్వారా సమాచారం సంపాదించాల్సిన అవసరం లేదు (ఒక్కో నగరంలో ఒక్కో లేఖ రాయటానికి నేను పరిమితం అయ్యాను. ఆమెతో సంప్రదింపుల్లో లేను. అందువల్లనే ఈసారి అల్ఫ్రెడిటోకు రాసిన కార్డు కూడా దీనితోనే జతచేస్తున్నాను).

మీ కుమారుడి వందనం స్వీకరించండి. మీరు లేని లోటు నిలువెల్లా కనిపిస్తోంది. ఆ ముసలాయన క్షేమంగా వెనిజులా చేరాడని భావిస్తున్నాను. ఇక్కడి కంటే అక్కడ జీవనానికి అయ్యే వ్యయం ఎక్కువగా ఉంది. కానీ అక్కడ వేతనాలు కూడా ఎక్కువే. అందువల్ల అటువంటి వారికి ఆ పరిస్థితులు సరిపోతాయి. అక్కడ కొంతకాలం నివశించటం మొదలుపెట్టాక అంకుల్‌శాంతో కలిసి జీవితానికి అలవాటుపడతాడనుకోండి. కానీ మనం మాత్రం దారి మళ్లకుండా చూసుకోవాలి...దీని భావం పాపికి తెలుసు. ఉంటాను.

# కారకాస్ దారిలో

అనివార్యంగా అడిగే అనవసర ప్రశ్నలతో వేధించి, చేయిచేసుకున్న తర్వాత, మా పాస్‌పోర్టులను పైకి కిందికి చూసి మమ్ములను ఒక పోలీసు అధికారికి ఉండే అనుమానాస్పద చూపులతో తేరిపార చూసిన తర్వాత జూలై 14న మేము బయలుదేరాలని సూచించే విధంగా మా పాస్‌పోర్టుల మీద ఒక స్టాంపు వేసి ఇచ్చారు. ఆ తర్వాత రెండు దేశాల మధ్య బ్రిడ్జి మీదుగా నడుచుకుంటూ వచ్చాము. బ్రిడ్జి దాటగానే కనిపించిన వెనిజులా సైనికుడు మా సామాను తనిఖీ చేశాడు. తర్వాత కేవలం తన అధికార దర్పం ప్రదర్శించుకోవటానికా అన్నట్లు కొన్ని ప్రశ్నలు వేశాడు. అప్పుడే వదిలించుకున్న కొలంబియా సైనికుల్లాగానే అతను కూడా నిరంతరం భృకుటి ముడివేసి వచ్చేపోయే

వారందరి వంకా అనుమానంగా చూస్తూ ఉన్నాడు. బహుశా సైనికుల్లో ఇది ఎక్కడైనా కనిపించే ధోరణి, ప్రవర్తనేమో. కొంతసేపు మమ్ములను వాళ్లు శాన్ ఆంటోనియో డి టచిరాలో నిర్భంధించి ఉంచారు. పాలనా సంబంధమైన చర్యలు అన్నీ పూర్తి చేశాక మమ్ములను వదిలిపెట్టారు. ఆ తర్వాత మమ్ములను శాన్ క్రిసోబాల్‌కు తీసుకెళ్తామని హామీ ఇచ్చి ఒక వాన్‌లో మా ప్రయాణం ముందుకు సాగించాము. ప్రయాణం సగం దూరం వచ్చాక అక్కడ ఏర్పాటు చేసిన కస్టమ్స్ తనిఖీ కేంద్రంలో మమ్ములను, మా సామానును పూర్తిగా తనిఖీ చేశారు. స్థానిక పోలీసు అధికారితో జరిగిన చర్చల ఫలితంగా బగోటాలో గందరగోళానికి కారణం అయిన ఆ కత్తిని కూడా తిరిగి ఇచ్చేశారు. ఉన్నత స్థాయి సంస్కృతి కలిగిన ప్రజలందరితో వ్యవహరించిన అనుభవం వల్ల అతనితో బెదురు లేకుండా చర్చించగలిగాము. నేను వేసుకున్న చర్మపు జాకెట్ జేబుల్లో ఉండటం మూలాన రివాల్వర్ తనిఖీ సిబ్బంది కళ్లపడలేదు. ఆ విధమైన తనిఖీ వల్ల కనుగొన్న ఈ కత్తి ఆందోళనకు కారణం అయ్యింది. ఎందుకంటే కారకాస్ చేరేలోగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాలన్నింటినీ మేము దాటుకుంటూ వెళ్లాల్సి ఉన్నందున ఈ కత్తి పెద్ద ఆందోళనకు కారణం అయ్యింది. మార్గమధ్యలో మేము ఇస్తున్న హేతుబద్ధ వివరణను అర్థం చేసుకోగలవాళ్లు దొరుకుతారన్న హామీ కూడా ఏమీ లేదు. రెండు రాష్ట్రాలను కలుపుతూ వెనిజులా వైపు ఉన్న రోడ్డు నాకు కొర్డొబా మార్గాన్ని గుర్తు చేస్తోంది. మొత్తం మీద కొలంబియాతో పోల్చుకుంటే ఈ దేశం మరింత సంపన్నవంతమైనదిగా ఉంది.

మేము శాన్ క్రిస్తోబాల్ చేరుకున్న తర్వాత వాహన కంపెనీ యజమానులకు, మాకు మధ్య వివాదం తలెత్తింది. ఆ యజమానులు సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో సుఖంగా ప్రయాణించాలనుకున్నారు. ఈ మొత్తం ప్రయాణంలో మూడు రోజులు బస్సులో ప్రయాణించే కంటే రెండు రోజులు వాన్‌లో ప్రయాణించటం సుఖంగా ఉంటుందన్న వారి వాదనను మేము అంగీకరించాల్సి వచ్చింది. మా తక్షణ సమస్యలు పరిష్కరించుకోవాలని, సాధ్యమైనంత త్వరగా నా ఉబ్బసం వ్యాధికి చికిత్స చేయించుకోవాలన్న ఆదుర్దాతో ఉన్న మేము అదనంగా మరో 20 బొలివర్లు ఇచ్చి వారి నుండి విడిపోవాలని నిర్ణయించుకున్నాము. కారకాస్ చేరే లక్ష్యంలో వాళ్లను వదిలివేయాలని నిర్ణయించుకున్నాము. ఆరోజు సాయంత్రం వరకు మేము బిజీగా ఉండేలా చూసుకున్నాము. చుట్టుపక్కల తిరుగుతూ ఈ దేశం గురించి దొరికిన సమాచారాన్ని తెలుసుకుంటూ స్థానికంగా ఉన్న ఒక మంచి గ్రంథాలయంలో పుస్తకాలు తిరగేస్తూ గడిపాము.

సాయంత్రం 11 గంటల సమయంలో అక్కడి నుండి ఉత్తరం దిక్కుగా ప్రయాణం ప్రారంభించాము. అప్పటికే కిక్కిరిసిన వాహనంలో మా నలుగురినీ తోసేశారు. అక్కడ నిద్రపోవటానికి అవకాశమే లేదు. మరీ దారుణమేమిటంటే టైర్లు దెబ్బతినడంతో మరో గంట అదనంగా ఆలస్యమైంది. ఈలోగా నా ఉబ్బసం సమస్య తీవ్రం కాసాగింది. వాహనం భారంగా కొండపైకి ఎక్కుతుండటంతో ఊపిరి సలపటం లేదు. ఈ ప్రాంతపు లోయల్లో పండే పంటలన్నీ కొలంబియాలో పండే పంటల్లాగానే ఉన్నాయి. రోడ్లు మరీ దారుణంగా ఉన్నాయి. దాంతో టైర్లకు పదే పదే పంచర్లవుతున్నాయి. రెండో రోజు ప్రయాణంలో మా బండికి అనేకసార్లు పంచర్లయ్యాయి. మధ్య మధ్యలో ఏర్పాటు చేసిన పోలీసు నియంత్రణా కేంద్రాల్లో వ్యాన్‌లో ఉన్న అందరినీ అంగుళం అంగుళం తనిఖీ చేసి వదులుతున్నారు. మాతో పాటు ప్రయాణిస్తున్న ఒక మహిళ మా గురించి పరిచయం చేసి ఉండకపోతే మా పరిస్థితి దారుణంగా ఉండేది. మా లగేజి అంతా ఆమెదేనని డ్రైవరు చెప్పాడు. దాంతో సమస్య తీరిపోయింది. ఆలస్యం అయ్యే కొద్దీ భోజనం ఖర్చు కూడా పెరిగింది. ఇప్పుడు తలకొక్కింటికి మూడున్నర బొలివర్‌ల చొప్పున చెల్లించాల్సి వస్తోంది. మేము సాధ్యమైనంత సొమ్ము పొదుపు చేయాలని నిర్ణయించుకున్నాము. దాంతో పుంటా డెల్ అగుయిలా బస్‌స్టాప్ వద్ద మేము ఉపవాసం ఉన్నాము. మా పట్ల దయతల్చిన డ్రైవరు మాకు తన డబ్బులతో మంచి భోజనంపెట్టించాడు. వెనిజులాలో ఆండిస్ పర్వత పంక్తిలో పుంటా డెల్ అగుయిలా అత్యంత ఎత్తయిన ప్రదేశం. సముద్రమట్టం నుండి 4108 మీటర్ల ఎత్తుంటుంది. నా దగ్గరున్న చివరి రెండు మందుబిళ్లలు వేసుకున్నాను. దాంతో ఆ రోజు రాత్రి గడపగలిగాను. తెలతెలవారుతుందనగా ఒక గంట సేపు నిద్రపోవటానికి డ్రైవరు వాహనం నిలిపి ఉంచాడు. గత రెండు రోజులుగా డ్రైవరు విరామం లేకుండా వాహనం నడుపుతూనే ఉన్నాడు. ఆ రోజు రాత్రికి కారకాస్ చేరుకోగలమని ఆశించాము. కానీ టైర్లకు పంచర్లు పడటంతో ప్రయాణం మరికాస్త ఆలస్యమైంది. వైర్లు తప్పుగా కలిపి ఉంచటంతో బ్యాటరీ కూడా పని చేయలేదు. అదికూడా సరి చేసుకోవాల్సి వచ్చింది. వాతావరణం మారుతోంది. రోడ్డుకిరువైపులా అరటి తోటలతో పాటు దోమల వీరంగం కూడా కనిపిస్తోంది. ప్రయాణపు చివరి దశలో ఉబ్బసం దెబ్బకు తూలిపడ్డాను. మేము గమ్యానికి చేరేసరికి ఉరుములు, మెరుపులు కనిపిస్తున్నాయి. నేను దాదాపు కదల్లేని స్థితికి చేరుకున్నాను. అర్ధ బొలివర్ అద్దెకు తీసుకున్న గదిలో మంచంమీద వాలిపోయాను. అల్బెర్టో అడ్రనలిన్ ఇంజక్షన్ కూడా ఇవ్వటంతో గాఢంగా నిద్రపోయాను.

# కొత్తగా ఉన్న 20వ శతాబ్దం

నా ఉబ్బసం వ్యాధి కొంత శాంతించింది. నా ఆరోగ్యం దాదాపు కుదుటపడినట్లే. అప్పుడప్పుడూ ఇన్‌హేలర్ మాత్రం ఉపయోగించాల్సి వస్తోంది. అల్బెర్టో లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. ఏదో కనిపించని దాడి నుండి నన్ను నేను కాపాడుకోలేనేమో అనిపిస్తోంది. ఏదో మనసుకు తట్టినప్పుడల్లా అతనితో పంచుకోవటానికి మరోవైపు తిరుగుతున్నాను. అతను పక్కన లేడన్న విషయాన్ని అప్పుడుగానీ గమనించలేకపోతున్నాను.

ఆ విషయం గురించి ఫిర్యాదు చేయటానికి పెద్దగా ఏమీ లేదు. మంచి ఆహారం దొరుకుతోంది. త్వరలో తిరిగి వచ్చి నా వైద్య విద్య పూర్తి చేసి పట్టా పుచ్చుకుని వృత్తి ప్రారంభించాలని ఆతృతపడుతున్నాను. అయితే మేమిద్దరమూ విడిపోవటం అన్న ఆలోచనకు నాకేమీ సంతోషం కలిగించటం లేదు. అనేక నెలల పాటు ఇద్దరమూ కలిసి మెలిసి తిరిగాము. మంచైనా, చెడైనా ఇద్దరమూ ఒకే పరిస్థితుల్లో ఒకే తరహా కలలుగన్నాము. ఈ సాహచర్యం మా ఇద్దరినీ మరింత సన్నిహితం చేసింది. ఈ ఆలోచనలన్నీ నా మదిలో గిర్రున తిరుగుతుంటే నాకు నేను కారకాస్‌కు దూరంగా సాగిపోతున్నట్లు అనిపిస్తోంది. శివార్లలో ఉన్న ఇళ్లు దూరం దూరంగా ఉన్నాయి. ఇరుకైన లోయ పొడవునా కారకాస్ నగరం విస్తరించి ఉంది. నలుదిక్కులా లోయ అంచులకు చేరి ఉంది. దాంతో కొద్ది సేపు నడిస్తే చుట్టూ ఉన్న కొండలను చుట్టిరావటానికి వీలయ్యేలా ఉంది. ఆ కొండల అంచు నుండి నగరం ప్రారంభమవుతుంది. బహుముఖ లక్షణాలు కలిగిన నూతన నగరం మీకు దర్శనమిస్తోంది. అక్కడున్న నల్లజాతి వాళ్లను చూస్తే ఆఫ్రికాలోని నీగ్రో తెగ ప్రజలు

గుర్తుకు వస్తారు. వీళ్లకు స్నానం చేసే అలవాటు లేనట్లుంది. దాంతో పాటు వీరు తమ జాతి ప్రత్యేకతలను కాపాడుకుంటూ ఉన్నారు. పోర్చుగీసు వాళ్ల నూతన దాడి నుండి కూడా వీళ్లు తమ ప్రత్యేకతలను కాపాడుకుంటూ వచ్చారు. ఈ రెండు ప్రాచీన జాతులు క్లిష్టమైన ఉమ్మడి జీవితాన్ని ప్రారంభించారు. మధ్యమధ్యలో తీవ్రమైన ఘర్షణలు కూడా జరుగుతున్నాయి. దైనందిన జీవితంలో ఉనికి కోసం జరుగుతున్న పోరాటంలో ఈ రెండు జాతులు ఎదుర్కుంటున్న వివక్ష, పేదరికం వీరిని ఐక్యం చేశాయి. అయితే జీవితం పట్ల రెండు జాతులకు ఉన్న భిన్న దృక్పధం కారణంగా ఈ రెండు జాతులు వేర్వేరుగానే ఉండిపోయాయి. నల్లజాతి ప్రజలు కలలు గనటానికి అలవాటుపడ్డవాళ్లు. తాము సంపాదించే కాస్తో కూస్తో సొమ్ము తాగి తగలేయటం వీరి నైజం. యూరోపియన్లకు కష్టించి పని చేయటం, పొదుపు చేయటం సహజనైజం. ఈ లక్షణంతోనే అమెరికాలో ఈ మూల వరకు వీరు రాగలిగారు. ఇక్కడ జీవించగలుగుతున్నారు. వ్యక్తిగతంగా కూడా తన స్వతంత్ర ఆశాలోకంలో విహరించగలుగుతున్నాడు.

ఈ ఎత్తయిన ప్రాంతంలో సిమెంట్‌తో నిర్మించిన ఇళ్ల స్థానంలో గుడిశెలే దర్శనం ఇస్తుంటాయి. ఒక గుడిశెలోకి తొంగి చూశాను. అది మధ్యలోకి వేరుచేయబడిన ఒక గది. ఒక మూల నెగడు, చిన్న టేబులు, చిన్న చాప పక్కన ఉన్నాయి. బహుశా అవే మంచాల్లాగా ఉపయోగపడుతూ ఉండవచ్చు. వివిధ రకాల కుచ్చుటోపీలు తడికలకు వేళ్లాడుతున్నాయి. కుక్క తన మూడు పిల్లలతో అక్కడే ఆడుకుంటోంది. రేగిన తల, జారిన స్థనాలతో ఉన్న ఒక మహిళ పొయ్యిదగ్గర ఏదో వండుతోంది. ఆ వాసనతో గదంతా నిండిపోయింది. ఆవిడకు 15 సంవత్సరాల వయసున్న ఒక అమ్మాయి సహాయం చేస్తోంది. తలుపుదగ్గరి నుండే సంభాషణ మొదలుపెట్టిన నేను కాస్సేపటి తర్వాత ఫోటో తీసుకోనిస్తారా అని అడిగాను. దానికి వారు ససేమిరా అన్నారు. చివరకు ఆ కెమెరా వారికే ఇవ్వచూపేందుకు కూడా సిద్ధమయ్యాను. కానీ ఫలితం లేకపోయింది. ఫోటో తీసిన తర్వాత దాన్ని కడిగి చిత్రం బయటకు తీయాలని వివరించటానికి ప్రయత్నించాను. కానీ అక్కడికక్కడే ఫోటో కావాలని డిమాండ్ చేశారు. చివరికి కెమెరా వాళ్లకే ఇవ్వటానికి సిద్దమైన తర్వాత దాంతో ఏమి చేయాలో తెలియక సందేహంగా చూడనారంభించారు.

సహకరించటానికి నిరాకరించారు. ఆ కుటుంబంతో మాట్లాడుతుండగా ఒక పిల్లవాడు తన స్నేహితులతో ఆడుకోవటానికి వెళ్లాడు. చేతిలో కెమెరాతో తలుపుకు అడ్డంగా నిలబడ్డ నేను ఎవరు ముందుకు కదిలినా ఫోటో తీయటానికి సిద్ధమైనట్లు నిల్చున్నాను. ఆ విధంగా మేము ఆటలాడుతుండగా ఆ పిల్లవాడు హుషారుగా కొత్త సైకిలు తొక్కుకుంటూ తిరిగి వస్తున్నాడు. అతనివంకే చూస్తూ కెమెరా బటన్ నొక్కాను. కానీ ఫోటో దారుణంగా వచ్చింది. నా కెమెరాకు చిక్కకుండా ఉండేందుకు ప్రయత్నిస్తూ కిందపడిపోయాడు. కళ్లవెంట నీళ్లొచ్చాయి. వెంటనే అందరూ నా చేతిలో కెమెరా ఉందన్న విషయం మర్చిపోయి నాపై కేకలు వేస్తూ వచ్చారు. వాళ్లు రాళ్లు విసరటంలో దిట్టలు కావటంతో బెదిరిపోయిన నేను చిన్నగా అక్కడి నుండి తప్పుకున్నాను. అంతటితో వదలక వాళ్లు నన్ను అవమానించటం మొదలుపెట్టారు. కోపం తారాస్థాయికి చేరటంతో చివరకు పోర్చుగీసోడా అని కూడా తిట్టారు.

రోడ్డు అంచుల నిండా ఎగుమతికి సిద్ధమైన కార్లతో కూడిన కంటైనర్లు నిల్చున్నాయి. వీటినే పోర్చుగీసు వాళ్లు తమ నివాసాలుగా మార్చుకున్నారు. అటువంటి ఒక దాంట్లో ఒక నల్లజాతి కుటుంబం కూడా నివసిస్తోంది. అక్కడ ఒక కొత్త రెఫ్రిజిరేటర్ చూశాను. అందరివద్దా రేడియోలు ఉన్నాయి. తారాస్థాయిలో సౌండ్ పెట్టటంతో పాటలు దూరానికి కూడా వినవస్తున్నాయి. అక్కడున్న చితికిపోయిన నివాసాల ముందు కొత్త కార్లు నిలబెట్టి ఉన్నాయి. ఆకాశంలో అన్ని రకాల విమానాలు దూసుకెళ్లుతున్నాయి. ఈ విమానాల శబ్దానికి చెవులు దిబ్బిళ్లు వేస్తున్నాయి. ఆ విధంగా నా కాళ్ల ముందు కారకాస్ నగరం నిరంతరం నూతనత్వాన్ని విరజిమ్ముతూ నిల్చుంది. నగరం నడిబొడ్డున ఎర్రని నాపరాళ్లుతో కట్టిన నిర్మాణాలు ఈ నగరపు ప్రకృతి సౌందర్యాన్ని పాడుచేస్తున్నాయి. అయితే ఈ వలస పాలకులు నిర్మించిన పచ్చరంగు భవనాలు ఆ విధంగా ఉండటానికి వేరే కారణాలున్నాయి. వలస పాలకులు వెళ్లిన తర్వాత కూడా ఈ భవనాలు తమ ఉనికిని చాటుతూనే ఉన్నాయి. ఉత్తరాది జీవన శైలిని నింపుకున్న కారకాస్‌నగరం వలసవాద గతంలో పునాదులు నింపుకుని ఉంది.



# చివరి మాటలు

పర్వతపు అంచున ఉన్న ఆ కుగ్రామంలో రాత్రి ఆకాశంలో నక్షత్రాలు కాంతులు వెదజల్లుతున్నాయి. నిశ్శబ్దం, చీకటి దెబ్బకు చలి మటుమాయమైంది. ఆ దృశ్యాన్ని ఎలా వర్ణించాలో నాకు తెలియటం లేదు కానీ–ఘనపదార్థాలన్నీ కరిగిపోయిన ఈథర్‌గా మారినట్లు–మా అందరి వ్యక్తిత్వాలను చిమ్మ చీకటి తనలోకి ఇముడ్చుకొంటోంది. ఆకాశంలో కూడుకుంటున్న చిన్న చిన్న మేఘాలు ఏవీ ఒక ఆకృతి దాల్చలేకపోతున్నాయి.సమీపంలో ఉన్న వీధి దీపం కూడా ఆరిపోవటంతో చీకటి రాజ్యానికి ఎదురులేకపోయింది.

ఆ మనిషి ముఖం చీకట్లో నీడలా ఉంది. అతని కళ్లలో మెరుపు మాత్రమే నేను చూడగలుగుతున్నాను. నాలుగు మునిపళ్లు మాత్రం బయటకు వచ్చి కనిపిస్తున్నాయి.

ఈ వివరణ ఇవ్వటానికి అక్కడున్న పరిస్థితి కారణమా లేక ఆ వ్యక్తి కారణమా అన్నది ఇదమిద్దంగా చెప్పలేను గానీ అనేకసార్లు అనేక మంది నోటి నుండి ఇదే తరహా వాదనలు విన్నాను. ఆ వాదనలేవీ నన్ను మెప్పించలేకపోయాయి. నా దూబాసి నిజానికి ఆసక్తికరమైన వ్యక్తి. యూరప్‌లోని ఒక దేశంలో పుట్టిన అతను యువకుడిగా పిడివాదం అన్న కత్తి తీసుకుని బయలుదేరాడు. భయం అంటే ఏమిటో అతనికి తెలుసు. ఆ తర్వాత అతను దేశం విడిచి దేశం సంచరించాడు. వేలాది సాహసాలు మూటగట్టుకున్నాడు. చివరికి ఈ ఒంటరి ప్రాంతంలో తేలాడు. ఏదో అద్భుతం జరుగుతుందని ఆశతో ఓపిగ్గా ఎదురు చూస్తున్నాడు.

కాస్సేపు అర్థం పర్థం లేకుండా మాట్లాడుకున్న తర్వాత ఇద్దరమూ ఒకరి తప్పులు ఒకరు ఎంచుకునేందుకు వాదించుకోనారంభించాము. చివరికి ఇద్దరమూ చెరోదారిన

వెళ్లేందుకు సమయం దగ్గిరపడినట్లు అనిపించింది. అతను తన భేషజం వదులుకున్నప్పుడు చిన్న పిల్లాడి మాదిరిగా నవ్వుతున్నాడు. తన నాలుగు మునిపళ్లు బయటికి కనిపించేలా నవ్వుతూ "భవిష్యత్తు ప్రజలకు సంబంధించినది. క్రమంగా ఒక్క వేటుతో వాళ్లు అధికారం స్వాధీనం చేసుకుంటారు. ఇక్కడా... అన్ని దేశాల్లోనూ" అని ముగించాడు.

"అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం ఏమిటంటే ప్రజలను విద్యావంతులను చేయటం. ఈ పని పూర్తి చేయాలంటే అధికారం చేతుల్లోకి తీసుకోకుండా చేయలేరు. అధికారం చేజిక్కించుకున్న తర్వాతనే ఆ పని పూర్తి చేయగలరు. తమ తప్పుల ద్వారానే చేయాల్సింది ఏమిటో తెలుసుకోగలరు. ఈ రకమైన తప్పులు కొన్ని సందర్భాల్లో తీవ్రమైనవిగాను ఉంటాయి. కొందరు అమాయకుల ప్రాణాలు కోల్పోయేందుకు కూడా దారితీస్తాయి. బహుశా వాళ్లు అమాయకులు కాకపోవచ్చు. ఎందుకంటే వీరు ప్రకృతి పట్ల ఘోరమైన తప్పిదం చేసిన వారై ఉంటారు. అంటే మారుతున్న ప్రకృతిని బట్టి వారు మారలేకపోయారు. ఆ విధంగా మారుతున్న పరిస్థితులకనుగుణంగా మారలేకపోతున్న మీ లాంటి వాళ్లు, నా లాంటి వాళ్లు తాము మద్దతు ఇచ్చిన అధికారాన్నే శాపనార్థాలు పెట్టుకుంటూ భారీ త్యాగం ద్వారా నూతన వ్యవస్థను నిర్మించుకుంటారు. విప్లవం వ్యక్తులకతీతమైనది. అది వ్యక్తుల ప్రాణాలు స్వీకరిస్తుంది. వారి జ్ఞాపకాలను కూడా ఒక ఉదాహరణగా మారుస్తుంది. యువతరాన్ని తమ వెంట తిప్పుకోవటానికి ఈ ప్రాణాలను ఒక సాధనంగా కూడా మార్చుకుంటుంది. నా పాపం చాలా పెద్దది. ఎందుకంటే చాలా అనుభవం కలిగింది, విస్పష్టమైనది. మీరు దాన్ని ఏ పేరుతోనైనా పిలవచ్చు. కుళ్లిన ఈ నాగరికత అలవర్చుతున్న వెసులుబాటు లేమితనాన్ని గుర్తు చేయటం కోసం నా త్యాగం ఉపయోగపడుతుంది. ఈ కుళ్లిన నాగరికత పతనావస్థకు చేరింది. నాకు తెలుసు- నా ఈ త్యాగం-చరిత్ర గతిని మార్చలేదన్న విషయం. నా పట్ల మీకున్న అభిప్రాయాన్ని కూడా మార్చలేదని నాకు తెలుసు. ద్వేషాన్ని, పోరాటానికి దర్పణం పట్టే బిగించిన పిడికిలి, పొంగిన దవడ ఎముకతో మీరు నన్ను చూడవచ్చు. ఎందుకంటే మీరు దానికి దర్పణం కాదు. కానీ ఈ సమాజానికి చెందిన న్యాయమైన వ్యక్తి ఒకరు నాశనం అవుతున్నారు. ఈ స్ఫూర్తి మీ గళం నుండి వెల్లడవుతుంది. మీ చర్యల్లో ప్రస్ఫుటితమవుతుంది. మీరు కూడా నేను ఉపయోగపడినంతగానే ఉపయోగపడగలరు.

కానీ మిమ్ములను త్యాగం చేయాలని కోరుకునే ఈ సమాజానికి మీ తోడ్పాటు ఎంత అవసరం అన్నది మాత్రం తెలుసుకోలేరు.”

అతని పళ్లు, గడ్డం చూస్తే అతని చరిత్రను తెలుసుకోవచ్చు. అతను కరచాలనం చేసినట్లు అనిపించింది. దూరం నుండి గుసగుసలాడినట్లు అనిపించింది. చివరిగా వీడ్కోలు చెప్పాడు. ఆ రోజు రాత్రి అతనితో సాగించిన సంభాషణలు పదే పదే వెంటాడు తున్నట్లనిపించింది. అతని ఆలోచనలు నన్ను చుట్టుముట్టేస్తున్నాయి. నాకు ఇప్పుడు తెలుస్తోంది...ఒక గొప్ప స్ఫూర్తి మానవాళిని రెండు శతృశిబిరాల కింద మార్చినప్పుడు నేను మాత్రం ప్రజలతోనే ఉంటాను. ఆ విషయం నాకు తెలుసు. ఆ విషయం ఆ రోజు రాత్రి చీకటి ఆకాశంలో రాసి ఉంది. సిద్ధాంతం, పిడివాదపు మత్తు తలకెక్కించుకున్న నేను బారికేడ్లు, గోతులపై దాడి చేస్తాను. రక్తసిక్తమైన నా ఆయుధం చేబూని అడ్డు వచ్చిన ప్రతి శతృవునూ హతమారుస్తూ పోతాను. నిజమైన న్యాయమైన విప్లవంలో నన్ను నేను అంతర్భాగంగా మార్చుకుంటాను. ఈ అలసట నుండి నూతన ఆలోచనలు పుట్టుకొస్తాయి. ఈ న్యాయమైన విప్లవం వ్యక్తిగత ఇచ్ఛను సమానం చేస్తుంది. తద్వారా అంతిమ లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. చేతుల్లో ఉన్న తుపాకి నుండి వెలువడుతున్న బుల్లెట్ల వాసనకు ముక్కుపుటాలు అదురుతున్నాయి. శతృమూకల రక్తంతో పరిసరాలు తడిసి ముద్దవుతున్నాయి. రానున్న సంగ్రామానికి సిద్ధమవుతూ నా శరీరాన్ని ఇనుపముక్కలాగా మార్చుకుంటున్నాను. విజేతగా నిలవనున్న కార్మికవర్గపు వీరవిహారంలో నూతన శక్తి, నూతన ఆశలు రేకెత్తుతాయి. అందులో నాకు ఇంత చోటు దొరికితే చాలునని సంతృప్తిపడతాను.



ఎర్నెస్టో గువేరా, అర్జెంటినాలో 1951



అర్జెంటినా, బ్యూనస్ఎయిరెస్‌లో ఓ మిత్రునితో  గువేరా 1951



బూనస్ ఎయిరెస్‌లో గువేరా, 1951



ఎర్నెస్టో, ఆల్బెర్టోలు తమ సాహస కృత్యాన్ని ఆరంభించడానికి
కొన్ని క్షణాల ముందు మిత్రులతో, 1951,
ఆల్బెర్టో గ్రెనడో (ఎడమ వైపు ముందు భాగంలో),
ఎర్నెస్టో గువేరా (మధ్యలో క్యాప్‌తో), లా పొడెరోసా ౨౨ (మోటార్ సైకిల్)



ఎర్నెస్టో గువేరా, లా పొడెరోసా ౨౨, 1951




ఎర్నెస్టో గువేరా, ఆల్బెర్టో గ్రనెడో



శాన్‌మార్టిన్ డి లాస్ ఆండీస్ సమీపంలో ఆండీస్ పర్వతాలను
అధిరోహించడాడానికి ప్రయత్నిస్తున్న ఆర్బెర్టో గ్రనెడో,
ఫోటో తీసింది ఎర్నెస్టో గువేరా, జనవరి 1952



చిలీలోకి ప్రవేశిస్తూ మోడెస్టా విక్టోరియాపై ఆల్బెర్టో గ్రనెడో,
ఫోటోతీసింది ఎర్నెస్టో గువేరా, ఫిబ్రవరి 1952



శాంటియాగో డి చిలీలో కోర్డోబా నుండి శాంటా లూసియాను ఆధిరోహిస్తూ
ఆల్బెర్టో గ్రనెడో (మధ్యలో) ఇద్దరు మిత్రులతో,
ఫోటో తీసింది ఎర్నెస్టో గువెరా, మార్చి 1952



పెరులో టరాటా నుండి పునో మార్గంలో (ఎడమ నుండి మూడవవాడు ఎర్నెస్టో),
ఫోటో తీసింది ఆల్బెర్టో గ్రనెడో, మార్చి 25, 1952



సక్‌చౌమాన్ కోట నుండి కుజ్‌కో దృశ్యం,
ఫోటో తీసింది ఆల్బెర్టో, లేదా ఎర్నెస్టో, ఏప్రిల్ 1952



సూర్య దేవాలయం శిధిలాలపై నిర్మించిన శాంటో డోమింగో చర్చి,
ఫోటో తీసింది ఆల్బెర్టో లేదా ఎర్నెస్టో, ఏప్రిల్ 1952



మచు పిచు, హుయానా పిచు,
ఫోటో తీసింది ఎర్నెస్టో లేదా ఆల్బెర్టో, ఏప్రిల్ 5, 1952



మేరియా ఆంగోలా క్యాథెడ్రిల్,
ఫోటో తీసింది ఎర్నెస్టో లేదా ఆల్బెర్టో, ఏప్రిల్ 1952



కుజ్‌కో క్యాథెడ్రల్, ఫోటో తీసింది ఎర్నెస్టో లేదా ఆల్బెర్టో, ఏప్రిల్ 1952



పెరు, పుచల్పాలో కాంబలాషె సోదరులతో
ఆల్బెర్టో గ్రనెడో (ఎడమ నుండి రెండవ వ్యక్తి),
ఫోటో తీసింది ఎర్నెస్టో గువేరా, మే 1952



పెరు వద్ద ఆండీస్ శ్రేణుల్లో పిసాక్ అనే గ్రామం,
ఫోటో తీసింది ఆల్బెర్టో లేదా ఎర్నెస్టో, ఏప్రిల్ 1952



ఒలాంటయ్‌టాంబో దుర్గం, ఫోటో తీసింది ఎర్నెస్టో గువేరా, ఏప్రిల్ 1952



ఒక ఇండియన్ జాతీయునితో ఆల్బెర్టో గ్రనెడో (ఎడమ, డాక్టర్ బ్రెసియాని,
ఫోటో తీసింది ఎర్నెస్టో గువెరా, జూన్ 1952




మాంబో- టాంగోపై ఎర్నెస్టో గువెరా, ఆల్బెర్టో గ్రనెడో, జూన్ 1952



శాన్ పాబ్లో కుష్టు వ్యాధి గ్రస్తుల కాలనీ సిబ్బందితో కలిసి చేపలు పడుతున్న ఆల్బెర్టో గ్రనెడో, ఫోటో తీసింది ఎర్నెస్టో గువెరా, జూన్ 1952



యగువా ఇండియన్ తెగకు చెందిన ఓ కుటుంబంతో
ఆల్బెర్టో గ్రనెడో (పిల్లవాడినెత్తుకొని),
డాక్టర్ బ్రెసియాని, శాన్ పాబ్లో కుష్టు వ్యాధి గ్రస్తుల కాలనీ డైరెక్టర్,
ఫోటో తీసింది ఎర్నెస్టో గువెరా, జూన్ 1952



అమెజాన్ నదిలో మాంబో- టోంగోపై పయనిస్తూ ఎర్నెస్టో గువెరా,
ఆల్బెర్టో గ్రనెడో, జూన్ 1952




ఎర్నెస్టో చేగువేరా

అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిరెస్‌కు చెందిన ఇద్దరు యువకులు 1952 జనవరిలో శక్తివంతమైన 500 సిసి నోర్టన్ మోటార్ సైకిల్‌పై దక్షిణ అమెరికా పర్యటనకు బయలుదేరారు. ఆ ఇద్దరిలో ఒకరు ఇరవై ఒక్క సంవత్సరాల చేగువేరా. అర్జెంటీనా, చిలి, పెరు, వెనిజువాల మీదుగా వారి పర్యటన సాగింది. ఇది జరిగింది క్యూబా విప్లవానికి ఎనిమిదేళ్ళు ముందు. ఆ విప్లవంలో చే పాల్గొన్నారు. ఆ తర్వాత కూడా ఆయన జీవితం మరింత సాహసవంతమైనదిగా మారింది. అయినప్పటికీ ఈ మోటార్ సైకిల్ యాత్ర ఒక్కటే దానంతటదే గొప్ప సాహస కృత్యం. ఆ యాత్రకు సంబంధించిన డైరీల సంకలనం ఇది.

ప్రజాశక్తి బుక్‌హౌస్